అనుదినం... జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
శుక్రవారం 21-02-2025
సమగ్ర తెలుగు దినపత్రిక
సంపుటి : 11 సంచిక : 51 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | 14 పేజీలు | వెల : 6.50

ఎవరినో గెలిపించేందుకు ప్రయత్నం



భారత్‌కు ఆర్థిక సాయంపై ట్రంప్ వ్యాఖ్యలు

అలా సాయం చేయాల్సిన అవసరమేంటని ప్రశ్న

న్యూయార్క్ : 'ఓటర్ టర్నవుట్' కోసం భారత్‌కు 21 మిలియన్ల డాలర్లను కేటాయించాలని గత బైడెన్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ మరోసారి ప్రశ్నించారు. 'బహుశా మరెవరినో గెలిపించేందుకు వారు ప్రయత్నించినట్లు వుంది.' అని తాను భావిస్తున్నట్లు ఆయన వ్యాఖ్యానించారు. మియామిలో ఎఫ్ఐఐ ప్రాధాన్యతా సదస్సులో మాట్లాడుతూ ట్రంప్ పై వ్యాఖ్యలు చేశారు. గతంలోకూడా ఆయన ఇదే అంశంపై ఆందోళనల ...13లో



నోరు అదుపులో పెట్టుకో

ప్రజా వ్యతిరేక విధానాలపై ఉద్యమిస్తున్నది కమ్యూనిస్టులే

వివరాలు 3లో

రాష్ట్ర ప్రయోజనాలకు భిన్నంగా కేంద్ర బడ్జెట్ ఉన్నా మీ స్పందనేదీ?


బీజేపీ పట్ల బీఆర్ఎస్ వైఖరేంటి:

కేసీఆర్‌కు సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ ప్రశ్న

సహకరించకుంటే తొత్తులా?

కమ్యూనిస్టులు త్యాగధనులు

కేసీఆర్ తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలి : సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని డిమాండ్



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు సహకరించకుంటే కాంగ్రెస్‌కు తొత్తులమా?అని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు విమర్శించారు. కమ్యూనిస్టులు త్యాగధనులని తెలిపారు. కమ్యూనిస్టులు కాంగ్రెస్‌కు తొత్తులంటూ కేసీఆర్ చేసిన వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు కూనంనేని గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. కమ్యూనిస్టులు ...3లో

అంతా అదానీ కోసమే

ఏ దేశంతో చర్చించినా ఆ గ్రూపు ప్రయోజనాలే ప్రధానికి ముఖ్యం

మోడీ కార్పొరేటు మిత్ర బృందంలో అదానీది ప్రత్యేక స్థానం. ప్రధాని హోదాలో మోడీ.. అదానీకి ప్రయోజనం చేకూర్చే విధంగానే వ్యవహరిస్తారన్నది బహిరంగ రహస్యమే. తన పర్యటనలో భాగంగా ప్రధాని మోడీ ఏ దేశానికి వెళ్లినా, మరో దేశానికి చెందిన అధినేత భారత్‌కు వచ్చినా.. అదానీకి ప్రయోజనం చేకూర్చే అవకాశం కనిపిస్తే చాలు.. ప్రధాని స్థాయిలో మోడీ పనులు చక్కబెడుతుంటారని చెప్తుంటారు. ఇప్పుడు ఖతార్ రాజు పర్యటనలోనూ ఇవే పరిస్థితులు కనిపించాయంటున్నారు విశ్లేషకులు.

ఇటీవల ఖతార్ రాజు భారత పర్యటనలోనూ ఇదే సుస్పష్టం

అంతకు ముందే అదానీ కంపెనీకి డీల్

ఖతార్ కంపెనీతో జాయింట్ వెంచర్‌పై సంతకం

ప్రోటోకాల్‌కు భిన్నంగా రాజుకు స్వాగతం పలికిన మోడీ

చర్చనీయాంశంగా ఈ రెండు సందర్భాలు



న్యూఢిల్లీ : గత కొంత కాలంగా అదానీకి గడ్డు పరిస్థితులే ఎదురయ్యాయి. సంపాదన కరిగినా.. సంపన్నుల జాబితా నుంచి స్థానం కోల్పోయినా.. కేంద్రంలోని మోడీ సర్కారును ఆయన నమ్ముకొని ఉన్నారు. మోడీ ప్రభుత్వం కూడా అందుకు అనుకూలంగానే వ్యవహరిస్తున్నది. ఖతార్ ఎమిర్(రాజు) తమీమ్ బిన్ హామద్ థాని భారత్ పర్యటనల విషయంలోనూ ఇది స్పష్టమైంది. ఆయన భారత పర్యటనకు రావటానికి కొన్ని రోజుల ముందు అదానీ కంపెనీ, ఖతార్ కంపెనీ గల్ఫ్ ప్రాంతంలో సముద్ర కార్యకలాపాలలో గౌతమ్ అదానీకి లబ్ది చేకూరేలా జాయింట్ వెంచర్‌పై సంతకం చేశాయి. 'హిండెన్‌బర్గ్'తో అదానీ గ్రూపు సామ్రాజ్యం కుప్పకూలింది. దీనికి తోడు పశ్చిమ దేశాలలో విశ్వసనీయతను కోల్పోవటం, దక్షిణాసియాలో ఉనికే లేకపోవటం వంటివి అదానీని ఊపిరి సల్పనీయకుండా చేశాయి. అమెరికాలో లంచం కేసు, శ్రీలంకలో విద్యుత్ పంపిణీ నుంచి వెనక్కి తగ్గడం ఇలా మరెన్నో కారణాలు అదానీ గ్రూపును ఇరకాటంలో పెట్టాయి. ప్రధాని మోడీ అమెరికా పర్యటనకు వెళ్లినపుడు అదానీ కోసమే వచ్చారా..అంటూ అక్కడి మీడియా ప్రధానిని ప్రశ్నించిన విషయం విదితమే. ఇంతలా అదానీ, మోడీ బంధాన్ని ప్రశ్నిస్తుంటే..తాజాగా ఖతార్ రాజు పర్యటనకు ముందే అంతా సెట్ చేశారని స్పష్టమవుతోంది. మోడీ అండతోనే ...5లో

నాంపల్లి కోర్టుకు సీఎం రేవంత్‌రెడ్డి

మూడు కేసులకు సంబంధించి హాజరు

బీఆర్ఎస్ పెట్టినవి ఉద్దేశపూర్వక కేసులే : టీపీసీసీ లీగల్‌సెల్



(ఫైల్)

నవతెలంగాణ-హైదరాబాద్

నాంపల్లిలోని ప్రజాప్రతినిధుల కోర్టుకు సీఎం రేవంత్‌రెడ్డి హాజరయ్యారు. ఎన్నికల ప్రచార సమయంలో రేవంత్‌రెడ్డిపై నల్గొండ టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో, బేగంబజార్ పీఎస్‌లో, మెదక్ జిల్లా కౌడిపల్లి పీఎస్ పరిధిలో మొత్తం మూడు కేసులు నమోదయ్యాయి. ఈ కేసుల విచారణ నిమిత్తం ఆయన కోర్టుకు హాజరయ్యారు. రేవంత్‌రెడ్డి ప్రతిపక్ష నేతగా ఉన్నప్పుడు.. బీఆర్ఎస్ ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా కేసులు నమోదు చేసిందని టీపీసీసీ లీగల్‌సెల్ వైస్ చైర్మెన్ తిరుపతి వర్మ తెలిపారు. తదుపరి విచారణను ప్రజాప్రతినిధుల కోర్టు మార్చి 23కి వాయిదా వేసింది.

విద్యుద్ఘాతానికి కుటుంబం బలి

ఒకరిని కాపాడబోయి మరొకరు..ముగ్గురు మృతి

బోధన్ మండలం పెగాడపల్లి శివారులో ఘటన



నవతెలంగాణ-బోధన్/రెంజల్

ఒకరిని కాపాడబోయి మరొకరు... వరుసగా ఒకే కుటుంబంలోని ముగ్గురు విద్యుద్ఘాతానికి గురై మృతి చెందారు. ఈ విషాదకర ఘటన నిజామాబాద్ జిల్లా బోధన్ మండలంలోని పెగడాపల్లి గ్రామ శివారులోని ఓ రైతుకు చెందిన పంట పొలంలో చోటు చేసుకుంది. దీంతో ఆ గ్రామంలో తీవ్ర విషాదం నెలకొంది. బోధన్ రూరల్ సీఐ విజయ్ బాబు తెలిపిన వివరాల ప్రకారం.. రెంజల్ మండలంలోని సాటాపూర్ గ్రామానికి చెందిన గంగారాం, బాలమణి దంపతులు వ్యవసాయ కూలీలుగా పనిచేయడంతో పాటు పందులు పెంచుతూ జీవనం సాగిస్తున్నారు. ఎప్పటిలాగే గురువారం పందులు.. పెగడాపల్లి గ్రామంలో మేతకు వెళ్లడంతో వాటికి తేవడానికి గంగారాం(45), బాలమణి(38), కుమారుడు కిషన్(22) వెళ్లారు. ఈ క్రమంలో కొన్ని పందులు పంట పొలాలవైపు వెళ్లగా వాటిని పట్టుకునే క్రమంలో వాటి వెంట వెళ్లారు. గంగారాం తన చేతిలో ఉన్న పొడవాటి కర్రతో పందులను తరమగా.. కర్ర అక్కడే ఉన్న విద్యుత్ తీగకు తగిలి కరెంట్ పాసైంది. దాంతో పంట పొలంలో నీరు ఉండి పచ్చిగా ఉండటంతో ముగ్గురికి కరెంట్ షాక్ తగిలి అక్కడికక్కడే మృతి చెందారు. ఈ విషయం తెలిసిన స్థానికులు ఘటనా స్థలానికి చేరుకుని పోలీసులకు సమాచారం ...13లో

ఆర్టిజన్లపై ఉక్కుపాదం

ఎటు చూసినా పోలీసులే ఎక్కడికక్కడ అరెస్టులు



సమస్యలు పరిష్కరించకుండా నిర్బంధమా?

'చలో విద్యుత్ సౌధ'పై ప్రభుత్వ దమనకాండ

కాంగ్రెస్ ఎన్నికల హామీని నిలబెట్టుకోవాలి

విద్యుత్ సంస్థల్లో పనిచేస్తున్న ఆర్టిజన్లను కన్వర్షన్ చేయాల్సిందే..: జేఏసీ చైర్మెన్ ఈశ్వర్‌రావు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఆర్టిజన్ల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని శాంతియుత ఆందోళనకు పూనుకుంటే తమపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపిందని తెలంగాణ విద్యుత్ ఆర్టిజన్స్ కన్వర్షన్(టీవీఏసీ), జేఏసీ ఆందోళన వ్యక్తం చేసింది. చలో విద్యుత్ సౌధ కార్యక్రమాన్ని భగ్నం చేసేందుకు పోలీసులు యుద్ధ వాతావరణాన్ని తలపించేలా మోహరించారు. వారిని ఎక్కడికక్కడ అదుపులోకి తీసుకున్నారు. తమ సమస్యలు పరిష్కరించకుండా ప్రభుత్వం నిర్బంధాన్ని ప్రయోగించటమేంటని జేఏసీ నేతలు మండి పడుతున్నారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన హామీని ఎందుకు నిలబెట్టుకోదని ప్రశ్నించారు. విద్యుత్ సంస్థల్లో పనిచేస్తున్న ఆర్టిజన్లను కన్వర్షన్ చేసే వరకు ఉద్యమం ఆగదనీ వారు హెచ్చరించారు. అరెస్టులు, నిర్బంధాలు ఉద్యమాలను ఆపలేవని తెలిపారు. తక్కువ జీతాలతో ఏండ్ల తరబడి పని చేస్తుంటే తమపై జాలి చూపకుండా అణచివేయాలని ...13లో

విద్యుత్ ఆర్టిజన్ల అరెస్టులకు సీపీఐ(ఎం) ఖండన 13లో

పోలీస్ స్టేషన్‌కు వెళ్లి పరామర్శించిన జాన్‌వెస్లీ



అక్రమంగా ఏపీ నీళ్ల తరలింపు

నిర్లక్ష్యంతో మొద్దు నిద్ర నటిస్తున్న కాంగ్రెస్ : మాజీమంత్రి హరీశ్‌రావు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఆంధ్రప్రదేశ్ అక్రమంగా కృష్ణా నీటిని తరలిస్తున్నా.. కాంగ్రెస్ నిర్లక్ష్యంతో మొద్దు నిద్ర నటిస్తున్నదని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు ...13లో

జగన్ స్నేహంతోనే ఏపీ జలదోపిడీ

మంత్రులు ఉత్తమ్, కోమటిరెడ్డి విమర్శ

తెలంగాణ జల హక్కులకు కేసీఆర్ పాతరేశారు 13లో





చింతకాయలు తెంపాడని.. దళితునిపై దాడి

కులం పేరిట దూషణ.. ఇంట్లోంచి ఈడ్చుకెళ్లిన వైనం

ఫిర్యాదు చేసి వారమైనా పట్టించుకోని పోలీసులు

అట్రాసిటీ కేసు పెట్టి నిందితుల్ని శిక్షించాలి : కేవీపీఎస్

నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతున్న సంగారెడ్డి జిల్లాలో ఇప్పటికీ గ్రామాల్లో భూస్వామ్య ఆధిపత్య భావజాలం కొనసాగుతుంది. ఏవో చిన్న కారణాలు చూపి దళితులపై దాడులు చేయడం, కులం పేరిట దూషించడం, గ్రామ బహిష్కరణ చేయడం పరిపాటిగా మారింది. సదాశివపేటలో మంత్రాల నెపంతో చెట్టుకు కట్టేసి కొట్టారు. మనోహరాబాద్ మండలంలో శుభ, అశుభ కార్యాలకు డప్పులు కొట్టలేదంటూ విద్యావంతులైన దళిత యువకుల్ని ...6లో

బెట్టింగ్ యాప్‌ల వలకు చిక్కి..

రూ.లక్షల్లో అప్పులు | సైబర్‌మోసాలతో ప్రాణం తీసుకుంటున్న యువత

నెల రోజుల్లోనే ఉమ్మడి కరీంనగర్‌లో నలుగురి ఆత్మహత్య

ఫేక్ యాప్‌ల ప్రచారంలో సోషల్ 'మీడియా' ఇన్‌ఫ్లుయెన్సర్లు



నవతెలంగాణ - కరీంనగర్ ప్రాంతీయ ప్రతినిధి

ఫేస్‌బుక్, ఇన్‌స్టా, ఎక్స్, యూట్యూబ్.. ఇలాంటి సామాజిక మాధ్యమాల్లో వేలల్లో, లక్షల్లో సబ్‌స్క్రైబర్లు కలిగి ఉండి వారి పోస్టులకు అదేస్థాయిలో లైక్‌లు, కామెంట్లు వచ్చే సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లు కొన్నాళ్ల ప్రమోషన్ యాడ్స్ చేస్తూ డబ్బులు సంపాదిస్తున్నారు. అందులోనూ బెట్టింగ్‌యాప్‌లు, రమ్మీ, క్యాసినో, రౌలట్ వంటి గేమ్స్, ఫేక్ ట్రేడింగ్ సైట్లు ప్రమోట్ చేస్తూ ఎక్కువ మందిని ప్రభావితం చేస్తున్నారు. అలా ప్రభావితమైన వాళ్లలో అత్యాశతో కొందరు ఈ ఫేక్ యాప్స్, సైట్లలో అప్పులు చేసి మరీ రూ.లక్షలు పెట్టుబడిపెట్టి పోగొట్టుకుంటున్నారు. అందులో కొందరు నిండా మునిగి.. మళ్లీ అప్పు దొరక్క.. చేసిన బాకీలు తీర్చలేక ప్రాణం తీసుకుంటున్నారు. మూడు వారాల వ్యవధిలోనే ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోనే నలుగురు యువకులు ఆత్మహత్య చేసుకోవడం ఇందుకు అద్దం పడుతోంది.

సోషల్‌మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్ల ప్రభావం..

వ్యంగ్యాస్త్రాలు, చలోక్తులు, ఫన్నీ వీడియోలు, స్పూఫ్‌లు, గ్రాఫిక్స్ ఫొటోలు, అశ్లీల మాటలు, వీడియోలు.. ఇలా రకరకాలుగా సోషల్ మీడియాలో పోస్టులు పెడుతూ పెద్దఎత్తున ఫాలోవర్స్‌ను సంపాదించుకుంటున్న సోషల్‌మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్ల హవానే ఇప్పుడు ఎక్కువగా కనిపిస్తోంది. అందులోనూ బూతు కంటెంట్ ఉన్న వారి ఖాతాలనే ఫాలో అవుతున్న వారి సంఖ్య గణనీయంగా పెరుగుతూ మిలియన్లలో సబ్‌స్క్రైబర్లు అవుతున్నారు. ఇప్పుడు అదే ఖాతాల నిర్వాహకులు ఫేక్‌యాప్‌లు, గేమింగ్, ట్రేడింగ్ సైట్లు ప్రమోట్ చేస్తూ రూ.లక్షల్లో సంపాదిస్తున్నారు. తమ సోషల్ మీడియా వేదికల్లో 'చేతిలో రూపాయిలేని నువ్వు.. లక్షాధికారి ఎలా అయ్యావురా..! అదా.. అదేం పెద్ద రహస్యమేమీ కాదు... ఫలానా ...5లో

ఫేక్‌యాప్‌లను ప్రమోట్ చేసిన వ్యక్తి అరెస్ట్

సిరిసిల్ల పట్టణం విద్యానగర్‌కు చెందిన కంసాని ఆకాష్ అనే యువకుడు సులభంగా డబ్బు సంపాదించాలన్న దురుద్దేశంతో ఇన్‌స్టాగ్రామ్ వేదికగా రాజా గేమ్స్ అనే ఫేక్ యాప్‌ను ప్రమోట్ చేశాడు. యువతను ఆకర్షించే విధంగా వీడియోలు చేసి యాప్‌లో అప్‌లోడ్ చేసి తప్పుదోవ పట్టించసాగాడు. ఆకాశ్‌పై వచ్చిన ఫిర్యాదుతో విచారణ జరిపి ఈనెల 17న పట్టణ పోలీసులు అతన్ని అదుపులోకి తీసుకున్నారు. ఎవరూ ఫేక్ యాప్‌లను నమ్మి డబ్బులు పెట్టి మోసపోకూడదని, ఫేక్ యాప్‌లతో యువతను తప్పుదోవ పట్టించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పట్టణ సీఐ హెచ్చరించారు.

రాజలింగమూర్తిని హత్య చేయించింది గండ్రే

బీఆర్ఎస్ దోపిడీని ప్రశ్నించినందుకే చంపేశారు : మంత్రి కోమటిరెడ్డి ఆరోపణ

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్



బీఆర్ఎస్ దోపిడీని ప్రశ్నించినందుకే సామాజిక కార్యకర్త రాజలింగమూర్తిని మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి హత్య చేయించారని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఆరోపించారు. గురువారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఎమ్మెల్యేలు బీర్ల ఐలయ్య, మధుసూధన్‌రెడ్డితో కలిసి ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఈ హత్యను ఆయన తీవ్రంగా ఖండించారు. బీఆర్ఎస్ పదేండ్లలో హత్యా రాజకీయాన్ని పెంచి పోషించిందని విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించి కేసీఆర్‌తోపాటు మరో ఐదుగురిపై రాజలింగమూర్తి కోర్టులో కేసు వేశారని గుర్తు చేశారు. ఈ దోపిడీలో మాజీ సీఎం కేసీఆర్‌కు దోషిగా శిక్ష పడుతుందని హెచ్చరించారు. కేసీఆర్, కేటీఆర్ హత్య చేయించారంటూ రాజలింగమూర్తి కూతురు, భార్య చెబుతున్నారని ఆయన గుర్తు చేశారు. న్యాయ వాదులు వామనరావు దంపతుల హత్యలకు ఎవరు కారణమో తెలంగాణ ప్రజలకు తెలుసని ...5లో

బీజేపీ పాలనలో ప్రజలకు మేలు జరగదు



- దోపిడీ, హింస, దౌర్జన్యాలు పెరుగుతున్నాయి :విద్యార్థుల ఉద్యమ ప్రస్థానం సదస్సులో వక్తలు

నవతెలంగాణ - ముషీరాబాద్

బీజేపీ పాలనలో ప్రజలకు మేలు జరగడం లేదని, రోజు రోజుకూ దోపిడీ, హింస, దౌర్జన్యాలు పెరిగిపోతున్నాయని పలువురు వక్తలు ఆందోళన వ్యక్తం చేశారు. హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో గురువారం పూర్వ విప్లవ విద్యార్థుల 50 ఏండ్ల ఉద్యమ ప్రస్థానంపై సదస్సు నిర్వహించారు. మొదటి సెషన్‌లో సామ మల్లారెడ్డి, అరుణ అధ్యక్షతన 'పూర్వ విద్యార్థుల అనుభవాలు' అనే అంశంపై చర్చ నిర్వహించారు. తుషార్ కాంత్, పద్మ కోడిపర్తి, ఆయుబ్, కావ్య లక్ష్మారెడ్డి విద్యార్థి దశ అనుభవాలను పంచుకున్నారు. రెండో సెషన్‌లో ప్రవీణ్ అధ్యక్షతన.. 'విప్లవ విద్యార్థి సంఘం ఆవిర్భావ నేపథ్యం, చరిత్ర సైద్ధాంతిక నేపథ్యం, 21వ శతాబ్దంలో విద్యార్థి ఉద్యమాలు' అనే అంశాలపై ఎన్.వేణుగోపాల్, అగ్రికల్చర్ యూనివర్సిటీ ఆర్ఎస్‌యు రవి నార్ల తమ అనుభవాలను పంచుకున్నారు. మూడో సెషన్‌లో విజయరాజు విష్ణు అధ్యక్షతన 'విప్లవ విద్యార్థి సంఘం- ఇతర రాష్ట్రాలపై ప్రభావం' అనే అంశంపై వివేక్ మాట్లాడారు. ఈ సందర్భంగా ఆహ్వాన సంఘం అధ్యక్షులు ప్రొఫెసర్ జగన్మోహన్‌సింగ్ మాట్లాడుతూ.. దేశంలో దోపిడీ, హింస, దౌర్జన్యాలు పోవాలంటే సమాజంలో ఐక్య ఉద్యమాలు చేయాలన్నారు. ప్రొఫెసర్ హరగోపాల్ మాట్లాడుతూ.. పాలకులు ఇప్పుడు నేరుగానే ప్రజలపై యుద్ధం చేస్తున్నారని అన్నారు. ప్రస్తుత సంక్షోభ కాలంలో మనుషులు మిగలడమే ఒక సవాలుగా మారిందన్నారు. ఈ పరిస్థితుల్లో 70, 80 దశకం నాటి విద్యార్థి పోరాటాలు సమాజానికి మార్గదర్శకం కావాలని ఆకాంక్షించారు. శివారెడ్డి మాట్లాడుతూ.. భారత విప్లవోద్యమానికి తెలంగాణలో నిర్మించిన పోరాటమే బాటగా నిలుస్తుందని చెప్పారు. డాక్టర్ గోపీనాథ్ మాట్లాడుతూ.. సమాజ మార్పు కోసం కోరే వాళ్లంతా ఏకతాటిపైకి రావాలని కోరారు. పీడీఎస్‌యూ పూర్వ నాయకులు ప్రదీప్ మాట్లాడుతూ.. ఐక్య ఉద్యమాలు నిర్మించి ఫాసిజాన్ని ఓడించాలన్నారు. ప్రొఫెసర్ కాత్యాయని విద్మహే మాట్లాడుతూ.. ఆర్ఎస్‌యూ విద్యార్థులు అడిగే ప్రశ్నలకు సమాధానం చెప్పడానికే తాను మార్క్సిజాన్ని చదువుకున్నానని చెప్పారు. 80వ దశకంలో తరగతి గదిలో విద్యార్థులకు ప్రొఫెసర్లకు మధ్య చర్చ జరిగేదని, ఇప్పుడు అలాంటి వాతావరణం లేద న్నారు. నాటి విద్యార్థులు విలువలతో కూడిన సమా జాన్ని నిర్మించేందుకు నిరంతరం కృషి చేసేవారని చెప్పారు. ప్రస్తుత సమాజంలో మానవీయ విలువలను నిలబెట్టడమే ఎలా అనేది అందరి ముందున్న ప్రశ్న అన్నారు. సదస్సుకు రమణ అధ్యక్షత వహించగా.. సాంబమూర్తి, ప్రొఫెసర్ కోదండరామ్ తదితరులు పాల్గొన్నారు.

24న జర్నలిస్టుల సమస్యలపై

రాష్ట్రవ్యాప్తంగా కలెక్టరేట్ల వద్ద నిరసన

టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపు



పరిష్కారానికి తక్షణం చర్యలు తీసుకోవాలని డిమాండ్

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 24న రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల కలెక్టరేట్ల వద్ద జర్నలిస్టులు నిరసన తెలియజేస్తూ కలెక్టర్లకు వినతి పత్రాలు సమర్పించాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్ణయించింది. జర్నలిస్టులంతా ఈ కార్యక్రమంలో విరివిగా పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చింది. హైదరాబాద్‌లో ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య అధ్యక్షతన ఫెడరేషన్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం గురువారం జరిగింది. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి బసవపున్నయ్య గత కార్యకలాపాలు, భవిష్యత్ కార్యాచరణపై నివేదిక సమర్పించారు. వివిధ జిల్లాలకు చెందిన ఫెడరేషన్ ఆఫీస్ బేరర్లు, కార్యవర్గ సభ్యులు ఆయా అంశాలపై సుదీర్ఘ చర్చలు జరిపారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న జర్నలిస్టుల సమస్యలతో పాటు తక్షణం పరిష్కరిం చాల్సిన పలు అంశాలపై సమావేశంలో చర్చించి తీర్మానాలు చేశారు. కార్యవర్గం ఆమోదించిన తీర్మానాలను ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య, ప్రధాన కార్యదర్శి బి.బసవ పున్నయ్య గురువారం మీడియాకు విడుదల చేశారు. జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు, అక్రెడిటేషన్ కార్డులు, హెల్త్ కార్డులు, పెన్షన్ స్కీం, దాడుల నివారణకు ప్రత్యేక కమిటీల ఏర్పాటు, చిన్నమధ్య తరహా పత్రికలకు ప్రభుత్వ గుర్తింపు, జర్నలిస్టుల రక్షణకు ప్రత్యేక చట్టం తదితర డిమాండ్ల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని సమావేశం డిమాండ్ చేసిందని తెలిపారు. గత ప్రభుత్వం జర్నలిస్టుల సమస్యల పరిష్కారంలో తీవ్ర నిర్లక్ష్యం చేసిందని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా ఇంత వరకు ఏ ఒక్క సమస్యనూ పరిష్క రించలేదని గుర్తు చేశారు. జర్నలిస్టులకు కొత్త అక్రెడిటేషన్ కార్డులు, హెల్త్ కార్డులు ఇవ్వకుండా జీవో 239 సమీక్ష, సవరణ కమిటీ పేరుతో కాలయాపన చేస్తున్నదనీ, దీని మూలంగా జర్నలిస్టులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తాము అధికారం లోకి రాగానే జర్నలిస్టు లకు ఇండ్ల స్థలాలిస్తామని గత ఎన్నికల్లో హామీ ఇచ్చిన ప్రభుత్వం, ఇప్పుడు సుప్రీంకోర్టు తీర్పును సాకుగా చూపి జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు ఇవ్వకుండా కాల యాపన చేస్తూ తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నదని వ్యాఖ్యానించారు. జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించడానికి కొత్త ప్రభుత్వానికి ఏడాదిగా సమయం ఉన్నా ఇంతవరకు పరిష్కరించలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

25 నుంచి సభ్యత్వ నమోదు

రాష్ట్రవ్యాప్తంగా ఈనెల ఫిబ్రవరి 25 నుంచి మార్చి 25వ తేదీ వరకు నెల రోజుల పాటు ఫెడరేషన్ సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టాలని సమావేశం తీర్మానం చేసింది.అన్ని జిల్లాల్లో సభ్యత్వ నమోదు జరుగుతుందని, జర్నలిస్టులంతా ఐక్యత, హక్కుల సాధన కోసం ఫెడరేషన్‌లో సభ్యులుగా చేరి భవిష్యత్తు కార్యాచరణలో భాగస్వాములు కావాలని వారు పిలుపునిచ్చారు. సభ్యత్వ నమోదు ప్రక్రియ పూర్తయిన తర్వాత అన్ని జిల్లాల ఫెడరేషన్ మహాసభలు నిర్వహించాలని, మార్చి 29న రాష్ట్రస్థాయి విస్తృత సమావేశం జరపాలని సమావేశం నిర్ణయించినట్టు వారు తెలిపారు. ఈ సమావేశంలో ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు పులిపల్పుల ఆనందం, పిల్లి రాంచందర్, బండి విజయ్ కుమార్, ఎల్గోయి ప్రభాకర్, గుడిగ రఘు, కొప్పు నిరంజన్, విజయానంద్, కోశాధికారి రాచమల్ల వెంకటేశ్వర్లు, కార్యదర్శులు ఎస్ కే సలీమా, ఈ చంద్రశేఖర్, తన్నీరు శ్రీనివాస్, కర్రా అనిల్ రెడ్డి, బి జగదీష్, బి రాజశేఖర్, మాణిక్‌ప్రభు, గండ్ర నవీన్, కార్యవర్గ సభ్యులు మణిమాల, కె. పాండు రంగారావు, నాయిని శ్రీనివాస రావు, పి. నాగవాణి, పరిపూర్ణం, రమేష్, మధుకర్, జ్యోతిబసు, అరుణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రేఖా గుప్తా అను నేను..

- ఢిల్లీ ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం

ఆరుగురు మంత్రులు కూడా..



న్యూఢిల్లీ : ఢిల్లీ ముఖ్యమంత్రిగా రేఖాగుప్తా గురువారం ప్రమాణస్వీకారం చేశారు. మరో ఆరుగురు ఎమ్మెల్యేలు మంత్రులుగా ప్రమాణస్వీకారం చేశారు. గురువారం మధ్యాహ్నం రామ్‌లీలా మైదానంలో అట్ట హాసంగా జరిగిన కార్యక్రమంలో ముఖ్యమంత్రిగా రేఖాగుప్తా చేత లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమంలో ప్రధాని మోడీ, పలువురు కేంద్ర మంత్రులు, ఎన్డీఏ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు, బీజేపీ అగ్రనాయకులు హాజరయ్యారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ పాల్గొన్నారు. ఆప్ నుంచి రాజ్యసభకు ఎంపికైన స్వాతి మలివాల్ కూడా ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.



చాక్లెట్ కొనిస్తామని

చిన్నారిపై లైంగికదాడి

- సంగారెడ్డి జిల్లాలో దారుణం

సంగారెడ్డి: సంగారెడ్డి జిల్లాలో దారుణం చోటు చేసుకుంది. 8 ఏండ్ల చిన్నారిపై ఇద్దరు యువకులు లైంగికదాడికి పాల్పడ్డారు. ఇంటి బయట ఆడుకుంటున్న బాలికను చాక్లెట్ కొనిస్తామని చెప్పి తీసుకెళ్లి అఘాయిత్యానికి ఒడిగట్టారు. తీవ్ర రక్తస్రావంతో బాలిక కేకలు వేయడంతో అక్కడి నుంచి పారిపోయారు. అక్కడికి చేరుకున్న కుటుంబీకులు, బంధువులు బాధితురాలిని సంగారెడ్డి ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

నైపుణ్యాల్లేవ్

గ్రాడ్యుయేట్లలో 42 శాతం మందే ఉపాధికి అర్హులు

భారతీయ గ్రాడ్యుయేట్లలో ఉపాధికి తగిన నైపుణ్యాలు కరువయ్యాయి. దీనికి తోడు దేశంలో ఉద్యోగ అవకాశాలు సన్నగిల్లటంతో వారి పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. గతేడాది భారత గ్రాడ్యుయేట్లలో 42 శాతం మందే ఉపాధికి అర్హులుగా ఉన్నారు. 2023తో పోల్చుకుంటే ఈ సంఖ్య కాస్త తగ్గటం గమనార్హం. మెర్సర్-మెట్ల్ నివేదిక ఈ విషయాన్ని వెల్లడించింది. ప్రధానంగా వారిలో సాంకేతికేతర నైపుణ్యాలు లేకపోవటం ఈ తగ్గుదలకు కారణమని పేర్కొన్నది. కన్సల్టింగ్ సంస్థ మెర్సర్ నివేదిక భారత్‌లోని యువత నైపుణ్య సంసిద్ధత సమగ్ర విశ్లేషణను అందిస్తుంది. 31 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలలోని 2700 కంటే ఎక్కువ క్యాంపస్‌ల నుంచి డేటా సేకరించింది. పది లక్షల కంటే ఎక్కువ మంది విద్యార్థులను ఇది కవర్ చేస్తుంది.

స్వల్పంగా నమోదైన తగ్గుదల

ఉపాధి సామర్థ్యాల్లోనూ అంతరాలు : మెర్సర్ నివేదిక

న్యూఢిల్లీ : మెర్సర్-మెట్ల్ ఇండియాస్ గ్రాడ్యుయేట్ స్కిల్ ఇండెక్స్ 2025 ప్రకారం.. ఉపాధిలో ఢిల్లీ అత్యధికంగా 53.4 శాతంతో అగ్రస్థానంలో ఉన్నది. 51.1 శాతంతో హిమాచల్ ప్రదేశ్, పంజాబ్‌లు తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. ఈ నివేదిక సమాచారం ప్రకారం.. టైర్ 1 కళాశాలల నుంచి గ్రాడ్యుయేట్లు సాంకేతిక, సాంకేతికేతర నైపుణ్యాలలో అధిక ఉపాధిని ప్రదర్శిస్తుండగా.. టైర్ 2, టైర్ 3 కాలేజీల నుంచి పట్టభద్రులు కొంత నైపుణ్యాన్ని ప్రదర్శిస్తున్నారు. గ్రాడ్యుయేట్ల ప్రతిభ వినియోగం కాని తీరును కూడా నివేదిక నొక్కి చెప్పింది. గ్రాడ్యుయేట్లు నిరంతర అభ్యాస మనస్తత్వాన్ని స్వీకరించాలనీ, సాధనలతో వారు తమను తాము సన్నద్ధం చేసుకోవాలని మెర్సర్ ఇండియా అధ్యక్షుడు సిద్ధార్థ గుప్తా నివేదికలో పేర్కొన్నారు.

విశ్లేషకులు, మాన వనరులు, డిజిటల్ మార్కెటింగ్ వంటి సాంకేతికేతర రంగాలలో భారతీయ గ్రాడ్యుయేట్ల ఉపాధి సామర్థ్యం 2023లో 48.3 శాతం ఉండగా.. అది 2024లో 43.5 శాతానికి పడిపోయింది. నైపుణ్య అవసరాల విషయంలో కొత్త ప్రతిభ కోసం కంపెనీల అంచనాలు వేగంగా పెరుగుతున్నాయి. సాఫ్ట్ స్కిల్స్‌తో పాటు సాంకేతిక, సాంకేతికేతర నైపుణ్యాల విభిన్న కలయిక కలిగిన గ్రాడ్యుయేట్లకు డిమాండ్ పెరుగుతున్నది. ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్ ఉపాధి సామర్థ్యం 45.1 శాతంగా ఉన్నది. బిజినెస్ అనలిస్ట్ రోల్స్‌కు 44.5 శాతంగా ఉండటం గమనార్హం. డిమాండ్ ఉన్న ఇతర అగ్ర సాంకేతికేతర ఉద్యోగాలతో పోలిస్తే హెచ్ఆర్ అసోసియేట్ రోల్స్ 39.9 శాతంతో అత్యల్ప ఉపాధి సామర్థ్యాన్ని కలిగి ఉన్నాయి. డిజిటల్ మార్కెటింగ్ 41 శాతంతో ఇతర ఉద్యోగాలతో పోలిస్తే వెనకబడి ఉన్నది.

సాంకేతిక పాత్రలకు ఉపాధి కల్పించే సామర్థ్యం 2023లో 41.3 శాతం నుంచి 2024లో 42 శాతానికి కొద్దిగా పెరిగింది. భారతీయ గ్రాడ్యుయేట్లు కృత్రిమ మేధ(ఏఐ), మెషిన్ లెర్నింగ్ (ఎంఐ) పాత్రలలో వేగాన్ని కొనసాగించ గలిగారు. అయితే, డేటా సైంటిస్ట్, బ్యాక్-ఎండ్ డెవలపర్ రోల్స్‌లో 39.8 శాతంతో గ్రాడ్యుయేట్లు అతి తక్కువ ఉపాధిని చూపించటం గమనార్హం. ఏఐ, జెన్ ఏఐతో సంభాషించటానికి అవసరమైన సాఫ్ట్ స్కిల్స్‌లో 50 శాతం మంది భారతీయ గ్రాడ్యుయేట్లు బలమైన సామర్థ్యాన్ని ప్రదర్శిస్తున్నారు. కమ్యూనికేషన్ స్కిల్స్ 55.1 శాతం, క్రిటికల్ థింకింగ్ 54.6 శాతం, నాయకత్వ నైపుణ్యాలు 54.2 శాతంతో ఉపాధిలో కాస్త పర్వాలేదనిపించాయి.

టైర్ 1 కళాశాలల్లో అత్యధిక ఉపాధి అవకాశాలు

దేశంలో కళాశాల స్థాయి ఆధారంగా వివిధ సాంకేతిక, సాంకేతికేతర పాత్రలలో ఉపాధి అవకాశాలు మారుతున్నాయి. భారతీయ గ్రాడ్యుయేట్లలో మొత్తం ఉపాధి అవకాశాలు టైర్ 1 కళాశాలల్లో అత్యధికంగా 48.4 శాతంగా ఉన్నాయి. తర్వాత స్థానంలో టైర్ 2(46.1 శాతం), టైర్ 3 (43.4శాతం) కాలేజీలు ఉన్నాయి.

లింగ అంతరం

పురుష గ్రాడ్యుయేట్లు.. మహిళల కంటే స్వల్పంగా ఉపాధిని ఎక్కువగా కలిగి ఉన్నారు. పురుష విద్యార్థులలో ఉపాధి సామర్థ్యం 43.4 శాతంగా ఉన్నది. మహిళా విద్యార్థులలో ఇది 41.7 శాతం ఉం డటం గమనార్హం. సాంకేతిక ఉద్యోగాలలో పురుష గ్రాడ్యుయేట్లలో ఉపాధి సామర్థ్యం 43.9 శాతంగా ఉన్నది. ఇది మహిళల విషయంలో 41.9 శాతంగానే ఉన్నది. ఏఐ, ఎంఎల్, డేటా సైంటిస్ట్ పాత్రలలో పురు షులు, మహిళా గ్రాడ్యుయేట్లు సమాన సామర్థ్యాన్ని కలిగి ఉన్నారు. డిజిటల్ మార్కెటింగ్‌కు మహిళా గ్రాడ్యుయేట్లు 42 శాతంతో ఎక్కువ అవకాశాలను కలిగి ఉన్నారు. పురుషుల విషయంలో ఇది 40 శాతమే కావటం గమనార్హం.

ఉపాధి సామర్థ్యం ఎక్కువ కలిగిన రాష్ట్రాలు

అత్యధిక ఉపాధి సామర్థ్యం కలిగిన రాష్ట్రాలలో ఢిల్లీ, హిమాచల్‌ప్రదేశ్, పంజాబ్, అసోం, తెలంగాణలు ముందు వరుసలో ఉన్నాయి. ఢిల్లీలో మొత్తం ఉపాధి సామర్థ్యం 53.4 శాతంగా ఉంటే.. హిమాచల్, పంజాబ్ రాష్ట్రాలలో ఇది 51.1 శాతంగా ఉన్నది. అసోంలో 48.2 శాతంగా, తెలంగాణలో 47.6 శాతంగా ఉన్నది. జార్ఖండ్, ఉత్తరాఖండ్‌లు కూడా మంచి ప్రదర్శననే కనబర్చాయి. పశ్చిమ బెంగాల్ 49 శాతంతో మంచి ఉపాధి అవకాశాలను కలిగి ఉన్నది.



సాంకేతిక ఉపాధిలో ఢిల్లీ ఫస్ట్

సాంకేతిక ఉపాధి పరంగా ఢిల్లీ 52.6 శాతంతో అత్యధిక రేటుతో ముందు వరుసలో ఉన్నది. ఉత్తరాఖండ్ 50.3 శాతం, పంజాబ్ 49.7 శాతం ఉపాధి రేటుతో తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. అయితే, సాంకేతిక ఉపాధికి సంబంధించి టాప్ 10లో దక్షిణాది నుంచి ఏ ఒక్క రాష్ట్రమూ లేకపోవటం గమనార్హం. జార్ఖండ్ 51.5 శాతంతో, తెలంగాణ 51.3 శాతంతో నాన్-టెక్నికల్ ఉద్యోగాలకు బలమైన ఉద్యోగావకాశాలను చూపిస్తున్నాయి. 50.3 శాతంతో ఏపీ ఈ ఉద్యోగాల్లో ఏడో స్థానంలో ఉన్నది.

నోరు అదుపులో పెట్టుకో

రాష్ట్ర ప్రయోజనాలకు భిన్నంగా కేంద్ర బడ్జెట్ ఉన్నా మీ స్పందనేదీ?

- బీజేపీ పట్ల బీఆర్ఎస్ వైఖరేంటి: కేసీఆర్‌కు సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ ప్రశ్న



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై సీపీఐ(ఎం), కమ్యూనిస్టులు నిరంతరం స్పందించి ఉద్యమాలు నిర్మిస్తున్నారని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ తెలిపారు. కమ్యూనిస్టులు కాంగ్రెస్‌కు తొత్తులుగా మారారంటూ బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ వ్యాఖ్యానించడాన్ని తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు ఆయన బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కమ్యూనిస్టుల గురించి మాట్లాడేటప్పుడు నోరు అదుపులో పెట్టుకోవాలని కేసీఆర్‌ను హెచ్చరించారు. రాష్ట్ర ప్రయోజనాలకు భిన్నంగా, శ్రామిక వర్గం, అణగారిన వర్గాలకు వ్యతిరేకంగా, విద్యావైద్యం, ఉపాధి అవకాశాల్లేకుండా సంపదను కార్పొరేట్ సంస్థలకు ధారాదత్తం చేసే పద్ధతిలో కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌ను ప్రవేశపెట్టిందని విమర్శించారు. దానిపై కేసీఆర్ ఎందుకు మాట్లాడటం లేదనీ, బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఎందుకు పోరాటాలు చేయడం లేదనీ, ప్రజా సమస్యలపై కేంద్ర ప్రభుత్వాన్ని ఎందుకు నిలదీయడం లేదని ప్రశ్నించారు. ఇలా వ్యవహరించడం లేదంటే బీజేపీకి బీఆర్ఎస్ తొత్తుగా వ్యవహరిస్తున్నట్టేనా? అని అడిగారు. పార్లమెంటు ఎన్నికల సందర్భంగా బీజేపీకి ఓట్లు వేయించి ఆ పార్టీ ఎంపీ సీట్లు గెలవడానికి, రాష్ట్రంలో బలపడటానికి కేసీఆర్ వైఖరి తీసుకున్నారని విమర్శించారు. బీఆర్ఎస్ అనుసరించిన ఈ వైఖరి వల్ల బీజేపీకి ఆ పార్టీ తొత్తుగా వ్యవహరిస్తున్నట్టే కదా?అని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రయోజనాలకు భిన్నంగా బీజేపీ వ్యవహరిస్తున్నా కేసీఆర్ ఎందుకు ప్రశ్నించడం లేదని అడిగారు. కేంద్ర ప్రభుత్వానికి, మోడీకి కేసీఆర్ భయపడుతున్నారా?అని నిలదీశారు. అందుకే కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటాలు నిర్వహించడం లేదా? ఈ విషయంపై బీఆర్ఎస్ స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. దేశంలో లౌకికశక్తులన్నీ మతోన్మాదానికి వ్యతిరేకంగా పోరాడుతున్నాయనీ, దానిలో బీఆర్ఎస్ కలిసి రావడం లేదని పేర్కొన్నారు. రాజ్యాంగ హక్కులను నిర్వీర్యం చేస్తుంటే దాని గురించి మాట్లాడ్డం లేదని తెలిపారు. రిజర్వేషన్లను నిరుపయోగంగా మారుస్తుంటే అడగడం లేదని పేర్కొన్నారు. రాష్ట్రాల హక్కులను హరిస్తుంటే, ఫెడరల్ స్ఫూర్తికి విరుద్ధంగా పాలన సాగిస్తుంటే రాష్ట్రంలో ప్రధాన ప్రతిపక్ష పార్టీ, గతంలో అధికారంలో ఉన్న బీఆర్ఎస్, ఆ పార్టీ అధినేత కేసీఆర్ ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. మతోన్మాద రాజకీయాలకు వ్యతిరేకంగా, లౌకిక పార్టీగా బీఆర్ఎస్ వ్యవహరించడం లేదని అన్నారు. బీజేపీ పట్ల బీఆర్ఎస్ వైఖరేంటో స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ప్రజా సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమవుతున్నదని విమర్శించారు. ఇచ్చిన హామీలను అమలు చేయడంలో వైఫల్యం కనిపిస్తున్నదని తెలిపారు. రాష్ట్ర బడ్జెట్‌లో వాటిని పరిష్కరించాలని కోరుతూ సీపీఐ(ఎం), ప్రజా సంఘాలు ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తున్నాయని వివరించారు. కేసీఆర్ మాత్రం ప్రధాన ప్రతిపక్ష నాయకుడిగా ఉండి ఫాంహౌజ్‌కే పరిమితమయ్యారనీ, బయటికి రావడం లేదని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడ్డం లేదనీ, రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాటాలు చేయడం లేదని తెలిపారు. ఆయన అవకాశవాద రాజకీయాలను అనుసరిస్తున్నారని విమర్శించారు. బీఆర్ఎస్ విధానాలను మార్చుకుని ప్రజా సమస్యలపై పోరాటాలకు సన్నద్ధం కావాలని కోరారు. బీజేపీ మతోన్మాదానికి వ్యతిరేకంగా జరిగే పోరాటంలో లౌకిక శక్తులతో కలిసొచ్చి పాల్గొనాలని సూచించారు. లేదంటే రాష్ట్రంలో బీఆర్ఎస్ అంతరించిపోయే పరిస్థితులొస్తాయని ఆయన హెచ్చరించారు.

ప్రజా వ్యతిరేక విధానాలపై ఉద్యమిస్తున్నది కమ్యూనిస్టులే


భారతీయులు సురక్షితం : పనామా



పనామా సిటీ : అమెరికా ప్రభుత్వం మొత్తంగా 299మంది మైగ్రేంట్లను పనామాకు పంపించింది. అందులో భారతీయుల బృందం కూడా వుంది. భారతీయులందరూ సురక్షితంగా ఇక్కడకు చేరుకున్నారని పనామా భారత్‌కు తెలియచేసింది. వారికి అవసరమైన చర్యలు తీసుకునేలా ఆ దేశంలోని భారత రాయబార కార్యాలయం, అక్కడి ప్రభుత్వంతో కలిసి పనిచేస్తోంది. భారతీయులు గురువారం పనామా చేరుకున్న విషయాన్ని ఎక్స్‌లో పోస్టు చేసింది. అయితే ఎంతమంది భారతీయులు వచ్చారన్న సమాచారం పంచుకోలేదు. వీరిలో ఎక్కువమంది పంజాబ్, హర్యానా, గుజరాత్‌లకు చెందినవారున్నారు. మూడు విమానాల్లో వీరందరినీ అమెరికా నుంచి ఇక్కడకు తీసుకువచ్చారు. సరైన పత్రాలు లేకుండా నివసిస్తున్న 299మందిలో కేవలం 171 మంది మాత్రమే వారి స్వంత దేశాలకు వెళ్ళేందుకు అంగీకరించారు. వారి దేశాలకు స్వచ్ఛందంగా పంపించడానికి తిరస్కరించిన 98మందిని పనామాలోని డేరియన్ ప్రావిన్స్‌లోని శిబిరానికి తరలించారు. అమెరికా తరలించిన వారిని ఆయా దేశాలకు పంపించే ప్రక్రియలో పనామా అనుసంధాన దేశంగా వ్యవహరించడానికి గత వారం పనామా అధ్యక్షుడు జోస్ రాల్ ములినో అంగీకరించారు. కోస్టారికా కూడా ఇందుకు అంగీకారం తెలిపింది. అమెరికాలో చట్టబద్ధమైన పత్రాలు లేకుండా నివసిస్తున్న వారందరినీ వారి దేశాలకు పంపివేస్తామని ట్రంప్ ప్రభుత్వం ప్రకటించింది. ఆ మేరకు చర్యలు తీసుకుంటోంది. వారు సురక్షితంగా అన్ని సదుపాయాలు వున్న హోటల్‌లో బస చేశారని, వారికి అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని పనామా, నికారాగ్వా, కోస్టారికాలకు భారత ఎంబసీ కార్యాలయం ఎక్స్ పోస్టులో తెలిపింది.

సహకరించకుంటే తొత్తులా?

(మొదటి పేజీ తరువాయి)



లేకుంటే పేద వాడి గురించి పోరాడే వారు లేరని పేర్కొన్నారు. కమ్యూనిస్టులు, మావోయిస్టుల విధానమే తమ విధానమంటూ అనేక సార్లు కేసీఆర్ అన్నారని గుర్తు చేశారు. కమ్యూనిస్టులు పోరాటం చేయడం లేదనీ, బీఆర్ఎస్ పోరాటం చేస్తున్నట్టు ఆయన వ్యాఖ్యలు చేయడం తప్పుడు సంకేతాలకు దారితీస్తున్నదని పేర్కొన్నారు. మాజీ ముఖ్యమంత్రిగా, తెలంగాణ సాధించిన వ్యక్తిగా కేసీఆర్‌ను గౌరవిస్తామనీ, దాన్ని కాపాడుకోవాలని సూచించారు. ముఖ్యమంత్రి పదవి లేకుండా కేసీఆర్ ఉండలేరా?అని ప్రశ్నించారు. ప్రతిపక్ష నాయకుడిగా కేసీఆర్ ప్రజా సమస్యలపై పోరాటం చేయాలని కోరారు. ఎక్కడో ఉండి మాట్లాడకుండా ప్రతిపక్ష నాయకుడిగా అసెంబ్లీకి వచ్చి మాట్లాడాలని సూచించారు. వందేండ్ల చరిత్ర కలిగిన సీపీఐకి ఎవరికి మద్దతు ఇవ్వాలో ఎవరికి వ్యతిరేకంగా ఎప్పుడు మాట్లాడాలో ప్రజల అభిప్రాయాలకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తే ఎవరిపైనైనా పోరాటం చేస్తామని హెచ్చరించారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు పోరాటం చేశామని గుర్తుచేశారు. బీఆర్ఎస్‌కు అనుకూలంగా ఉన్న ప్పుడు ఆర్టీసీకి చేసిన అన్యాయం వల్ల హుజూరా బాద్‌లో జరిగిన ఉప ఎన్నికల్లో మద్దతు ప్రకటించ లేదని తెలిపారు. మునుగోడు ఉప ఎన్నికల్లో మద్దతిచ్చినా ఎవరికీ చేయనంత మోసం కమ్యూనిస్టులకు కేసీఆర్ చేశారని విమర్శించారు. కమ్యూనిస్టుల ఎజెండా తీసుకుం టామనీ, ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడతా మనీ, కార్మికులకు అనుకూలమైన చట్టాలు చేస్తామని చెప్పి తీరని అన్యాయం చేశారని పేర్కొన్నారు. సింగరేణి, ఆర్టీసీ, జెన్‌కో, తెలంగాణ ప్రధాన పరిశ్రమలకు బీఆర్ఎస్ అన్యాయం చేసిందని తెలిపారు. ఆర్టీసీకి సమ్మె నోటీసు ఇచ్చింది కమ్యూనిస్టు పార్టీ అనుబంధ సంఘమనీ, జెన్‌కోలో పోరాటాలు కమ్యూనిస్టులు చేస్తున్నారని పేర్కొన్నారు. బీఆర్ఎస్ రాజకీయ పోరాటం చేస్తున్నదనీ, ఎంత తొందరగా అధికారంలోకి రావాలని భావిస్తున్నదని తెలిపారు. బీఆర్ఎస్ అధికార ఆరాటం కోసం కమ్యూనిస్టులను ఎందుకు అడ్డుపెట్టుకుంటు న్నారని సాంబశివరావు ప్రశ్నించారు. ప్రజల కోసం నిరంతరం పోరాటం చేస్తామనీ, ఎప్పుడు నెగ్గాలో ఎప్పుడు తగ్గాలో తమకు తెలుసునని తెలిపారు. కమ్యూనిస్టులపై కేసీఆర్ నిజంగా అలాంటి వ్యాఖ్యలు చేస్తే వారికే నష్టమని పేర్కొన్నారు.

గాజాలోకి మొబైల్ ఇండ్లు

రఫా క్రాసింగ్‌ను దాటిన సహాయ ట్రక్కులు



గాజా : ఇజ్రాయిల్‌తో కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందంలో భాగంగా సహాయ ట్రక్కులు గాజాలోకి ప్రవేశిస్తున్నాయి. అందులో భాగంగా 15 మొబైల్ ఇంట్లతో కూడిన సహాయ ట్రక్కులు ఈజిప్ట్ నుంచి గాజాకు వస్తున్నాయని ఈజిప్ట్ మీడియా తెలిపింది. మొత్తంగా ఐదు ట్రక్కులు, బుల్డోజర్ ఈజిప్ట్ వైపు గల రాఫా క్రాసింగ్‌ను దాటి కరీం అబూ సలేం టెర్మినల్ వద్దకు వచ్చాయని, ఇక గాజాలోకి అనుమతించడమే తరువాయని ఈజిప్ట్ టెలివిజన్ చానెల్ అల్ కహెరా న్యూస్ తెలిపింది. కాగా గాజాలోని పాలస్తీనా అధికారుల నుండి దీనిపై వెంటనే ఎలాంటి సమాచారం అందలేదు. మరోవైపు గాజాలో పోలియో వ్యాక్సిన్ వేసేందుకు చర్యలు ప్రారంభం కావాల్సి వుంది. ఇప్పటికే పోషకాహారం లేక దుర్భర స్థితిలో వున్న చిన్నారులకు కేవలం ఇలా వ్యాక్సిన్లు అందిస్తే సరిపోదని, వారికి సమతుల ఆహారం అందించాల్సి వుందని సేవ్ ది చిల్డ్రన్ సంస్థ పేర్కొంది.

ఇజ్రాయిల్ దాడుల్లోనే వారు చనిపోయారు నాలుగు మృతదేహాల అప్పగింత

హమాస్ తమ చెరలో వుండగా ఇజ్రాయిల్ దాడుల్లో మరణించిన నలుగురు బందీల మృతదేహాలను గురువారం అప్పగించింది. ఖాన్ యూనిస్ నగరంలో ఈ అప్పగింత కార్యక్రమం జరిగింది. షిరి, యార్డెన్ బీబాస్ వారి ఇద్దరు కుమారులను ఆనాడు హమస్ బందీలుగా తీసుకెళ్ళింది. అయితే వారిలో తండ్రిని గత కాల్పుల విరమణ సందర్భంగా విడుదల చేసింది. బందీలుగా వారిని అదుపులోకి తీసుకున్నపుడు పిల్లల వయస్సు అరియల్ (4), కిఫిర్ (9మాసాలు)గా వుంది. వీరు ముగ్గురు ఇజ్రాయిల్ జరిపిన వైమానిక దాడిలోనే మరణించారని హమాస్ వెల్లడించింది. హమస్ బందీల్లో కిఫిర్ అత్యంత పిన్న వయస్కుడు. 2023 నవంబరులో హమాస్ ఈ మేరకు ప్రకటన చేసింది. అయితే ఈ మరణాలను ఇజ్రాయిల్ అధికారులు ధృవీకరించలేదు. చివరి నిముషంలో కూడా వారు మరణించారని అంగీకరించడానికి కొంతమంది తిరస్కరించారు. మొదటి కాల్పుల విరమణ ఒప్పందంలో భాగంగా యార్డెన్ బీబాస్‌ను అప్పగించారు. ఇప్పుడు తల్లి, ఇద్దరు పిల్లలు సజీవంగా వారి కుటుంబ సభ్యులను కలుసుకోలేకపోయారని హమస్ వ్యాఖ్యానించింది. తమ వద్ద వుండగా వారిని అత్యంత మానవతా దృక్పథంతో చూసుకున్నామని కానీ ఇజ్రాయిల్ అటువంటి వారి గురించి ఆలోచించకుండా దాడులు జరిపి వారి ప్రాణాలను పొట్టనబెట్టుకుందిన హమాస్ విమర్శంచింది.

విచారణను ఎదుర్కొంటున్న దక్షిణ కొరియా అధ్యక్షుడు యూన్



సియోల్ : క్రిమినల్ కేసులో విచారణను ఎదుర్కొంటున్న దక్షిణ కొరియా అధ్య క్షుడు యూన్ సుక్ యోల్ గురువారం కోర్టుకు హాజరయ్యారు. గతేడాది డిసెంబరులో దేశంలో కొద్ది గంటల పాటు సైనిక పాలన విధించి తిరుగుబాటుకు కుట్ర పన్నారన్న క్రిమినల్ అభియో గాలతో అరెస్టు చేయడంపై యూన్ తరపు న్యాయవాదులు వాదిస్తున్నారు. సియోల్ సెంట్రల్ జిల్లా కోర్టులో జరుగుతున్న విచారణకు అధ్యక్షుడు రావడంతో ఆ ప్రాంతమంతా గట్టి బందోబస్తు చేశారు. ఆయన మద్దతుదారులు వందల సంఖ్యలో ర్యాలీలు నిర్వహించారు. క్రిమినల్ కేసులో ఇలా విచారణను ఎదుర్కొంటున్న మొదటి సిట్టింగ్ అధ్యక్షుడు యూన్. ముందుగా సాక్షులను విచారించిన తర్వాత యూన్ తరపు న్యాయవాదులు ఆయన అరెస్టును రద్దు చేసి కస్టడీ నుండి విడుదల చేయాల్సిందిగా కోరుతూ చేసిన అభ్యర్థనను కోర్టు పరిశీలించనుంది. డిసెంబరు 14ను అధ్యక్షుడిని అభిశంసించిన తర్వాత ఆయన అధ్యక్ష అధికారాలను రద్దు చేశారు. ఇప్పుడు ఆయనను లాంఛనంగా పదవి నుండి తొలగించాలా లేక పార్లమెంట్ అభిశంసనను రద్దు చేసి, తిరిగి అధ్యక్ష పీఠంపై అధిష్టించాలా అని రాజ్యాంగ న్యాయస్థానం యోచిస్తోంది.

విద్య కేంద్రం గుత్తసొత్తు కాదు

ఉమ్మడి జాబితాలోని అంశమే | మోడీ సర్కార్ వైఖరితో రాష్ట్రాలు రిబ్బన్ కటింగ్‌లకే పరిమితమవుతాయి

- స్వయం ప్రతిపత్తి లేకుండా నాణ్యమైన విద్యనందించలేం
- దీనిపై ఉమ్మడి లక్ష్యంతో పోరాడుదాం : కేరళలో జాతీయ ఉన్నత విద్యా సమ్మేళనంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పిలుపు



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

"విద్య అనేది కేంద్రం గుత్తసొమ్ము కాదు. ఇది ఉమ్మడి జాబితాలోని అంశం. ఆయా రాష్ట్రాలు వారి ప్రజలకు సరిపోయే విద్యాసంస్థలను, వ్యవస్థలను నిర్మించుకుంటాయి, విద్య, ఆరోగ్య రంగాల్లో రాష్ట్రాల స్వయంప్రతిపత్తిని కేంద్రం గౌరవించాలి. ఒక రాష్ట్రానికి మరో రాష్ట్రానికి పోలిక ఉండదు. స్వయం ప్రతిపత్తి లేకుండా నాణ్యమైన విద్యను ఏ రాష్ట్రమూ అందించ లేదు. మోడీ సర్కార్ వైఖరి ఇలాగే ఉంటే రాష్ట్రాలు రిబ్బన్ కటింగ్‌లకే పరిమితమవుతాయి. దీనిపై అందరం ఉమ్మడి లక్ష్యంతో పోరాడుదాం" అని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు. గురువారం కేరళలోని తిరువనంతపురంలో జరిగిన జాతీయ ఉన్నత విద్యా సమ్మేళనంలో ఆయన మన రాష్ట్రం తరపున పాల్గొని ప్రసంగించారు. యూజీసీ ముసాయిదా నిబంధనల ప్రభావం, రాష్ట్రాల స్వయం ప్రతిపత్తి, తెలంగాణ విద్యారంగంలో చేపట్టిన కార్యక్రమాలపై ఆయన ఈ సందర్భంగా వివరించారు. అనంతరం పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. "మీరు బిల్లు చెల్లించాలి, కానీ ఫుడ్ ఆర్డర్ చేయలేరు" అనే తరహాలో యూజీసీ కొత్త నిబంధనలు ఉన్నాయని ఎద్దేవా చేశారు. రాష్ట్ర ప్రభుత్వాలు యూనివర్సిటీలకు నిధులు సమకూర్చడంతో పాటు నిర్వహించాలని మాత్రమే కేంద్రం భావిస్తోందని విమర్శించారు. వైస్ ఛాన్సలర్ల నియామకాల నుంచి అడ్మిషన్ల వరకు కీలకమైన నిర్ణయాల్లో రాష్ట్ర ప్రభుత్వాల పాత్రను తొలగిస్తున్నారనీ, ఇది ఇలాగే కొనసాగితే అవి నిధులను సమకూర్చడం వరకే పరిమితమవుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. "దేశంలో విద్యావ్యవస్థను ఢిల్లీ నుంచి రిమోట్ కంట్రోల్ ద్వారా నడపలేం. రాష్ట్రాల అవసరాలకు అనుగుణంగా విధానాలను రూపొందించాలి. సహకారం అంటే బలవంతం కాదు... సంప్రదింపులు అని అర్థం, కేంద్రం నిజంగా సహకార సమాఖ్య వాదాన్ని విశ్వసిస్తే రాష్ట్రాలతో చర్చించాలి. వాటి స్వయం ప్రతిపత్తిపై అత్యున్నత న్యాయస్థానం రాజస్థాన్ వర్సెస్ భారతీయ యూనియన్ కేసులో 'భారతదేశం ఒక సమాఖ్య రాజ్యాంగంగా ఉంది" అని పేర్కొన్న అంశాన్ని భట్టి ఈ సందర్భంగా వివరించారు. కేశవానంద భారతి వర్సెస్ కేరళ రాష్ట్రం కేసులో 'సమాఖ్య వ్యవస్థ భారత రాజ్యాంగంలోని ప్రామాణిక లక్షణం' అని పేర్కొన్న సందర్భాన్నీ ఆయన ఉదహరించారు.

అండర్ గ్రాడ్యుయేట్ కోర్సుల్లో ప్రవేశానికి ప్రవేశ పరీక్ష తప్పనిసరి చేయడం మూలంగా వెనుకబడిన వర్గాలకు చెందిన విద్యార్థులు ఉన్నత విద్యకు దూరం అయ్యే అవకాశముందని భట్టి ఆవేదన వ్యక్తం చేశారు. బ్రూకింగ్స్ నివేదిక ప్రకారం దేశంలోని ఉన్నత విద్యాసంస్థల్లో సగటున 690 మంది విద్యార్థులుండగా, చైనాలో అది16,000 గా ఉన్నదని తెలిపారు. మూడు వేల మంది విద్యార్థుల నమోదు కనిష్ఠ ప్రామాణికంగా పెడితే అనేక ఉన్నత విద్యాసంస్థలు మంచి ర్యాంకింగ్, ఫండింగ్ పొందే అవకాశాలు కోల్పోతాయని పేర్కొన్నారు. ఈ విధానం కార్పొరేట్, ప్రయివేటు సంస్థలను ప్రోత్సహి స్తుందనీ, అదే సందర్భంలో సంక్షేమ లక్ష్యంతో పని చేసే విద్యా సంస్థలకు తీవ్ర నష్టం కలిగిస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఉన్నత విద్య విషయంలో సరైన మార్గాన్ని ఎంచుకునే అవకాశం రాష్ట్రాలకు ఇవ్వకుండా మోడీ సర్కార్ యూజీసీ విషయంలో మొండిగా వ్యవహరిస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని ఆయన హెచ్చరించారు. రాష్ట్రాలు తమ హక్కులను కాపాడుకు నేందుకు మోడీ సర్కార్ విధానాలకు వ్యతిరేకంగా ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్, ఆ రాష్ట్ర ఉన్నత విద్యా శాఖ మంత్రి ఆర్.బిందు, కర్నాటక మంత్రి ఎంసీ. సుధాకర్ అవారే, తమిళనాడు నుంచి తిరుగోవి చేజియాన్, పంజాబ్ నుంచి సర్దార్ హరోజ్‌సింగ్ తోపాటు ప్రముఖ విద్యావేత్తలు పాల్గొన్నారు.

తెలంగాణలో విద్యకు పెద్దపీట

అభివృద్ధికి విద్యను మూలస్తంభంగా భావించిన తమ ప్రభుత్వం తెలంగాణలో విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తోందని భట్టి తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలను స్థాపిస్తునట్టు వివరించారు. యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీని నిర్మిస్తున్నామనీ, పాఠశాల స్థాయి నుంచి విశ్వవిద్యాలయం వరకు ప్రాధాన్యత క్రమంలో బోధనా సిబ్బంది పోస్టుల భర్తీ చేపట్టినట్టు తెలిపారు. ఉన్నత విద్యా వ్యవస్థ బలోపేతానికి కావాల్సిన నిధులతో పాటు అన్ని మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నట్టు వివరించారు. విద్యార్థుల నమోదు సగటు జాతీయ స్థాయిలో 28.4 శాతం ఉండగా, రాష్ట్ర ప్రభుత్వ తీసుకున్న నిర్ణయాలతో అది 40 శాతానికి పెరిగిందని గుర్తు చేశారు.



సంపాదకీయం

నెల రోజుల అమెరికా రాజు !

డోనాల్డ్ ట్రంప్ అమెరికా అధ్యక్షుడిగా గద్దెనెక్కి నెల రోజులు దాటింది. ఇంత స్వల్ప వ్యవధిలో యావత్ ప్రపంచాన్ని ప్రతికూలంగా తనవైపు దృష్టి సారించేట్లు చూసిన మరొక నేత వర్తమానంలో లేరంటే అతిశయోక్తి కాదు. రెండోసారి ఎన్నికల్లో పోటీచేసి ఓడిపోయిన నేతగా ఒక రికార్డు నమోదు చేస్తే మూడోసారి కూడా పోటీలో ఉంటానంటూ మరో సంచలన ప్రకటన చేశాడు. వెంపల చెట్టుకు నిచ్చెన వేసి లంఘించి ఎక్కేవారికి కూడా అధికారం వస్తే ఆజాను బాహులంటూ పొగిడేందుకు ఎందరో వంది మాగధులు ఉంటారు. కానీ ట్రంప్ తీరే వేరు. అలాంటి వారితో నిమిత్తం లేకుండానే తనకు తానే రాజునని ప్రకటించుకున్నాడు. అంతపని చేసిన తర్వాత అధ్యక్ష భవనం మౌనంగా ఉంటుందా! లాంగ్ లివ్ కింగ్ (రాజు దీర్ఘకాలం వర్ధిల్లాలి) అంటూ సామాజిక మాధ్యమంలో ట్రంప్ ఒక పోస్టు పెట్టాడు. ఎందుకటా! న్యూయార్క్ నగరంలో మాన్‌హటన్ ఒకటి. రద్దీ సమయాల్లో ఆ ప్రాంతంలో వాహనదారులు ప్రవేశించా లంటే తొమ్మిది డాలర్లు, తక్కువగా రాత్రుళ్లలో 2.25డాలర్లు చెల్లించాలనే నిబంధన జనవరి ఐదు నుంచి అమల్లోకి వచ్చింది. ఆ నిర్ణయాన్ని రద్దు చేసి మాన్‌హటన్, మొత్తం న్యూయార్క్ నగరాన్నే రక్షించినట్లు ప్రకటించటమేగాక రాజు దీర్ఘకాలం వర్ధిల్లాలి అంటూ దానికి తోక తగిలించాడు. అంటే తనను తాను రాజుగా వర్ణించుకున్నాడు. అధ్యక్ష భవనం ఆ పోస్టును 'ఎక్స్'లో పంచుకుని తన మరింతగా ప్రచారంలోకి తెచ్చింది. రాజు మాదిరి కిరీటంతో కూడిన ట్రంప్ కృత్రిమ మేధ బొమ్మను జత చేసింది.


> చంద్రబాబు నాయుడు గతంలో ముఖ్యమంత్రిగా కంటే సిఇఓ పిలిపించుకొనేందుకు ఇష్టపడినట్లుగా అధ్యక్షుడిగా కంటే సర్వాధికారిగా చెప్పుకొనేందుకే ట్రంప్ పదే పదే తాపత్రయపడుతున్నాడు. ఎవరైతే తన దేశాన్ని రక్షిస్తారో వారు ఏ ఒక్కచట్టాన్నీ ఉల్లంఘించరు అన్న ఫ్రెంచి నెపోలియన్ బోనపార్టే ప్రకటనను ఉటంకిస్తూ తాను చట్టాలకు అతీతుడిని అనే భావన కలిగించాడు. అలాంటి పెద్ద మనిషి తనను తాను రాజుగా వర్ణించుకోవటంలో ఆశ్చర్యం ఏముంది?



ఇతర దేశాలకు సంబంధించి ట్రంప్ తీసుకుంటున్న లేదా ప్రకటించిన నిర్ణయాలు తీవ్ర వివాదం రేపుతున్నాయి. న్యూయార్క్ నగర ప్రవేశ టోల్‌ను రద్దు చేయటం అంతర్గతంగా ధ్వజమెత్తేందుకు దారి తీసింది.ప్రజాస్వామిక వ్యవస్థలను తక్కువ చేసి చూస్తున్నారని, ఒక రాష్ట్రంలో అమలు చేస్తున్నవాటిని రద్దు చేసే అధికారం ఫెడరల్ ప్రభుత్వ నేత ట్రంప్‌కు ఎవరి చ్చారంటూ విమర్శలు వెల్లువెత్తాయి. అమెరికాకు రాజులు, రారాజులు లేరు, ఎవరి మోకాళ్ల ముందూ మోకరిల్లాల్సిన అవసరం లేదంటూ స్పందించారు. చట్టాలు అమలు జరుగుతున్న దేశంలో ఉన్నాం తప్ప గత 250 సంవత్సరాలుగా ఒక రాజుపాలనలో కాదు అంటూ న్యూయార్క్ గవర్నర్ కాథే హోచుల్ మండిపడ్డారు. ఆమె డెమోక్రటిక్ పార్టీనేత కూడా. ట్రంప్ నిర్ణయాన్ని అడ్డుకునేందుకు న్యాయపరమైన చర్యలు తీసుకుంటామని కూడా ప్రకటించారు.తనకు తాను కితాబులు ఇచ్చుకోవటంలో డోనాల్డ్ ట్రంప్ పేరు మోశాడు. గతంలో "ఎంతో స్థిరమైన మేధావి, నిజాయితీ పరుడైన నాయకుడు " అని చెప్పుకున్న ఘనుడు ఇప్పుడు ఏకంగా రాజుగా వర్ణించుకున్నాడు. తనది సాధారణ జన్మకాదని మన ప్రధాని నరేంద్రమోడీ స్వయంగా చెప్పుకుంటే తాను సాధారణ అధ్యక్షుడిని కాదన్నట్లుగా ట్రంప్ మాట్లాడాడు. చంద్రబాబు నాయుడు గతంలో ముఖ్యమంత్రిగా కంటే సిఇఓ పిలిపించుకొనేందుకు ఇష్టపడినట్లుగా అధ్యక్షుడిగా కంటే సర్వాధికారిగా చెప్పుకొనేందుకే ట్రంప్ పదే పదే తాపత్రయపడుతున్నాడు. ఎవరైతే తన దేశాన్ని రక్షిస్తారో వారు ఏ ఒక్కచట్టాన్నీ ఉల్లంఘించరు అన్న ఫ్రెంచి నెపోలియన్ బోనపార్టే ప్రకటనను ఉటంకిస్తూ తాను చట్టాలకు అతీతుడిని అనే భావన కలిగించాడు. అలాంటి పెద్ద మనిషి తనను తాను రాజుగా వర్ణించుకోవటంలో ఆశ్చర్యం ఏముంది?

తన విజయంలో ప్రధాన పాత్ర పోషించిన వారిలో ఒకడు, ప్రపంచ ధనికుడైన ఎలన్‌మస్క్‌ను ట్రంప్ తన యంత్రాంగంలో చేర్చుకున్న తర్వాత భజనకు కొదవేమి ఉంటుంది. తిరుగులేని అధినేత, కోర్టులు ఎలాంటి పరిమితులు విధించలేవంటూ మస్క్ చెప్పాడు. అధ్యక్షుడు కోరుకున్న దాన్ని అమలు జరపకపోతే కుదరదు, అధ్యక్షుడు ప్రజాప్రతినిధి, అంటే ప్రజాభీష్టాన్ని అమలు చేయకపోతే దాని అర్థం మనం ప్రజాస్వామ్యంలో జీవిస్తున్నట్లు కాదు, ఒక అధికారస్వామ్యంలో ఉన్నట్లు అంటూ టీకా తాత్పర్యం చెప్పాడు. అమెరికా రాజ్యాంగ చర్చల సమయంలో అనేక కోణాలు వెలువడ్డాయి. ఏక కేంద్రక ప్రభుత్వం(అధ్యక్ష తరహా పాలన) అంటే తల్లి కడుపులో పిండ రూపంలో ఉన్న రాజరికమే అని కొందరు హెచ్చరించారు.ఇప్పుడు డోనాల్డ్ ట్రంప్ దాన్ని రుజువు చేస్తున్నట్లుగా చర్యలు ఉన్నాయి. ప్రస్తుతం అమెరికా పార్లమెంటు ఉభయ సభల్లో రిపబ్లికన్ పార్టీకి సంపూర్ణ మెజారిటీ ఉంది.తాన అంటే తందానా అనేవారికి కొదవ లేదు.అపరిమిత అధికారాలు అనేక దేశాల్లో నియంతల ఆవిర్భావానికి దారితీశాయి. అమెరికా కూడా అదే బాటలో పయనిస్తోందా?

కుంభమేళా స్నానం, మోక్షానికి ద్వారం- అవుతుందా?



డాక్టర్ దేవరాజు మహారాజు

కుంభమేళాలో తొక్కిసలాట జరిగి జనం మరణిస్తే, అధికారంలో ఉన్నవారు కనీసం సానుభూతి చూప కుండా, వారి శవాల్ని నీళ్లలో వదిలేశారని పార్లమెంట్ సభ్యులే పార్లమెంట్‌లో ధ్వజమెత్తారు. దానికి అధికారంలో ఉన్నవారు జవాబు చెప్పకపోగా -అలా మరణించిన వారికి మోక్షం లభిస్తుందని వ్యాఖ్యానించారు. ఇవన్నీ వార్తా పత్రికల్లో, టీవీ ఛానళ్లలో వచ్చిన వార్తలే. నేను కల్పించినవి కావు. నా వ్యంగ్య వ్యాఖ్య ఎంత మాత్రమూ కాదు. త్రివేణి సంగమంలో తొక్కిసలాట మాత్రమే కాకుండా, "పవిత్ర" ప్రయాగ్‌రాజ్‌లో వేసిన గుడారాలలో అగ్ని ప్రమాదాలు జరిగి, ఎన్నిప్రాణాలు పోయాయో, ఎంత ఆస్తినష్టం జరిగిందో అధికారికంగా లెక్కలు లేవు. వాస్తవాల్ని కప్పి పుచ్చ డంలో అధికార బీజేపీది అందెవేసిన చేయికదా? ఇవిగాక, తీవ్రంగా కలుషితమైపోయిన నదీజలాల్లో మునిగి చర్మ వ్యాధులూ, ఇతర రోగాలూ వచ్చి ఆసుపత్రుల పాలై కన్నుమూస్తున్న వారి సంఖ్య తెలియదు. కుంభమేళా నుండి వారి వారి స్థలాలకు వెళ్తూ, రోడ్డు ప్రమాదాలకు గురై మరణించిన వారిలెక్క తేలలేదు.

ఇక అక్కడ, త్రివేణీ సంగమంలో జరిగిన వీఐపీ, వీవీఐపీల స్నానఘట్టాలు- ఒక కమర్షియల్ కలర్ సినిమాను తలపించాయి. ఫొటో షూట్‌లకు, తన వ్యక్తిగత ఇమేజ్ హైప్‌లకు అత్యంత ప్రాధాన్యమిచ్చే మన దేశ ప్రధాని చర్మవ్యాధులు రాకుండా వాటర్ ప్రూఫ్ లాంగ్ జాకెట్ వేసుకుని చుట్టూ కట్టించుకున్న లావుపాటి తాళ్లను పట్టుకుని, భుజాల దాకా మునిగిలేచారు. తమదాకా వచ్చేసరికి అన్ని జాగ్రత్తలు తీసుకునే మన నేతలు అదే విషయం సామాన్య జనానికి ఎందుకు చెప్పరూ? నగ్నంగా తిరిగే సన్యాసులు, నాగబాబాలు, అఘోరాల్ని వదిలేయండి. కోట్ల సంఖ్యలో సామాన్య జనం కూడా వెళ్లి ప్రమాదకరమైన ఆ మురికి నీళ్లలో మునిగారు కదా? "మీరంతా వాటర్ ప్రూఫ్ జాకెట్లతో రండని" మంకీబాత్‌లో ప్రధాని ఎందుకు పిలుపివ్వలేదూ? స్తోమత ఉన్నవారైనా అలా వచ్చేవాళ్లు కదా? అనవసరంగా కోట్ల మందిని ఇప్పుడు రోగాల పాలు చేసినట్టే కదా? తొక్కిసలాటలో చనిపోయిన వారికి మోక్షం లభిస్తుందని చెప్పిన కొందరు బీజేపీ బాబాలు - రోగాల బారిన పడి చావలేక బతకలేక బతుకు దుర్భరం చేసుకున్న వారికి, మరి ఏమొస్తుందన్నది-ఎందుకు చెప్పలేదూ?

మరొక కోణంలో ఆలోచిస్తే, సనాతన ధర్మపరాయణులే కదా - కుంభమేళాలో నీటమునిగి వస్తున్నదీ? కుంభమేళా స్నానానికి మరి వాటర్ ప్రూఫ్ జాకెట్లను, లావుపాటి తెల్ల తువ్వాళ్లను సనాతన ధర్మం అనుమతిస్తుందా? జనాలను పిచ్చివాళ్లను చేయడం తప్పించి, ఇందులో పనికొచ్చే విషయం ఏమైనా ఉందా? నగ్నంగా వీధుల్లో తిరిగే "అనాగరికత"ను మన ప్రభుత్వాలు ఎందుకు సమర్థిస్తున్నాయీ? ఏ మానవీయ విలువల పరిరక్షణ కోసం? ఏ ధర్మాన్ని స్థాపించడం కోసం? దేశాన్ని 'విశ్వ గురువు'గా నిలబెట్టడమంటే ఇలాగేనా? ఆత్మవిమర్శ అక్కర్లేదా? ఇప్పటికే హరియాణా రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో రామాయణ, మహా భారతాలను బోధిస్తున్నారు. అలాగే ఒక కుంటను వెతికి, దానిలోకి నీళు పంపించి, చిన్నపాటి సరస్సులా తయారు చేశారు. దానికి 'బ్రహ్మ సరోవర్' అని పేరు పెట్టారు. బ్రహ్మ సరోవరాన్నే తమ ప్రాంతానికి తీసుకొచ్చామని.. సంప్రదాయ వాదులైన రాజకీయ నాయకులు ప్రచారం చేసుకుంటున్నారు.

కుంభమేళాలో వీఐపీలు, వీవీఐపీలు స్నానాలు చేసేచోట జనం ఉండరెందుకూ? సామాన్యులు స్నానాలు చేసేచోట మాత్రం తొక్కిసలాట జరిగి, జనం చచ్చిపోతుం టారు. 'హిందువులందరూ మా బంధు వులు' - అని చెప్పుకునేవారు అందరికీ సమానావకాశాలు ఇవ్వాలి కదా? అందరి రక్షణ, భద్రత చూడాలి కదా? ప్రయాగ్‌రాజ్‌లో జరిగే కుంభమేళాలో 13 జనవరి 2025 నుండి 26 ఫిబ్రవరి 2025 మధ్య సుమారు 463 మిలియన్ల (సుమారు యాభై కోట్ల) మంది పాల్గొంటారని



అంచనా వేశారు కదా- మరి అంతమంది జనం ఒక్కచోట చేరుతున్నప్పుడు దుర్ఘటనలు జరగకుండా తీసుకునే చర్యలు కూడా ఆ స్థాయిలోనే ఉండాలి కదా? "మూర్ఖత్వ ప్రదర్శన"లో ప్రపం చంలోనే దేశాన్ని మొదటి స్థానంలో నిలబెట్టిన ఘనత యోగి - మోడీల జోడీకి దక్కుతుంది. ధర్మ పరిరక్షణ అంటే ఇదేనన్నమాట! 15 ఫిబ్రవరి 2025 రాత్రి కుంభమేళాకు వెళ్లే రైళ్ల కోసం ఢిల్లీ రైల్వే స్టేషన్ ప్లాట్ ఫాంల మీద జరిగిన తొక్కిసలాటలో పద్దెనిమిది మంది 'ఉత్తపుణ్యానికి' చనిపోయారు. కుంభమేళా గురించి అసత్య ప్రచారాలు చేసి, ఎవరికీ జీవితంలో మరో అవకాశం రాదన్నట్టు - జనాన్ని ఉసిగొల్పి ప్రాణాలతో చెలగాటం ఆడడం ఈ ప్రభుత్వాలకు తగునా ? ప్రయాగ్‌రాజ్ నుండి తిరిగి వారివారి స్థలాలకు వెళ్లే క్రమంలో రోడ్డు ప్రమాదాల్లో చనిపోయిన వారి సంఖ్య కూడా చాలా పెద్దదే. వీటికి ఎవరు బాధ్యులు? కలుషితమైన నీటిలో మునిగి రోగాల బారినపడి, చికిత్స అందక చని పోతున్న వారికి ఎవరు బాధ్యులు? దేశ జనాభాను తగ్గించాలన్న కుట్ర - ఈ ప్రభుత్వాలేమైనా చేయడం లేదు కదా?

'హిందూ ముస్లిం భాయి భాయి' - అన్నందుకు గాంధీని గాడ్సే తుపాకితో కాల్చిచం పాడు. ఇంకా కోపం చల్లారని ఆరెస్సెస్ కార్యకర్తలు గాంధీ ఫొటోను తుపాకితో కాల్చి, ఫొటోమీద ఎర్రరంగు జల్లి - వేడుకలు చేసు కుంటున్నారు. మరోపక్క గాడ్సేను వీరుడిగా అభివర్ణిస్తూ పండగ చేసుకుం టున్నారు. ఇలాంటి కార్యక్రమాలు వాళ్లు ఇప్పటికీ సిగ్గువిడిచి చేస్తూనే ఉన్నారు కదా? సరే, హిందూ ముస్లిం భాయి భాయి అనేది గాంధీ కాలం నాటి మాట అనుకుందాం. ఇప్పుడు కనీసం 'హిందూ సబ్ భాయి భాయి' అవ్వండి చూద్దాం! ఆ తర్వాత దేశాన్ని హిందూ దేశంగా మార్చడం గురించి ఆలోచిద్దురు గాని! ఇటీవల హైదరాబాదులో చిలుకూరు బాలాజీ దేవాలయ పూజారి మీద దాడి చేసింది ముస్లింలు కాదు. క్రైస్తవులూ కాదు! ఇంకా ఏ ఇతర మతస్థులూ కూడా కాదు. కేవలం హిందువులే. హిందువులే హిందువుల మీద దాడి చేశారు. ముందు ఆవిషయం అర్థం చేసుకోండి! ఈ హిందువుల దాడి వెనక భక్తి, ధార్మిక భావనా ఏమైనా ఉందా? లేదు కదా? కేవలం డబ్బు ఇవ్వమని బెదిరించడమే ఉంది.

> అమానవీయ విలువల ప్రతిష్ఠాపనకు నిరంతరం కృషి చేస్తున్న నాయకులు మాత్రం నోరు మెదపరు. పైగా, తమ కార్యకర్తలకు ముస్లిం వేషధారణ వేయించి, వారితో అసాంఘిక కార్యక్రమాలు చేయిస్తూ- వీడియోలు తీయించి, ప్రచారం చేస్తుంటారు. అంటే, హిందువులంతా ముస్లింలను అసహ్యించుకోవాలని వారి ఉద్దేశం. వారి భావం జనంలోకి పోవడానికి ఏ తప్పుడు పనైనా చేయించగలరు. ఏ తప్పుడు మాటయినా మాట్లాడగలరు. ఇవేవీ దేశ పౌరులకు కొత్తకాదు. గత పదేళ్లుగా వారు చూస్తున్నదే. అనుభవిస్తున్నదే! ఏదో విధంగా ఈ దేశ ప్రజల్ని మానసిక బానిసత్వంలోకి నెట్టేయడమే- అధికారంలో ఉన్న రాజకీయ నాయకుల లక్ష్యం! "ఏ ప్రకటన ఇవ్వకుండా నిశ్శబ్దంగా రాజ్యాంగాన్ని మార్చేద్దాం!" అని అంతర్గతంగా తన కేడర్‌కు ఆరెస్సెస్ ఛీఫ్ హితబోధ చేసిన విషయం తాజాగా బయటికొచ్చింది! అందువల్ల, దేశ ప్రజలు మరింత అప్రమత్తతో ఉండాల్సిన అవసరం ఉంది.

ఇటీవల ఒక ఆచార్యుడు మాట్లాడుతూ తను కనుగొన్న ఒక అద్భుత సత్యాన్ని ప్రకటించాడు. ఆయన తనను తాను హేతువాదినని చెప్పుకుంటాడు. ఆయన చెప్పిందేమంటే - ఈ దేశంలోని ముస్లింలు ఈ దేశాన్ని ముస్లిం దేశంగా మార్చాలని ప్రయత్నిస్తున్నారట. దాన్ని హిందువులు ప్రతిఘటిస్తున్నారట. అది జరగాల్సిందేనని బలంగా నొక్కిచెప్పాడు. దేశంలోని సమకాలీన పరిస్థితులు తెలుసుకునే ఇలా మాట్లాడు తున్నాడా? అని నాకు అనుమానం కలిగింది. అవగాహనా రాహిత్యం అనడానికి లేదు. ఎందుకంటే, బాగా చదువుకుని అధ్యాపకుడిగా పనిచేసిన అను భవశాలి. నేను గతంలో "దేశంలో గౌరవనీయులైన మూర్ఖులు' అని ఓ పుస్తకం ప్రకటించినందుకు సంతృప్తిగా అనిపించింది. ఉదాహరణకు గతంలోకి వెళ్లి దేశ చరిత్రను పరిశీలిద్దాం! వందల ఏండ్ల పాటు మొఘలులు అంటే ముస్లింలు ఈ దేశాన్ని పరిపాలించారు. వాళ్లు అప్పుడు ఈ దేశాన్ని ముస్లిం దేశంగా మార్చలేదు. 'అక్బర్ ద గ్రేట్' గా పిలువబడ్డ అక్బర్ చక్రవర్తి పరమత సహనానికి మారుపేరుగా నిలిచాడు. తను చదవలేకపోయినా ఇక్కడి రామా యణ మహాభారత కావ్యాలను ఉరుదూలోకి అనువాదం చేయించి, చదివించుకుని విషయాలు తెలుసుకున్నాడు. హిందువును పెండ్లి చేసుకుని వారితో బంధుత్వం కలుపుకున్నాడు. ఈ దేశంలోని సంస్కృతీ సంప్రదాయాలను ఉన్నవి ఉన్నట్లుగా నిలపడానికి ప్రయత్నించాడు. వాటిని మార్చి, ఛిన్నాభిన్నం చేయగల శక్తి ఉండి కూడా అలా చేయలేదు. సోదర భావానికే ప్రాధాన్యమిచ్చాడు. తన హృదయ వైశాల్యాన్ని చాటుకున్నాడు.

ఇకపోతే మన హైదరాబాదు ప్రాంతాన్ని నిజాములు అంటే, ముస్లింలు పాలించారు. వారు ఈ ప్రాంతాన్ని ముస్లిం ప్రాంతంగా మార్చలేదు. అలాగే దేశాన్ని వందల ఏళ్లు బ్రిటీష్ వారు అంటే క్రైస్తవులు పాలించారు. వారు కూడా ఈ దేశాన్ని క్రైస్తవ దేశంగా మార్చలేదు. ఇక్కడ అన్ని మతాలు సమాంతరంగా, సమానంగా పరిఢవిల్లాయి. వివిధ భాషలూ, సంస్కృతులు కలగలిసి 'భారతీయత' అంటే ఇదే అని - ప్రపంచానికి చాటిచెప్పాయి. తమ మతమే దేశమంతా ఉండాలనీ, ఇతర మతస్తులంతా రెండవస్థాయి పౌరులుగా నోరు మూసుకుని ఉండాలని ఎవరూ ఎప్పుడూ ప్రయత్నించలేదు. ఇదిగో ఇప్పుడే ఆరెస్సెస్ - బీజేపీలు ఆ ప్రయత్నం ముమ్మరం చేస్తున్నాయి. వాస్తవం ఇదైతే, హేతువాదినని చెప్పుకునే అతను ఎంత విపరీతంగా ఆలోచిస్తున్నాడూ? ఇంకొక విషయం గమనించండి. కుంభమేళా నిర్వహణలో ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయి. అలాంటప్పుడు అక్కడి ముస్లిం కుటుంబాలు హిందువుల కోసం సహాయ కార్యక్రమాలు చేపట్టాయి. కుంభమేళాకు వచ్చిన హిందువులకు తమకు సాధ్యమైనంతలో తమ ఇండ్లలో ఆశ్రయమిచ్చాయి. అన్నం పెట్టాయి. బట్టలిచ్చాయి. తమ వాష్‌రూంలు వాడుకోనిచ్చాయి. అక్కడ ఇరుకు సందులు, చిన్న చిన్న ఇండ్లు, పైగా పేద ముస్లింలు పెద్ద ఎత్తున వసతులు కల్పించలేరు. అయినా కూడా వారికి ఉన్నంతలో సామాజిక బాధ్యతగా సహాయమందించారు.

అమానవీయ విలువల ప్రతిష్ఠా పనకు నిరంతరం కృషి చేస్తున్న నాయకులు మాత్రం నోరు మెదపరు. పైగా, తమ కార్యకర్తలకు ముస్లిం వేషధారణ వేయించి, వారితో అసాం ఘిక కార్యక్రమాలు చేయిస్తూ- వీడియోలు తీయించి, ప్రచారం చేస్తుంటారు. అంటే, హిందువులంతా ముస్లింలను అసహ్యించుకోవాలని వారి ఉద్దేశం. వారి భావం జనంలోకి పోవడానికి ఏ తప్పుడు పనైనా చేయించగలరు. ఏ తప్పుడు మాటయినా మాట్లాడగలరు. ఇవేవీ దేశ పౌరులకు కొత్తకాదు.

గత పదేళ్లుగా వారు చూస్తున్నదే. అనుభవిస్తున్నదే! ఏదో విధంగా ఈ దేశ ప్రజల్ని మానసిక బానిసత్వంలోకి నెట్టేయడమే- అధికారంలో ఉన్న రాజకీయ నాయకుల లక్ష్యం! "ఏ ప్రకటన ఇవ్వకుండా నిశ్శబ్దంగా రాజ్యాంగాన్ని మార్చేద్దాం!" అని అంతర్గతంగా తన కేడర్‌కు ఆరెస్సెస్ ఛీఫ్ హితబోధ చేసిన విషయం తాజాగా బయటికొచ్చింది! అందువల్ల, దేశ ప్రజలు మరింత అప్రమత్తతో ఉండాల్సిన అవసరం ఉంది. దేశంలో జరుగుతూ వున్న విషయాలను నిశితంగా పరిశీలించాల్సి ఉంది.తమ హక్కుల సాధన కోసం అవసరమైనప్పుడు ప్రశ్నించాల్సి ఉంది. ప్రతిఘటించాల్సి కూడా ఉంది !!

- త్రిపురనేని రామస్వామి జాతీయ పురస్కార తొలి గ్రహీత

ప్రపంచం చూపు.. సోషలిజం వైపు...

ఫిబ్రవరి 21న ప్రపంచవ్యాపితంగా 'రెడ్ బుక్స్ డే'ను అంతర్జాతీయ వామపక్ష ప్రచురణాలయ సంస్థలు నిర్వహిస్తున్నాయి.1848 ఫిబ్రవరి 21న మొదటిసారి "కమ్యూనిస్టు ప్రణాళిక" విడుదలైన సందర్భాన్ని పురస్కరించుకొని 2020 నుండి రెడ్ బుక్స్‌డే కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. 2023 నుండి సీపీఐ(యం) శ్రేణులు కూడా ఇందులో ప్రత్యక్షంగా పాల్గొంటూ అధ్యయనం చేస్తున్నాయి.

సోవియట్ యూనియన్ కూలిపోయాక కమ్యూనిజం పాతాళానికి తొక్కబడిందని, అది ఇక తిరిగి లేవదని అమెరికా గర్వంగా ప్రకటించింది. ప్రపంచీకరణను మనలాంటి దేశాలపై రుద్దింది. మన తలుపులు బార్లా తెరిపించి పెట్టుబడులతో వచ్చి మన ప్రభుత్వ రంగాన్ని, ప్రకృతి వనరుల్ని, మన సంపదను దోచుకున్నారు. సంపద ఎక్కువై సంక్షోభంలో పడ్డారు. తీవ్రమైన ఆర్థిక అసమానతలు పెట్టుబడిదారీ వ్యవస్థను సంక్షోభంలోకి నెట్టాయి. 176 సంవత్సరాల క్రితం కమ్యూనిస్టు ప్రణాళిక ద్వారా మార్క్స్, ఎంగెల్స్‌లు అదే చెప్పారు. శాస్త్ర-సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి పెంచే ఉత్పత్తిని కొనే శక్తి ప్రజలకు సన్నగిల్లుతుందన్నారు. నేడదే జరుగుతోంది. తాజాగా పార్లమెంటులో ప్రవేశపెట్టిన ఆర్థిక సర్వే 2024-25లో ప్రజల కొనుగోలు శక్తి తగ్గిందని, ఆర్థిక వ్యవస్థ



మందగించిందని వాపోయారు. పెట్టుబడిదారీ వ్యవస్థ ఈ సంక్షోభం నుండి బయట పడాలంటే ప్రజల ఆదాయాలు పెంచాలని, కొనుగోలు శక్తిని పెంచి మార్కెట్‌లో డిమాండ్ సృష్టించాలని ప్రముఖ దినపత్రికలు ఎకనమిక్ టైమ్స్, ఇండియన్ ఎక్స్‌ప్రెస్, హిందూ, బిజినెస్‌లైన్, బిబిసి, బిజినెస్ స్టాండర్డ్ సంపాదకీయాలు, వ్యాసాలు ప్రచురించాయి. ఈ వాస్తవాన్ని మార్క్స్-ఎంగెల్స్‌ల సిద్ధాంతాలు మరింత బలంగా ధృవీకరిస్తున్నాయి. పెట్టుబడిదారీ వ్యవస్థ సంక్షోభం నుండి గట్టెక్కడానికి దేవుళ్లను, గుడులను, భక్తిని కూడా వ్యాపారంగా మార్చి వాడుకుంటున్న పరిస్థితి నేడు నెలకొంది.అందుకే మార్క్స్, ఎంగెల్స్, లెనిన్, స్టాలిన్, మావో, హోచిమిన్, కాస్ట్రో, గ్రాంసీ, డిమిట్రోవ్ తదితర అంతర్జాతీయ విప్లవకారుల రచనలను, ఇఎంఎస్ నంబూద్రిపాద్, సుందరయ్య, భగత్‌సింగ్ లాంటి యోధులు రాసిన పుస్తకాలను ఈ తరం అధ్యయనం చేస్తే వర్తమాన సమస్యలను శాస్త్రీయంగా అర్థం చేసుకోవచ్చు.

ఇప్పటి వరకు సాగిన విద్యావిధానం విద్యార్థులకు సామాజిక స్పృహ నుండి దూరం చేసింది. రాజకీయాలు వద్దంటూ తమకు సేవ చేసే ఉద్యోగులుగా మార్చుకుంది. పెట్టుబడుల అంతర్జాతీయీకరణతో వచ్చిన నూతన అవకాశాలతో కొన్ని రంగాల్లో ఉద్యోగాలు పెరిగాయి. ఐ.టి లాంటి పరిశ్రమలు విస్తరించాయి. ఇప్పుడు వాటి ప్రగతికి బ్రేక్ పడింది. వేతనాలు, సౌకర్యాలు తగ్గిపోతున్నాయి."అమెరికా ఫస్ట్" అంటూ ట్రంప్ సర్కార్ భారతీయ విద్యార్థులను, ఉద్యోగులను చట్ట వ్యతిరేకులంటూ అవమానకరంగా సంకెళ్లు వేసి వెనక్కి పంపిస్తున్నది. భారతమాత గురించి ఆకాశానికి ఎగిరి నినాదమిచ్చే మోడీ మౌనంగా అవమానాన్ని దిగమింగి భారతీయ ఆత్మ గౌరవాన్ని ట్రంప్‌కు తాకట్టు పెట్టారు. అదానీపై కేసు లేకుండా చేసుకోడానికి దేశ ప్రతిష్టను ఫణంగా పెట్టారు. యువతరం ఆశలు సన్నగిల్లుతున్నాయి. వారి భవిష్యత్తు అగమ్యగోచరంగా ఉంది. ప్రత్యామ్నాయం కోసం అన్వేషిస్తున్నారు. ఈ క్రమంలో తిరిగి సోషలిజం వైపు ఆలోచిస్తున్నారు. దాంతో నేడు పాలకులకు భయం పట్టుకుంది. 'ప్రపంచాన్ని కమ్యూనిజమనే భూతం ఆవహించింద'ని 'కమ్యూనిస్టు ప్రణాళిక'లో పెట్టుబడిదారులను ఉద్దేశించి మార్క్స్, ఎంగెల్స్ చెప్పారు. నేడదే ట్రంప్ మాటల్లో కనిపిస్తోంది. కమ్యూనిజాన్ని పాతాళానికి తొక్కామని సంబరపడుతున్న పాలకులు తనకు కమ్యూనిజమే ప్రథమ శత్రువని ట్రంప్ ప్రకటించడంతో ఉలిక్కిపడుతున్నారు. పాతాళానికి తొక్కబడిన కమ్యూనిజం లేచి తిరిగి పెట్టుబడిదారులకు నిద్ర లేకుండా చేసే శక్తిగా ఎలా ఎదిగింది? శ్రీలంక, నేపాల్, లాటిన్ అమెరికాలో ఎలా నిలదొక్కుకుంది? ఇత్యాది ప్రశ్నలు పాలకులకు సవాలుగా మారాయి.

దేశంలో ప్రజలు ముఖ్యంగా యువతరం ఆశలను నెరవేర్చడంలో విఫలమైన మోడీ వారి ఆలోచనలను మతం వైపు మళ్లించి రాజకీయ పబ్బం గడుపుకోడానికి కుంభమేళా సహా అనేక అవకాశాలను దుర్వినియోగం చేస్తున్నారు. మతోన్మాదాన్ని ప్రేరేపిస్తున్నారు. 2014లో యువతకు మోడీ చేసిన వాగ్దానాలు పూర్తిగా భంగమయ్యాయి. అధికారాన్ని, కార్పొరేట్ లాభాలను, ఆధిపత్యాన్ని కాపాడుకోవడానికే మతోన్మాదాన్ని ప్రేరేపిస్తున్నారు. దీన్ని ప్రశ్నించిన భక్తులు, పురోహితులపై సైతం దాడులకు దిగుతున్నారు. వారికి హిందూమతం మీదకన్నా హిందూత్వ పేరుతో మతోన్మాద రాజకీయాలు చేయడంపైనే ఆసక్తి ఎక్కువగా ఉంది. చిలుకూరు బాలాజీ ఆలయ పూజారిపై 'రామరాజ్యం' పేరుతో జరిపిన భౌతిక దాడి ఈ కోవకు చెందినదే. శాస్త్ర-సాంకేతిక పరిజ్ఞానం మానవాభ్యున్నతికి బాటలు వేస్తున్నది. సామాజిక రంగంలో శాస్త్రమే కమ్యూనిజం. దాని లక్ష్యం సోషలిజం సాధన. దాన్ని సాధించే దిశలో ఆయుధమే మార్క్సిస్టు సాహిత్యం. దాన్ని యువతరంలోకి తీసుకుపోయి వారికి దిక్సూచిలా మార్చడానికే ఫిబ్రవరి 21న రెడ్ బుక్స్ డే నిర్వహిస్తున్నారు. ఇది ఒక్కరోజు వ్యవహారం కాదు. ఏడాది పొడవునా, ఇంకా చెప్పాలంటే జీవితాంతం అధ్యయనం చేయడానికి రెడ్ బుక్స్ డే స్ఫూర్తినిస్తుంది.

(ఫిబ్రవరి 21 రెడ్‌బుక్స్‌డే)

మాతృభాషలో విద్య...ఆ జాతి ప్రజల హక్కు



షేక్ కరిముల్లా
9705450705

ఒక వెన్నెల రాత్రి. పిల్లలంతా వీధిలో ఆటలాడుతున్నారు. ఇంతలో ఒక నల్లని మేఘం చంద్రుణ్ని కప్పేసింది. వెన్నెలపోయింది.వారి ఆట ఆగిపోయింది. అప్పుడు నాలుగేండ్ల బుడతడు అరుగు మీద దుప్పటి కప్పుకుని కూర్చున్న తాత దగ్గరకుపోయి "తాత! చందమామకు చలివేసిందా? నల్లటి దుప్పటి కప్పుకున్నాడు?" అని ప్రశ్నించాడు. ఏమి చెప్పాలో తెలియని తాత ఈ బుడత తెలివికి, ప్రశ్నకు, ఆలో చనకు మురిసిపోయాడు. ఈ ఘటన విశ్లేషించి చూస్తే నాలుగేండ్ల బుడతడికి పరిశీలించడం, విశ్లేషించడం, పోల్చడం, ప్రశ్నించడం, భావవ్యక్తీకరణ, జ్ఞప్తికి తెచ్చుకోవడం, గుర్తించటం, హేతుబద్ధంగా ఆలోచించటం, ఊహించటం, సృజనాత్మకత మొదలైన అంతర్గత సామర్థ్యాలున్నాయని మనం గ్రహిం చవచ్చు. ఇదంతా ఎలా సాధ్యమైంది? అంటే, అది మాతృభాష వల్లే.ప్రపంచ వ్యాప్తంగా అనేకసార్లు రుజువైన విషయమేమిటంటే మాతృభాష మాధ్యమంగా విద్యలో సాధించిన విజయాలు ఒక పరభాష మాధ్యమంలో ఏమాత్రం సాధించలేమని. ఇంట్లో తన పరిసరాల్లో మాట్లాడే భాషలోనే చాలా తేలిగ్గా తమ భావాలు వెల్లడిస్తారు. భావవ్యక్తీకరణ, నైపుణ్యం, సృజన, ప్రశ్న, ధార్మికత, హేతువు ఇవన్నీ రెట్టింపుగా వుంటాయి.

అందుకే గీజూబాయి పిల్లలకు ఇష్టమైన ఆటాపాటల ద్వారానే చదువు చెప్పాలంటాడు.పిల్లలు సినిమాలు, షికార్లకు ఎంత ఉత్సాహంగా వెళ్తారో పాఠశాలలకు కూడా అలా పరుగెత్తాలంటాడు. బాల్యం ఇలా ఎదగాలి. అంతేగాని, అసలు వారికి ఏ మాత్రం పరిచయం లేని ఈ సమాజపు జీవన విధానం, సంస్కృతి, చదువుతో సంబంధం లేని ఒక విదేశీ పరభాషలో చదువులు చెప్పటం అంటే వారిని కచ్చి తంగా శిక్షించటమే. ఒకటో తరగతి నుండే ఇంగ్లీష్ మీడియం చదువులంటూ అభం శుభం తెలియని పసిపిల్లలపై దాడి చేయటమే. ఇది మరోరకంగా బాలల హక్కుల ఉల్లంఘనే. ఈ పిల్లల హక్కుల హననాన్ని ఎవరు ప్రశ్నించరు. పిల్లలను ఆడిస్తూ, పాడిస్తూ, అన్వయిస్తూ ఐన్‌స్టీన్ సూత్రాలు, మార్క్స్ మిగులు విలువ సిద్ధాంతాలు, డార్విన్ జీవ పరిమాణ సిద్ధాంతాలు ఇలా ఏదైనా వారు ఆడుతూ పాడుతూ అలవోకగా నేర్చుకుంటారు. కాబట్టి కేజీ నుంచి పీజీ వరకు మొత్తం బోధన అమ్మభాషలోనే సాగాలి. అప్పుడే పిల్లల్లో దాగిన సృజనాత్మకశక్తి బయటకు వస్తుంది. వారి మేధస్సు వికసించి భవితకు బంగారు బాటలు పడతాయని ప్రపంచ వ్యాప్తంగా జరిగిన ఎన్నో అధ్యయనాలు తేల్చాయి. అందుకే ప్రపంచంలో దాదాపు అన్ని అభివృద్ధి చెందిన దేశాలు వారి మాతృభాషలోనే విద్యాబోధన చేస్తున్నాయి. అద్భుత విజయాలు సాధిస్తున్నాయి. అంతేకానీ, ఇంగ్లీష్ రాకపోతే విజ్ఞాన శాస్త్రం, గణితం నేర్చు కోలేరన్నది వాస్తవం కాదు. విజ్ఞానశాస్త్ర భావనలు ఒక భాషకు ఒక సంస్కృతికి పరిమితమైనవి కావు. రష్యన్లు, జర్మన్లు, ఫ్రెంచి, జపాన్‌వారు ఇంగ్లీష్ భాష ప్రమేయం లేకుండా మంచి విజ్ఞాన శాస్త్ర నూతన ఆవిష్కరణలు చేశామని సగర్వంగా చెప్పుకుంటారు.

1212 ప్రాంతంలో గణిత విజ్ఞాన శాస్త్ర అధ్యయనంలో ఉత్తమ విద్యాబోధన చేసి మొదట పది స్థానాలు సాధించిన దేశాల్లో తొమ్మిది దేశాల మాధ్యమం ఇంగ్లీష్ కాదు. పైపెచ్చు అవన్నీ కూడా ఆసియా ఖండంలోనివి. వీటిలో భారతదేశం లేదు. కానీ ప్రాచీన భారతంలో ఎన్నో అద్భుత ఆవిష్కరణలు జరిగాయి. 'సున్నా'ను కనుగొన్నది మనమే. బ్రహ్మగుప్తుడు (విక్రమాదిత్యుని కాలంలో) న్యూటన్ కంటే ఎంతోముందే భూమికి గురుత్వాకర్షణ శక్తి ఉందని చెప్పాడు. ప్లాస్టిక్ సర్జరీ, ఆయుర్వేది వైద్య విధానాలు కనుగొన్నది మనమే. ఇక్కడ ఆంగ్లభాష నేర్చుకోవటాన్ని ఎవరూ అభ్యంతరం చెప్పడం లేదు. ఇంగ్లీష్ భాషను ఒక భాషగా నేర్చుకోవాలి కాని, సైన్స్,విజ్ఞాన శాస్త్రాల ద్వారా ఇంగ్లీష్ నేర్పుతామంటే ఇంత కంటే అజ్ఞానం లేదు, ఇది అశాస్త్రీయం. ప్రపంచంలో ఎక్కడ ఎటువంటి విధానం లేదు. ముందు మాతృభాష నేర్చుకుంటే ఏ ఇతర భాషలైన మూడు, నాలుగు నెలల్లో నేర్చుకుంటారని శాస్త్రీయంగా నిరూపించబడినది. ఇక్కడ ఒక విషయం చెప్పాలి. మైనార్టీ దళిత బహుజనుల్లో నుండి వచ్చిన 'అబ్దుల్ కలాం, అంబేద్కర్ వంటివారు కటిక పేదరికం, దారిద్ర్యం నుండి వచ్చినవారే. వీరు వారి మాతృభాషల్లో చదవడం వల్లే జీవితంలో అత్యున్నతస్థాయికి



ఎదిగారు. సమాజ అభివృద్ధికి ఎంతో పాటుపడ్డారు.

1990 తర్వాత నూతన ఆర్థిక విధానాల పేరిట దేశం సామ్రాజ్యవాదుల చేతుల్లోకి వెళ్లి పోయింది. మన సంస్కృతి అణిచివేయబడింది.భాష మీద పట్టులేక చరిత్ర, సంస్కృతి మీద అవగాహన లేక భావితరం నిర్వీర్యమైపోయింది. ఈ ఖరీదైన ఇంగ్లీష్ చదువులు బానిసలను ఉత్పత్తి చేసింది. భార తీయులకు స్పృహ లేకుండా పోయింది. వీరు డాలర్స్ డ్రీమ్స్‌లో విదేశాలకు ఊడిగం చేయడానికి ఈ ఇంగ్లీష్ పక్షుల్లా ఎగిరిపోతున్నారు. వారి తల్లిదండ్రులను ఇక్కడ వృద్ధాశ్రమాల్లో వదిలిపెడుతున్నారు. ఇంతకంటే వ్యక్తి పరాయికరణ మరేముంటుంది? జ్ఞానం లోపించిన ఇంగ్లీష్ చదువులు మనిషిని, మాన వీయతను, చంపేస్తున్నాయి. దేశం ఇంతగా కునారిల్లడానికి కారణమవుతున్నాయి. దేశ భవిష్యత్తు తరగతిలో రూపొందకుండా వచ్చీరాని పరాయిభాషలో కొట్టుకుపోతున్నది. ఇది దేశానికి మంచిది కాదు. అసంబద్ధమైన విద్యావ్యవస్థ, చదువులో స్థాయి లేకపోవడటంతో జ్ఞానం లోపించిన విశ్వవిద్యాలయాల పట్టాలు చేతిలో ఉంటున్నాయి. విద్యార్థి అక్షరాస్యుడుగా మాత్రమే కళాశాలలు, విశ్వవిద్యాలయాల నుంచి బయటకు వస్తున్నాడు. జీవితంలో ఏ చిన్న సమస్య వచ్చినా ఆ సమస్యకు గల మూలాలను అర్థం చేసు కోలేకపోతున్నాడు. జీవితం చీకటిమయం అనుకుంటూ ఆందోళనలో ఆత్మహత్యకు పాల్పడుతున్నాడు. దీన్ని నిలువరించాలి. అందుకని తెలుగుభాషను అభివృద్ధి పరచాలి. సమస్త విజ్ఞాన శాస్త్రాలను తెలుగు భాషలోనే అనువదించాలి. తొమ్మిదికోట్ల మంది తెలుగు ప్రజల భాష అయిన తెలుగులోనే విద్య పరిపాలన సాగాలి.

చదువంటే జ్ఞానం, ఈ జ్ఞానమే మనిషిని, దేశాన్ని నిలబెడుతుంది. ప్రపంచంలో ఏదేశం కూడా ఇతరభాషలో తమ బిడ్డలకు చదువు చెప్పడం లేదు. ఉన్నత చదువులకు ఇంగ్లీష్ అవసరమనే భావన మంచిదే. కానీ అదే జీవితం కాకూడదు. పాల కులు కూడా ఇంగ్లీష్‌ను ప్రోత్సహిస్తున్నారు. ఎందుకంటే, వారి దుష్టపాలన, విధానాలు, దోపిడీని ప్రజలు అర్థం చేసుకోకుండా, ప్రశ్నించకుండా ఉండాలంటే ప్రజల్ని అజ్ఞానంలోనే ఉంచాలి. అందుకు భావం అర్థం కాని వృథా చదువుల్లో ప్రజలు కొట్టుకుపోవాలి. అవినీతి నిరంతరం కొనసాగాలి. ఈ ఇంగ్లీష్ మీడియం చదువుల వెనుక ఉన్న పాలకుల కుట్రలివి. స్వాతంత్ర్యానికి ముందు బ్రిటీష్ వారు ఆంగ్ల మాధ్యమాన్ని ప్రవేశపెట్టి వారికి కావాల్సిన గుమస్తాలను తయారు చేసుకున్నారు. కానీ, మనవాళ్లు మాత్రం స్వాతంత్ర్యానంతరం అదే ఆంగ్లాన్ని కొనసాగిస్తూ ప్రజలకు అర్థం కాని విధంగా దోపిడీకి పాల్ప డుతున్నారు. ఈ దృక్పథం నుంచి ఆలోచిస్తే కాని ఇది మనకు అర్థం కాదు. సంస్కృతి వాహికగా, ప్రజల జీవన విధానం, చరిత్ర విలువల సంపుటిగా ఒక జాతి భాషను అర్థం చేసుకోవాలి. మాతృభాషలేని జాతులు ఎక్కడా ఉండవు. ఒక భాష అంతరిస్తే ఒక సంస్కృతి ప్రమా ణంగా ఆ జాతి నశించిపోయినట్టే భావించాలి. వేరే ఏదో పరాయి భాష, ఇతర సంస్కృతి వారిని జయించి ఉంటాయి. అవి ఆ జాతికి నిజంగానే ఘోర విపత్తు. ఇప్పుడు ఈ విపత్తు నుండి తెలుగుజాతిని కాపాడుకోవాలి.

(నేడు అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం)



అంతా అదానీ కోసమే

(మొదటిపేజీ తరువాయి)

ఖతార్ ఎమిర్ పర్యటనకు ముందు ఈ డీల్ జరిగిందని పలువురు విశ్లేషిస్తున్నారు.

అదానీ హార్బర్ సర్వీసెస్.. సీ హారిజన్ ఆఫ్‌షోర్ మెరైన్ సర్వీసెస్, ఖతార్‌లో జమాల్ ఎ రబ్ ఎఎం అల్ యాఫీ అనే వ్యక్తితో జాయింట్ వెంచర్ కంపెనీని ఏర్పాటు చేసింది. ఈ జాయింట్ వెంచర్ పేరు అల్ అన్నాబి మెరైన్ సర్వీసెస్. దీనిని ఫిబ్రవరి 12న ఎమిర్ భారత పర్యటనకు ఐదు రోజుల ముందు స్థాపించారు. జాయింట్ వెంచర్ కంపెనీ నౌకల కార్యకలాపాలు, నిర్వహణను చేస్తుంది. అదానీ హర్బర్ సర్వీసెస్ దీనిలో 49 శాతం వాటాను కలిగి ఉన్నది. ఈనెల 13న కంపెనీ జాయింట్ వెంచర్ గురించి నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్‌కు తెలిపిన తర్వాత ఏపీసెజ్ షేర్లు స్వల్పంగా పెరిగాయి. ఈ జాయింట్ వెంచర్ అదానీ సముద్ర సామ్రాజ్య గల్ఫ్‌లో ఇప్పటికే గణనీయమైన ఉనికిని కలిగి ఉన్నది. ఆఫ్‌షోర్ సపోర్ట్ వెసెల్ కంపెనీ అయిన ఆస్ట్రో ఆఫ్‌షోర్‌ను అత్యధికంగా కొనుగోలు చేయటం ద్వారా ఏపీసెజ్ దుబాయ్‌లో ఉన్నది.

పశ్చిమ ఆసియాలోని మధ్యధరా వైపున అదానీ పోర్ట్స్ ఇజ్రాయిల్‌లో కూడా ఉన్నది. ఇది ఇజ్రాయిల్ గడోట్ గ్రూపు భాగస్వామ్యంతో హైఫా పోర్ట్‌ను నిర్వహిస్తుంది. అయితే, అల్ అన్నాబి గురించి పెద్దగా తెలియదు. ప్రమోటర్‌గా పేరు పొందిన మరొక పక్షం అల్ యాఫీ గురించి కూడా సమాచారం లేదు.

ఈనెల 17న సాయంత్రం ఎమిర్ భారత్‌కు వచ్చినపుడు ప్రధాని మోడీ.. ప్రోటోకాల్‌ను ఉల్లంఘించి మరీ ఆయనను ఆహ్వానించటానికి స్వయంగా ఎయిర్‌పోర్ట్‌కు వెళ్లటం గమనార్హం. ప్రధాని ట్వీట్ చేసిన ఫొటోలలో ఆయన విమానం మెట్ల దిగువన రెడ్ కార్పెట్‌పై ఎమిర్‌ను స్వీకరిస్తున్నట్టు కనబడింది. "నా సోదరుడిని ఆహ్వానించేందుకు విమానాశ్రయానికి వెళ్లాను" అంటూ కూడా ఎక్స్ వేదిగా మోడీ రాసుకొచ్చారు. ఒక దేశాధినేత మనదేశంలో పర్యటిస్తున్నపుడు భారత ప్రధాని ఇలా వ్యవహరించటం చాలా అరుదు. గతంలో అమెరికా అధ్యక్షులుగా ఉన్నపుడు ఒబామా, డోనాల్డ్ ట్రంప్, జపాన్ ప్రధాని షింజో అబే, యూఏఈ అధ్యక్షుడు మొహమ్మద్ బిన్ జాయెద్ అల్ నహ్యాన్‌లు భారత్‌కు వచ్చినపుడు మోడీ ఈ విధంగా వ్యవహరించారు.

ప్రస్తుతం ఖతార్ ఎమిర్ విషయంలోనూ మోడీ ఈ విధంగా స్వయంగా ఎయిర్‌పోర్టుకు వెళ్లి మరీ ఆహ్వానం పలకటాన్ని అదానీ డీల్‌తో పలువురు విశ్లేషకులు ముడిపెడుతున్నారు. ఇప్పుడు ప్రధాని మోడీ తీరు వివాదంగా మారుతున్నది. ఈ నేపథ్యంలోనే ఖతార్ కంపెనీతో అదానీ డీల్ విషయం చర్చనీయాంశంగా మారింది. ఆయన పర్యటనకు కొన్ని రోజుల ముందే ఇది జరగటం అనేక అనుమానాలకు తావిస్తున్నది. గతంలోనూ ద్వైపాక్షిక పర్యటనలలో భాగంగా ప్రధాని మోడీ ఏ దేశానికి వెళ్లినా.. అదానీ వ్యాపార ఒప్పందాలు ఈ విధంగానే కుదిరాయన్న విషయాన్ని పలువురు విశ్లేషకులు గుర్తు చేస్తున్నారు. బంగ్లాదేశ్ నుంచి గ్రీస్ వరకు, శ్రీలంక నుంచి ఇజ్రాయిల్ వరకు.. ప్రధాని మోడీ ద్వైపాక్షిక పర్యటనలకు వెళ్లిన ప్రతి చోటా అదానీకి ప్రయోజనం చేకూర్చే అంశాలుంటాయని చెప్తున్నారు. గుజరాత్‌లోని భారత్-పాక్ సరిహద్దుకు దగ్గరగా సోలార్ ఫామ్‌ను అభివృద్ధి చేయటానికి అదానీని అనుమతించేందుకు ప్రభుత్వం సరిహద్దు భద్రతా నియమాలను సడలించిందని ఇటీవల బయటపడింది.

ఎమిర్ భారత పర్యటనలో భాగంగా రెండు దేశాల మధ్య ద్వైపాక్షిక ఒప్పందాలు జరిగాయి. భారత్-ఖతార్ ద్వైపాక్షిక వాణిజ్యం 15 బిలియన్ డాలర్లుగా ఉన్నదని అంచనా. ఇందులో ఎక్కువ భాగం ఎల్పీజీ, ఎల్ఎన్‌జీ ఎగుమతులు ఖతార్ నుంచి జరుగుతాయి. ఈ రెండు ఇంధనాల విషయంలో ఖతార్ భారత్‌కు అతిపెద్ద సరఫరాదారు.

శ్రీలంకలోని రహస్య ఒప్పందాలపై అక్కడి ప్రభుత్వం సీరియస్‌గా దృష్టిని సారించింది. ఈ నేపథ్యంలో అక్కడి సోలార్ ఫామ్ ప్రాజెక్టు నుంచి అదానీ గ్రూపు వైదొలిగింది. బంగ్లాదేశ్‌లో అప్పటి ప్రధాని షేక్ హసీనా ప్రభుత్వంతో ఆయన విద్యుత్ ఎగుమతి ఒప్పందం చేసుకున్నారు. అయితే, ఆ దేశంలో ఉన్నటు వంటి ప్రత్యేక పరిస్థితులు అదానీకి చేటు తెచ్చాయి. ఈ నేపథ్యంలో ఖతార్‌లో ఒప్పందం ఒక ఉపశమనం అని విశ్లేషకులు చెప్తున్నారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య



నవతెలంగాణ-గాంధారి

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య చేసుకున్న ఘటన కామారెడ్డి జిల్లా గాంధారి మండలంలోని గుర్జల్ గ్రామంలో జరిగింది. ఎస్ఐ ఆంజనేయులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని గుర్జల్ గ్రామానికి చెందిన రైతు సొప్పరి మాణిక్యం (48) తనకున్న వ్యవసాయ పొలంలో రెండు బోర్లు వేయించాడు. అయినా నీరు పడలేదు. దాంతో ఉపాధి కోసం దుబాయ్‌కి వెళ్లి.. తిరిగి వచ్చాడు. అయినా అప్పు తీరలేదు. సుమారు రూ.18లక్షలు అప్పు కావడంతో తీవ్ర మనోవేదనకు గురయ్యాడు. బుధవారం ఉదయం 10 గంటలకు తన వ్యవసాయ పొలం వద్ద పురుగుల మందు తాగి తూలుతూ వస్తుండగా గమనించిన అతని కొడుకులు సంగమేశ్వర్, సందీప్.. వెంటనే అతన్ని కామారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి సికింద్రాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి బుధవారం రాత్రి మృతి చెందాడు. భార్య సొప్పరి లక్ష్మి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నేడు వికారాబాద్, నారాయణ పేట జిల్లాల్లో సీఎం పర్యటన

72,045 ఇందిరమ్మ ఇండ్లకు శంకుస్థాపన

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి శుక్రవారం వికారాబాద్, నారాయణపేట జిల్లాల్లో పర్యటించనున్నారు. పలు అభివృద్ధి పనులు, సంక్షేమ కార్యక్రమాల్లో ఆయన పాల్గొంటారు. సీఎం పర్యటన వివరాలు...మధ్నాహ్నం 12 గంటలకు వికారాబాద్ జిల్లా దుద్యాల్ మండలం పోలేపల్లి గ్రామానికి చేరుకుంటారు. అక్కడి రేణుకా ఎల్లమ్మ తల్లి ఆలయంలో పూజలు నిర్వహిస్తారు. ఆ తర్వాత నారాయణ పేట మండలం అప్పక్‌పల్లి చేరుకుంటారు. అక్కడ జిల్లా మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పెట్రోల్ బంక్‌ను ప్రారంభిస్తారు. బీపీసీఎల్ కంపెనీ సహకారంతో పూర్తిగా మహిళల ఆధ్వర్యంలో పెట్రోల్ బంక్‌ను నిర్వహించనున్నారు. రాష్ట్రంలోనే మొదటి సారి ఈ తరహా బంక్‌ను ముఖ్యమంత్రి ప్రారంభించనున్నారు. అనంతరం అప్పక్‌పల్లిలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల శంకుస్థాపన కార్యక్రమంలో రేవంత్ పాల్గొంటారు.

నారాయణ పేట మెడికల్ కాలేజీలో అకాడమిక్ బ్లాక్‌తోపాటు, ఇతర భవనాల నిర్మాణాలకు శంకుస్థాపన చేస్తారు. వీటితోపాటు మొదటి విడుతలో మంజూరు చేసిన 72,045 ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి సీఎం శ్రీకారం చుట్టనున్నారు. ఇల్లు లేని కుటుంబాలందరికీ ఇండ్లు మంజూరు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిన నేపథ్యంలో లబ్దిదారులు స్వంతంగా ఇల్లు కట్టుకునే అవకాశాన్ని కల్పించారు.పూర్తి సబ్సిడీతో ఒక్కొ ఇంటికి ఐదు లక్షల రూపాయల చొప్పున ఆర్థిక సాయం చేయాలని సర్కారు నిర్ణయించింది. బేస్‌మెంట్ నిర్మాణం పూర్తికాగానే లక్ష రూపాయలను లబ్దిదారుని ఖాతాలో జమ చేస్తుంది. మిగతా డబ్బులను మూడు విడతాల్లో జమ చేస్తుంది.

ఏఐజీ ఆస్పత్రికి మాజీ సీఎం కేసీఆర్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్



మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ గురువారం హైదరాబాద్‌లోని ఏఐజీ ఆస్పత్రికి వెళ్లారు. సాధారణ వైద్య పరీక్షల కోసం ఆయన ఆస్పత్రికి వెళ్లినట్టు బీఆర్ఎస్ వర్గాలు తెలిపాయి. పరీక్షల అనంతరం ఆయన తిరిగి ఇంటికెళ్లారు.

అగ్రహారంలో రోడ్డెక్కిన పాడి రైతులు

కరీంనగర్ డెయిరీని పునరుద్ధరించాలని డిమాండ్ • ప్లాంట్ సీజ్‌తో నష్టపోతామని ఆవేదన

• దాదాపు 40గ్రామాల్లో నిలిచిపోయిన పాల సేకరణ • విజయ డెయిరీ ఆధ్వర్యంలో పాల సేకరణ ఏర్పాట్లు : కలెక్టర్



నవతెలంగాణ - వేములవాడ/ సిరిసిల్ల

రాజన్న సిరిసిల్ల జిల్లాలోని వేములవాడ అర్బన్ మండలం అగ్రహారంలో ఉన్న కరీంనగర్ డెయిరీకి అనుమతి లేదనే కారణంతో అధికారులు గురువారం సీజ్ చేశారు. దీంతో పాడి రైతులు ప్రధాన రహదారిపై బైటాయించి ధర్నా నిర్వహించారు. ముందస్తు సమాచారం లేకుండా డెయిరీని ఎలా సీజ్ చేస్తారని, తాము పాలు ఎలా విక్రయించుకోవాలని ఆవేదన వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న పట్టణ సీఐ వీరప్రసాద్, ఎస్ఐలు రమేష్, వెంకటరాజం, పోలీస్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని రైతులను సముదాయించే ప్రయత్నం చేశారు. అధికారులు వచ్చి డెయిరీని పున:ప్రారంభించాలని డిమాండ్ చేశారు. అయితే, ఈ డెయిరీలో పరిధిలో రాజన్న సిరిసిల్ల జిల్లాతోపాటు కామారెడ్డి జిల్లాలో దాదాపు 40గ్రామాల రైతుల నుంచి పాల సేకరణ నిలిచిపోయింది. అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకుండానే ప్లాంట్ మూసేయడంతో సాయంత్రం పాలతో కేంద్రాలకు వెళ్లిన రైతులు ఆందోళనతో వెనుదిరిగారు. జిల్లా అధికారులు చెబుతున్నట్టుగా విజయ డెయిరీకి అన్ని గ్రామాల్లో కేంద్రాలు లేకపోవడంతో పాల సేకరణ ఎలా సాధ్యమనేది ప్రశ్నార్థకంగా మారింది. ఈ నేపథ్యంలో గురువారం సాయంత్రం, శుక్రవారం ఉదయం ఉత్పత్తి అయ్యే పాలకు రైతులు నష్టపోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.


అనుమతులు లేకపోవడంతోనే.. : కలెక్టర్

అగ్రహారంలోని కరీంనగర్ మిల్క్ ప్రొడ్యూసర్ డెయిరీ ప్లాంట్‌కు సరైన అనుమతులు లేకపోవడంతో, ప్రమాద నివారణ చర్యల్లో భాగంగా తాత్కాలికంగా మూసివేసినట్టు రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా తెలిపారు.

పరిశ్రమల శాఖ, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ నుంచి, రెవెన్యూ శాఖ, ల్యాండ్ కన్వర్షేషన్ అనుమతులు, పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ అనుమతులు, మున్సిపల్ శాఖ అనుమతులు లేనందున మూసేశామన్నారు. వేములవాడ టౌన్ ప్లానింగ్ అధికారులు ముందస్తుగా నోటీసులు జారీ చేయగా, వాటిని తీసుకోవడానికి నిరాకరించారని కలెక్టర్ గుర్తు చేశారు. జిల్లాలోని పాడి రైతులకు ఇబ్బంది కలగకుండా ప్రత్యామ్నాయంగా విజయ డెయిరీ ఆధ్వర్యంలో అధిక ధరకు పాలను సేకరిస్తామని చెప్పారు. పాల సేకరణలో ఏమైనా ఇబ్బందులు ఎదురైతే 8341031867, 9121160538, 9398684240 నెంబర్‌లలో సంప్రదించాలని సూచించారు.

రాజలింగమూర్తి హత్యలో రాజకీయమా..? భూవివాదమా..?

• నలుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న పోలీసులు
• విచారించి ఎంతటివారినైనా శిక్షిస్తాం.. : భూపాలపల్లి డీఎస్పీ సంపత్ రావు



నవతెలంగాణ-భూపాలపల్లి

జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలో బుధవారం జరిగిన మాజీ కౌన్సిలర్ భర్త రాజలింగమూర్తి హత్య కేసు సంచలనంగా మారింది. మృతుని భార్య నాగవెల్లి సరళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేపట్టారు. మృతుని భార్య సరళ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో తెలిపిన వివరాల ప్రకారం.. భూపాలపల్లి పోలీస్ స్టేషన్ ఎదురుగా ఉన్న భూమి విషయమై రేణికుంట్ల కొమురయ్య, రేణికుంట్ల సంజీవ్ కుటుంబంతో గొడవ జరగడంతో.. ఆ భూమి విషయంపై రామలింగమూర్తి కోర్టుకు వెళ్లారు. తీర్పు తమకే అనుకూలంగా వస్తుందన్న కారణంతో ఈనెల 19వ తేదీ సాయంత్రం 7:30 గంటలకు దాడి చేసి హత్య చేశారని సరళ తెలిపారు. రేణికుంట్ల సంజీవ్ మరో ముగ్గురితో కలిసి బండ్ల మీద వచ్చి భూపాలపల్లిలోని టీబీజీకేఎస్ కార్యాలయం నుంచి రెడ్డి కాలనీకి వెళ్లే దారిలో ద్విచక్ర వాహనంపై వెళ్తున్న తన భర్త రాజలింగమూర్తి తలపై రాడ్‌తో కొట్టడంతో కింద పడిపోయారని, వెంటనే ఆయన కడుపులో కత్తులతో విచక్షణా రహితంగా పొడిచి చంపారని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో సరళ పేర్కొన్నారు. నా భర్తను చంపడానికి ప్రోత్సహించిన వారిపై రాజకీయ కోణం ఉందనే అనుమానం వ్యక్తం చేశారు. హత్యకు కారణమైన రేణిగుంట్ల సంజీవ్, మల్హర్ రావు మండలం తొండ్ల గ్రామానికి చెందిన పింగిలి హేమంత్, భూపాలపల్లి మండలం కొంపల్లి గ్రామానికి చెందిన మోరే కుమార్, భూపాలపల్లికి చెందిన కొత్తూరు కుమార్‌పై చట్టపరమైన చర్యలు తీసుకొని తమకు న్యాయం చేయాలని ఫిర్యాదులో తెలిపారు.

అన్ని కోణాల్లో విచారణ చేపట్టి పట్టుకుంటాం : డీఎస్పీ సంపత్ రావు

నాగవెల్లి రాజలింగమూర్తి హత్యకు భూతగాదాలే కారణమని మృతుని భార్య సరళ ఫిర్యాదులో పేర్కొన్నారని, హత్యతో ప్రత్యక్షంగా, పరోక్షంగా సంబంధం ఉన్న వారిపై అన్ని కోణాల్లో దర్యాప్తు చేపట్టి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని భూపాలపల్లి డీఎస్పీ సంపత్ రావు తెలిపారు. ఈ ఘటనపై గురువారం ఆయన ఒక వీడియో విడుదల చేశారు. దాని ప్రకారం.. సామాజిక కార్యకర్త నాగవెల్లి రాజలింగమూర్తి హత్య కేసుపై సమగ్ర విచారణ జరిపి ఎంతటి వారినైనా పట్టుకొని శిక్షపడే విధంగా చేస్తామని తెలిపారు.

నాగవల్లి రాజలింగమూర్తి అంత్యక్రియలు పూర్తి

బుధవారం రాత్రి హత్యకు గురయిన నాగవల్లి రాజలింగమూర్తి మృతదేహాన్ని పోలీసులు.. పోస్టుమార్టం నిమిత్తం వంద పడకల ఆస్పత్రికి తరలించారు. గురువారం మధ్యాహ్నం 12 గంటలకు పోలీసుల సమక్షంలో పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. అనంతరం స్వగ్రామమైన జంగేడులో అంత్యక్రియలు నిర్వహించారు.

రాజలింగమూర్తిని హత్య చేయించింది గండ్రే

(మొదటిపేజీ తరువాయి)

మంత్రి ఈ సందర్భంగా ఎద్దేవా చేశారు. వరంగల్‌లో ఎంపీడీవోను బీఆర్ఎస్ నాయకులు హత్య చేశారంటూ అప్పటి సీపీ రంగనాథ్ చెప్పిన విషయాన్ని గుర్తు చేశారు. కొడంగల్‌లో సాక్షాత్తు జిల్లా కలెక్టర్‌పై కూడా సురేష్ అనే రౌడీ షీటర్ దాడి చేశారని తెలిపారు. రాష్ట్రంలో ఎలాంటి అభివృద్ధి జరగొద్దనే లక్ష్యంతో బీఆర్ఎస్ ఉందన్నారు. కాంగ్రెస్ గ్రాఫ్ తగ్గిందంటూ మాజీ సీఎం కేసీఆర్ అనడం పట్ల మంత్రి అభ్యంతరం వ్యక్తం చేశారు. హత్య రాజకీయాలతో బీఆర్ఎస్ గ్రాఫ్ పెరిగిందా? అని కేసీఆర్‌ను ప్రశ్నించారు. కిరాయి హత్యలు చేయడం మానుకోవాలని హెచ్చరించారు. 15 నెలలుగా ఫామ్‌హౌస్ నుంచి ఎప్పుడైనా బయటకు వచ్చారా? అని ప్రశ్నించారు. రాజలింగమూర్తి హత్యను ప్రభుత్వం సీరియస్‌గా తీసుకోవాలని కోరారు. హత్యలో కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు, గండ్ర వెంకటరమణారెడ్డి పాత్ర ఉందని ఆరోపించారు. సీబీసీఐడీ విచారణ చేసి 24 గంటల్లోనే నిందితులను అరెస్ట్ చేయాలని కోరారు.

ఫాస్ట్ ట్రాక్ కోర్టు ఏర్పాటు చేసి వెంటనే శిక్ష పడేలా చూడాలని డిమాండ్ చేశారు. హత్యను సీఎం రేవంత్‌రెడ్డి కూడా సీరియస్‌గా తీసుకుంటారని అన్నారు. లగచర్లలో కూడా కలెక్టర్‌ను చంపాలని కుట్ర చేశారని ఆరోపించారు. తెలంగాణలో హత్య రాజకీయాలకు తావు లేదన్నారు. అవినీతిపై పోరాడే వారికి రక్షణ కల్పిస్తామని భరోసానిచ్చారు. హరీశ్‌రావు అవినీతిపై పోరాడుతున్న చక్రధర్‌కు కూడా రక్షణ కల్పిస్తామన్నారు. తెలంగాణను దోచుకుని తిని ఎదురు తిరిగిన వారిని చంపేస్తారా? అని బీఆర్ఎస్ నేతలను ప్రశ్నించారు.

కాంగ్రెస్ విమర్శలు అవాస్తవాలు
మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణారెడ్డి

భూపాలపల్లిలో రాజలింగమూర్తి హత్యకు సంబంధించి వాస్తవాలు తెలుసుకోకుండా కాంగ్రెస్ విమర్శలు చేస్తున్నదని మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నేత గండ్ర వెంకటరమణారెడ్డి కొట్టిపారేశారు. రాజలింగమూర్తి హత్యను ఖండించారు.

గురువారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. స్థానిక భూ వివాదం నేపథ్యంలో ఈ హత్య జరిగిందని ఎఫ్ఐఆర్ కూడా నమోదైందని గుర్తుచేశారు. కొందరి ఒత్తిడితో రాజలింగ మూర్తి భార్య తనపై ఆరోపణలు చేస్తున్నారన్నారు. విచారణను ప్రభావితం చేసేలా కాంగ్రెస్ ప్రయత్నిస్తున్నదని ఆరోపించారు. నిష్పాక్షికంగా విచారణ జరపాలని డిమాండ్ చేశారు.

రాజలింగమూర్తి హత్యపై తెలంగాణ సీఎంవో ఆరా

మేడిగడ్డ బ్యారేజీ కుంగిపోవడానికి భారాస ప్రభుత్వమే కారణమంటూ కేసు వేసిన రాజలింగమూర్తి హత్యపై తెలంగాణ సీఎం కార్యాలయం (సీఎంవో) ఆరా తీసింది. ఈ హత్యకు గల కారణాలపై నిఘా వర్గాల నుంచి సమాచారం కోరింది. సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు సీఎంవో అధికారులు వివరాలు సేకరించారు.

భాష మన సంస్కృతికి జీవనాడి

అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవ శుభాకాంక్షలు : కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

భాష మన సంస్కృతికి జీవనాడి అనీ, తల్లి గర్భంలో ఉన్నప్పటి నుంచే మనకు అలవడేదే మాతృభాష అని కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్ర ప్రజలకు అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. మాతృభాష మన అస్తిత్వమనీ, సంస్కృతి,సాంప్రదాయాలకు మూలమని తెలిపారు. మాతృభాషను రక్షించుకోవాల్సిన అవసరముందని పేర్కొన్నారు. ఎన్నో యాసలు, మరెన్నో మాండలికాలు. ఒక్కో దాంట్లో.. ఒక్కో అందమైన భావన గల తెలుగు భాష ప్రాశస్త్యం గురించి ఎంత చెప్పినా తక్కువేనని పేర్కొన్నారు. 'అవధానం' వంటి అద్భుతమైన ప్రక్రియ ఒక్క తెలుగు భాషకే సాధ్యమని కొనియాడారు.

ఎనిమిది మంది ఐఏఎస్‌ల బదిలీ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలో ఎనిమిది మంది ఐఏఎస్ అధికారులను బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. సహకార కమిషనర్, మార్కెటింగ్ డైరెక్టర్‌గా కె.సురేంద్ర మోహన్‌కు అదనపు బాధ్యతలు అప్పగించారు. ఆరోగ్యశ్రీ సీఈవో ఎల్.శివకుమార్‌ను జీఏడీలో రిపోర్టు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది.

ఆరోగ్యశ్రీ సీఈవోగా ఆర్.వి.కర్ణన్‌కు అదనపు బాధ్యతలు. వాణిజ్య పన్నుల డైరెక్టర్‌గా కె.హరిత నియామకం. విత్తనాభి వృద్ధి సంస్థ డైరెక్టర్‌గా యాస్మిన్ బాషాకు అదనపు బాధ్యతలు. తెలంగాణ ఫుడ్స్ ఎండీగా కె.చంద్రశేఖర్‌రెడ్డికి అదనపు బాధ్యతలు. వనపర్తి అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్ నారాయణపేట అదనపు కలెక్టర్‌గా బదిలీ. టెక్స్‌టైల్స్, హ్యాండ్లూమ్స్ డైరెక్టర్ బి.శ్రీనివాస్‌రెడ్డి మాతృ సంస్థకు బదిలీ చేశారు.

పెరిగిన విద్యుత్ వినియోగ డిమాండ్

• దక్షిణ తెలంగాణ పంపిణీ సంస్థ సీఎండీ ముషారఫ్ ఫరూఖీ • సమ్మర్ ప్లాన్ పనులపై సమీక్ష



నవతెలంగాణ-నల్లగొండ ప్రాంతీయ ప్రతినిధి

నల్లగొండ జిల్లాలో విద్యుత్ డిమాండ్ వెయ్యి మెగావాట్లు దాటిందని దక్షిణ తెలంగాణ పంపిణీ సంస్థ సీఎండీ ముషారఫ్ ఫరూఖీ అన్నారు. నల్లగొండ పట్టణలో సమ్మర్ ప్లాన్‌లో జరుగుతున్న పనుల తనిఖీలో భాగంగా గురువారం కలెక్టర్ ఇలా త్రిపాఠితో కలిసి ఆయన బీట్ మార్కెట్ సబ్‌స్టేషన్‌ను సందర్శించారు. గతేడాది దాదాపు 67 పిటిఆర్‌లు ఓవర్ లోడ్ అయ్యాయని, ఇప్పుడు ఎలాంటి ఓవర్‌లోడింగ్ సమస్యలు లేవని తెలిపారు. హైదరాబాద్ నగరానికే పరిమితమైన 1912 విద్యుత్ కాల్ సెంటర్‌ను జిల్లాలకు కూడా విస్తరించినట్టు చెప్పారు. అనంతరం కలెక్టర్ కార్యాలయంలో జిల్లా విద్యుత్ అధికారులతో సీఎండీ సమావేశం నిర్వహించారు. సమావేశం అనంతరం తిప్పర్తి మండలం ఇందుగల సబ్ స్టేషన్‌ను పరిశీలించారు. నకిరేకల్ దగ్గర నిర్మితమవుతున్న ఆర్లగడ్డగూడెం 33 కేవీ ఫీడర్ పనులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో మొదటిసారిగా విద్యుత్ డిమాండ్ 1000 మెగావాట్లకు చేరిందని తెలిపారు. ఈ నెల 17వ తేదీన 1002 మెగావాట్లుగా రికార్డు అయిందన్నారు.

జిల్లాలో గృహ, వాణిజ్య పారిశ్రామిక, వ్యవసాయం రంగాల్లో విద్యుత్ వినియోగం భారీగా పెరుగుతున్నదన్నారు. గతేడాదితో పోల్చుకుంటే ఈ ఏడాది నూతనంగా దాదాపు 20 వేల మంది వినియోగదారుల చేరికతో మొత్తం వినియోగదారులు 8.24 లక్షలు ఉన్నట్టు ప్రకటించారు. గృహజ్యోతి పథకం కింద దాదాపు 2.37 లక్షల మంది లబ్ది పొందుతున్నారని, ప్రస్తుతం 2.37 లక్షల వ్యవసాయ వినియోగదారులు ఉన్నారని తెలిపారు. ఈ ఏడాది దాదాపు 5600 వ్యవసాయ కనెక్షన్లను నూతనంగా మంజూరు చేసినట్టు చెప్పారు. సమ్మర్ ప్లాన్‌లో భాగంగా జిల్లాలో అదనంగా 2900 ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఈ ఏడాది మొత్తం 10 సబ్ స్టేషన్లు ఏర్పాటు చేయాలని ప్రణాళిక వేసినట్టు చెప్పారు. ఇప్పటికే నాలుగు సబ్ స్టేషన్లు ఏర్పాటు చేశామన్నారు. విద్యుత్ అంతరాయాలు జరిగినప్పుడు వెంటనే పరిష్కరించేందుకు అంబులెన్స్ తరహా వాహనాలు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. యాసంగి, ఎండా కాలం ముగిసే వరకు అధికారులకు, సిబ్బందికి ఎలాంటి సెలవులూ మంజూరు చేయరాదని సూచించారు. ఆయన వెంట సంస్థ డైరెక్టర్ ఆపరేషన్ డాక్టర్ నరసింహులు, రూరల్ జోన్ చీఫ్ ఇంజినీర్ బాలస్వామి, జిల్లా నోడల్ అధికారి, చీఫ్ ఇంజినీర్ బిక్షపతి, జిల్లా సూపరింటెండింగ్ ఇంజినీర్ చంద్ర మోహన్, ఇతర అధికారులు పాల్గొన్నారు.



డిగ్రీ అధ్యాపకుల పీహెచ్‌డీ గ్రంథ సమర్పణకు మరో అవకాశమివ్వాలి

• ఓయూ వీసీ కుమార్‌కు టీజీసీటీఏ వినతి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ప్రభుత్వ డిగ్రీ కాలేజీల్లో పనిచేస్తున్న అధ్యాపకుల సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ ప్రభుత్వ కాలేజీ అధ్యాపకుల సంఘం (టీజీసీటీఏ) డిమాండ్ చేసింది. ఈ మేరకు గురువారం హైదరాబాద్‌లో ఉస్మానియా విశ్వవిద్యాలయం (ఓయూ) వీసీ ఎం కుమార్‌ను ఆ సంఘం చైర్‌పర్సన్ సౌందర్య జోసెఫ్, అధ్యక్షులు బి శ్రీనివాస్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి ఈ బ్రిజేష్ కలిసి వినతిపత్రం సమర్పించారు. ప్రభుత్వ డిగ్రీ కాలేజీ అధ్యాపకుల పీహెచ్‌డీ సిద్ధాంత గ్రంథ సమర్పణకు మరో అవకాశం కల్పించాలని కోరారు. రాష్ట్రంలో ప్రభుత్వ కాలేజీల్లో సేవలందిస్తున్న అధ్యాపకులకు పరిశోధనా రంగంలో అవకాశాలను కల్పిస్తూ ఓయూ గతంలో వారికి పీహెచ్‌డీలో ప్రవేశాలను కల్పించిందని గుర్తు చేశారు. బోధనా రంగంలో నిరంతరం సేవలందిస్తూ విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి పాటుపడుతున్నారని తెలిపారు. కరోనా కాలంలో విద్యాసంబంధమైన వెలితి ఉండొద్దనే కారణంతో అధ్యాపకులు మరింత కృషి చేశారని వివరించారు. సీబీసీఎస్, సెమిస్టర్ విధానం వల్ల విద్యాసంవత్సరంలో పూర్తి సమయం కాలేజీలకే అంకితం కావాల్సి వస్తున్నదని పేర్కొన్నారు. దీంతో పరిశోధనా ప్రగతికి అడ్డంకిగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. అయినప్పటికీ కష్టపడి తమ పరిశోధన గ్రంథాలను సిద్ధం చేశామని తెలిపారు. పీహెచ్‌డీ సిద్ధాంత గ్రంథ సమర్పణకు మరోసారి అవకాశం కల్పించాలని కోరారు. దానివల్ల మేలైన పరిశోధనలు వచ్చే అవకాశముందని సూచించారు.

గురక అని వస్తే ప్రాణం తీశారు

• వైద్యుల నిర్లక్ష్యంతో శ్రీనివాస్ మృతి
• మృతుని కుటుంబ సభ్యుల ఆరోపణ



(ఫైల్)

నవతెలంగాణ-సంగారెడ్డి

గురక సమస్యతో ఆస్పత్రికి వెళ్లిన ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన సంగారెడ్డి జిల్లా కేంద్రంలో జరిగింది. పోలీసులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. కొండాపూర్ మండలం గారకుర్తి గ్రామానికి చెందిన వెల్దురి శ్రీనివాస్‌కు తరచూ గురక వస్తుండటంతో చికిత్స తీసుకుంటే తగ్గుతుందని బంధువులు చెప్పిన మాటతో.. సంగా రెడ్డిలోని పద్మావతి న్యూరో మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రికి బుధవారం మధ్యాహ్నం వెళ్లారు. శ్రీనివాస్‌ను పరీక్షించిన వైద్యులు ముక్కులో బోను పెరిగిందని, ఆపరేషన్ చేస్తే తగ్గుతుందని చెప్పారు. దాంతో ఆస్పత్రి వైద్యులు బుధవారం ముక్కులో బోనుకు ఆపరేషన్ చేశారు. అయితే గురువారం తెల్లవారుజామున 2.00 గంటలకు శ్రీనివాస్ చనిపోయాడని కుటుంబ సభ్యులకు వైద్యులు తెలిపారు. ఆరోగ్యంగా ఉన్న వ్యక్తి ఎలా చనిపోతాడని ఆస్పత్రి యాజమాన్యాన్ని ప్రశ్నించగా పేషంట్‌కు గుండెపోటు వచ్చిందని వైద్యులు తెలిపారు. వైద్యుల నిర్లక్ష్యం మూలంగానే శ్రీనివాస్ మృతి చెందాడని ఆగ్రహం వ్యక్తం చేస్తూ బంధువులు ఆస్పత్రి ఎదుట ఆందోళన చేశారు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు ఆస్పత్రికి చేరుకుని పరిస్థితిని అదుపు చేశారు. వైద్యుల నిర్లక్ష్యంతో శ్రీనివాస్ చనిపోయాడని మృతుని అన్న నాగేందర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు పట్టణ ఇన్‌స్పెక్టర్ రమేష్ తెలిపారు.

బెట్టింగ్ యాప్‌ల వలకు చిక్కి..

(మొదటిపేజీ తరువాయి)

ఆన్‌లైన్ బెట్టింగ్ గేమ్ ఆడి రూ.లక్షలు సంపాదించా. ఇప్పుడు లగ్జరీకారు, ఇల్లు కొనే స్థాయికి వచ్చా! నువ్వు ఆడు.. నువ్వూ లక్షాధికారి కావొచ్చు!' లాంటి సంభాషణలతో కూడిన ప్రమోషన్ వీడియోలు సోషల్ మీడియాలో ఎక్కువగా చేస్తున్నారు. ఒకవేళ ఆ యాప్ వివరాల కోసం వెబ్‌సైట్ లింక్‌ను ఒకసారి క్లిక్ చేసినా.. సదరు వ్యక్తి ఏ సామాజిక మాధ్యమం తెరిచినా.. ఏ వెబ్‌సైట్‌ను సందర్శించినా.. ఒకపక్క ఆన్‌లైన్ రమ్మీ, క్యాసినో, రౌలెట్ లాంటి గ్యాబ్లింగ్ గేమ్స్ అనేకం యాడ్స్ రూపంలో కనిస్తుంటాయి. మరోవైపు ఆ యాప్‌లకు సంబంధించి యూట్యూబ్, ఇతర సామాజిక మాధ్యమాల ఇన్‌ఫ్లుయెన్సర్లు ప్రమోషన్‌కు ప్రభావితం చేస్తుంటాయి. ఆర్థికంగా ఏమీ లేని వ్యక్తి కేవలం బెట్టింగ్, ఇతర ఆన్‌లైన్ గేమ్స్ ఆడి రోజువారీగా సంపాదిస్తున్నట్టుగా బ్యాంక్‌ఖాతాకు సంబంధించి యూపీఐ బ్యాలెన్స్ చెకింగ్ పోస్టులో రూ.వేలు, రూ.లక్షలు జమ అయినట్టుగా చూపుతూ పెడుతున్న పోస్టులు కొందరిని అత్యాశకు గురి చేస్తున్నాయి.

నిరుద్యోగులు, యువతే ఎక్కువ..

ఆన్‌లైన్ గేమ్స్ బారిన నిరుద్యోగులు, తొందరగా డబ్బులు సంపాదించాలని ఆశపడే యువతే ఎక్కువగా బలవుతున్నారు. తెలిసిన వ్యక్తుల వద్ద, లోన్‌యాప్స్ ద్వారా డబ్బులు అప్పుగా తీసుకుంటూ ఆయా బెట్టింగ్‌యాప్స్, ఆన్‌లైన్ గేమ్స్‌లో పోగొట్టుకుంటున్నారు. తీరా మళ్లీ అప్పు దొరక్క, చేసిన అప్పులు తీర్చే మార్గం కనిపించక కొందరు ఆత్మహత్య చేసుకుంటున్నారు.నెల రోజుల్లో ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ఆత్మహత్య చేసుకున్న యువకుల ఉదంతాలివీ..

- కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండలం గద్దపాక గ్రామానికి చెందిన బూస శంకర్ కుమారుడు కార్తీక్(25) కొన్నేండ్లుగా ఆన్‌లైన్‌లో రమ్మీ ఆడాడు. గేమ్ కోసం రూ.15లక్షల వరకు అప్పు చేశాడు. ఆరు నెలల కింద 20గుంటల పొలం అమ్మి అప్పు తీర్చేశాడు. తరువాత మరోసారి రూ.2.50లక్షలు అప్పు చేసి రమ్మీ ఆడటంతో ఆ డబ్బులు కూడా పోయాయి. దీంతో మనస్తాపానికి గురైన కార్తీక్ జనవరి 30న గ్రామ సమీపంలోని వాగు వద్ద పురుగుల మందుతాగి ఆత్మహత్య చేసుకున్నాడు.
- ఇదే మండలం ఇప్పలపల్లి గ్రామానికి చెందిన ఎడిగ మధు(33) కొన్ని నెలలు ఆన్‌లైన్ బెట్టింగ్ ఆడుతూ రూ.10లక్షలకుపైగా పోగొట్టుకున్నాడు. అప్పులు చేసి బెట్టింగ్‌లో పెట్టడంతో అవి చెల్లించలేక కొన్ని రోజులుగా మనోవేదనకు గురయ్యాడు. ఈనెల 10న ఇంట్లో ఎవరూ లేని టైంలో గడ్డి మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు.
- పెద్దపల్లి జిల్లా గోదావరిఖని టూటౌన్ పోలీసు స్టేషన్ పరిధి సైంటిస్‌క్లయిన్ కాలనీకి చెందిన చొప్పరి దేవేందర్(35) కార్లను అద్దెకు నడుపుతుండటమే కాకుండా జూలపల్లిలో బిర్యానీ సెంటర్ నిర్వహిస్తున్నాడు. కొంతకాలంగా ఆన్‌లైన్ గేమింగ్‌కు అలవాటుపడి రూ.50లక్షలు పోగొట్టుకున్నాడు. రూ.5లక్షల వరకు అప్పులు చేశాడు. ఆర్థిక ఇబ్బందులకు తోడు అప్పులు ఇచ్చిన వారు ఒత్తిడి చేయడంతో మనస్తాపానికి గురైన దేవేందర్ ఆదివారం ఇంట్లోనే ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు.

కాళేశ్వరం విచారణ కమిషన్
గడువు మరోసారి పెంపు

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

కాళేశ్వరం ఎత్తిపోతల బ్యారేజీల్లో అవకతవకలపై న్యాయవిచారణ చేస్తున్న జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ గడువును మరోమారు సర్కారు పొడిగించింది. ఇప్పటివరకు పెంచిన గడువు ఈనెలాఖరు వరకు ఉన్న నేపథ్యంలో ఏప్రిల్ 30 వరకు కమిషన్ గడువును పొడిగిస్తూ నీటిపారుదల శాఖ ఉత్తర్వులు జారీచేసింది. కమిషన్ చైర్మెన్ పీసీ ఘోష్ ఈనెల 23న హైదరాబాద్ రానున్నారు. కాళేశ్వరం ఆనకట్టలకు సంబంధించి తదుపరి విచారణ కొనసాగించనున్నారు. ఈ దఫాలో మిగిలిన విచారణ క్రాస్ ఎగ్జామినేషన్ ప్రక్రియను కమిషన్ పూర్తిచేసే అవకాశాలు కనిపిస్తున్నాయి.



మా భూముల నుంచి ఎన్‌హెచ్ వద్దే వద్దు
నిబంధనలకు విరుద్ధంగా అలైన్మెంట్

- సిద్దిపేట ఆర్డీవో కార్యాలయం వద్ద రైతుల నిరసన

నవతెలంగాణ-సిద్దిపేట

మా భూముల నుంచి జాతీయ రహదారి 365బీ వద్దేవద్దని రైతులు డిమాండ్ చేశారు. గ్రీన్ ఫీల్డ్ రహదారిని 150 ఫీట్ల వెడల్పుతో నిర్మించడానికి రూట్ మ్యాప్‌ను జాతీయ రహదారుల నిబంధనలకు విరుద్ధంగా అలైన్‌మెంట్‌ను తయారు చేస్తున్నారని వివిధ గ్రామాలకు చెందిన రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. సిద్దిపేట జిల్లాలోని పుల్లూరు, చిన్నగుండవెల్లి, ఎన్సనాపల్లి, ఖమ్మంపల్లి, బూరుగుపల్లి, తడకపల్లి, దుద్దెడ గ్రామాలకు చెందిన రైతులు గురువారం సిద్దిపేట ఆర్డీఓ సదానందంను కలిసి తమ సమస్యను వివరించారు. అనంతరం కార్యాలయం ఎదుట బైటాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నిబంధనల ప్రకారం గ్రీన్ ఫీల్డ్ రహదారిని వివిధ ప్రాంతాల మీదుగా మూడు రకాలుగా సర్వే చేయాల్సి ఉంది కానీ, ఏజెన్సీ వారు ఒకటే రూట్‌లో మూడు సర్వేలు చేసినట్టు తెలిపారు. ఉత్తరం వైపు ఉన్న సిరిసిల్లకు వెళ్లడానికి పడమర దిక్కున పది కిలోమీటర్ల దూరం లోపలికి వచ్చి ఉత్తరం దిక్కున రోడ్డు కలుపుతున్నారని అన్నారు. దీనివల్ల తమకు తీవ్ర నష్టం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇదివరకే ప్రభుత్వానికి వివిధ నిర్మాణాల కోసం వందల ఎకరాల భూములు ఇచ్చామని, మళ్లీ ఇప్పుడు రహదారి నిర్మాణం పేరుతో తమ భూములను తీసుకోవడం మమ్మల్ని తీవ్రంగా మానసిక వేదనకు గురిచేస్తుందన్నారు. ఈ రహదారి నిర్మాణం పూర్తిగా రెండు పంటలు పండే పట్టా భూముల నుంచి పోతుందని, రైతులం ఆర్థికంగా నష్టపోతామని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం పునరాలోచించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాలకు చెందిన రైతులు పాల్గొన్నారు.

వ్యవసాయ విస్తరణాధికారిని సస్పెండ్ చేయాలి

- పురుగుల మందు డబ్బాలతో రైతుల నిరసన



నవతెలంగాణ-నర్సాపూర్

సంగారెడ్డి జిల్లా హత్నూర మండలం దౌల్తాబాద్ క్లస్టర్ వ్యవసాయ విస్తరణ అధికారి మహేందర్‌ను వెంటనే సస్పెండ్ చేయాలని కాసాల రైతులు డిమాండ్ చేశారు. కాసాలకు చెందిన కోర ప్రభుకృష్ణ, పూసల శ్రీనివాస్ గౌడ్, అచ్చిని మల్లేశం, కంకరీ నగేష్, కొమ్మరగోల్ల మహేష్, ఎండీ ఆకీల్, అజ్జిమర్రీ కృష్ణ.. పురుగుమందు డబ్బాలతో గురువారం ఆందోళనకు దిగారు. రైతు భరోసా డబ్బులు తమ ఖాతాలో ఇప్పటి వరకు జమ కాలేదనే విషయాన్ని సదరు అధికారిని సంప్రదించి అడుగగా నిర్లక్ష్యంగా సమాధానమిచ్చారని రైతులు తెలిపారు. రైతు భరోసా రాని రైతులు పురుగుల మందు తాగితే రైతు భరోసా నిధులు విడుదల అవుతాయని వెటకారంగా మాట్లాడుతున్నారని రైతులు ఆరోపించారు. రైతులకు ఏవైనా సమస్యలు ఎదురైతే సామరస్యంగా నచ్చజెప్పాల్సిన అధికారి, తన హెూదాను మరిచి రైతులను తక్కువ చేస్తూ మాట్లాడటం సరైంది కాదన్నారు. రైతులపై అనుచితంగా ప్రవర్తించిన వ్యవసాయ విస్తరణ అధికారి మహేందర్‌పై సంబంధిత ఉన్నతాధికారులు తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కాగా, దీనిపై ఏఈఓ మహేందర్‌ను వివరణ కోరగా.. రైతుల ఆరోపణలు అవాస్తవమని అన్నారు. వారు తనపై ఉద్దేశపూర్వకంగానే తప్పుడు ప్రచారం చేస్తున్నారని తెలిపారు. రైతులపై తానెప్పుడూ దురుసుగా ప్రవర్తించలేదన్నారు.

ఏవో కార్యాలయం పై ఏసీబీ దాడులు

- రూ.30 వేలు లంచం తీసుకుంటూ పట్టుబడ్డ ఏఓ

నవతెలంగాణ-అశ్వాపురం



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండల పరిషత్ కార్యాలయంలోని మండల వ్యవసాయ అధికారి కార్యాలయంపై గురువారం ఏసీబీ అధికారులు దాడులు నిర్వహించారు. ఈ దాడిలో ఏవో రూ.30 వేలు లంచం తీసుకుంటుండగా రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నట్టు ఏసీబీ డీఎస్పీ వై.రమేష్ తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. మండలానికి చెందిన ఓ రైతు ఏవో సాయి శాంతన్ కుమార్‌ను కలిసి పత్తి అమ్మకాల విషయంలో టీఆర్‌లు కావాలని అడగ్గా.. రూ.30 వేలు లంచం అడిగారు. దాంతో ఆ రైతు గత వారం రోజుల క్రితం ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. కాగా, ఏఓకు రైతు డబ్బులు ఇస్తుండగా.. ఏసీబీ అధికారులు రెడ్‌హేండెడ్‌గా అధికారిని పట్టుకున్నారు. అలాగే, అతనిపై విచారణ చేపట్టి ఈ దాడులను చేశామని ఏసీబీ డీఎస్పీ తెలిపారు. అవినీతి అక్రమాలకు పాల్పడే అధికారులకు సంబంధించిన సమాచారం 1064 టోల్ ఫ్రీ నెంబర్ ద్వారా తమకు సమాచారం అందిస్తే చర్యలు చేపడతామని తెలిపారు. ఈ దాడుల్లో ఏసీబీ అధికారులు ఎన్ శేఖర్, సట్ల రాజు సిబ్బంది పాల్గొన్నారు.

రాకేశ్‌కు మెరుగైన ఉచిత వైద్యమందించాలి

- చార్జింగ్ వాహనాన్నీ ఇవ్వాలి : అధికారులకు సీఎం రేవంత్ రెడ్డి ఆదేశం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

సూడో మస్క్యులర్ డిస్ట్రోఫీ (కండరాల క్షీణత వ్యాధి)తో బాధపడుతున్న నిరుపేద యువకుడు రాకేశ్‌కు మెరుగైన వైద్యమందించాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. హన్మకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం రంగయ్యపల్లి గ్రామానికి చెందిన గూళ్ల రాకేశ్ చాలా కాలం నుంచి కండరాల క్షీణత వ్యాధితో బాధపడుతున్నారు. ఇటీవల వ్యాధి తీవ్రత పెరిగి నడవలేని స్థితికి చేరుకోవడంతో అతని పరిస్థితిపై మీడియాలో కథనాలు వెలువడ్డాయి. రాకేశ్‌కు క్రమం తప్పకుండా ఖరీదైన ఇంజెక్షన్లను ఇవ్వాల్సి ఉంటుందని వైద్యులు సూచించారు. దీనిపై సీఎం స్పందించి, అధికారులకు ఆదేశాలివ్వడంతో సీఎం ఓఎస్డీ శ్రీనివాసులు రాకేశ్ కుటుంబ సభ్యులతో మాట్లాడారు. ప్రభుత్వం నుంచి అన్ని విధాలుగా ఆదుకుంటామని ముఖ్యమంత్రి తరఫున హామీ ఇచ్చారు. ములకనూరులోని ఒక ప్రయివేటు కాలేజీలో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్న రాకేశ్‌కు స్వగ్రామం నుంచి వెళ్లి రావడానికి చార్జింగ్ వాహనాన్ని ప్రభుత్వం అందించనున్నట్టు వెల్లడించారు. తమ కొడుకును ఆదుకున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి రాకేశ్ తల్లిదండ్రులు గూళ్ల సమ్మయ్య, లక్ష్మి ధన్యవాదాలు తెలిపారు.

ఎంఆర్‌ఎఫ్ యాజమాన్య నిర్లక్ష్యం..
నాలుగేండ్లయినా పర్మినెంట్ చేయని వైనం
రోడ్డున పడ్డ కార్మికులు

- అడిగినందుకు 320 మందికి డ్యూటీ బంద్
- డీఆర్‌డీఏ పరీక్ష, ఇంటర్వ్యూ ద్వారా కంపెనీలో నియామకం
- కార్మికుల్ని పర్మినెంట్ చేయాలి : సీఐటీయూ





నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

శ్రమటోడ్చి సంపదను సృష్టించి కంపెనీలకు లాభాలు తెచ్చిపెడుతున్న కార్మికుల పట్ల యాజమాన్యాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయి. కార్మిక చట్టాల్ని ఉల్లంఘిస్తూ శ్రమ దోపిడీకి పాల్పడుతున్నాయి. నాలుగేండ్లయి సీనియార్టీ దాటినా పర్మినెంట్ చేయకుండా దాటవేస్తున్నాయి. ఒకరా ఇద్దరా 320 మంది కార్మికులు కష్టపడి కంపెనీలో పనిచేస్తున్నా పర్మినెంట్‌కు నోచుకోవట్లేదు. రిక్రూట్‌మెంట్ సమయంలో చేసుకున్న ఒప్పందం ప్రకారం పర్మినెంట్ చేయాలని కోరినందుకు వారిని పనిలోంచి తీసేసి నియంతృత్వాన్ని ప్రదర్శిస్తోంది ఎంఆర్‌ఎఫ్ కంపెనీ యాజమాన్యం. పర్మినెంట్‌కు నోచుకోకపోవడం వల్ల వేతన పెరుగుదలతో పాటు ఇతర బెనిఫిట్స్ అందకుండా పోతున్నాయని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వాయిదాలు వేయడం కాకుండా వెంటనే కార్మికుల్ని పనిలోకి తీసుకుని పర్మినెంట్ చేయాలని సీఐటీయూ డిమాండ్ చేస్తోంది.

పారిశ్రామిక ప్రాంతంగా అభివృద్ధి చెందిన సంగారెడ్డి జిలాలో ఎంఆర్‌ఎఫ్ పరిశ్రమకు ఎంతో గుర్తింపు ఉంది. సదాశివపేట మండలంలోని అంకినపల్లి ఎంఆర్‌ఎఫ్ పరిశ్రమలో వేలాది మంది కార్మికులు పనిచేస్తున్నారు. ప్రొడక్షన్ విభాగం, ఎలక్ట్రికల్స్, మెకానికల్ ఇతర విభాగాల్లో కలిపి 4 వేల మంది వరకు పర్మినెంట్, కాంట్రాక్టు కార్మికులున్నారు. ఎంఆర్‌ఎఫ్ టైర్ల పరిశ్రమలో ఉద్యోగం వస్తే జీవితం బాగుపడుతుందన్న ఆశతో వందలాది మంది కార్మికులు ఉద్యోగంలో చేరారు. డీఆర్‌డీఏ ద్వారా పరీక్ష, ఇంటర్వ్యూ ద్వారా ప్రతిభావంతులను కంపెనీ నియమించుకుంది. పర్మినెంట్ అయితే తమ కుటుంబాలు స్థిరపడతాయన్న ఆశతో ఉన్న కార్మికుల్ని పరిశ్రమ యాజమాన్యం నిర్లక్ష్యం చేయడంతో వాళ్లంతా రోడ్డున పడ్డారు.

నాలుగేండ్లయినా పర్మినెంట్ చేయని యాజమాన్యం

రాత పరీక్ష, ఇంటర్వ్యూలో ప్రతిభ కనబర్చిన వాళ్లు నియామకం అయిన తర్వాత ప్రత్యేక శిక్షణ పొందారు. ప్రొడక్షన్, ఇతర విభాగాల్లో కలిపి 320 మంది కార్మికులు కంపెనీ ఉద్యోగులుగా నియమించబడి నాలుగు సంవత్సరాలు పూర్తయ్యింది. వీరందర్నీ కాంట్రాక్టు పద్ధతిలో నియమించిన సమయంలోనే మూడున్నర సంవత్సరాలు పూర్తవ్వగానే అందర్నీ పర్మినెంట్ చేస్తామని పరిశ్రమ యాజమాన్యం చెప్పింది. కంపెనీ మాట మేరకు కార్మికులంతా కష్టపడి పనిచేస్తూ వచ్చారు. నాలుగేండ్లు పూర్తయినా యాజమాన్యం తమను పర్మినెంట్ చేయకపోవడంతో కార్మికులు ఆందోళనకు గురయ్యారు.

పర్మినెంట్ అడిగినందుకు తొలగింపా...?

కాంట్రాక్టు పద్ధతిలో నియమించబడిన కార్మికుల్ని మూడున్నర సంవత్సరాల సర్వీస్ పూర్తవ్వగానే విధిగా పర్మినెంట్ చేస్తామని పరిశ్రమ యాజమాన్యం రిక్రూట్‌మెంట్ సమయంలోనే హామీ ఇచ్చింది. అదే విషయాన్ని కార్మికులు యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లారు. కంపెనీ ప్రతినిధులు కార్మికుల మాటల్ని పట్టించుకోకపోవడంతో నిరసనగా కంపెనీ ఎదుట బైటాయించారు. పోలీసులు మోహరించి కంపెనీ ప్రతినిధుల పక్షాన కార్మికులను దుర్భాషలాడి బెదరగొట్టారు. కార్మికులు పర్మినెంట్ గురించి అడిగినందుకు ఆగ్రహించిన కంపెనీ యాజమాన్యం 300 మందిని విధుల్లోకి రావొద్దని చెప్పింది. చట్టబద్ధమైన అంశాన్ని గుర్తు చేసి నిరసన తెలపడం పెద్ద నేరమైనట్టుగా ఎంఆర్‌ఎఫ్ యాజమాన్యం నియంతృత్వంగా వ్యవహరించి కార్మికుల్ని వారం రోజులుగా కంపెనీ విధుల్లోకి రానివ్వడంలేదు.

కార్మికుల్ని విధుల్లోకి తీసుకుని పర్మినెంట్ చేయాలి

ఎంఆర్‌ఎఫ్‌లో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికుల్ని వెంటనే విధుల్లోకి తీసుకుని పర్మినెంట్ చేయాలి. మూడున్నరేండ్లకు పర్మినెంట్ చేయాల్సిన యాజమాన్యం నాలుగేండ్లయినా పట్టించుకోలేదు. అదే విషయాన్ని అడిగినందుకు విధులకు రాకుండా అడ్డుకోవడం సరైందికాదు. లేబర్ అధికారులు జోక్యం చేసుకుని కార్మికుల్ని విధుల్లోకి తీసుకునేందుకు చర్యలు తీసుకోవాలి. పర్మినెంట్ చేసే విషయంలోనూ డీసీఎల్ యాజమాన్యాన్ని ఒప్పించాలి.

ప్రవీణ్‌కుమార్, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు

శ్రమ దోపిడీకి పాల్పడుతున్న వైనం

నాలుగేండ్లుగా పనిచేస్తున్న 320 మంది కాంట్రాక్టు కార్మికులకు నెలకు రూ.11,500 వరకు వేతనం చెల్లిస్తున్నారు. కాంట్రాక్టు కార్మికులుగా ఉన్నందున ఇతర ఏ రకమైన బెనిఫిట్స్‌కు నోచుకోవట్లేదు. నాలుగేండ్లుగా చాలీ చాలని వేతనాలతో పనిచేస్తూ వచ్చారు. మూడున్నర సంవత్సరాల తర్వాత పర్మినెంట్ అయితే అన్ని రకాల కటింగ్స్ పోను వేతనం రూ.22,500 వరకు పెరగడంతో పాటు పీఎఫ్, ఈఎస్ఐ ఇతర బెనిఫిట్స్ పొందుతారు.

చర్చల పేర వాయిదాలు

పర్మినెంట్ చేయాలని కార్మికులు నిరసన వ్యక్తం చేస్తుండటంతో విధుల్లోకి రావొద్దంటూ కంపెనీ ఆంక్షలు విధించింది. దాంతో సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికుల్ని విధుల్లోకి తీసుకోవడంతో పాటు పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేస్తూ డీసీఎల్‌కు ఫిర్యాదు చేశారు. నిబంధనల మేరకు కార్మికుల్ని పర్మినెంట్ చేయాలని కోరారు. డీసీఎల్ అధికారితో కంపెనీ ప్రతినిధులు చర్చలు జరిపారు. నాలుగు రోజుల సమయం కావాలని వాయిదా కోరారు. సోమవారం వరకు కంపెనీ యాజమాన్యం పర్మినెంట్ చేసేందుకు అంగీకరించకపోతే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కార్మికులు కోరుతున్నారు.

గుర్తింపు యూనియన్‌కు పట్టదా..?

ఎంఆర్‌ఎఫ్ పరిశ్రమలో 320 మంది కార్మికులు పర్మినెంట్ కోసం రోడ్డెక్కారు. పర్మినెంట్ చేయాల్సిన సమయం దాటి ఆరు మాసాలు కావస్తుంది. యాజమాన్యం పట్టించుకోకపోతే కార్మికుల తరపున గుర్తింపు సంఘం మాట్లాడాలి. ఆ దిశగా గుర్తింపు యూనియన్ చొరవ తీసుకోకపోవడం వల్లనే కార్మికుల్ని విధుల్లోకి రానీయకుండా పరిశ్రమ యాజమాన్యం మొండిగా వ్యవహరిస్తుందన్న అభిప్రాయం కార్మికుల్లో ఉంది.

మార్చిలో చేనేత కార్మికుల రుణాలు మాఫీ
సహకార సంఘాలకు ఎన్నికలు జరిపిస్తాం

- పెరిగిన ధరలకు అనుగుణంగా కనీసవేతనాలు అందేలా చూస్తాం : చేనేత కార్మిక సంఘం బృందానికి మంత్రి తుమ్మల హామీ



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

మార్చిలో చేనే కార్మికులకు రుణాలు మాఫీ చేస్తామనీ, బాగా నడుస్తున్న 190 సహకార సంఘాలకు వీలైనంత తొందర్లో ఎన్నికలు నిర్వహిస్తామని చేనేత, జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హామీనిచ్చారు. గురువారం హైదరాబాద్‌లోని సచివాలయంలో గల తన మీటింగ్ హాల్‌లో చేనేత శాఖ కమిషనర్ శైలజా రామయ్యర్, టెస్కో ఎమ్‌డీ అశోక్, జేడీ, ఇతర ఉన్నతాధికారులతో కలిసి చేనేత కార్మిక సంఘం బృందంతో మంత్రి సమావేశమయ్యారు. అందులో ఆ సంఘం గౌరవాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు, సలహాదారులు కూరపాటి రమేశ్, అధ్యక్షులు వనం శాంతికుమార్, ప్రధాన కార్యదర్శి గంజి మురళీధర్, కార్యదర్శి ముషం నరహరి, రాష్ట్ర కమిటీ సభ్యులు గుండు వెంకటనర్సు, గుర్రం నర్సింహ, తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా చేనేత కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు, సహకార సంఘాలకు పాలకమండళ్ల గడువు ముగిసినా ఎన్నికలు నిర్వహించకపోవడం, త్రిఫ్టు పథకం సరిగా అమలు కాకపోవడం, తదితర అంశాలను మంత్రి నాగేశ్వరరావు, అధికారుల దృష్టికి చెరుపల్లి సీతారాములు తీసుకెళ్లారు. పెరిగిన ధరలకు అనుగుణంగా చేనేత కార్మికులకు కనీస వేతనాలు అందేలా చూడాలని అధికారులను మంత్రి తుమ్మల ఆదేశించారు. త్రిఫ్ట్ పథకంలో కార్మికుల వేతనాలపై 8 శాతం జమ చేయాలనే అంశాన్ని పరిశీలిస్తామన్నారు. చేనేత సహకార సంఘాల్లో మగ్గం నేస్తున్న కార్మికులను సభ్యులు చేర్చుకునేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. జీవో నెంబర్ 51 ఎంక్వయిరీ ఉన్న సంఘాలను ఏండ్ల కొద్ది నాన్చకుండా త్వరగా తేల్చాలని సూచించారు. చేనేత కార్మికుల ఉపాధి సంక్షేమం కోసం హ్యాండ్లూమ్ వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు, బడ్జెట్ కేటాయింపు సాధ్యాసాధ్యాలను పరిశీలించాలని అధికారులను ఆదేశించారు.

కేంద్ర బడ్జెట్‌లో రూ. 1.8 లక్షల కోట్లు కేటాయించాం
తెలంగాణకు అన్యాయమనేది పచ్చి అబద్ధం

- ఆరు గ్యారంటీలపై డైవర్ట్ చేయడానికే కేంద్రంపై విమర్శలు : కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్



కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు రూ.1.8 లక్షల కోట్లు కేటాయించామనీ, గత బడ్జెట్ కంటే ఇది పదిశాతం అధికమని కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్ నొక్కిచెప్పారు. తెలంగాణకు అన్యాయం జరిగిందని కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలు చేస్తున్న ప్రచారం పచ్చి అబద్ధమని కొట్టిపడేశారు. ఆరు గ్యారంటీల అమలులో విఫలమైన కాంగ్రెస్ ప్రభుత్వం దాని నుంచి ప్రజలను పక్కదోవ పట్టించేందుకు కేంద్రంపై విమర్శలు చేస్తున్నదన్నారు. భూపాలపల్లిలో రాజలింగమూర్తి హత్యను ఖండించారు. హత్యారాజకీయాలను ఉక్కుపాదంతో అణచాలనీ, ఆ ఘటనపై లోతుగా విచారణ జరిపించి రాష్ట్ర ప్రభుత్వం తన నిజాయితీని నిరూపించుకోవాలని డిమాండ్ చేశారు. గురువారం హైదరాబాద్‌లోని మెర్క్యూరీ హోటల్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణలోని గ్రామాలు, పట్టణాల కోసం కేంద్రం ఏం చేసిందో..రాష్ట్ర ప్రభుత్వం ఏం చేసిందో చర్చించడానికి సిద్ధమా? అని కాంగ్రెస్ నేతలకు సవాల్ విసిరారు. తెలంగాణకు పన్ను ఆదాయ పంపిణీ ద్వారా రూ.29,899 కోట్లు, గ్రాంట్ల ద్వారా రూ.21,075 కోట్లు ఇచ్చామని తెలిపారు. రైల్వేలు, జాతీయ రహదారులు, మౌలిక వసతుల కల్పన, విమానయాన రంగాలకు, రైతులకు, అటవీ శాఖకు, తదితరాల కోసం తెలంగాణకు కేంద్రం ప్రకటించిన నిధుల వివరాలను వెల్లడించారు. దేశానికి సంబంధించిన బడ్జెట్ లో ఒక రాష్ట్రం పేరు లేనంత మాత్రాన ఆ రాష్ట్రానికి నిధులివ్వలేదని సరిగాదని చెప్పారు. కృష్ణా జలాల వాటాలో తెలంగాణకు అన్యాయం చేసింది కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలేనని విమర్శించారు. ఆ రెండు పార్టీలు తెలంగాణ ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ రెండూ చీకటి మిత్రులని ఆరోపించారు. కాళేశ్వరం, డ్రగ్స్, ఫోన్‌ట్యాపింగ్, ఫార్ములా ఈ రేస్ కేసుల నుంచి రక్షించుకునేందుకు బీఆర్ఎస్ నేతలు ఢిల్లీకి పోయి కాంగ్రెస్ అధిష్టానంతో చీకటి ఒప్పందం చేసుకున్నది వాస్తవం కాదా? అని ప్రశ్నించారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు లబ్ధి చేకూర్చేందుకు అభ్యర్థులను నిలబెట్టకుండా కేసీఆర్ లోపాయికారి ఒప్పందం చేసుకున్న మాట నిజం కాదా? అని నిలదీశారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామని చెప్పి పదిశాతం కోతపెట్టి అన్యాయం చేసిందని విమర్శించారు. కులగణన తప్పుల తడుక అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో టాప్ 5 మంత్రులదే హవా నడుస్తున్నదనీ, దీనిపై సొంత పార్టీ ఎమ్మెల్యేలే అసంతృప్తితో ఉన్నారని చెప్పారు.

చింతకాయలు తెంపాడని.. దళితునిపై దాడి

(మొదటిపేజీ తరువాయి)

గ్రామం నుంచి బహిష్కరించారు. పొలం కౌలుకు చేసినందుకు దళితుడిని బండరాళ్లతో కొట్టి చంపారు. ఇలా చెబుతూ పోతే వరుస సంఘటనలు జరుగుతూనే ఉన్నాయి.

చింతకాయ తెప్పిండని దాడి, కులం పేర తిట్లు

సంగారెడ్డి జిల్లా రాయికోడ్ మండలం పిప్పడపల్లి గ్రామంలో ఓ దళితుడు చింత చెట్టుకు కాయలు తెప్పినందుకు కులం పేరిట దూషించారు. ఇంట్లో నుంచి బయటికి ఈడ్చుకెళ్లి దాడి చేశారు. బాధితుడు సుమన్ తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 13వ తేదీన చీకుర్తి నీలమ్మ, భర్త అమృత్ తమ వ్యవసాయ పొలం వద్ద ఉన్న చింత చెట్టుకు చింత కాయలు తెంపి తీసుకురావాలని దళితుడైన సుమన్‌కు చెప్పారు. దాంతో పొలం వద్దకెళ్లి చింత చెట్టు ఎక్కి కాయలు తెంపుతుండగా చీకుర్తి లక్ష్మణ్, అతని భార్య మమత అక్కడికి వచ్చారు. చింతకాయలు ఎవరు తెంపమన్నారంటూ నిలదీశారు. కులం పేరుతో దూషించారు. అవమానపరుస్తూ తిట్టడంతో సుమన్ తెంపిన చింతకాయల్ని అక్కడే వదిలేసి వెళ్లాడు. 14వ తేదీన సుమన్ ఇంట్లో ఉండగా చీకుర్తి లక్ష్మణ్, మమత అక్కడికెళ్లి ఇంటి నుంచి బయటికి గుంజి కులం పేరుతో అనరాని మాటలు అంటూ దూషించారు. చెట్టుకు సంబంధించిన వాళ్లు చెప్పడం వల్లనే అక్కడికెళ్లి చింతకాయలు తెంపినట్టు అందులో ఎలాంటి తప్పు లేకపోయినా తనపై దాడి చేశారని సుమన్ తెలిపారు.

ఫిర్యాదు చేసినా పట్టించుకోని పోలీసులు

కులం పేరుతో ఇష్టమొచ్చినట్టు తిట్టడం తో పాటు దాడి చేసిన వ్యక్తులపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని సుమన్ స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఏడు రోజులు గడుస్తున్నా పోలీసులు సుమన్ ఫిర్యాదును పట్టించుకోలేదు. దళితుల్ని తిట్టినా కొట్టినా ఇతర ఏ పద్ధతుల్లో అవమానపర్చినా కఠినంగా శిక్షించాలని చట్టాలు చెబుతున్నాయి. పోలీసులు మాత్రం దాడిచేసిన వ్యక్తులకు చట్టాల్ని చుట్టాలుచేసి చేతులు దులుపుకున్నారు.

దాడి చేసిన పెత్తందార్లను కఠినంగా శిక్షించాలి : కేవీపీఎస్

దళితుడైన సుమన్‌పై దాడి చేసిన పెత్తందార్లను కఠినంగా శిక్షించాలని కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు అతిమేల మాణిక్, జిల్లా ప్రధాన కార్యదర్శి అశోక్ డిమాండ్ చేశారు. పిప్పడపల్లిలో చింత చెట్టుకు కాయలు తెంపిండని చెప్పి ఇంట్లోంచి ఈడ్చుకొచ్చి కులం పేరిట తిట్టడం, దాడి చేయడం హేయమైన చర్య అన్నారు. సుమన్‌పై దాడి చేసి తిట్టిన పెత్తందార్లపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.

జీవవైవిధ్య పరిరక్షణలో భాగస్వామ్యం కావాలి

- రాష్ట్ర అటవీ, పర్యాటక శాఖ మంత్రి కొండా సురేఖ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్



జీవ వైవిధ్య పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని రాష్ట్ర అటవీ, పర్యాటక శాఖ మంత్రి కొండా సురేఖ ప్రజలకు పిలుపునిచ్చారు. హైదరాబాద్‌లోని కన్హ శాంతి వనంలో తెలంగాణ బయోడైవర్సిటీ బోర్డు నిర్వహిస్తున్న నేషనల్ బయో డైవర్సిటీ కాన్ఫరెన్స్ - 2025లో గురువారం మంత్రి పాల్గొని మాట్లాడారు. పర్యావరణం, నీరు, భూ పరిరక్షణ కోసం చర్యలు తీసుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. జీవవైవిధ్య పరిరక్షణ దిశగా సంరక్షణ, పరిశోధన, అధ్యయన రంగాలకు ఉపయుక్తంగా ఈ జీవవైవిధ్య సదస్సు ఉపయోగపడుతుందని ఆకాంక్షించారు. విద్యార్థులు, యువ శాస్త్రవేత్తలు జీవ వైవిధ్యం కోసం ప్రత్యేకంగా కృషి చేయాలని కోరారు. తెలంగాణ ఎన్నో విధాలైన సహజమైన ప్రాంతాలకు నెలవనీ, పర్యావరణ సమతుల్యతను సంరక్షించడం కోసం సమిష్టి కృషి జరగాల్సి అవసరముందని చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా మానవ తప్పిదం వల్ల కొన్ని జాతుల మొక్కలు, జంతువులు అంతరించిపోయే దశలో ఉన్నాయనీ, వాటి సంరక్షణ కోసం మానవులుగా మనమే బాధ్యత తీసుకోవాల్సిన ఆవశ్యకతను నొక్కి చెప్పారు. ఒక జాతి అంతరిస్తే దానిలోని జన్యుసంపద అంతరించి నట్టేననీ, జీవ వైవిధ్యపు నిజమైన విలువంతా జన్యువుల్లో నిక్షిప్తమై ఉంటుందని వ్యాఖ్యానించారు. మన దేశంలో రాష్ట్ర ప్రభుత్వాలు, చాలా సంస్థలు జీవ వైవిధ్య సంరక్షణలోనూ దాన్ని ప్రతిభావంతంగా వినియోగించడంలోనూ నిమగ్నమై ఉన్నాయని స్పష్టం చేశారు.

దేవాలయాల విశిష్టతపై 'మన మన్యంకొండ' వీడియో
ఆవిష్కరించిన మంత్రి సురేఖ

- దర్శకుడు శ్రీధర్‌కు మంత్రి అభినందన

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్



మహబూబ్ నగర్ జిల్లాలోని మన్యంకొండ లక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయ విశిష్టత గురించి ప్రత్యేకంగా రూపకల్పన చేసిన వీడియోను రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ఆవిష్కరించారు. గద్దర్ అవార్డుల కమిటీ సభ్యులు, ఉత్తమ దర్శకులు, నంది అవార్డు గ్రహీత అల్లాణి శ్రీధర్ రచన దర్శకత్వంలో, ఫిల్మ్ మీడియా ప్రొడక్షన్స్ పతాకంపై సాయి తేజ 'మన మన్యంకొండ' వీడియోను నిర్మించారు. దీన్ని గురువారం హైదరాబాద్‌లోని సచివాలయంలోని తన పేషీలో మంత్రి విడుదల చేశారు. తెలంగాణలో ఎన్నెన్నో అద్భుత ఆలయాలున్నాయనీ, వాటి వైభవోపేతమైన చరిత్రను, స్థల పురాణాన్ని, ప్రజల విశ్వాసాలను అందరికీ చేరేలాగా ప్రచారం జరగాలని అందుకు ప్రభుత్వం సహకరిస్తుందని మంత్రి సురేఖ చెప్పారు. సమాజం ఉత్తమ విలువలతో ముందుకు సాగాలంటే, ధార్మిక చింతన కలిగించే ఇటువంటి చిత్రాలు మరిన్ని రావాల్సిన అవసరముందని ఆకాంక్షించారు. ఆలయాల అభివృద్ధికి తమ ప్రభుత్వం సహకరిస్తున్నదని చెప్పారు. దేవాలయాలపై ఎంతో శ్రమకోర్చి వీడియో తీసిన శ్రీధర్‌ను మంత్రి ప్రత్యేకంగా అభినందించారు. శాలువా కప్పి సన్మానించారు.

ఆస్పత్రిలో చేరిన సోనియా గాంధీ

- ఉదర సంబంధిత కారణాలతో..

న్యూఢిల్లీ : కాంగ్రెస్ అగ్రనేత, రాజ్యసభ సభ్యురాలు సోనియా గాంధీ ఆస్పత్రిలో చేరారు. ఉదర సంబంధిత కారణాలతో ఢిల్లీలోని సర్ గంగారామ్ ఆస్పత్రిలో ఆమె అడ్మిట్ అయ్యారు. ప్రస్తుతం సోనియా గాంధీ ఆరోగ్యం బాగానే ఉన్నట్టు , రెగ్యులర్ చెకప్‌లో భాగంగానే ఆమె ఆస్పత్రిలో చేరినట్టు సమాచారం. శుక్రవారం ఉదయం సోనియాను డిశ్చార్జి చేయనున్నట్టు తెలుస్తోంది.



కుల గణనలో అందరు పాల్గొనాలి : రాపోలు

నవతెలంగాణ-ఎల్బీనగర్

కుల గణనలో అందరు పాల్గొనాలని బీసీ కమిషన్ సభ్యులు రాపోలు జయప్రకాశ్ అన్నారు. ఈ మేరకు గురువారం సరూర్ నగర్ డివిజన్, డాక్టర్స్ కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో తిరిగి కుల గణనలో ప్రతి ఒక్కరు పాల్గొనాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వివిఎన్ శ్రీనివాస్, వన్నాడి శ్రీనివాస్, ధనరాజ్ గౌడ్, శుశీల, శంకర్ యాదవ్, సంగీత, కిషోర్, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ ఏర్పాటుకు స్థల పరిశీలన



నవతెలంగాణ-అబ్దుల్లాపూర్ మెట్

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టనున్న ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ ఏర్పాటుకు అబ్దుల్లాపూర్‌మెట్ మండలం, మజీద్‌పూర్ గ్రామ రెవెన్యూ సర్వే నెం.224, పసుమాముల గ్రామ రెవెన్యూ సర్వే నెం.422లోని ప్రభుత్వ భూమిని తెలంగాణ రాష్ట్ర ప్లాషిప్ ప్రాజెక్టు కమిషనర్ శశాంక ఐఏఎస్, ఇబ్రహీంపట్నం ఆర్డీఓ అనంతరెడ్డి, స్థానిక తహసీల్దార్ సుదర్శన్ రెడ్డిలతో కలిసి గురువారం పరిశీలించారు. ఈ పరిశీలనలో మండల రెవెన్యూ సర్వేయర్ జ్యోతి, రెవెన్యూ సిబ్బంది, స్థానిక గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

జీవిత బీమా సంస్థలో

వెంటనే ఉద్యోగాల భర్తీ చేపట్టాలి



- ఆలిండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయిస్ అసోసియేషన్ నాయకుల డిమాండ్

నవతెలంగాణ -ఎల్బీనగర్

భారతీయ బీమా సంస్థలో క్లాస్ త్రీ, క్లాస్ ఫోర్ ఉద్యోగాల నియమాకాలు చేపట్టాలని ఆలిండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయిస్ అసోసియేషన్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ నాయకులు మాట్లాడుతూ గురువారం ఇన్సూరెన్స్ ఎంప్లాయిస్ కోపరేటివ్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శనలు, నినాదాలు చేస్తూ ఒక గంట సమ్మెలో ఉద్యోగులందరూ పాల్గొని విజయవంతం చేసినట్టు పేర్కొన్నారు. ఆలిండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయిస్ యూనియన్ సంఘం సభ్యుల దిల్ సుఖ్ నగర్ శాఖ ఉద్యోగులతో కలిసి జీవిత బీమా సంస్థలో వెంటనే క్లాస్ త్రీ మరియు క్లాస్ ఫోర్ ఉద్యోగ నియమాకాలు చేపట్టాలని డిమాండ్ చేసినట్టు పేర్కొన్నారు. జీవిత బీమా సంస్థల్లో అతిపెద్ద సంఘముగా ఆల్ ఇండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయిస్ అసోసియేషన్ సంఘానికి గుర్తింపును ఇవ్వాలని అన్నారు. అలాగే 2017 తర్వాత 15 వేలకు పైగా క్లాసు త్రీ, క్లాస్ ఫోర్ ఉద్యోగులు పదవీ విరమణ పొందడం జరిగిందని తెలిపారు. ఉన్న ఉద్యోగులపై పని భారము పెరగడం జరుగుతుందని, అయినా గట్టి పోటీని తట్టుకొని సంస్థను అభివృద్ధి బాటలో నడిపిస్తున్నామని అన్నారు. ప్రతి సంవత్సరం వ్యాపార ప్రగతిని సాధిస్తూ వస్తున్నామని తెలిపారు. ఉద్యోగుల సమస్యలు మరియు ప్రయోజనాలు సాధించుకోవాలంటే జీవిత బీమా సంస్థలోని అతిపెద్ద సంఘముగా ఆల్ ఇండియా ఇన్సూరెన్స్ భారతీయ బీమా సంస్థను గుర్తింపు ఇవ్వాలని కోరారు. ఈ రెండు డిమాండ్లను అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీ బి మోర్ ప్రెసిడెంట్ వి. శ్యామల నాయుడు, బి. రువర్ధన్, విజయ విహారి, సుమ, ప్రెసిడెంట్ పద్మావతి, జనరల్ సెక్రటరీ వి. సోమ్లా నాయక్, బి. సుమ, ఏఎస్ అనురాధ, కే. విద్యావతి, డి మురళీకృష్ణ, బి. లీల, జి.సునీత, కేవీఎల్ కామేశ్వరి, రామ అవతార్, శివ పార్వతి, ఆర్.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అక్రమ ఇసుకపై ప్రత్యేక నిఘా



సీపీ సుధీర్ బాబు

నవతెలంగాణ-హయత్‌నగర్

అక్రమ ఇసుకపై ప్రత్యేక నిఘా పెట్టినట్టు రాచకొండ పోలీస్ కమిషనర్ డాక్టర్ సుధీర్ బాబు తెలిపారు. ఎల్బీనగర్‌లోని సీపీ క్యాంప్ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన అనేక సంక్షేమ కార్యక్రమాల్లో భాగంగా ప్రభుత్వ పథకాలకు ఇసుకను ఉచితంగా పంపిణీ చేయడానికి శ్రీకారం చుట్టిందన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల్లో ప్రధానమైనటువంటి ఇందిరమ్మ ఇల్లు, వివిధ ప్రభుత్వ నిర్మాణాలకు సంబంధించినటువంటి పథకాలకు ఆయా ప్రాంతాల్లో ఉన్నటువంటి ఇసుకను ఉచితంగా అందించాలని ప్రభుత్వం నిర్ణయం చేశారని, అట్టి ఇసుకను అక్రమంగా తరలిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కొంతమంది అక్రమంగా ఇసుకను రవాణా చేస్తున్న విషయం రాచకొండ పోలీసులకు పెద్ద ఎత్తున ఫిర్యాదులు వస్తున్నాయని, సుదీర్ఘంగా ఫిర్యాదులపై పూర్తిస్థాయిలో విచారణ చేపడుతామని పేర్కొన్నారు. ఇసుక అక్రమ రవాణా అడ్డుకునే అంశంపై తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఇచ్చినటువంటి సూచన ప్రకారం రాచకొండ కమిషనర్ జోన్‌లో విస్తృతంగా ఇసుక అక్రమ రవాణా పై కేసులు అయితే అన్యాయంగా జైలు పాలు అవుతారని వెల్లడించారు. రాచకొండ కమిషనరేట్ పరిధిలో దాదాపు 300 పైగా ఇసుక అక్రమ రవాణా కేసులు నమోదు చేయడం జరిగిందని, ఇసుక రీచ్‌ల నుండే ఇసుక అక్రమ రవాణా కాకుండా ప్రభుత్వం ఇప్పటికే చర్యలు చేపట్టిందని తెలిపారు.రాచకొండ కమిషనరేట్‌లో ఎక్కడైనా సరే ఇసుకను అక్రమంగా డంపు చేస్తే కచ్చితంగా సీజ్ చేసి, అక్రమ ఇసుక రవాణా దారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కోటీ 5 లక్షల విలువ గల గంజాయి పట్టివేత



రాచకొండ పోలీస్ కమిషనర్ డాక్టర్ సుధీర్ బాబు

నవతెలంగాణ- హయత్‌నగర్

రూ.కోటీ 5 లక్షల విలువ గల గంజాయిని పట్టుకున్నట్టు రాచకొండ పోలీస్ కమిషనర్ డాక్టర్ సుధీర్ బాబు తెలిపారు. ఈ మేరకు గురువారం ఎల్బీనగర్‌లో ఉన్న సీపీ క్యాంప్ కార్యాలయంలో నిందితుల వివరాలను కమిషనర్ మీడియాకు వెల్లడించారు. మహారాష్ట్ర, పూణేకు చెందిన అహ్మద్ గులాబ్ షేక్ డ్రైవర్.. ఇతను గంజాయిని విశాఖపట్నం నుండి హైదరాబాద్ మీదుగా మహారాష్ట్రకు రెండుసార్లు గంజాయిని తరలించాడు. ఒక్కసారికి మహారాష్ట్రకు గంజాయి తరలిస్తే మూడు లక్షలు నగదు తీసుకుంటాడు. ఇలా రెండుసార్లు భారీగా గంజాయిని మహారాష్ట్రకు తరలించినట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. వైజాగ్‌కు చెందిన బుజ్జిబాబు గంజాయిని సేకరించి.. పూణే మహారాష్ట్రలో ఉన్న వైభవ్, దేవాలకు డ్రైవర్ గులాబ్ అహ్మద్ గులాబ్ షేక్ ద్వారా సరఫరా చేసేవాడు. విశ్వసనీయ సమాచారం అందుకున్న పోలీసులు గురువారం రామోజీ ఫిలిం సిటీ వద్ద వాహనాల తనిఖీలు చేశారు. ఈ క్రమంలో అనుమానం వచ్చిన ఓ కంటైనర్‌ను తనిఖీ చేశారు. ఈ కంటైనర్‌లో స్క్రాప్ తో పాటు గంజాయిని తరలిస్తున్నారు. కంటైనర్‌లో దాదాపు 300 కేజీల గంజాయి, ఒక టాటా కంటైనర్, మొబైల్ స్వాధీనం చేసుకున్నట్లు కమిషన్ తెలిపారు. మొత్తం వాటి విలువ ఒక కోటీ 5 లక్షలు ఉంటుందని వెల్లడించారు. ఈ సమావేశంలో మహేశ్వరం జోన్ అడిషనల్ డీసీపీ షాకీర్ హుస్సేన్, అబ్దుల్లాపూర్‌మెట్ ఇన్‌స్పెక్టర్ అంజిరెడ్డి, ఎస్ఓటీ ఇన్‌స్పెక్టర్ రవికుమార్, ఎస్ఓటీ ఎస్ఐ రాజు తదితరులు పాల్గొన్నారు.

కుల మతాలకు అతీతంగా

ఉర్సు ఉత్సవాలు జరుపుకోవడం హర్షనీయం



- ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

నవతెలంగాణ-బడంగ్‌పేట్

కుల, మతాలకు అతీతంగా ప్రజలందరూ పహాడి షరీఫ్‌లోని బాబా షర్ఫుద్దీన్ దర్గా ఉర్సు ఉత్సవాలను జరుపుకోవడం హర్షనీయమని మాజీ మంత్రి, మహేశ్వరం నియోజకవర్గం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి అన్నారు. గురువారం మహేశ్వరం నియోజకవర్గం జల్ పల్లి మున్సిపల్ పరిధిలో ఉన్న పహాడి షరీఫ్‌లోని బాబా షర్ఫుద్దీన్ 759వ ఉర్సును పురస్కరించుకొని ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి చాదర్‌ను సమర్పించారు. ఈ కార్యక్రమంలో జల్ పల్లి మున్సిపల్ బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ యంజాల జనార్దన్, సీనియర్ నాయకులు షేక్ అఫ్జల్, నాయకులు బదర్ హుస్సేని, నగేష్, సాయిద్ పటేల్, మాఖదుమ్ పటేల్, యూత్ అధ్యక్షులు యంజాల అర్జున్, అజీమ్, ముతావల్లీలు మొయినుద్దీన్, ఇర్ఫాన్ పాల్గొన్నారు.

చంపాపేట్ డివిజన్‌లోని తెలంగాణ రాష్ట్ర ప్రదేశ్ కాంగ్రెస్ సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షులు మిద్దెల జితేందర్ జన్మదినం సందర్భంగా చంపాపేట్ డివిజన్ సీనియర్ కాంగ్రెస్ నాయకుడు గోపాల్ ముదిరాజ్, రాష్ట్ర సేవాదళ్ కార్యదర్శి మెట్టు వెంకటరెడ్డి తదితరులు శుభాకాంక్షలు తెలియజేశారు.

నవతెలంగాణ - చంపాపేట్





ఆర్కేపురం డివిజన్ పరిధిలోని ప్రత్యంగిరా దేవాలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాలకు యువజన కాంగ్రెస్ నేత ప్రజా సేవకులు చిలుక ఉపేందర్ రెడ్డి హాజరయ్యారు. తర్వాత ఆయన ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో దేవాలయ కార్యదర్శి మునిపల్లె శ్రీనివాస్, కాలనీ సంక్షేమ సంఘం కార్యదర్శి రామారావు, ఆర్యవైశ్య సంఘం రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు వెంకటేష్ గుప్తా, పెద్దపూర సైదులు, శ్యాం, వేణు మాధవ్, సతీష్, విప్లవ తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ -దిల్‌సుఖ్‌నగర్



తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రత్యేక అధికారి పి. శ్రీనివాస్ రెడ్డిని గురువారం టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, మాజీ మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి, మాజీ కార్పొరేటర్ పెద్దబావి సుదర్శన్ రెడ్డిలు మర్యాదపూర్వకంగా కలసి పూల బొకేను అందజేసి, ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపారు.

నవతెలంగాణ-బడంగ్‌పేట్

50 శాతం రిజర్వేషన్ కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తాం : ధనుంజయ నాయుడు



నవతెలంగాణ -నాగోల్

స్థానిక సంస్థల్లో 50 శాతం రిజర్వేషన్ కోసం ప్రభుత్వంపై ఒత్తిడి చేస్తామని బీసీ హక్కుల సాధన సమితి తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధూళిపాళ ధనుంజయ నాయుడు అన్నారు. నాగోల్‌లోని ఎస్‌ఏ డాంగే భవన్‌లో బీసీ హక్కుల సాధన సమితి ముఖ్యులతో కలిసి గురువారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన జన గణనలో కులగణన చేపట్టి పూర్తి చేయడానికి రెండవ ప్రక్రియ ప్రారంభించిన రాష్ట్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలియజేశారు. ఇంతకుముందు జరిగిన సర్వేలో పాల్గొనని వారు ఇప్పుడు ప్రభుత్వం చేపట్టిన కులగణనలో పాల్గొని తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని సూచించారు. బీసీల జనాభాను తక్కువ చేసి చూపించినట్టుగా వస్తున్న ఆరోపణలకు ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. మార్చి 10వ తేదీన అఖిలపక్ష నాయకులతో పాటు అన్ని బీసీ సంఘాలతో కూడిన బృందాన్ని ఢిల్లీకి తీసుకెళ్లాలని ముఖ్యమంత్రి నిర్ణయాన్ని ఆయన స్వాగతించారు. అనంతరం బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర సహాయ కార్యదర్శి బొడ్డుపల్లి కృష్ణ మాట్లాడుతూ రాష్ట్రంలో ఈనెల 28వ తేదీ వరకు జరుగుతున్న కుల గణనలో బీసీ హక్కుల సాధన సమితి సభ్యులు ప్రత్యేక సర్వేలో నమోదు చేసుకునే విధంగా చర్యలు తీసుకోనున్నామని, బీసీ సామాజిక వర్గాల కుల గణన రిపోర్టు ఆధారంగా మార్చి నెలలో బీసీ మేధావులతో పాటు అన్ని పార్టీల రాష్ట్ర నాయకులు సమావేశం ఏర్పాటు చేయాలని ఇటీవల జరిగిన బీసీ హక్కులసాధన సమితి సమావేశంలో నిర్వహించినట్లు ఆయన తెలిపారు. ఈ సమావేశంలో బీసీ హక్కుల సాధన సమితి నాయకుడు బాతరాజు నరసింహ, రూపాని లింగస్వామి, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

మహిళల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

- మహిళ కాంగ్రెస్ నాయకురాలు లక్ష్మిరెడ్డి

నవతెలంగాణ-బడంగ్ పేట్

మహిళల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని మహిళ కాంగ్రెస్ నాయకురాలు లక్ష్మిరెడ్డి అన్నారు. గాంధీభవన్‌లో గురువారం జరిగిన రంగారెడ్డి జిల్లా మహిళా నాయకుల సమావేశంలో ఆమె మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో పేద ప్రజల కోసం ప్రవేశ పెట్టిన పథకాలు అర్హులకు అందేలా కాంగ్రెస్ పార్టీ మహిళా నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. తెలంగాణ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయడం కోసం కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ మహిళ కాంగ్రెస్ అధ్యక్షురాలు జ్యోతి భీమ్ భరత్, జల్‌పల్లి మున్సిపాలిటీ మహిళ అధ్యక్షురాలు నసీమ్ సుల్తానా, నాయకులు నసీమ్ బేగం, రహ్మత్ బేగం, అస్మాబేగం, నసీమ్ మినహజ్, తదితరులు పాల్గొన్నారు.



మంత్రిని కలిసిన చేనేత నాయకులు



నవతెలంగాణ -హయత్‌నగర్

చేనేత కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వ్యవసాయ చేనేత జోళీ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును ఆయన నివాసంలో చేనేత నాయకులు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. తర్వాత సమస్యలపై వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్మిక సంఘం గౌరవ అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు మాట్లాడుతూ.. పెరిగిన ధరలకు అనుగుణంగా చేనేత కార్మికులకు కనీస వేతనాలు పెంచాలని అన్నారు. త్రిఫ్ట్ పథకంలో కార్మికుల వేతనాలపై 8శాతం జామ చేయాలన్నారు. చేనేత కార్మికుల రుణాలను రద్దు చేయాలని, చేనేత సహకార సంఘాలలో మగ్గం నేస్తున్న కార్మికులను సభ్యులుగా చేర్చుకోవాలని కోరారు. చేనేత కార్మికుల ఉపాధి సంక్షేమం కోసం హ్యాండ్లూమ్ వెల్ఫేర్ బోర్డ్ ఏర్పాటు చేసి, దానికి బడ్జెట్ కేటాయించాలని వినతిపత్రంలో పేర్కొన్నట్లు తెలిపారు. ఆయన వెంట చేనేత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వనం శాంతి కుమార్, సలహాదారుడు కూరపాటి రమేష్, ప్రధాన కార్యదర్శి గంజి మురళీధర్, కార్యదర్శి ముషం నరహరి, రాష్ట్ర కమిటీ సభ్యులు గుండు వెంకట నర్సు, గుర్రం నరసింహులు తదితరులు ఉన్నారు.

'సిరిపురం యాదయ్య అమరుడు'



నవతెలంగాణ-ఎల్బీనగర్

తెలంగాణ అమరుడు సిరిపురం యాదయ్య అని మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ సీనియర్ నాయకులు దేప భాస్కర్ రెడ్డి అన్నారు. తెలంగాణ మలిదశ ఉద్యమంలో ప్రత్యేక రాష్ట్ర కోసం అమరుడైన తెలంగాణ ఉద్యమ కెరటం సిరిపురం యాదయ్య 15 వర్ధంతి సందర్భంగా సరూర్‌నగర్ డివిజన్ పరిధిలోని కొత్తపేట్ చౌరస్తాలో ఉన్న ఆయన విగ్రహానికి గురువారం పూలమాలల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, టీపీసీసీ సభ్యులు దేప భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ఉద్యమంలో యువకిషోరం సిరిపురం యాదయ్య త్యాగం మరువలేనిదన్నారు. సమస్త తెలంగాణ ప్రజలందరీ మనస్సులను యాదయ్య మరణం కదిలించిందన్నారు. ఉస్మానియా యూనిర్సిటీ ఎన్‌సీసీ గేట్‌కు యాదయ్య పేరు పెట్టాలని పలువురు వ్యక్తులు డిమాండ్ చేశారు. నివాళులర్పించిన వారిలో సరూర్ నగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శంకర్ యాదవ్, రాష్ట్ర యువజన కాంగ్రెస్ పార్టీ నాయకులు చిలుక ఉపేందర్ రెడ్డి, యువజన కాంగ్రెస్ పార్టీ నాయకులు నల్లెంకి ధనరాజ్ గౌడ్, సరూర్ నగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు చిక్కుళ్ళ శివ ప్రసాద్, గడ్డి అన్నారం మార్కెట్ కమిటీ డైరెక్టర్ బండి మధుసూదన్ రావు, గట్ల రవీంద్ర, తలాటి రమేష్ నేత, రాష్ట్ర ఎస్సీ సెల్ కన్వీనర్ నందిగామ నరసింహ, సరూర్ నగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రెటరీ ఇమ్రాన్ అలీ, పెద్దపూర సైదులు, నయీం, జంగా రెడ్డి, శివ, కల్యాణ్ యాదవ్, అల్లేటి కిరణ్ నభీ, కిషోర్, రంజిత్, పాండు, సరూర్ నగర్ డివిజన్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు యూనుస్, షఫీ, సలీం, డివిజన్ మహిళా అధ్యక్షురాలు అరుణ, శైలజ, సంగీత, రవళి, సుశీల తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ పదాన్ని ఉపయోగించుకుని కేసీఆర్ కుటుంబం పదేళ్లు దోపిడీ చేసింది : మధుయాష్కీ గౌడ్



ఎంతోమంది అమరుల త్యాగాలతో తెలంగాణ ఏర్పడగా..పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో అమరవీరుల కుటుంబాలను అన్యాయం జరిగిందని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మెన్, మాజీ ఎంపీ మధుయాష్కీ గౌడ్ ఆవేదన వ్యక్తం చేశారు.మలిదశ తెలంగాణ ఉద్యమంలో ఆత్మబలిదానంతో అమరుడైన సిరిపురం యాదయ్య వర్ధంతిని పురస్కరించుకొని కొత్తపేట చౌరస్తాలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి మధుయాష్కీ గౌడ్ హాజరై యాదయ్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మధుయాష్కీ గౌడ్ మాట్లాడుతూ తెలంగాణ పదాన్ని ఉపయోగించుకొని కేసీఆర్ కుటుంబం రాజకీయంగా ఎదిగిందే తప్పా, అమరవీరుల కుటుంబాలకు చేసింది ఏమీ లేదన్నారు. తెలంగాణలో సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత తెలంగాణ కోసం ఉద్యమించిన గద్దర్, పాశం యాదగిరి, జయరాజ్ తదితర ఎంతోమంది ఉద్యమకారులను గుర్తించి ప్రభుత్వ స్థలం, ఆర్థిక సహాయం అందించిందన్నారు. మిగతా వారికి కూడా దశల వారీగా సహకారం అందించేందుకు ముందుకు వెళ్తున్నామన్నారు. 2009లో తెలంగాణ ఏర్పాటు ప్రకటన వెలువడిన అనంతరం ఆంధ్ర ప్రాంత నాయకులు అడ్డు పడడంతో ఏర్పడిన గందరగోళం నేపథ్యంలో తెలంగాణ ఏర్పాటు ఆలస్యం అవుతుందన్న ఆవేదన విద్యార్థి, యువకుల్లో బలంగా ఏర్పడిందన్నారు. ఈ క్రమంలోనే సిరిపురం యాదయ్య లాంటి వారు ఆత్మబలి దానాలకు పాల్పడ్డారన్నారు. కానీ పార్లమెంట్ సభ్యుడిగా తాను, మిగతా ఎంపీలు కూడా సోనియా గాంధీకి తెలంగాణ ఆవశ్యకతను, తెలంగాణలో జరుగుతున్న ఆత్మబలిదానాలను వివరించి, తెలంగాణ ఏర్పాటు చేయాలని బలంగా వాదన వినిపించామన్నారు. ఈ క్రమంలో తల్లిగా తన బిడ్డలను కాపాడుకోవాలన్న సదుద్దేశంతో, ప్రజల ఆకాంక్షలను గుర్తించి సోనియా గాంధీ తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పాటు చేశారని మధుయాష్కీ వివరించారు. ఉద్యమకారులను, అమరవీరుల కుటుంబాలకు న్యాయం జరిగే విధంగా తమ కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని, ఈ విషయంలో తను చొరవ తీసుకుంటానని పేర్కొన్నారు. వచ్చింది కేవలం తెలంగాణ మాత్రమేనని సంపూర్ణ సామాజిక తెలంగాణ కోసం ప్రభుత్వం పని చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ప్రచార కమిటీ కో కన్వీనర్ వజీర్ ప్రకాష్ గౌడ్, కాంగ్రెస్ నేత బేర బాలకిషన్, కార్యక్రమ నిర్వాహకులు సిల్వర్ వెంకటేష్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షులు లింగాల కిషోర్ గౌడ్, శ్రీపాల్ రెడ్డి, వేణుగోపాల్ యాదవ్, కుట్ల నర్సింహ యాదవ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు పాశం అశోక్ గౌడ్, బుడ్డా సత్యనారాయణ, నాయకులు దేరంగుల కృష్ణ, దాము మహేందర్ యాదవ్, సామ మహేశ్వర్ రెడ్డి, గోపిరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, విజయ భాస్కర్ రెడ్డి, దుర్గా రెడ్డి, అంతటి శ్రీనివాస్ గౌడ్, పట్టపర్ల సాయికుమార్ గౌడ్, తోకటి కిరణ్ పాల్గొన్నారు.

ఆపూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



నవతెలంగాణ - చంపాపేట్

ఎల్బీనగర్ నియోజకవర్గం చంపాపేట్ డివిజన్ కర్మన్‌ఘాట్ పరిధిలోని ఉదయ్ నగర్ కమిటీ హాల్లో 1981 -1987లో ఒకట తరగతి నుండి ఏడో తరగతి వరకు చదివిన పూర్వవిద్యార్థులు గురువారం ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ కార్యక్రమంలో టి. శాంతమ్మ జి. మంజుల, జి. రేణుక, జి. జ్యోతి, డి.రేణుక, పి. మాధవి, ఎల్. రాజేశ్వరి, డి. కృష్ణవేణి, ఎస్. సాయిలీల, డి. సాయిలీల, వి. జయమ్మ, గురువులు డి. శారద-రాజవర్ధన్ రెడ్డి, నరసింహ్మాచారి, జగదీశ్వరాచారి, నంబి కృష్ణయ్య, దేవారెడ్డి రంగారెడ్డి, షఫియుద్దీన్, కె. జగదీశ్ బాబు, పి. రామస్వామి, జి. రాజవర్ధన్ రెడ్డి, ఎం. రామకృష్ణ, ఎస్. భాస్కర్ రెడ్డి, వి. గణాచారి, కె. రామన్ గౌడ్, టి. వెంకటేష్, జి. బ్రహ్మ చారి, అశోక్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సేవాలాల్ జయంతి వేడుకలు

నవతెలంగాణ-చంపాపేట్

హైదరాబాద్ జిల్లా యాకుత్ పురా నియోజకవర్గం సంతోష్ నగర్, ఐఎస్ సదన్ డివిజన్ పరిధిలోని వినయ్ నగర్ కమ్యూనిటీ హాల్లో గురువారం సంత్ సేవాలాల్ మహారాజ్ 286 జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. భారత్ గోర్ బంజారా సేవా సమితి రాష్ట్ర చైర్మెన్ డాక్టర్ జగన్ నాయక్ విస్లావత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలకు ముఖ్య అతిథులుగా యాకుత్‌పురా ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మిరాజ్, హైదరాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మెన్ కోట్ల శ్రీనివాస్, హైదరాబాద్ జిల్లా సివిల్ సప్లై అధికారిని డి. దీప్తి, మలక్‌పేట్, యాకుత్ పురా అసిస్టెంట్ సివిల్ సప్లై అధికారులు సురేందర్, ఏ. నర్సింగ్ రాజ్, యాకుత్ పురా నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ యూత్ అధ్యక్షులు కోట్ల లడ్డు, ఎల్ఐసి డెవలప్మెంట్ అధికారి రామావత్ థావుర్య నాయక్ హాజరయ్యారు. తర్వాత సేవాలాల్ మహారాజ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో డి. రామకోటి నాయక్, జె. దాసు నాయక్, గేమ్యా నాయక్, వి. పాండు నాయక్, వి. జవహర్ లాల్ నాయక్, యాదయ్య గుప్త, కే. శ్రీనివాస్, ఎస్.వినోద్, గోపాల్, వి. పరమేష్, కిరణ్ కుమార్, ఈశ్వర్, మహేశ్వర్, బాబు, శివ, గురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.



మీదేల జితేందర్‌కు శుభాకాంక్షలు తెలిపిన యాటవెల్లి హన్మంత్ రెడ్డి



నవతెలంగాణ- మేడ్చల్

తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ సేవాదళ్ అధ్యక్షులు మీదేల జితేందర్ జన్మదినం సందర్భంగా జిల్లా సేవాదళ్ ప్రధాన కార్యదర్శి యాటవెల్లి హన్మంత్‌రెడ్డి వారి కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారికి శాలువా కప్పి సన్మానించి కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కలిసిన వారిలో జిల్లా సేవాదళ్ అధ్యక్షులు షఫీద్దీన్, సేవాదళ్ జిల్లా నాయకులు ఉన్నారు.

రావల్‌కోల్ కేంద్రంగా మున్సిపాలిటీని ఏర్పాటు చేయాలి

మాజీ వైస్ ఎంపీపీ గోపని వెంకటేష్

నవతెలంగాణ- మేడ్చల్

రావల్ కోల్ గ్రామ కేంద్రంగా నూతన మున్సిపాలిటీని ఏర్పాటు చేయాలని మాజీ వైస్ ఎంపీపీ గోపని వెంకటేష్ అన్నారు.ఈ మేరకు ఇటీవల కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో వినతి పత్రం అందజేసినట్లు పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నుండి మేడ్చల్ జిల్లాలో నూతన మున్సిపాలిటీలు ఏర్పాటు చేస్తామంటూ వస్తున్న వార్తల నేపథ్యంలో రావల్ కోల్ గ్రామం కేంద్రంగా చుట్టుప్రక్కల ఉన్న గిరిజన తండాలు, గ్రామాలను కలుపుకొని మున్సిపాలిటీని ఏర్పాటు చేయాలని కోరినట్టు తెలిపారు. రావల్ కోల్ గ్రామంలో విస్తారంగా ప్రభుత్వ భూముల వల్ల భవనాలు కట్టుకోవడానికి వీలుంటుందని తెలిపారు. జనాభా పరంగా చూసినా, రెవెన్యూపరంగా చూసినా రావల్ కోల్ గ్రామం పెద్దాదని తెలియజేశారు.

రూ. 2 లక్షల ఎల్‌వోసీ చెక్కు అందజేత



నవతెలంగాణ-కాప్రా

మీర్‌పేట్ హెచ్‌బీ కాలనీకి చెందిన ఓ.షణ్ముక్ అనారోగ్యానికి గురికావడంతో ఆయనకు సైనిక్‌పూరిలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి రూ.2లక్షల ఎల్‌వోసీ లెటర్ అందజేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ జెర్రిపోతుల ప్రభుదాస్, నాయకులు పి.ప్రభాకర్ రెడ్డి, కిషోర్, మహేష్ గౌడ్, నిరంజన్ చారి, దండెం నరేందర్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌లో మహేంద్ర హిల్స్ గరుకుల విద్యార్థినీల ప్రతిభ



నవతెలంగాణ-ఘట్కేసర్

ఉస్మానియా యూనివర్సిటీ సింథటిక్ ట్రాక్‌లో ఫిబ్రవరి 18, 19 తేదీలలో జరిగిన 11వ తెలంగాణ రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ యూత్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో సాంఘిక సంక్షేమ గురుకుల డిగ్రీ కళాశాల, మహేంద్ర హిల్స్ అథ్లెటిక్స్ క్రీడా అకాడమీ బాలికలు అత్యుత్తమ ప్రతిభ కనబర్చి పతకాలను సాధించారు. ఈ పోటీల్లో నరాల బుచ్చమ్మ (ఉమెన్ విభాగం) షాట్‌పుట్ బంగారు పతకం, డిస్కస్ త్రో బంగారు పతకం, కే. రేవతి (ఉమెన్ విభాగం) షాట్‌పుట్ కాంస్య పతకం, డిస్కస్ త్రో కాంస్య పతకం, పి. అనూష (అండర్-20 విభాగం) హైజంప్ రజత పతకం, డి. సత్య (ఉమెన్ విభాగం)లాంగ్ జంప్ రజత పతకం సాధించినట్టు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ స్నేహలత గురువారం తెలిపారు. ఈ సందర్భంగా పతకాలు సాధించిన వారికి మెడల్స్ వేసి సర్టిఫికెట్లను అందజేశారు. అనంతరం ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. విద్యార్థినులు క్రీడల్లో అద్భుత ప్రదర్శన చూపి రాష్ట్రస్థాయిలో ప్రతిభను చాటుకున్నారని, వారి విజయానికి శిక్షకులు, క్రీడాకారిణులు చేసిన కృషిని అభినందిస్తున్నామని తెలిపారు. ఈ విజయాలు కళాశాల క్రీడా విభాగానికి గర్వకారణమని, విద్యార్థినుల పట్టుదల, కృషికి శ్రమ తోడైందని తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ స్వరూప, కళాశాల ఉపాధ్యాయ బృందం, అథ్లెటిక్స్ కోచ్ భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

గోవింద్ నాయక్ లేనిలోటు తీర్చలేనిది



నవతెలంగాణ-కాప్రా

ఏఎస్‌రావునగర్ భవానీనగర్ కాలనీకి చెందిన కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ సెంట్రల్ ఇన్సుట్యూట్ ఆఫ్ ప్లాస్టిక్ ఇంజనీరింగ్ టెక్నాలజీ(సిపెట్) ఉద్యోగి గోవింద్ నాయక్ లేనిలోటు తీర్చలేనిదని గోవింద్ మిత్రమండలి సభ్యులు అన్నారు. నాలుగు రోజుల క్రితం గోవింద్ నాయక్ మృతి చెందడంతో కాప్రా సర్కిల్ కుషాయిగూడ అన్నపూర్ణ ఎస్టేట్‌లో గోవింద్ మిత్రమండలి ఆధ్వర్యంలో గరువారం సంతాప సభనిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా మాజీ కార్పొరేటర్లు కొత్త రామారావు, పజ్జూరి పావనీరెడ్డి, బీఆర్‌ఎస్ నాయకుడు సింగిరెడ్డి సోమశేఖర్‌రెడ్డిలు హాజరై గోవింద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన సేవలను గుర్తు చేసుకున్నారు. సిపెట్ ఉద్యోగిగా నిబద్ధతతో పని చేస్తూ ఎంతో మంది విద్యార్థులకు ఉద్యోగాలు కల్పించారని కొనియాడారు. కార్యక్రమంలో అన్నపూర్ణ ఎస్టేట్ రాంమోహన్ రావు, వాసిరెడ్డి శివప్రసాద్, కొత్తపల్లి రాంబాబు, బదార్ల సాంబశివరావు, ఉప్పలపాటి రఘు, శ్రీనివాసరావు (శేషు), సిహెచ్ నాగభూషణం(భోస్), ఎస్‌ఆర్ శ్రీనివాస్, సిపెట్ సంస్థ ఉద్యోగులు, భవానీనగర్ కాలనీవాసులు తదితరులు నివాళ్లు అర్పించారు.

పడమటి సోమారం, మక్త అనంతారం గ్రామాల్లో ఓటింగ్‌పై అవగాహన



నవతెలంగాణ - పోచారం

అనురాగ్ యూనివర్సిటీకి చెందిన ఎన్‌ఎస్‌ఎస్ (యూనిట్-2 యూనిట్ -3 కలిసి సమ్మర్ క్యాంప్‌ను నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా భువనగిరి జిల్లాలోని పడమటి సోమారం, మక్త అనంతారం గ్రామాలను దత్తత తీసుకుని అక్కడ వివిధ సామాజిక సేవా కార్యక్రమాలను చేపడుతున్నారు. బుధవారం సమ్మర్ క్యాంప్‌లో భాగంగా పడమటి సోమారం గ్రామంలో ఓటింగ్‌పై అవగాహన కల్పించేందుకు విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. గ్రామంలోని అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించి పిల్లలతో ముచ్చటించారు. గ్రామంలో మురికి కాలువలో ఉన్న చెత్తను తొలగించారు. అంతకుముందు ర్యాలీని గ్రామ పంచాయతీ కార్యాలయం నుంచి ప్రారంభమై శివాలయం వరకు నిర్వహించారు. 'ఓటు హక్కు మన హక్కు', 'జీవితాన్ని మార్చే ఓటు' అంటూ నినాదాలు చేశారు. ప్రజలకు ఓటు హక్కు ప్రాముఖ్యత, ప్రజాస్వామ్యంలో ఓటింగ్ గురించి వివరించారు. ఈ కార్యక్రమం అనురాగ్ యూనివర్సిటీ డీన్ విజయ్ కుమార్, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ డాక్టర్ సీ. మల్లేశ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ పురుషోత్తం, చిన్న శ్రీనివాస్, విభాగ కోఆర్డినేటర్స్ కోటేశ్వరరావు, నరేష్, ఎన్‌ఎస్‌ఎస్ ట్రైనీ విద్యా సాగర్, ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్లు పాల్గొని విద్యార్థులకు మార్గదర్శనం అందించారు. ఎన్‌ఎస్‌ఎస్ కార్యక్రమాన్ని అనురాగ్ యూనివర్సిటీ అధికారులు, గ్రామ పెద్దలు, సర్పంచ్ తదితరులు ప్రశంసించారు. సమ్మర్ క్యాంప్‌లో భాగంగా పడమటి సోమారం, మక్తా అనంతారం గ్రామాల్లో మరిన్ని సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

ముగిసిన ఎస్‌ఎఫ్‌ఐ మేడ్చల్ జిల్లా 7వ మహాసభ



నవతెలంగాణ-కాప్రా

ఎస్ఎఫ్ఐ మేడ్చల్ జిల్లా 7వ మహాసభ గురువారం ఘనంగా ముగిసింది. ఈ మహాసభలో 21 మందితో ఎస్ఎఫ్ఐ మేడ్చల్ జిల్లా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా అవినాష్, జిల్లా కార్యదర్శిగా కార్తీక్ బాధ్యతలు స్వీకరించారు. ఈ మహాసభలో విద్యార్థుల సమస్యలపై జిల్లా అధ్యక్షుడు అవినాష్, కార్యదర్శి కార్తిక్ మాట్లాడారు. మేడ్చల్ జిల్లాలో విద్యా రంగంలో అనేక సమస్యలు ఉన్నాయని, వాటి పరిష్కారానికి ఎస్ఎఫ్ఐ నిరంతరం పోరాడుతుందని పేర్కొన్నారు. ప్రతి నియోజకవర్గంలో ఒక ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ఏర్పాటు కావాలని డిమాండ్ చేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రభుత్వ డిగ్రీ కాలేజీల కొరత వల్ల అనేక మంది విద్యార్థులు ప్రయివేట్ కాలేజీలకు వెళ్లాల్సి వస్తోందని, అధిక ఫీజులు చెల్లించలేని పేద విద్యార్థులు ఉన్నత విద్యకు దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సామాజిక సంక్షేమ హాస్టళ్లలో సమస్యలు తీవ్రంగా ఉన్నాయని, భోజన నాణ్యత లోపించడం, మంచినీటి కొరత, సౌకర్యాల లేమి వంటి సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. హాస్టళ్లను మెరుగుపరిచేలా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ పాఠశాలలు, కాలేజీల్లో ఉపాధ్యాయుల కొరత ఉన్నదని, దీని వల్ల విద్యా ప్రమాణాలు తగ్గిపోతున్నాయని విమర్శించారు. వెంటనే ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఫీజుల నియంత్రణపై ప్రభుత్వ విధానం స్పష్టంగా ఉండాలన్నారు. ప్రయివేట్ విద్యా సంస్థలు అన్యాయంగా ఫీజులు పెంచి విద్యార్థులను దోచుకుంటున్న పరిస్థితిని అరికట్టాలని కోరారు. రవాణా సమస్యల గురించి మాట్లాడుతూ.. మెట్రో సిటీ అయిన మేడ్చల్ జిల్లాలో పలు ప్రాంతాల్లో సరైన బస్సు సదుపాయం లేకపోవడం వల్ల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ప్రత్యేక విద్యార్థి బస్సులను అందుబాటులోకి తేవాలని డిమాండ్ చేశారు. మేడ్చల్ జిల్లా ఎస్ఎఫ్ఐ కమిటీ జాయింట్ సెక్రటరీలు: శ్యామ్ రావు, సుబ్బు ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా భగత్, పవిత్ర, అరుణ్, మనోజ్‌లను ఎన్నుకున్నారు. జిల్లా కమిటీ సభ్యులుగా శివ, మాధ్యూ, సాయిచరణ్, శ్రీమాన్, నందేశ్వర్, వాసు, ప్రణయ్, మనీష్, మహేశ్వర ఎన్నికయ్యారు. ఎన్నికైన కమిటీ విద్యార్థుల సమస్యలపై నిరంతరం పోరాడాలని సంకల్పం వ్యక్తం చేసింది. మేడ్చల్ జిల్లాలో ఉచిత, నాణ్యమైన విద్య, సమాన అవకాశాలు, మెరుగైన హాస్టల్ సౌకర్యాల కోసం ఎస్ఎఫ్ఐ శక్తివంతమైన పోరాటం చేస్తుందని అని జిల్లా నాయకులు స్పష్టం చేశారు.

వేర్వేరు సంఘటనల్లో ఇద్దరు వ్యక్తులు అదృశ్యం

నవతెలంగాణ - జవహర్‌నగర్

వేర్వేరు సంఘటనల్లో ఇద్దరు వ్యక్తులు అదృశ్యమైన సంఘటన జవహర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం...

స్నేహితుడిని కలిసి వస్తానని..



ఆకుల రూత్తమ్మ, భర్త ఇబ్రాత్, బాలాజీ నగర్‌లోని బజరంగ్ నగర్ కాలనీలో నివాసముంటున్నారు. ఆమె కొడుకు సమల్ రాజు(14) జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాడు. జనవరి 18వ తేదీ ఉదయం 10:30 గంటలకు తన స్నేహితుడు అభిషేక్ ఇంటికి వెళ్తున్నానని వెళ్లాడని తెలిపారు. అతని వద్ద రూ.7వేల ఉన్నాయని తెలిపారు. సాయంత్రం వరకు ఇంటికి తిరిగి రాకపోవడంతో చుట్టూ పక్కల వెతికినా ఆచూకీ లభించకపోవడంతో గురువారం పోలీస్ స్టేషన్‌లో రూత్తమ్మ ఫిర్యాదు చేశారు. సమల్ రాజ్ ఇంతకుముందు రెండుసార్లు ఇంటి నుండి వెళ్ళిపోయి రెండు రోజుల తరువాత తిరిగి వచ్చాడని, ఈ సారి 28 రోజులు గడిచినప్పటికీ తిరిగి రాలేదన్నారు. సమల్ రాజ్ స్నేహితులు రాజు, ఇమ్రాన్, అభిషేక్, పురుష, పవన్, గోవింద్‌లపై అనుమానం ఉందని ఫిర్యాదులో పేర్కొన్నారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

మెదడు స్ట్రోక్‌తో బాధపడుతున్న వ్యక్తి అదృశ్యం



బొమ్మిడాల జయ లక్ష్మి భర్త భాస్కర్ (50), శ్రీ రామ్ నగర్ కాలనీలో నివాసముంటున్నారు. భాస్కర్ మెదడు స్ట్రోక్‌తో బాధపడుతూ ఇంట్లోనే ఉంటున్నాడు. గురువారం మధ్యాహ్నం సుమారు 12 గంటలకు ఇంటికి సమీపంలో ఉన్న మ్యాచింగ్ సెంటర్‌కు షాపుకి వెళుతున్నాని వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. ఫోన్ చేసినా లేపడం లేదు. చుట్టూ పక్కల వెతికినా ఆచూకీ లభించకపోవడంతో గురువారం జయలక్ష్మి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

కొండా సురేఖను కలిసిన భీమిడి జైపాల్ రెడ్డి



నవతెలంగాణ -శామీర్‌పేట

రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖను మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లా రీజినల్ ట్రాన్స్‌ఫోర్ట్ అథారిటీ (ఆర్‌టీఏ) మెంబర్, తూంకుంట మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు భీమిడి జైపాల్ రెడ్డి, దేవరయాంజాల్ శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానం ఛైర్మెన్ పేండం లక్ష్మీనారాయణ (నాని), ధర్మకర్తలు వలందాస్ మురళి గౌడ్, తూంకుంట జగదీశ్ గౌడ్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు వజ్జల శశాంత్(బన్నీ), యూత్ కాంగ్రెస్ నాయకులు వెంకటేశ్ ,భరత్ తదితరులు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. దేవరయాంజాల్ శ్రీ సీతారామ స్వామి దేవస్థానం నూతన కమిటీ ఏర్పాటుకు సహకరించినందుకు మంత్రిని కమిటీ ఛైర్మెన్ శాలువాతో సత్కరించి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా దేవరయాంజాల్ శ్రీసీతా రామ స్వామి దేవాలయానికి ఈఓను నియమించాలని మంత్రికి వినతి పత్రం అందజేశామని, మంత్రి సానుకూలంగా స్పందించారని తెలిపారు.

కార్మికుల సమస్యను పరిష్కరించాలి



- ఆటో యూనియర్ రాష్ట్ర అధ్యక్షులు కలమడుగు రాజేందర్‌ను కలిసిన యూనియన్ సభ్యులు

నవతెలంగాణ-సిటీబ్యూరో

కార్మికుల సమస్యలను పరిష్కరించాలంటూ జీహెచ్ ఎంసీ పరిధిలోని కూకట్‌పల్లి సర్కిల్ తెలంగాణ స్వచ్ఛ ఆటో టిప్పర్, రిక్షా కార్మికుల యూనియన్ సభ్యులు లిబర్టీ సర్కిల్‌లోని యూనియన్ ఆఫీసులో రాష్ట్ర అధ్యక్షులు కలమడుగు రాజేందర్‌ను కలిశారు. వారు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ సందర్భంగా రాజేందర్ మాట్లాడుతూ కార్మికుల సమస్యలను తీర్చేందుకు తనవంతు కృషిచేస్తానన్నారు. కార్మికుల ఆటో టిప్పర్లకు జీహెచ్ఎంసీ చెల్లించాల్సిన రోడ్ టాక్స్, పెండింగ్ చలాన్‌లను ఆర్టీఏ అధికారులు కార్మికులపై రుద్దుతున్నారని, చలాన్లు చెల్లించకపోతే స్వచ్ఛ ఆటోటిప్పర్లను సీజ్ చేస్తామని ఆర్టీఏ అధికారులు బెదిరిస్తున్నారని తెలిపారు. భారీ చలాన్లు రాసి కార్మికుల ను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని తెలిపారు. ఎప్పటి నుండో కార్మికులకు సంబంధించి పెండింగ్ లో ఉన్న అన్ని సమస్యలను పరిష్కరించుకొనుటకై అతిత్వ రలోనే నగర మేయర్, కమిషనర్‌లను కలిసి సమస్యలను పరిష్కరించుకుందామని వారికి తెలిపారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ అధ్యక్షులు కాట్రావత్ గోపాల్ నాయక్, రాష్ట్ర ప్రధానకార్యదర్శి హంసరాజు, జీహెచ్ ఎంసీ వర్కింగ్ ప్రెసిడెంట్ అర్జున్, జనరల్ సెక్రెటరీ శేఖర్, కూకట్పల్లి జోనల్ ఇన్చార్జ్ అంజి, సీనియర్ నాయకులు సుంకన్న, జై భీమ్ శేఖర్‌సూరి, జీహెచ్ఎంసీ ఆర్గనైజింగ్ సెక్రటరీ రేణుకుమార్‌తోపాటు ఇతర నాయకులు కార్మికులు పాల్గొన్నారు.

చెరువులో పడి యువకుడు మృతి



నవతెలంగాణ-కీసర

చెరువులో పడి యువకుడు మృతి చెందిన ఘటన కీసర పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, విశాఖపట్నంకు చెందిన ఓబ్బిలినేని సూర్యదేవ్ (26) ప్రయివేటు ఉద్యోగం చేస్తున్నాడు. బుధవారం తన పుట్టినరోజు సందర్భంగా హైదరాబాద్‌లోని గచ్చిబౌలిలో తన చిన్ననాటి స్నేహితులను కలిసేందుకు వచ్చాడు. స్నేహితులతో కలిసి బుధవారం కీసర మండలం యాదగిరిపల్లి చెరువు వద్దకు వచ్చి పుట్టినరోజు వేడుకలు జరుపుకున్నారు. సూర్యదేవ్ ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతి చెందాడు. మద్యం మత్తులో చెరువులో పడి ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. కేసు నమోదు చేసుకుని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఆనందరావు నగర్ మౌలిక వసతుల కల్పనకు చర్యలు



నవతెలంగాణ -అల్వాల్

అల్వాల్ డివిజన్ పరిధిలోని ఆనందరావు నగర్ కాలనీలో తక్షణమే మౌలిక వసతులు కల్పిస్తామని కార్పొరేటర్ శాంతి శ్రీనివాస్ అన్నారు. గురువారం అధికారులతో కలిసి కాలనీవాసుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. డ్రయినేజీ సమస్య తీవ్రంగా ఉందని కాలనీవాసులు ఫిర్యాదు చేశారు. దీంతో అధికారులు సమస్యను త్వరలో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం చినరాయుని చెరువులో అంటమాలజిస్ట్ ఏఈ అనిల్ కుమార్‌తో కలిసి మస్కిటో లార్వా సైడ్ ఆయిల్ బాల్స్‌ను వేశారు. పరిసర ప్రాంతాలను దోమల నుండి విముక్తి కలిగించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో అధికారులు డీఈ ప్రశాంతి, ఏఈ వరుణ్, జలమండలి మేనేజర్ కృష్ణమాచారి, శేఖర్, రాజు, రామారావు కాలనీ ప్రెసిడెంట్ డాక్టర్ హరిబాబు, వాసు శ్రీశైలం, శర్మ ,అంజేష్, ఆనంద్, ప్రకాష్, రేవతి, స్థానిక నాయకులు యాదగిరి గౌడ్, ప్రేమ్ కుమార్ అరుణ్, సాజిద్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ నిధిని సద్వినియోగం చేసుకోవాలి

- ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి



నవతెలంగాణ నేరేడ్‌మెట్

ముఖ్యమంత్రి సహాయ నిధిని అనారోగ్యంతో బాధపడుతున్న ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి అన్నారు. గౌతమ్ నగర్ డివిజన్ పరిధిలోని యాదవ నగర్‌కు చెందిన పి.రవితేజకు మంజూరైన రూ.1లక్ష ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కును గురువారం బోయిన్ పల్లిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి గౌతమ్ నగర్ డివిజన్ కార్పొరేటర్ మేకల సునీత రాము యాదవ్‌తో కలిసి లబ్దిదారుడు రవితేజకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జగదీష్ గౌడ్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు మేకల రాము యాదవ్, జేకే సాయి గౌడ్, రెబ్బ వాసు, తదితరులు పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా

- నగర పోలీస్‌కమిషనరేట్ నిర్వహించిన స్పెషల్ డ్రైవ్‌లో26 కేసులు నమోదు

నవతెలంగాణ-సిటీబ్యూరో

హైదరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఇసుక అక్రమ రావాణాపై ప్రత్యేక నిఘా వేశారు. ఈ క్రమంలో ఈ నెల 14 నుంచి 19 వరకు ఏర్పాటు చేసిన స్పెషల్ డ్రైవ్‌లో 26కేసులను నమోదు చేసిన పోలీసులు 8 వాహనాలను సీజ్ చేశారు. 57మందిని అరెస్టు చేయడంతోపాటు అక్రమంగా తరలిస్తున్న 1196 టన్నుల ఇసుకను స్వాధీనం చేసుకున్నారు. అనధికారికంగా ఇసుక రావాణ చేసినా, అక్రమంగా తవ్వకాలు చేసినా చట్టపరంగా చర్యలు తీసుకుంటామని గురువారం హైదరాబాద్ సీపీ సీవీ ఆనంద్ హెచ్చరించారు. ఎక్కడైనా అనుమానాస్పద కార్యక్రమాల కు పాల్పడినట్టు తెలిస్తే సమీపంలోని పోలీస్‌స్టేషన్‌లో గానీ, పోలీసులకు ఫిర్యాదు చేయాలని నగరపౌరులకు సీపీ సూచించారు.

ఉద్యమకారులకు పెన్షన్, ఇంటి స్థలం ఇవ్వాలి



- ఉద్యమకారుల ఫోరం అధ్యక్షులు సుధాకర్‌చారి
- మ్యాఫెస్టోలోని హామీలను అమలు చేయాలని పోస్ట్‌కార్డుల ఉద్యమానికి శ్రీకారం

నవతెలంగాణ - జవహర్ నగర్

కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ ప్రకారం ఉద్యమకారులకు పెన్షన్, ఇంటి స్థలాన్ని కేటాయించాలని జవహర్ నగర్ ఉద్యమకారుల ఫోరం అధ్యక్షులు పిన్నోజు సుధాకర్ చారి డిమాండ్ చేశారు. గురువారం జవహర్ నగర్‌లో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు చీమ శ్రీనివాస్ ఆదేశాల మేరకు తెలంగాణ పోరాటంలో పాల్గొన్న ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలాన్ని కేటాయించి, రూ.25వేల పింఛన్, హెల్త్ కార్డులు త్వరగా అందించాలని పోస్ట్‌కార్డు ఉద్యమానికి శ్రీకారం చుట్టారు. బాలాజీ నగర్ చౌరస్తాలోని అంబేద్కర్, జగ్జీవన్ రావు విగ్రహాలకు పూలమాల వేసి యాప్రాల్ పోస్ట్ ఆఫీస్ వరకు బైక్ ర్యాలీగా వెళ్లి పోస్ట్ కార్డులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి పంపించారు. అనంతరం వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యమకారులను పట్టించుకోవడం లేదని వాపోయారు. గత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని కోరారు. లేనిపక్షంలో మరో ఉద్యమం చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆనందాస్ ప్రకాష్, కుటిగంటి వెంకటేష్, కుమ్మరి నరసింహ, సోమ సత్యనారాయణ, పాము భాస్కర్, మొగిలి పాక పరశు రాం, బీర్రు ఎల్లస్వామి, మూల సోమయ్య, తాండ్ర జలంధర్, కొంపల్లి వెంకట నర్సయ్య, నర్సింహ యాదవ్, పోలాస సాయి కుమార్, క్రిష్ణ యాదవ్, మహిళా అధ్యక్షురాలు అబ్బగాని పుష్ప, మేడబోయిన లక్ష్మి, పెద్ద సంఖ్యలో ఉద్యమకారులు, తదితరులు పాల్గొన్నారు.



శ్రీ చైతన్య స్కూల్ ఎదుట నాయకుల ఆందోళనలు

- అఖిల కుటుంబ సభ్యులకు న్యాయం చేసేవరకు కదిలిది లేదని యజమాన్యానికి హెచ్చరిక



నవతెలంగాణ-మేడ్చల్

మేడ్చల్ పట్టణంలోని శ్రీ చైతన్య స్కూల్‌లో పదవ తరగతి విద్యార్థిని అఖిలను ఫీజు చెల్లించే విషయంలో ప్రిన్సిపాల్ ఒత్తిడి చేయడంతో ఈ నెల 11న ఆత్మహత్యకు యత్నించి చికిత్స పొందుతూ మృతి చెందిన విషయం తెలిసిందే. కాగా అప్పటినుంచి స్కూల్ ప్రాంగణంలో ఎస్ఎఫ్ఐ, బీజేవైఎం, బీఆర్ఎస్వీ, బీజేపీ నేతలు అఖిల కుటుంబ సభ్యులకు న్యాయం చేయాలని, విద్యాశాఖ అధికారులు స్పందించి స్కూల్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆందోళనలు చేపడుతున్నారు. కాగా స్కూల్ యజమాన్యం ఇచ్చిన హామీ మేరకు గురువారం బీజేపీ, బీఆర్ఎస్వీ నాయకులు అఖిల కుటుంబ సభ్యులతో కలిసి స్కూల్ వద్దకు చేరుకొని న్యాయం చేయాలని కోరారు. స్కూల్ యజమాన్యం మళ్లీ సోమవారం ఈ విషయంపై మాట్లాడదామని నాయకులకు చెప్పే ప్రయత్నం చేసింది. దీంతో ఆగ్రహించిన నాయకులు అఖిల కుటుంబ సభ్యులకు వెంటనే న్యాయం చేయాలని స్కూల్ ఎదుట బైటాయించి నిరసన తెలిపారు. సమాచారం అందుకున్న సీఐ అద్దాని సత్యనారాయణ, ఎస్సై మన్మద్ సిబ్బందితో కలిసి ఘటన స్థలానికి చేరుకొని స్కూల్ ప్రాంగణంలో ఆందోళనలు చేస్తే విద్యార్థుల చదువుకు ఆటంకం, వాహనదారులకు ఇబ్బంది కలుగుతుందని నాయకులకు సర్దిచెప్పి పంపించారు. కార్యక్రమంలో బీజేపీ మున్సిపల్ అధ్యక్షులు శైలజహరినాథ్, రాగం అర్జున్, మున్సిపల్ బీఆర్ఎస్వీ అధ్యక్షుడు శ్రీనాథ్ ముదిరాజ్, బీజేవైఎం అధ్యక్షులు వంశీ, కృష్ణప్రియ నాయకులు వంశీధర్ రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.



కుత్బుల్లాపూర్ నియోజకవర్గం డిస్ట్రిక్ట్ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ మెంబర్‌గా రవీందర్ నియమితులైన సందర్భంగా గురువారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్ రెడ్డిని కలిసి టీజీఓ 2025 డైరీ అందజేశారు. అనంతరం హన్మంతన్న మేడ్చల్ జిల్లా కలెక్టర్ నుంచి ప్రొసీడింగ్స్ ఆర్డర్ తీసుకున్న రవీందర్‌కి శాల్వాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు సిద్దనోళ్ల సంజీవ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-దుండిగల్



కుత్బుల్లాపూర్ అసెంబ్లీ నియోజకవర్గం కాంగ్రెస్ కమిటీ లేబర్ సెల్ (టీపీసీసీ) అధ్యక్షులుగా కావాలి గోపాల్ ముదిరాజ్ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ కమిటీ లేబర్ సెల్ (టీపీసీసీ) జనరల్ సెక్రటరీగా కర్కల ఉపేందర్ రెడ్డి నియమితులైన సందర్బంగా.. కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్ రెడ్డిని కలిశారు. అనంతరం హనుమంతు రెడ్డి వారిని ఘనంగా శాల్వాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో కొంపల్లి మున్సిపాలిటీ అధ్యక్షులు బైరి ప్రశాంత్ గౌడ్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు సిద్దనోళ్ల సంజీవ రెడ్డి, సుదర్శన్ రెడ్డి, గోపాల్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-దుండిగల్

మెడికల్ కళాశాల కోసం స్థలాన్ని మంజూరు చేయాలి

- సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ఈ.ఉమామహేష్
- జిల్లా కలెక్టర్ గౌతమ్‌కు సీపీఐ నేతల వినతి

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

కుత్బుల్లాపూర్ మండలానికి మంజూరైన ప్రభుత్వ మెడికల్ కాలేజీ ఏర్పాటు చేయాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ఈ.ఉమామహేష్ కోరారు. ఈ మేరకు గురువారం గాజులరామారం సమీపంలోని హెచ్ఎంటి ఖాళీ మైదానంలో కళాశాల కోసం మంజూరైన స్థలాన్ని మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతం పాత్రు సంబంధిత అధికారులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా సీపీఐ నాయకులు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. చర్లపల్లి రాములు, బాబు కలిసిన వారిలో ఉన్నారు.

సేవలు విస్తృతం చేస్తాం



- లయన్స్ క్లబ్ ఆఫ్ జీడిమెట్ల అధ్యక్షులు లయన్ పివి.రాజం

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

నిరుపేదలకు చేయూతనందించే దిశగా లయన్స్ క్లబ్ ఆఫ్ జీడిమెట్ల ఆధ్వర్యంలో సేవలు విస్తృతం చేస్తామని అధ్యక్షులు లయన్ పివి.రాజం అన్నారు. లయన్స్ క్లబ్ ఆఫ్ జీడిమెట్ల వారి సహకారంతో ఇటీవలే రంగారెడ్డి నగర్ డివిజన్ గాంధీనగర్‌లోని కమ్యూనిటీ హాలులో కంటి వైద్య శిబిరం నిర్వహించారు. అందులో అర్హులైన 60 మందికి గురువారం స్వామి వివేకానంద యూత్ అసోసియేషన్ సభ్యులతో కలిసి ఆయన ఉచితంగా కంటి అద్దాలు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పేద ప్రజలలో మనోధైర్యం నింపేందుకు దాతలు, స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రతినిధులు గుప్త,స్వామి వివేకానంద యువజన సంఘం అధ్యక్షులు జల్దా లక్ష్మీనాథ్,సభ్యులు శ్రీనివాస్, తిమ్మయ్య, నవీన్, రాజిరెడ్డి పాల్గొన్నారు.

నూతన కమిటీ కాలనీ అభివృద్ధికి కృషి



నవతెలంగాణ-కూకట్‌పల్లి

నూతన కమిటీ కాలని అభివృద్ధికి కృషి చేయాలని కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ అన్నారు. ఆల్విన్ కాలనీ డివిజన్, శంషిగుడా పరిధిలోని ఇంద్రహిల్స్‌లో, జరిగిన కాలనీ అసోసియేషన్ ఎన్నికల్లో, ప్రెసిడెంట్‌గా గెలుపొందిన వెంకట్ నాయక్, డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్‌ని, యువనేత దొడ్ల రామకృష్ణ గౌడ్‌ను కలిశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ నూతనంగా ఎన్నికైన అధ్యక్షునికి శుభాకాంక్షలు తెలిపారు. అసోసియేషన్ కమిటీని ఏర్పాటుచేసుకుని, కార్యవర్గ సభ్యులందరు సమిష్టిగా కలిసి పనిచేస్తూ.. కాలనీ అభివృద్ధికి కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పోశెట్టిగౌడ్, మహిపాల్ గౌడ్, జి.రామారావు, నరసింహులు, కాంతారావు, బి.చందు, సతీష్, రంజిత్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్‌పై వామపక్షాల నిరసన



- సీపీఐ (ఎం) కుత్బుల్లాపూర్ మండల కార్యదర్శి కీలుకాని లక్ష్మణ్, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి ఉమా మహేష్

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

కేంద్ర బీజేపీ ప్రవేశ పెట్టిన బడ్జెట్‌ను నిరసిస్తూ సీపీఐ, సీపీఐ(ఎం), మాస్లైన్ పార్టీల ఆధ్వర్యంలో షాపూర్ రైతు బజార్ దగ్గర నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు మాట్లాడుతూ... భారీ పెట్టుబడులు, మౌలిక సదుపాయాల విస్తరణ లక్ష్యాలుగా ఉన్న బడ్జెట్‌తో సామాజిక సేవలు, పేదలు, నిరుద్యోగ యువత, రైతాంగం, వ్యవసాయ కూలీలకు ఒరిగేదేమీ లేదన్నారు. ప్రజలకు వినియోగ సామర్థ్యం, కంపెనీలకు పెట్టుబడి సామర్థ్యం పెరిగే ప్రణాళికలు రచించబడతాయని ఆశించారు. 2016లో నోట్ల రద్దు తర్వాత ఈ రెండు అంశాలూ నానాటికీ బలహీన పడుతున్నయన్నారు. ఒక్క మాటలో చెప్పాలంటే ప్రజలను ఓటు బ్యాంకుగా పరిగణించి, ఓట్లు రాల్చు కోవడానికి బడ్జెట్‌ను ఉపయోగించుకునేల కనిపిస్తోంది. జీఎస్టీ పేరుతోటి కేంద్రం చిన్న పరిశ్రమలను దివాలా తీయించి, చిన్న పరిశ్రమల ఊసే లేకుండా చేసే ప్రయత్నం జరుగుతుంది. దేశంలో 200 మంది శతకోటేశ్వరులపై నాలుగు శాతం సంపద పన్ను ప్రవేశపెట్టి కార్పోరేట్ పన్నులు పెంచాలని వ్యవసాయ ఉత్పత్తులకు కనీసం మద్దతు ధర హామీ కల్పించాలన్నారు. గ్రామీణ ఉపాధి హామీ పథకానికి 50 శాతం కేటాయింపులు పెంచాలని ఆరోగ్య, విద్యారంగాలకు జిడిపిలో మూడు శాతం చొప్పున కేటాయించాలన్నారు. స్కీం వర్కర్ల గౌరవ వేతనంలో కేంద్ర వాటాను పెంచాలని వామపక్ష నాయకులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) మండల కమిటీ సభ్యులు ఈ.దేవదానం, పి.అంజయ్య, డి.కరుణాకర్, కే.శీను, ఆర్.స్వాతి, సీపీఐ మండల నాయకులు కే.స్వామి, సీపీఐ ఎంఎల్ మాస్ లైన్ రాష్ట్ర నాయకులు వి.ప్రవీణ్, జి.వెంకన్న కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మోడీ విధానాలు దుర్మార్గమైనవి



- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

ఆదానీ కోసం దేశాన్ని అమెరికాకు తాకట్టు పెడుతున్న మోడీ చర్యలు దుర్మార్గమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు అన్నారు.

భారతదేశాన్ని లూటీ చేస్తున్న ఆదానీపై అమెరికాలో నమోదైన అవినీతి, లంచం కేసులో తప్పించడానికే మోడీ ఇటీవల అమెరికా దేశ అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌తో సమావేశమయ్యాడని కూనంనేని సాంబశివరావు తెలిపారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కౌన్సిల్ సమావేశం గురువారం షాపూర్ నగర్ ఏఐటీయూసీ పొట్లూరి నాగేశ్వరావు భవన్‌లో జిల్లా సహాయ కార్యదర్శి ఉమా మహేష్ అధ్యక్షతన వహించారు. ఈ సమావేశానికి కూనంనేని సాంబాశివారావు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మోడీ అమెరికా వెళ్లి ట్రంపును కౌగిలించుకోవడం ధృతరాష్ట్ర కౌగిలిగా మారిందన్నారు. కేవలం తన పదవి కోసం అనేక ప్రజావ్యతిరేక విధానాలను అవలంబిస్తున్నారని, దీనిని కమ్యూనిస్టులు ప్రతిఘటిస్తారని అన్నారు. అంతేకాకుండా రాష్ట్రంలో కేసీఆర్ కమ్యూనిస్టుల గురించి నిన్న మాట్లాడడం సిగ్గు చేటని విమర్శించారు. ఫామ్ హౌస్‌లో ఉండి ప్రజాస్వామ్యంపై చిత్తశుద్ధి లేని కేసీఆర్ తన రాజకీయాల గురించి మాట్లాడుకోవాలి గానీ, కమ్యూనిస్టుల గురించి మాట్లాడే హక్కు లేదన్నారు. సీపీఐ ఏర్పడి వంద సంవత్సరాలు అయిన సందర్భంగా రాష్ట్రం యొక్క అన్ని జిల్లాలలో, మండలాలలో, గ్రామాలలో పార్టీని పునర్నిర్మాణం కోసం మహాసభ నిర్వహిస్తున్నామని తెలిపారు. రానున్న రోజుల్లో ఖమ్మంలో ఐదు లక్షల మందితో అతిపెద్ద బహిరంగ సభను నిర్వహిస్తామని తెలియజేశారు. పరికిచెరువు పరిరక్షణ కొరకు చేసిన ఉద్యమం వల్ల హైడ్రాధికారులు చెరువును పరిరక్షించడం జరిగిందన్నారు. రానున్న రోజుల్లో బస్ డిపో ఏర్పాటు కొరకు, గురుకుల పాఠశాలల కొరకు ఉద్యమిస్తామన్నారు. ఈ సందర్భంగా సీపీఐ పార్టీ పతాకాన్ని కార్యాలయం ఎదురుగా ఆవిష్కరించడం జరిగింది. సమావేశానికి ముందు ప్రజా ఉద్యమాలలో అమరులైన వారికి సంతాపాన్ని తెలియజేశారు. ఈ సమావేశంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వివిఎస్. బోస్, ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు యూసూఫ్, జిల్లా కార్యదర్శి సాయిలు గౌడ్, ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు యేసు రత్నం, జిల్లా సహాయ కార్యదర్శులు జీ.దామోదర్ రెడ్డి, కార్యవర్గ సభ్యులు హరినాథ్ రావు, స్వామి, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించాలి



నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

కూకట్ పల్లి నియోజకవర్గంలో ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించాలని కూకట్‌పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్‌చార్జి బండి రమేష్, కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్‌ను కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ కార్యాలయంలో కలిశారు. పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకవచ్చారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలు, వాటి పరిష్కారం కోసం తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జాతీయ రహదారితో పాటు స్థానిక రహదారుల పైన ప్రతిరోజు ఉదయం సాయంత్రం ఏర్పడే రద్దీ, ట్రాఫిక్ సమస్యలు, మురికి నీటిపారుదల పరిసర ప్రాంతాలు చెరువులు, కుంటల్లో దోమలు విపరీతంగా వ్యాపిస్తున్నాయని వాటి కట్టడికి తీసుకోవాలని చర్యలను వెంటనే చేపట్టాలని కోరారు. గత ప్రభుత్వం హయాంలో సర్దార్ పటేల్ నగర్ హస్మత్ పేటలో ఏర్పాటు చేసిన మోడల్ రైతు బజార్లు నేటికీ కూడా బీఆర్ఎస్ నాయకుల కబంధహస్తాల్లో ఇరుక్కుపోయాయని వాటిని విడిపించాలని సూచించారు. కేపీహెచ్‌బీలో కట్టాల్సిన వంద పడకల ఆస్పత్రి, మూసాపేట వై జంక్షన్‌లో నిర్మించాల్సిన ఫ్లైఓవర్ బ్రిడ్జి, రహదారుల విస్తరణ వీధి దీపాల ఏర్పాటు త్రాగునీరు సమస్యల గురించి చర్చించారు. మలేషియా టౌన్షిప్‌లోని సీనియర్ సిటిజన్స్‌ను పక్కనే గల పార్కులో వాకింగ్‌కు సైతం అనుమతించడం లేదన్న టౌన్షిప్ అసోసియేషన్ సభ్యుల ఫిర్యాదుపై జోనల్ కమిషనర్ స్పందించారు. సమస్య పరిష్కారం కోసం హామీ ఇచ్చారు.

జేఎన్‌టీయూ ప్రొ.కిషన్ కుమార్ రెడ్డికి శుభాకాంక్షలు



నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

జేఎన్టీయూ హెచ్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్గా బాధ్యతలు చేపట్టిన ప్రొ.టి.కిషన్ కుమార్ రెడ్డిని గురువారం జేఎన్‌టీయూహెచ్ జేఏసీ నేతలు ఆయన చాంబర్లో కలిసి శాలువాతో సన్మానించి పూల కుండీ అందించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా జేఎన్‌టీయూహెచ్ జేఏసీ చైర్మెన్ బొట్ల బిక్షపతి విద్యార్థుల యొక్క పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకవచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ యూనివర్సిటీ క్యాంపస్ ప్రాంగణంలో వైఫై అభివృద్ధి, అన్ని డిపార్ట్‌మెంట్‌లో మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. యూనివర్సిటీ అన్ని అనుబంధ కళాశాలల్లో శాశ్వత ఆచార్యులకు టీచింగ్ వర్క్‌లోడ్ కేటాయించేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. పరిశోధన ప్రాజెక్టులను చేపట్టాలని ప్రత్యేక శ్రద్ధ తీసుకొని పరిశోధన విద్యార్థుల భవిష్యత్తు తీర్చిదిద్ది వారి సేవలను వినియోగించుకోవాలని తెలిపారు. యూనివర్సిటీలో పేపర్లెస్ టెక్నాలజీ అభివృద్ధి, స్పోర్ట్స్, కల్చరల్, ఎన్.ఎస్.ఎస్, ఎన్.సి.సిలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. వైస్ ఛాన్సలర్ సానుకూలంగా స్పందించి విద్యార్థులు తరచూ యూనివర్సిటీలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యల్ని ఎప్పటికప్పుడు తమ దృష్టికి తేవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సలహాదారులు డా.రాజేష్ ఖన్నా, చైర్మెన్ డాక్టర్ బొట్ల బిక్షపతి, రాష్ట్ర అధ్యక్షులు బల్గర్ సందీప్, వర్కింగ్ ప్రెసిడెంట్ దాస్యం విక్రాంత్, జనరల్ సెక్రటరీ కె.దిలీప్, ఉపాధ్యక్షులు సంజయ్ పి.సుకుమార్ రెడ్డి, టి.తేజ, సోషల్ మీడియా ఇన్‌చార్జీ సెక్రటరీలు ఆర్.యూనివర్సిటీ అధ్యక్షులు ఆదిమల్ల పవన్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

సెయింట్ ఆంథొనీ ఇన్సిట్యూషన్స్ సిల్వర్ జూబ్లీ వేడుకలు



నవతెలంగాణ-దుండిగల్

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం సుచిత్ర, కొంపల్లి లోని సెయింట్ ఆంథొనీస్ గ్రూప్ ఆఫ్ ఎడ్యుకేషనల్ ఇన్సిట్యూషన్స్ సిల్వర్ జూబ్లీ వేడుకలని కొంపల్లిలోని జీబీఆర్ కల్చరల్ క్లబ్లో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకి ముఖ్య అతిథిగా తెలంగాణ ఉన్నత విద్యమండలి చైర్మెన్ డా.వి.బాల కిష్టా రెడ్డి, లోకసత్తా పార్టీ వ్యవస్థపకులు జయప్రకాశ్ నారాయణ, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్‌లతో కలిసి హాజరై జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ నేటి బాలలే రేపటి పౌరులని, బాల్యం నుంచే విలువలతో కూడిన విద్యను అందించాలని తెలిపారు. విద్యార్థులకు భవిష్యత్ తరాలకు ఉపయోగపడేలా విజ్ఞాన సంపుటి అందించాలన్నారు.

కరోనా తర్వాత విద్య రంగ విధానంలో చాలా మార్పులు వొచ్చాయని, వాటికి అనుగుణంగా విద్యార్థులకి నాణ్యమైన విద్య అందించాలని తెలిపారు. అనంతరం లోక్ సత్తా పార్టీ వ్యవస్థాపకులు, ఐఏఎస్ మాజీ ఎమ్మెల్యే జయ ప్రకాశ్ నారాయణ మాట్లాడుతూ సమగ్ర విద్య యొక్క ప్రాముఖ్యతపై ప్రేరణాత్మకమైన ప్రసంగం చేశారు. సెయింట్ ఆంథొనీస్ సంస్థ యొక్క కృషిని అభినందించారు. అనంతరం ఎమ్మెల్యే కె.పి. వివేకానంద మాట్లాడుతూ విద్య రంగంలో టెక్నాలజి ఆర్టిఫిషల్ ఇంటెలిజెన్సీ అభివృద్ధి చెందుతుందన్నారు. తల్లిదండ్రులు కూడా విద్యార్థుల అభిరుచికీ తగట్టుగా ప్రోత్సహించాలన్నారు. ఈ సందర్భంగా సెయింట్ అంథోని గ్రూప్ చైర్మెన్ ఎస్.పి.సుందర్ రాజు, అకాడమిక్ డైరెక్టర్ ఎస్.ఆర్. సరిత మాట్లాడుతూ తమ విద్యాసంస్థ 2000 సంవత్సరంలో సుచిత్రలో 95 మంది విద్యార్థులతో స్థాపించామని తెలిపారు. 25 సంవత్సరాలలో సెయింట్ ఆంటోనీ గ్రూప్ పాఠశాలలతో పాటు డిగ్రీ కళాశాల, సుందర్ ఎడ్యుకేషనల్ అకాడమీ ఐఐటీ జేఈఈ నీటి లాంటి కోచింగ్‌తో పాటు విద్యార్థుల అభ్యున్నతికి కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతోపాటు అన్ని రంగాలలో ప్రావీణ్యం అందిస్తున్నామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో హెచ్ఎండీఏ అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ హార్టికల్చర్ డి.చక్రపాణి, మెట్రో టీవీ.ఎండీ, జయ ప్రసాద్, పుడోటా అరుల్ రాజు, రుద్ర రాజు రామ కృష్ణ రాజు, ప్రయివేటు స్కూల్స్ కరస్పాండెంట్ అసోసియేషన్ అధ్యక్షులు శివయ్య, ఎం.శ్రీనివాస్ గౌడ్, పాఠశాల ఉపాధ్యాయుల, విద్యార్థుల తల్లిదండ్రులుపాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యేను కలిసిన నూతన కార్యవర్గం



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని షాపూర్ నగర్‌లో మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్‌ని తన నివాసం వద్ద నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఎన్.టి.ఆర్ నగర్ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గ సభ్యులు, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా నూతన లేబర్ సెల్ సభ్యులు కలిశారు. అనంతరం కూన శ్రీశైలం నూతన కార్యవర్గ సభ్యులకు, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా లేబర్ సెల్ ఉపాధ్యక్షులు సంపత్ కుమార్ గౌడ్, ప్రధాన కార్యదర్శి కర్కాల ఉపేందర్ రెడ్డి, కుత్బుల్లాపూర్ నియోజకవర్గం లేబర్ సెల్ అధ్యక్షులు కావలి గోపాల్ ముదిరాజ్, మేడ్చల్ నియోజకవర్గం లేబర్ సెల్ వర్కింగ్ ప్రెసిడెంట్ సైపేట మల్లేష్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కూన శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ..ఎన్.టి.ఆర్ నగర్ అభివృద్ధి కోసం నూతన కార్యవర్గం కృషిచెయ్యాలన్నారు.

ఎన్‌టీఆర్ నగర్..

ఈ కార్యక్రమంలో నిజాంపేట మాజీ కార్పొరేటర్ ఏనుగుల శ్రీనివాస్ రెడ్డి, ఏనుగుల శ్రీకాంత్ రెడ్డి, ఆమంచి శ్రీహర్ష, కాలనీ అధ్యక్షులు రెడ్డిపల్లి సుధాకర్, ఉపాధ్యక్షులు లక్ష్మి, కాలప్ప, ప్రధాన కార్యదర్శి ఉదయ్ కుమార్, కోశాధికారి బైపునేని మోహన్, ప్రశాంత్ కుమార్, చారితో పాటు తదితరులు పాల్గొన్నారు.

అనంతరం కూన శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ మేడ్చల్ జిల్లా లేబర్ సెల్ సభ్యులు.. తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ సామాన్య కార్యకర్తలను గుర్తించి.. గుండెలో పెట్టుకుందన్నారు. మన పార్టీ కోసం పనిచేసిన ప్రతి కార్యకర్తకు,నాయకునికి తప్పనిసరిగా గుర్తింపు ఉంటుందన్నారు. నూతనంగా ఎన్నికైన లేబర్ సెల్ సభ్యులు పార్టీ కోసం, ప్రజల కోసం పనిచేయాలన్నారు.ఈ కార్యక్రమంలో టీపీసీసీ లేబర్ సెల్ జిల్లా ప్రెసిడెంట్ కందాడి సుదర్శన్ రెడ్డి, కొంపల్లి మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ప్రశాంత్ గౌడ్, కొంపల్లి మాజీ సర్పంచ్ జిమ్మీ దేవేందర్, ఉప సర్పంచ్ గోపాల్ రెడ్డి, జయబేరి గోపాల్ రెడ్డి, అశోక్ రెడ్డి, కావలి నవీన్ గార్లతో పాటు తదితరులు పాల్గొన్నారు.



మహిళా సాధికారతతోనే ఆర్థిక పరిపుష్టి



- బీఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్

నవతెలంగాణ-దుండిగల్

మహిళా సాధికారతతోనే ఆర్థిక పరిపుష్టి అనిబీఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్ అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం బహదూర్‌పల్లిలోని కెఎం. పాండు ప్రభుత్వ వొకేషనల్ జూనియర్ కాలేజ్ ఆవరణలో మల బార్ గోల్డ్ అండ్ డైమండ్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన "మలబార్ నేషనల్ స్కాలర్షిప్ ప్రోగ్రాం" కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ హాజరై 337 మంది విద్యార్థినిలకు ఒక్కొక్కరికి పదివేల రూపా యల చొప్పున 26.72 లక్షల రూపాయల విలువగల స్కాలర్ షిప్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ నంర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రపంచాన్ని మార్చే అత్యంత శక్తివంతమైన సాధనం విద్య అని తెలిపారు. ఆడపిల్ల విద్యాభివృద్ధితోనే కుటుంబం ఆర్థిక పరిపుష్టిని సాధిస్తుందని నమ్మి ఆడపిల్లల విద్యకై జాతీయ స్థాయి స్కాలర్ షిప్ కార్యక్రమాన్ని మహిళల సాధికారతకై మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ వారు చేపడుతున్న కార్యక్రమం ఎంతో అభినందనీయమని పేర్కొన్నారు. ఇప్పటి వరకు 95,000 మందికి స్కాలర్ షిప్పులను అందించడం, నేడు మరో మారు మేడ్చల్, హైదరాబాద్ జిల్లాలోని 337 మంది విద్యార్థినులకు 26.72 లక్షల రూపాయలను స్కాలర్ షిప్ రూపంలో అందించడం జరుగుతుందన్నారు. రానున్న రోజుల్లో కూడా ఆడపిల్లల విద్యాభివృద్ధికై మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ వారు చేపట్టే ప్రతి కార్యక్రమానికి నా సహాయ సహకారాలు ఎప్పుడూ ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో మలబార్ గోల్డ్ అండ్ డైమండ్ జోనల్ హెడ్ షణీబ్, కె.కూకట్ పల్లి స్టోర్ మేనేజర్ మహమ్మద్ ఇర్ఫాన్, కె.పి.హెచ్.బి స్టోర్ మేనేజర్ శ్రీనివాస్, కెఎస్,మార్కెటింగ్ హెడ్ రాకేష్, ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ జాయిన్ సెక్రెటరీ డాక్టర్ ఆర్. జోత్స్న రాణి, కుత్బుల్లాపూర్ ప్రభుత్వ డిగ్రీ కాలేజ్ ప్రిన్సిపాల్ అలివేలు మంగమ్మ, ఒకేషనల్ జూనియర్ కాలేజ్ ప్రిన్సిపాల్ షేక్ మైమూన్, జూనియర్ కాలేజ్ ప్రిన్సిపాల్ నాగేంద్రరావు, కూకట్పల్లి ప్రభుత్వ జూనియర్ కాలేజ్ ప్రిన్సిపల్ వెంకటయ్య, మేడ్చల్ జిల్లా ఫిషరీస్ కో-ఆపరేటివ్ చైర్మెన్ మన్నె రాజు, జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మెన్ నాగరాజు యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

అక్రమ కట్టడాలపై హైడ్రా కొరడా



- ఐదు నిర్మాణాలు కూల్చివేత
- బాధితుల రోదనలు
- జగద్గిరిగుట్ట పోలీసుల బందోబస్తు

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

కుత్బుల్లాపూర్ మండల రెవెన్యూ పరిధి,జగద్గిరిగుట్ట డివిజన్ భూదేవి హిల్స్ సమీపంలో వెలిసిన ఐదు అక్రమ కట్టడాలపై గురువారం హైడ్రా అధికారులు కొరడా ఝుళిపించారు. హైడ్రా అధికారులు కూల్చివేతలు చేపడుతున్నారని సమాచారం తెలుసుకున్న బాధితులు అస్థలానికి చేరుకున్నారు. తమ నిర్మాణాలను కూల్చివేయద్దంటూ అధికారులతో వాగ్వివాదానికి దిగారు. జెసిబి ముందు బైఠాయించి ఆందోళన చేపట్టారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జగద్గిరిగుట్ట సీఐ. కేతురి నరసింహ ఆధ్వర్యంలో పోలీసులు పటిష్ట బందోబస్తు చేపట్టారు. పైసా పైసా పోగుచేసి కట్టుకున్నామంటూ బాధితులు కన్నీటి పర్యంతమయ్యారు. తమకు దిక్కెవ్వరు అంటూ ఆర్తనాదాలు చేశారు. మాకు న్యాయం చేయాలంటూ బాధితులు అధికారులను వేడుకున్నారు.



నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
సికింద్రాబాద్ - సనత్‌నగర్ - జూబ్లీహిల్స్
శుక్రవారం | ఫిబ్రవరి 21, 2025 | www.navatelangana.com

మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్యకు అవమానం

- సీఎం కార్యాలయం ఎదుట గంటల తరబడి ఎదురు చూపులు



నవతెలంగాణ-బంజారాహిల్స్

సీఎం రేవంత్ రెడ్డిని కలవడానికి గంటల పాటు బైటె వేచి చూసి అధికారులు, సిబ్బంది పట్టించుకోకుండా.. లోపలికి అనుమతించకపోవడంతో నిరాశతో వెనక్కి తిరిగి వెళ్లిపోయిన మాజీ ఎమ్మెల్యే నర్సయ్య ప్రజా పాలన ప్రభుత్వంలో మార్పు రావాలని సూచించారు.

బీసీలకు అట్రాసిటీ రక్షణ చట్టం తీసుకురావాలి

నవతెలంగాణ-ఓయూ

ఎస్సీ, ఎస్టీల మాదిరిగా బీసీలకు కూడా అట్రాసిటీ రక్షణ చట్టం తీసుకురావాలని బుధవారం ఓయూ ఆర్ట్స్ కళాశాల నుంచి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి లేఖ రాసినట్టు బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ పేర్కొన్నారు. ఇప్పుడిప్పుడే ఎదుగుతున్న బీసీ కులాలను ఓర్వలేక కొన్ని ఉన్నత వర్గాలు కులం పేరుతో తిడుతూ దాడులు చేస్తున్నారని కొన్ని గ్రామాలలో కుల వృత్తులు చేయని వారిని గ్రామ అభివృద్ధి కమిటీ పేరుతో గ్రామ బహిష్కరణ చేస్తున్నారని అన్నారు. రజకులు (చాకలి) ఖచ్చితంగా బట్టలు ఉతకాల్సిందేనని అలా చేయని వారికి గ్రామ ప్రజలు ఎవరు సహకరించొద్దని, ఊరు విడిచి హుకుం జారీ చేస్తున్నారని అన్నారు. అగ్రవర్ణాల అమ్మాయిని మంగలి (నాయిబ్రాహ్మణ) అబ్బాయి ప్రేమ వివాహం చేసుకుంటే వారి ఇంటిని తగలబెట్టి అతన్ని గ్రామం నుంచి వెలివేసేరని ఇంకా మనకు తెలియని సంఘటనలు ఎన్నో జరుగుతున్నాయని అందువల్ల బీసీలకు రక్షణ చట్టం తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ విద్యార్థి యువజన పరిషత్ రాష్ట్ర అధ్యక్షులు బూర శ్రీనివాస్, బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర నాయకులు గోద రవీందర్ పాల్గొన్నారు.

అనుమతి లేని అంతస్తుల కూల్చివేత



నవతెలంగాణ-జూబ్లీహిల్స్

జీహెచ్ఎంసీ సర్కిల్ 19 పరిధిలోని ఎర్రగడ్డ వికాసపురి కాలనీలో జీ ప్లస్ టుకు అనుమతి తీసుకొని అదనంగా ఆరు అంతస్తుల వరకు ఇంటి యజమాని నిర్మాణం చేపట్టాడు. మూడుసార్లు నోటీసులు ఇచ్చినప్పటికీ లెక్కచేయకుండా సెలవు దినాలలో స్లాబులు వేసి నాలుగు అంతస్తులు అక్రమంగా నిర్మించాడు. ఇంటి యజమాని కోర్టుకు వెళ్లి స్టే తెచ్చుకోవచ్చు అనే ధీమాతో కోర్టుకు వెళ్లాడు. పరిశీలించిన నాంపల్లి కోర్టు నోటీసులు ఇచ్చిన లెక్క చేయకుండా నిర్మించిన అదనపు అంతస్తులను వెంటనే కూల్చివేయాలని అధికారులను ఆదేశించారు. వెంటనే స్పందించిన అధికారులు బుధవారం ఇంటిని టౌన్ ప్లానింగ్ సెక్షన్ అధికారి నరేష్, నాయక్ ఇంజినీర్లు మౌనిక, స్పందన రావు, సిబ్బందితో వెళ్లి కూల్చివేయడం జరిగింది. ఈ సందర్భంగా సెక్షన్ ఆఫీసర్ నరేష్ మాట్లాడుతూ.. ఇంటి యజమానులు ఎవరైనా అనుమతి ఇచ్చిన వరకే అంతస్తులు నిర్మించుకోవాలని, అనుమతి లేకుండా అంతస్తులు నిర్మించి నష్టపోవద్దని, రాజకీయ నాయకులు అండగా ఉంటారని, కోర్టుకు వెళ్లి స్టే తెచ్చుకోవచ్చుని అపోహలతో అక్రమ నిర్మాణాలు చేపట్టవద్దని ఇంటి యజమానులను హెచ్చరించారు.

నిరంతరం ప్రజల మధ్యనే ఉంటా..

- ప్రజల సమస్యలు వెంటనే పరిష్కరించాలి
- ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్
- భగత్ సింగ్ పార్క్ వద్ద రూ.20 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణం పరిశీలన



నవతెలంగాణ-జూబ్లీహిల్స్

నిరంతరం ప్రజల మధ్యనే ఉంటా... ప్రజల సమస్యలను వెంటనే పరిష్కరించాలని, ప్రజలు సంతోషంగా ఉండాలని, తాను నిరంతరం కోరుకుంటానని మాజీమంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. గురువారం సనత్‌నగర్, అమీర్‌పేట్‌లోని పలు ప్రాంతాలలో వివిధ శాఖల అధికారులతో కలిసి పర్యటించారు. స్థానిక ప్రజలు వారి సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా, వెంటనే స్పందించిన ఆయన సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ముందుగా బల్కంపేట గ్రేవ్ యార్డ్ సమీపంలో డీసీఎం వాహనాలను పార్కింగ్ చేయకుండా ట్రాఫిక్ పోలీసులు తొలగిస్తున్నారని, పలువురు వాహనదారులు ఎమ్మెల్యేలను కలిసి తమ సమస్యలను విన్నవించారు. దీంతో గురువారం ట్రాఫిక్ పోలీసు అధికారులతో కలిసి డీసీఎం పార్కింగ్ ప్రాంతానికి చేరుకొని ట్రాఫిక్‌కు, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా వాహనాలను నిలుపుకోవాలని ఎమ్మెల్యే ఆదేశించారు. అనంతరం ఎస్ఆర్‌టీలోని భగత్ సింగ్ పార్క్ వద్ద రూ.20 లక్షల వ్యయంతో నూతన రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించగా, పరిశీలించేందుకు వెళ్లిన ఎమ్మెల్యే దృష్టికి స్థానికులు ప్రస్తుత అవసరాలను దృష్టిలో ఉంచుకొని సీవరేజ్ లైన్‌ను రీ మోడలింగ్ చేయాలని కోరారు. అదేవిధంగా త్రాగునీటి సరఫరా సక్రమంగా ఉండటంలేదని ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన ఆయన సీవరేజ్ లైన్, త్రాగునీటి సమస్య పరిష్కారం కోసం తీసుకోవాల్సిన చర్యలను గుర్తించాలని వాటర్ వర్క్స్ జీఎం హరిశంకర్‌ను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తన దృష్టికి తీసుకొచ్చిన సమస్యలను పరిష్కరించే విధంగా తాను కృషి చేస్తున్నానని చెప్పారు. 2014 సంవత్సరం తర్వాతనే సనత్‌నగర్ నియోజకవర్గ పరిధిలో అనేక అభివృద్ధి పనులను చేపట్టి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించినట్టు వివరించారు. రోడ్లను ఎంతో అద్భుతంగా అభివృద్ధి చేశామని, పార్క్‌లను కూడా అభివృద్ధి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చిన విషయాన్ని గుర్తుచేశారు. తాను నిరంతరం ప్రజల మధ్యనే ఉంటానని, ప్రజల అవసరాలను గుర్తెరిగి అందుకు అనుగుణంగా అభివృద్ధి పనులు చేపడుతూ వస్తున్నానని చెప్పారు. ఈ కార్యక్రమాంలో కార్పొరేటర్ కొలన్ లక్ష్మి, డీసీ రజనీకాంత్, ఈఈ వెంకటేశ్వర్ రెడ్డి, డీఈ వాసుదేవ రెడ్డి, ఎఎంహెచ్ చంద్రశేఖర్ రెడ్డి, టౌన్ ప్లానింగ్ అధికారి మన్సూర్, స్ట్రీట్ లైట్ డీఈ కిరణ్మయి, హార్టికల్చర్ అధికారి జ్యోత్స్న, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు కొలన్ బాల్ రెడ్డి, నాయకులు ఖలీల్, శేఖర్, జమీర్, ఫాజిల్, నోమాన్, వసీం, పురుషోత్తం తదితరులు ఉన్నారు.

రాష్ట్ర సాధనలో కాంగ్రెస్ పార్టీ కృషి ఎనలేనిది

- డా.కోట నీలిమ



నవతెలంగాణ-బేగంపేట్

తెలంగాణ బిల్లు ఆమోదం పొందిన తర్వాత భారతదేశంలో 29వ రాష్ట్రంగా తెలంగాణ ఆవిర్భావం చెంది నేటికీ 11 ఏండ్లు నేడు తెలంగాణ ప్రజల చిరకాల ఆకాంక్ష అయిన ప్రత్యేక రాష్ట్రం సిద్ధించిన రోజని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, ఏఐసీసీ మెంబెర్, సనత్ నగర్ నియోజకవర్గం ఇన్‌చార్జి డా. కోట నీలిమ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 2014 ఫిబ్రవరి 18న లోక్ సభలో తెలంగాణ బిల్లుపై చర్చ ప్రారంభం అయి మూజువాని ఓటుతో తెలంగాణ బిల్లును ఆమోదించినట్టు ఆనాటి లోక్సభ స్పీకర్ మీరా కుమార్ తెలిపారు. 2014 ఫిబ్రవరి 20న రాజ్యసభలో నాటి హోంశాఖ మంత్రి షిండే బిల్లును ప్రవేశపెట్టగా నాటి రాజ్యసభ డిప్యూటీ చైర్మెన్ కొరియన్ ది బిల్ ఇస్ పాస్డ్ అంటూ ప్రకటించడంతో తెలంగాణ రాష్ట్రం ఆవిష్కృతం అయింది. 2014 మార్చి 1న తెలంగాణ ఏర్పాటు బిల్లుకు రాజముద్ర పడింది. రాష్ట్రపతి ఆమోదముద్ర వేసిన తర్వాత జూన్ 2న తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవంగా ప్రకటించారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో కాంగ్రెస్ పార్టీది, సోనియా గాంధీ పాత్ర అత్యంత కీలకం అని కోట నీలిమ గుర్తు చేశారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం ఖాయం

- కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేష్





నవతెలంగాణ-కంటోన్మెంట్

ఎమ్మెల్సీ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ విజయం సాధిస్తుందని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేష్ అన్నారు. గురువారం మెదక్, నిజామాబాద్, అదిలాబాద్, కరీంనగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సమన్వయకర్తగా కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేష్ వెళ్లాడు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఆల్ఫోర్స్ నరేందర్ రెడ్డి విజయాన్ని కాంక్షిస్తూ సిర్పూర్ కాగజ్ నగర్‌లోని వినయ్ గార్డెన్స్‌లో నిర్వహించిన సన్నాహక సమావేశానికి ముఖ్యఅతిథిగా మంత్రి సీతక్క తో పాటు హాజరయ్యారు. నాయకులు, కార్యకర్తలను ఉద్దేశించి శ్రీ గణేష్ మాట్లాడుతూ.. ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం ఖాయమైందని, ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీ ఎన్నికలలో పోటీ చేయకుండా పరారైందని, కాంగ్రెస్ గెలుపును అడ్డుకోవడానికి లోపాయి కారీగా బీజేపీకి బీఆర్ఎస్ పార్టీ సహకరిస్తుందని, కావున విజ్ఞులైన పట్టభద్రులు వివేకంతో ఆలోచించి రాష్ట్రాన్ని సంక్షేమం, అభివృద్ధిలలో అగ్రగామిగా నిలుపుతున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, కాంగ్రెస్ ప్రభుత్వానికి అండగా నిలబడాలని కోరారు.

అభివృద్ధి మరింతగా పురోగమించాలంటే కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నరేందర్ రెడ్డి గెలుపు చాలా అవసరమని, బీఆర్ఎస్ బీజేపీల కుట్రలను ఛేదించి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు.

ఎల్ఐసీలో ఉద్యోగుల సమ్మె



- పాల్గొన్న ఎస్.పద్మ బ్రాంచ్ కార్యదర్శి

నవతెలంగాణ-జూబ్లీహిల్స్/ అమీర్‌పేట్

భారతీయ జీవిత బీమా సంస్థ(ఎల్ఐసీ)లో దేశవ్యాప్తంగా గురువారం అన్ని బ్రాంచీలలో మూడు, నాలుగు గ్రూపు ఉద్యోగులు సమ్మె చేశారు. అందులో భాగం గా అమీర్‌పేట్ ఎల్ఐసీ సిటీ బ్రాంచ్ 11 లోని మూడు, నాలుగు తరగతి ఉద్యోగులు మధ్యాహ్నం 12:30 నుంచి ఒక గంట పాటు ఉద్యోగులు విధులు బహిష్కరించి సమ్మెలో భాగంగా నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఎస్.పద్మ (బ్రాంచ్ కార్యదర్శి) పాల్గొని ఉద్యోగులను ఉద్దేశించి మాట్లాడారు. ఎల్ఐసీ గత కొన్ని దశాబ్దాలుగా ఎల్ఐసీ సంస్థలో గ్రూప్ మూడు, నాలుగు ఉద్యోగాల నియామకం చేపట్టలేదని, ప్రతి ఏడాది వేలాది ఉద్యోగులు సంస్థ నుంచి రిటైర్ అవుతున్నందున, ఉన్న వారిపై అధిక పని భారం పెరిగి, పాలసీదారులకు అందించవలసిన సేవల విషయంలో తీవ్ర ఒత్తిడితో, ఎల్ఐసీకి చెడ్డ పేరు రాకూడదన్నారు. పని భారం పెరిగి అనారోగ్యం పాలు అవుతున్నారని అన్నారు . ఈనెల 11వ తేదీన సీఈఓ పేరిట దేశంలోని అన్ని శాఖలలో వినతి పత్రాలు ఇచ్చినప్పటికీ యాజమాన్యం నుండి ఎలాంటి స్పందన కనపడలేదు. అందుకే సమ్మె చేయవలసి వచ్చిందని యాజమాన్యాన్ని హెచ్చరించారు. వెంటనే గ్రూప్ మూడు, నాలుగు ఉద్యోగాలు భర్తీ చేయాలని, అదేవిధంగా ఆలిండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయిస్ అసోసియేషన్ (ఏఐఐఈఏ) సంఘానికి గుర్తింపు ఇవ్వాలని, రెండు ప్రధాన డిమాండ్లతో ఎల్ఐసీలోని ఉద్యోగులంతా గురువారం సమ్మె చేయటం జరిగిదన్నారు. రాబోవు రోజులలో ఇతర కార్మిక సంఘాలతో కలిసి మరిన్ని ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని, ఎల్ఐసీ ఉద్యోగు లకు పిలుపు నిచ్చారు. ఇప్పటికైనా ఎల్ఐసీ యాజమాన్యం వెంటనే చర్యలు తీసుకొని దేశ వ్యాప్తంగా ఉన్న మూడు, నాలుగు తరగతి ఉద్యోగాలు భర్తీ చేయాలని కోరారు.

రెడ్ల ఆదిపత్యం... బహుజనుల ఆత్మగౌరవానికి మధ్య జరుగుతున్న పోరు



- రాష్ట్ర రాజకీయ ముఖచిత్రాన్ని మలుపుతిప్పే ఎమ్మెల్సీ ఎన్నికలు
- జాజుల శ్రీనివాస్ గౌడ్

నవతెలంగాణ-బంజారాహిల్స్

రాష్ట్ర రాజకీయ ముఖచిత్రాన్ని మలుపుతిప్పే ఎమ్మెల్సీ ఎన్నికలు రెడ్ల ఆదిపత్యం-బహుజల ఆత్మగౌరమధ్య జరుగుతున్న పోరనీ బీసీ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో బీసీ ఉపాధ్యాయ సంఘం నూతన డైరీ ఆవిష్కరణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జాజుల శ్రీనివాస్ గౌడ్ హాజరైయ్యారు. నూతన డైరీని రాష్ట్ర ఉపాధ్యాయ అధ్యక్షుడు సుంకరి శ్రీనివాస్, బీసీ ఇంటలెక్చువల్ ఫోరం వ్యవస్థాపకులు మాజీ ఐఏఎస్ అధికారి చిరంజీవులుతో కలిసి ఆయన ఆవిష్కరించారు. జాజుల మాట్లాడుతూ.. వచ్చే ఎమ్మెల్సీ ఎన్నికలు 2028లో జరిగే అసెంబ్లీ ఎన్నికలకు సెమీఫైనల్ అన్నారు. బీసీ ఎమ్మెల్సీ అభ్యర్థులు పూల రవీందర్, ప్రసన్న హరి కిషన్, కొమురయ్య గెలుపు ఖాయమన్నారు. బీసీల అభ్యర్థులు గెలుపుకు బహుజనులతో సిద్ధమయ్యారని తెలిపారు. ఇవి పార్టీలు, వ్యక్తుల మధ్య జరిగే ఎన్నికలు కావని, రెడ్ల ఆదిపత్యం, బహుజల ఆత్మగౌరవం మధ్య జరిగే ఎన్నికలని పేర్కొన్నారు. చిరంజీవులు మాట్లాడుతూ.. బీసీల ఆత్మగౌరం, అస్తిత్వం బీసీ ఉద్యమం జరుగుతుందన్నారు. బీసీల మార్పుకు ఈ ఏడాది నాంది పలుకనున్నదన్నారు. బీసీల రాజకీయ సాధికారత కల్పన ధ్యేయంగా ముందుకెళ్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో బీసీ ఉద్యోగ సంఘాల మహిళా ప్రధాన కార్యదర్శి రామ, బీసీ కుల సంఘాల జేఏసీ చైర్మన్ కుందారపు గణేష్ చారి, కన్వీనర్ బాలరాజు గౌడు, విద్యార్థి సంఘం అధ్యక్షుడు విక్రమ్ గౌడ్, బీసీ నేత కనకాల శ్యామ్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రైజింగ్ తెలంగాణ సీఎస్ఆర్ అవార్డ్స్ నామినేషన్స్ ఆహ్వానం



నవతెలంగాణ-బంజారాహిల్స్

రైజింగ్ తెలంగాణ సీఎస్ఆర్ అవార్డ్స్‌ను ఇచ్చి సత్కరించడం ఎంతో విశేషమని, ఇప్పటికే నాలుగు పర్యాయాలు వైద్యరత్న అవార్డులను అందించిన జేఎంజీ గ్రూప్స్ కృషి ప్రశంశనీయమని తెలంగాణ రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహా అన్నారు. గురువారం జూబ్లీహిల్స్‌లోని ఆయన కార్యాలయంలో 2025 సంవత్సరానికి రైజింగ్ తెలంగాణ సీఎస్ఆర్ అవార్డ్స్ గోడపత్రికను ఆవిష్కరించి మాట్లాడారు. కరోనా సమయంలో వైద్యుల సేవలు మరువలేనివని, అలాంటి వైద్యులకు ఇలాంటి అవార్డులను అందిచడం అభినందనీయమన్నారు, JMG, Hadhyas Media C.E.O జగన్నాథం మాదిరెడ్డి మాట్లాడుతూ.. 2015 నుండి విద్య, వైద్య, వ్యాపార, స్త్రీ శక్తి రంగాలలో విశిష్ట సేవలు అందించిన ఆయా రంగాలకు చెందిన వారిని ఘనంగా సత్కరించామని, ఐదోవ సారి కూడా ఈ అవార్డుల ప్రక్రియను కొనసాగిస్తున్నామన్నారు. ఇప్పటికే నామినేషన్ల ప్రక్రియను మొదలు పెట్టమని ఏప్రిల్ 20 వరకు నామినేషన్లను స్వీకరిస్తానన్నారు. ఏప్రిల్ 30న రైజింగ్ తెలంగాణ సీఎస్ఆర్ అవార్డులను మంత్రి దామోదర రాజనర్సింహా చేతులమీదుగా అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జేఎంజీ గ్రూప్స్ డైరెక్టర్స్ పవన్, ఐకానిక్ ఎండీ శ్రీనివాస్ గౌడ్, ఆర్పీఏ ఫౌండర్, జనరల్ సెక్రెటరీ కే శివకుమార్, గ్లోబల్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఫౌండర్ కట్ట సునీల్, రాచకొండ ఫార్చ్యూన్ ఇన్ఫ్రా డైరెక్టర్స్ భాగీ రెడ్డి, గంగాధర్ రెడ్డి, సుధాకర్ యాదవ్, విశ్వ తదితరులు పాల్గొన్నారు.

కుంభమేళాలో సీబీఎన్ కుంటుంబ ఫ్లెక్సీకి స్నానం

- సీబీఎన్ ఫ్యాన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు తలారి. శ్రీనివాసరావు



నవతెలంగాణ-ఓయూ

ఉత్తర ప్రదేశ్ రాష్ట్రంలో ప్రయోగరాజ్‌లో కొనసాగుతున్న మహాకుంభ మేళాలో త్రివేణి సంగమం ఘాట్‌లో అఖిల భారత చంద్రబాబు నాయుడు ఫ్యాన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు, ఓయూ పీహెచ్డీ విద్యార్థి తలారి. శ్రీనివాసరావు చంద్రబాబు నాయుడు కుటుంబ సభ్యులు గలిగి ఉన్న ఫ్లెక్సీకి స్నానం చేయించి తన అభిమాన నేతపై తనకు ఉన్న అభిమానాన్ని ప్రత్యేకంగా చాటుకున్నారు. చంద్రబాబు నాయుడు కుటుంబ సభ్యులకు ఆ శివుడు, త్రివేణి సంగమ జలాలు మంచి ఆరోగ్యన్ని ప్రసాదించలని రానున్న రోజుల్లో నారా లోకేష్ తండ్రికి మించిన తనయుడు కావాలని ఆ శివుణ్ణి తలారి. శ్రీనివాసరావు కోరుకున్నారు. రానున్న రోజుల్లో టీటీడీ, చంద్రబాబు నాయుడు నాయకత్వం మరింతగా అభివృద్ధి చెందలని కోరుకున్నారు. చంద్రబాబు నాయుడు ఏదో ఒక రోజు ఈ దేశ ప్రధాని కావల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.

పేరుకే 5స్టార్ హోటళ్లు పన్ను చెల్లింపుల్లో అన్ స్టార్లు

- జీహెచ్ఎంసీ ఆదాయానికి గండి కొడుతున్న వ్యాపార సంస్థలు



నవతెలంగాణ-బంజారాహిల్స్

జీహెచ్ఎంసీ సర్కిల్ 18లో వరుసగా కొనసాగుతున్న టాక్స్ వసూళ్ల పర్వం. తాజ్ హోటల్స్‌లో బకాయిలు చూస్తే కండ్లు తిరిగి పడిపోవాల్సిందే.. 2009 నుంచి సరైన రీతిలో బకాయిలు చెల్లించకుండా జీహెచ్ఎంసీ ఆదాయానికి గండి కొడతూ వస్తున్నారు. అడిగితే రూమ్ ఇస్తున్నాం కడుపునిండా అన్నం పెడుతున్నాం ఇంకా టాక్సీలు ఎందుకు కట్టాలి అనే తీరులో వ్యాపార సంస్థ యజమానులు ఆలోచిస్తున్నారు. గురువారం బంజారాహిల్స్‌లోని తాజ్ బంజారా హోటల్ ఏకంగా కోటి రూపాయల పైచిలకు టాక్స్ డబ్బులు చెల్లించకపోయే సరికి హోటల్‌ను జీహెచ్ఎంసీ అధికారులు సీజ్ చేశారు. బుధవారం ఎస్వీఆర్ హోటల్స్ సైతం కోటి రూపాయల బకాయిని ప్రస్తుతం చెల్లించలేమని కావాలంటే బాండ్ పేపర్ రాసుకోండి అని పేపర్ బాండ్ రాయించుకుంది. హోటల్ యాజమానులు రాజకీయ పలుకుబడిని వాడుకొని ఏండ్ల తరబడి పన్నులు ఎగ్గొడుతూ ప్రజలకు అందించే మౌలిక సదుపాయాలకు గండి కొడుతున్నారు. పాలకులేమో ఎన్నికలు రాగానే ఉచిత హామీలు ఇచ్చి నెరవేర్చలేక బెంబేలెత్తుతున్నారు. భారీ వసూళ్లు మాత్రం అలాగే ఉండిపోవడానికి మరో ముఖ్య కారణం వ్యాపారాల్లో దాదాపు 60 శాతం రాజకీయ నాయకులు, ఉన్నత స్థాయి అధికారుల వాటాలు వ్యాపారాల్లో ఉండేసరికి వాటిని రక్షిస్తూ, ప్రజలకు లబ్ది చేరకుండా చేస్తున్నారు. సకాలంలో పన్నులు వసూలైతేనే ప్రభుత్వం అనుకున్న పనులను అనుకున్న సమయంలో చేస్తుంది. కావాల్సిన నిధులు లేకపోవడంతో అనేక సంక్షేమ సదుపాయాల పనులన్నీ ఆగిపోయి ఉన్నాయి. జీహెచ్ఎంసీ పరిధిలో కాంట్రాక్టర్ల బిల్లును సైతం చెల్లించలేని పరిస్థితి, అవుట్ సోర్స్ ఉద్యోగుల వేతనాలు సరైన సమయానికి చెల్లించలేని పరిస్థితి ఏర్పాడింది. సరైన సమయంలో పన్నులు వసూలు కావడానికి వన్ టైం సెటిల్మెంట్లు పెట్టి ప్రభుత్వం గతంలో ప్రయత్నం చేసిన సంగతి తెలిసిందే, అయినప్పటికీ వసూళ్ల పర్వం అంతగా కొనసాగలేదు కానీ ప్రస్తుత ప్రభుత్వం చేయాలని ప్రతిపాదనతో ముందుకు వెళుతున్నట్టు వరుసగా జరుగుతున్న ఘటనలు ఉదాహరణగా తీసుకోవచ్చని ప్రజలు భావిస్తున్నారు.

సాంకేతికత శక్తిలో మహిళలు రాణించాలి

- సిమోనా అడెలినా పోపోవిసీ



నవతెలంగాణ-బంజారాహిల్స్

సాంకేతికత శక్తిలో మహిళలకు సమానత్వం, అంతర్గతతను ప్రోత్సహించడానికి నిబద్ధతతో ఉన్నామనీ, గడచిన కొన్ని ఏండ్లుగా బాహ సే పోటీల్లో మహిళా ఇంజినీర్ల భాగస్వామ్యాన్ని ప్రోత్సహిస్తున్నామని రెనాల్ట్ నిస్సాన్ టెక్నాలజీ, బిజినెస్ సెంటర్ ఇండియా వైస్ ప్రెసిడెంట్, హెచ్ఆర్ సిమోనా అడెలినా పోపోవిసీ తెలిపారు. సొసైటీ ఆఫ్ ఆటోమోటివ్ ఇంజినీర్స్ (ఎస్ఏఈ) శ్రీ విష్ణు ఎడ్యుకేషనల్ సొసైటీ సహకారంతో ఎస్ఏఈ బాహ సే ఇండియాతో కలిసి నిర్వహిస్తున్న ప్రతిష్టాత్మక అంతర్ కళాశాలల 'బాహ సే ఇండియా 2025' ఈవెంట్ వివరాలు తెలిపేందుకు హైదరాబాద్‌లోని ది ప్లాజా హోటల్‌లోని మీడియా సమావేశంలో దీనికి సంబంధించిన వాహనాన్ని నిర్వాహక కమిటీ అధ్యక్షుడు బాలరాజు సుబ్రహ్మణ్యం, శ్రీ విష్ణు ఎడ్యుకేషనల్ సొసైటీ కార్యదర్శి ఆదిత్య విస్సం, బీపీసీఎల్ హైదరాబాద్ టెరిటరీ మేనేజర్ శ్రవణ్ కుమార్, బాహ సే ఇండియా కన్వీనర్ వినోద్ కుమార్ బాలసుబ్రమణియన్లు 'బాహ సే ఇండియా 2025' మెదక్ జిల్లా నర్సాపూర్‌లోని బీవీ రాజు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో 20 నుంచి 25వ వరకు జరుగుతుందని ప్రకటించారు. సిమోనా అడెలినా మాట్లాడుతూ.. రెనాల్ట్ నిస్సాన్లో డైవర్సిటీ, సమానత్వం, అంతర్గతతను ప్రోత్సహించడానికి నిబద్ధతతో ఉన్నామన్నారు. గడచిన కొన్ని ఏండ్లుగా బాహ సే పోటీల్లో మహిళా ఇంజనీర్ల భాగస్వామ్యాన్ని ప్రోత్సహిస్తూ.. మోటార్ స్పోర్ట్స్, మొబిలిటీ రంగంలో ముందుకు రావడానికి ఉత్సాహ పరుస్తున్నామని చెప్పారు. ఈ ప్రయత్నంలో భాగంగా 'ఆల్ గర్ల్స్ టీమ్ అవార్డ్' ద్వారా బాహ సే మహిళా ఇంజినీర్ల వినూత్న ఆలోచనలు, పట్టుదల, ప్రతిభను గౌరవించడం మాకు గర్వకారణంగా ఉందన్నారు. నంతరం బాహ సే ఇండియా 2025' చాలా ప్రత్యేకం అని బాహ సే ఇండియా నిర్వాహక కమిటీ అధ్యక్షుడు బాలరాజు సుబ్రహ్మణ్యం తెలిపారు. ఇది బాహ సే ఇండియా పద్దెనిమిదో సంచిక అన్నారు. ఇప్పుడు పదో వార్షికోత్సవాన్ని పూర్తి చేసుకుంటుందని చెప్పారు. 2015లో కేవలం 7 జట్లతో ప్రారంభమైన ఈ బాహ సే ఇప్పుడు 85 పైగా జట్లు పోటీ పడే స్థాయికి ఎదిగిందన్నారు. ఈ మొదట్లో ఒకే ఒక విభాగంలో పోటీ మొదలైందన్నారు. ఇప్పుడు అనేక విభాగాలను కలిగి ఉన్న బహుముఖ వేదికగా రూపాంతరం చెందిందన్నారు. ఇది ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దృష్టికోణానికి అనుగుణంగా ఉందన్నారు. క్లాస్‌రూమ్‌లో విద్యార్థులకు పరిమితమైన అవగాహన లభిస్తుందని పేర్కొన్నారు. ఈ పోటీలో పాల్గొనడం ద్వారా వాహనాన్ని ఆవిష్కరించడం, డిజైన్ చేయడం మాత్రమే కాకుండా, టీమ్ బిల్డింగ్, సహకారం, మార్కెటింగ్ తదితర నేర్చుకోవచ్చని తెలిపారు. బాహ సే పోటీలో రూ. 30 లక్షల వరకు బహుమతులు ఉన్నాయన్నారు. భారత ప్రభుత్వం ఈ పోటీ ద్వారా ఎంపికైన అత్యుత్తమ పది జట్లను అంతర్జాతీయ పోటీలకు పంపేందుకు పది లక్షల ప్రోత్సాహకాన్ని అందిస్తుందని వెల్లడించారు. అంతర్జాతీయ పోటీల్లో మన జట్లు టాప్ త్రీలో నిలుస్తుండడం సంతోషకరమని తెలిపారు. భారత మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం బాహ సే ఇండియా ఆవిర్భావానికి నాంది పలికారనీ గుర్తు చేశారు. యువత, సాంకేతికత శక్తిని నమ్మిన ఆయన 2015లో ఈ విప్లవాత్మక కార్యక్రమానికి నాంది పలికారు. తయారీ నైపుణ్యాలను ప్రదర్శించేందు సన్నద్ధమైందనీ ఈవెంట్‌లో గ్లోబల్ ఆటోమోటివ్ దిగ్గజాలు వోల్వో, డైమ్లర్,ఏవీఎల్, అల్టైర్,టాటా మోటార్స్ తదితర ప్రముఖ కంపెనీలు పాల్గొంటున్నాయనీ సంస్థ ప్రతినిధులు ప్రకటించారు.

సిరిపురం యాదయ్య 15వ వర్ధంతి



- ఉద్యమానికి ఊపిరి పోసిన యాదయ్య..వక్తలు

నవతెలంగాణ-ఓయూ

మలిదశ తెలంగాణ అమరవీరుడు సర్దార్ సిరిపురం యాదయ్య 15వ వర్ధంతిని గురువారం ఉస్మానియా యూనివర్సిటీ ఎన్సిసి గేటు వద్ద సిరిపురం యాదయ్య స్మారక సమితి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలువురు నేతలు మాట్లాడుతూ.. మలిదశ ఉద్యమంలో ప్రాణ త్యాగం చేసిన యాదయ్య విగ్రహాన్ని ఎన్‌సీసీ గేటు దగ్గర ఏర్పాటు చేయాలని, ఓయూ మెయిన్ గేటుకు సిరిపురం యాదయ్య పేరును పెట్టాలని, ఎన్‌సీసీ గేటు ప్రాంగణం రోడ్డుకు యాదయ్య మార్గ్ అని నామకరణ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గత పదేండ్ల కాలంలో ఎన్నోసార్లు సిరిపురం యాదయ్య వర్ధంతి సందర్భంగా ప్రభుత్వానికి విన్నవించిన పట్టించుకోలేదని, అమరవీరుల త్యాగాలను గుర్తించుకునేందుకు భవిష్యత్ తరాలకు అందించేందుకు వెంటనే విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ ప్రొ. కోదండరాం, ఎల్ రమణ, తెలంగాణ రాష్ట్ర సిరిపురం యాదయ్య స్మారక సమితి, కన్వీనర్ ప్రొఫెసర్ తాటికొండ రాజయ్య, స్మారక సమితి సభ్యులు నర్సింగ్ రావు, హరి, ఉపేందర్, పుట్ట పాండు రంగయ్య, రోషం బాలు, నరేంద్ర, ఓయూ జేఏసీ నాయకులు రాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన త్యాగాన్ని స్మరించుకుంటు చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు.

సీఎం సహాయనిధి పేదలకు వరం



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

సీఎం సహాయనిధి పేదలకు వరం అని బీఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ అన్నారు. కుత్బుల్లాపూర్‌లోని ఎమ్మెల్యే నివాస కార్యాలయం వద్ద కుత్బుల్లాపూర్ ప్రాంతానికి చెందిన జి.రామా రావు, చింతల్ ప్రాంతానికి చెందిన బి.శ్రీనాథ్‌లకు ఆరోగ్య పరిస్థితి బాగాలేదని స్థానిక నాయకుల ద్వారా ఎమ్మెల్యే సమాచారం అందుకున్నారు. ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి జి.రామారావు తండ్రి జి.లక్ష్మయ్య రూ.2,00,000, బి.శ్రీనాథ్ తండ్రి బి.యాదగిరి రూ.2,00,000 లకు ఎల్‌ఓసీ మంజూరు చేయించి గురువారం లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆపదలో ఉండి ఆర్థిక సహాయం కోసం ఎదురుచూసే వారికి సీఎం సహాయనిధి ఎంతో భరోసానిస్తుం దన్నారు.

మార్కెట్ కమిటీలకు అవగాహన కల్పించాలి



నవతెలంగాణ-సిటీబ్యూరో

మామిడి పండ్లను మగ్గించడానికి కెమికల్స్ వాడకంపై మార్కెట్ కమిటీలకు అవగాహన కల్పించాలి అని వినియోగదారుల హక్కుల సంస్థ ఫుడ్ సేఫ్టీ కమిషనర్‌ను కోరింది. గురువారం సంస్థ రాష్ట్ర అధ్యక్షులు రామగిరి హరిబాబు సూచనల మేరకు హానికరమైన రసాయనాలు పూసిన పండ్ల వాడకంతో కలిగే నష్టాల పై వినియోగదారులకు, వ్యాపారస్తులకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత ఆహార భద్రత కమిషనర్, ఆహార భద్రత నియంత్రణ అధికారులపై ఉందని వినియోగదారుల హక్కుల సంస్థ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దొమ్మాటి కిరణ్ కుమార్ ఫుడ్ సేఫ్టీ కమిషనర్ ఆర్.వి.కర్ణన్‌కి గుర్తు చేశారు. ఈ సందర్భంగా గత ఏడాది ఎస్ ఎస్ ఎస్ ఏ ఐ గైడ్ లైన్స్‌ని పక్కన పెట్టి అధిక మోతాదు రసాయనాలు వాడుతూ మామిడి పండ్లను మగ్గించి మార్కెట్లోకి వదిలారని, దాదాపు 25 లక్షల మెట్రిక్ టన్నుల మ్యాంగోలు మోతాదుకు మించి అనికరమైన రసాయనాలతో కలుషితమైన మామిడి పండ్లను మార్కెట్లో వినియోగదారులు కొని తినేటట్టు చేశారని, ఈ సంవత్సరం శ్రద్ధ వహించి కఠిన చర్యలు తీసుకోవాలని తెలియజేస్తూ సంస్థ తరఫున కమిషనర్ కలిసి వినతి పత్రం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మహిళా విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ జి.ప్రీతి, లక్ష్మి, ఇతరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ అభివృద్ధికి కృషి చేయాలి



- కాంగ్రెస్ కూకట్‌పల్లి ఇన్‌చార్జీ బండి రమేష్

నవతెలంగాణ-బాలానగర్

కూకట్‌పల్లి నియోజకవర్గం పరిధిలోని ఆయా ప్రాంతాలలో పదవులను అధీష్టించిన ప్రతి ఒక్కరు పూర్తి స్థాయిలో కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని కూకట్‌పల్లి కాంగ్రెస్ ఇన్‌చార్జి బండి రమేష్ పేర్కొన్నారు. ఇటీవల నియోజవర్గం యువజన కాంగ్రెస్ అధ్యక్షుడుగా ఎన్నికైన ఎండి సలీం బాలానగర్‌లోని పార్టీ కార్యాలయంలో గురువారం బండి రమేష్‌ను కలిసి పార్టీ ధ్రువ పత్రాన్ని పొందారు. ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ నియోజకవర్గంలో నూతనంగా చేపట్టిన పార్టీ పదవులను కేవలం ప్రజా సేవకు మాత్రమే వినియోగించాలన్నారు. ఎలాంటి అధికార దర్పానికి వినియోగించరాదని సూచించారు. ఈ నేపథ్యంలో యువజన కాంగ్రెస్ అధ్యక్షుడుగా నియమితులైన ఎండి. సలీంను బండి రమేష్ అభినందించారు. ఈ కార్యక్రమంలో ఏ బ్లాక్ ఉపాధ్యక్షులు మాదిరెడ్డి యుగంధర్ రెడ్డి, డివిజన్ అధ్యక్షుడు మధు గౌడ్, అస్లాం, మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి చిటకోరు కృష్ణ, భరత్, మేడ్చల్ జిల్లా ఫిషర్ మెన్ కమిటీ వైస్ చైర్మెన్ ఆకుల నరేందర్, రంగస్వామి, ప్రణతి, బాలరాజ్, పర్వేజ్, వెంకటేష్, థామస్ తదితరులు పాల్గొన్నారు.

విశాల్‌గౌడ్‌కు ఇంటర్నేషనల్ ఎక్సలెన్స్ అవార్డు అందజేత



- దుబాయిలో బహుకరించిన భారత ప్రభుత్వ కేంద్రమంత్రి రామదాస్ అథవలె
- 40 దేశాల ప్రతినిధులతోపాటు అవార్డును అందుకున్న విశాల్‌గౌడ్

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

హైదరాబాదులో చేసిన సామాజిక రాజకీయ సేవాకార్యక్రమాలకుగాను యువనాయకుడు, సేవాభావి కె.పి విశాల్‌గౌడ్‌కు ఇంటర్నేషనల్ ఎక్సలెన్స్ అవార్డును వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ సంస్థ భారత ప్రభుత్వ కేంద్ర మంత్రి రామదాస్ అథవలే చేతుల మీదుగా గురువారం బహూకరించింది. లండన్‌కు చెందిన వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ సంస్థ ప్రపంచవ్యాప్తంగా 40 దేశాల్లో 2024వ సంవత్సరంలో అత్యుత్తమ సామాజిక సేవలను అందిం చిన వారిని దుబాయిలోని పామ్ జుమేరియా హెూటల్ లో జరిగిన అవార్డుల బహుకరణ కార్యక్రమంలో ఘనం గా సత్కరించారు. యున్కెటెడ్ అరబ్ ఎమిరేట్స్ ఛాంబ ర్స్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి హమీద్ మొహమ్మద్ బిన్ సాలెం, దుబ్కై వరల్డ్ ట్రేడ్ సెంటర్ కార్యనిర్వాహక ఉపాధ్యక్షుడు మాహిర్ అబ్దుల్‌కరీమ్ జుల్ఫర్, వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్ సంస్థ అడ్వోకేట్ సంతోష్ శుక్లా, మిడిల్ ఈస్ట్ అధ్యక్షుడు డా.జితేంద్ర మత్లాని, యున్కెటెడ్ అరబ్ ఎమిరేట్స్ అల్ మఖ్తూమ్ ఫౌండేషన్ ట్రస్టీ మిర్జా అల్ సాహెగ్, యున్కెటెడ్ అరబ్ ఎమిరేట్స్ వైమానిక దళం కార్యనిర్వాహక డ్కెరెక్టర్ మొహమ్మద్ మాజ్కీ, డా.బహర్ అల్ హూదీ, ఇబ్రహీం యాహూద్, ఇతరుల సమక్షంలో ఈ కార్యక్రమం జరిగింది. కాగా కెపి విశాల్‌గౌడ్ 2010 నుంచి సుమారు ఒకటిన్నర దశాబ్దంగా హైదరాబాదు నగరంలో అనేక సేవా కార్యక్రమాలను విస్తృతంగా నిర్వ హిస్తూ వచ్చారు. అనేక సంఘటనల్లో ఎప్పుడూ బాధితు ల పక్షాన అండగా నిలుచారు. ముఖ్యంగా ఆయన ప్రతి ఏటా వరదలు వచ్చినపుడు, కరోనా సమయాల్లో రాత్రిం బవళ్ళు తన వద్ద వున్న వందలాది వాలంటీర్లు, కార్యకర్త లతో కలిసి విస్తృతంగా సేవలందించారు. వరదల్లో ఇళ్ళతో సహా నీట మునిగినపుడు వేలాది మందికి రాత్రికి రాత్రే భోజనాలను సమకూర్చడం, తాగునీటిని అందిం చడం, వారికి తాత్కాలికంగా దుప్పట్లు పంపిణీ చెయ్యడం, తాత్కాలిక పునరావాస కార్యక్రమాలు నిర్వహించడం వంటివి చేశారు. అయితే వీటన్నింటిని ఆయన ప్రచారానికి దూరంగా బాధితులకు అండగా నిలిచి సమకూర్చడం జరిగింది. వీటికి సంబంధించిన వివరాలు సేకరించిన వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ సంస్థ కెపి విశాల్ గౌడ్‌కు ఇంటర్నేషనల్ ఎక్సలెన్స్ అవార్డును బహుకరించింది.

కళాశాల నిర్మాణానికి భారీ విరాళం

నవతెలంగాణ-షాద్‌నగర్

ప్రభుత్వ జూనియర్ కళాశాల నిర్మాణానికి వెంకటేశ్వర హచరిస్ యాజమాన్యం రూ.25 లక్షల భారీ విరాళాన్ని ప్రభుత్వ రంగ సంస్థల చైర్మెన్, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర హచరిస్ జనరల్ మేనేజర్ కేజీ ఆనంద్, ఫైనాన్షియల్ మేనేజర్ శ్రీనివాసరావు చెక్కు రూపంలో ఎమ్మెల్యేకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లా డుతూ నిరుపేద విద్యార్థులు చదువుకునే ప్రభుత్వ జూనియర్ కళాశాల నిర్మించేందుకు సహకరిస్తున్న ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. ఒక్క పిలుపుతో ఇంత ఎత్తున కళాశాల నిర్మాణం కోసం నిధులు ఇవ్వడం సంతోషంగా ఉందన్నారు. ఈ కళాశాల నిర్మాణం భావితరాలకు దిశ నిర్దేశంగా నిలుస్తుందని కొనియాడారు. ఎంతోమంది నిరుపేద విద్యార్థులు ఇక్కడ చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించడానికి సహకరిస్తున్న ప్రతి ఒక్కరికి ఎప్పుడూ రుణపడి ఉంటానని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు చెంది తిరుపతిరెడ్డి, అల్వాల్ రెడ్డి, రవికుమార్, లింగారెడ్డిగూడెం అశోక్ తదితరులు పాల్గొన్నారు.

యువజన కాంగ్రెస్‌ను క్షేత్ర స్థాయిలో బలోపేతం చేయాలి

- తెలంగాణ రాష్ట్ర యువజన కాంగ్రెస్ ఇన్‌చార్జి సుర్వి ద్వివేది..



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

తెలంగాణ వ్యాప్తంగా యువజన కాంగ్రెస్‌ను క్షేత్రస్థాయిలో పటిష్టం చేయాలని రాష్ట్ర యువజన కాంగ్రెస్ ఇన్‌చార్జి సుర్వి ద్వివేది పిలుపునిచ్చారు. అఖిల భారత యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో 3 రోజుల పాటు కొనసాగిన 'యువక్రాంతి బునియాదీ' ముగింపు సందర్భంగా గోషామహల్ నియోజ కవర్గం యువజన కాంగ్రెస్ అధ్యక్షులు ఉజైర్ మీర్జాబేగ్‌కు రాష్ట్ర యువజన కాంగ్రెస్ ఇన్‌చార్జి సుర్వి ద్వివేది, రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షులు జక్కిడి శివచరణ్ రెడ్డిల చేతుల మీదుగా ప్రశంసా పత్రం అందజేశారు. గోషామహల్ నియోజకవర్గం యువజన కాంగ్రెస్ అధ్యక్ష పదవికి జరిగిన ఎన్నికల్లో ఘన విజయం సాధించిన ఉజైర్ మీర్జాబేగ్‌ను ఈ సందర్భంగా వారు అభినందించారు.

చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్స్ నూతన కార్యవర్గం ఏర్పాటు



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

హైదరాబాద్ జిల్లా చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్స్ యూనియన్ నూతన కార్యవర్గం ఏర్పాటైయింది. ఈ మేరకు టీఎన్జీవో కేంద్ర సంఘం అధ్యక్షుడు మారం జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి ముజీబని, హైద రాబాద్ జిల్లా అధ్యక్షుడు విక్రమ్ కుమార్, కార్యదర్శి కుర్రాడి శ్రీనివాస్ సమక్షంలో అధ్యక్షుడిగా వరకాల ప్రవీణ్ కుమార్, ఉపాధ్యక్షురాలుగా నాంపల్లి నాగ లక్ష్మి, సెక్రటరీగా వినోద్ కుమార్, జాయింట్ సెక్రటరగా మత్స్యగిరి, ట్రెజరరిగా భాస్కర్, ఆర్గనైజింగ్ సెక్రటరీ స్వప్న, పబ్లిసిటీ సెక్రటరీ నవీన్ శెట్టి లతోపాటు ఎగ్జిక్యూటివ్ కమిటీ మెంబర్లుగా వనిత, అలేఖ్యలు నియామక పత్రాలు అందుకున్నారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



నవతెలంగాణ-మెహిదీపట్నం

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయు హైదరాబాద్ సౌత్ జిల్లా కార్యదర్శి ఎం.శ్రవణ్ కుమార్, సీఐటీయు సీనియర్ నాయకులు విట్టల్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సీఐటీయు కార్వాన్ జోన్ కమిటీ ఆధ్వర్యంలో గ్రూప్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జీహెచ్ఎంసీ మున్సిపల్ కార్మికులు ఎన్నో సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. ఖాళీగా ఉన్న కార్మికుల పోస్టులను భర్తీ చేయకపోవడం వలన కార్మికులపై పని ఒత్తిడి చాలా పెరిగిందన్నారు. కార్మికులు లాంగ్ ఆబ్సెంట్ మెడికల్ అండ్ ఫిట్ లాంటి సమస్యలను ఎదుర్కొంటున్నారని ఈ సమస్యలను పరిష్కరించడానికి అధికారులు చొరవ చూపాలని కోరారు. కార్మికులకు పనిముట్ల కిట్టులు ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. పండగల రోజున కార్మికులకు సగం పని దినము ఉండాలని విజ్ఞప్తి చేశారు. కార్మికుల పోస్టులు ఖాళీ అయిన చోట్ల సంబంధిత కార్మికుల కుటుంబ సభ్యులకు ఆ పోస్టులలో అవకాశాలు ఇవ్వాలని కోరారు. అధికారులు స్పందించి కార్మికుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని లేకపోతే పోరాటం తప్పదని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ మున్సిపల్ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

స్టాండింగ్ కమిటీలో 15 అంశాలకు కమిటీ ఆమోదం

- ప్రభుత్వం జీహెచ్ఎంసీకి రూ.700 కోట్లు విడుదలపై కృతజ్ఞతలు తెలిపిన కమిటీ సభ్యులు





నవతెలంగాణ-సిటీబ్యూరో

నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అధ్యక్షతన గురువారం 8వ స్టాండింగ్ కమిటీ సమావేశం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూంలో జరిగింది. ముఖ్యంగా జీహెచ్ఎంసీలో పరిధిలోని రహదారుల విస్తరణ, మల్టీలెవల్ ఫ్లైఓవర్స్ నిర్మాణాలకు సంబంధించి ప్రభుత్వ అనుమతి కొరకు కార్పొరేషన్ ద్వారా సిఫార్సు చేస్తూ కమిటీ ఆమోదం తెలిపింది. కమిటీ సమావేశంలో 15 అంశాలు, 6 టేబుల్ ఐటమ్ లకు సభ్యులు ఆమోదించినట్లు మేయర్ తెలిపారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ స్టాండింగ్ కమిటీ సమావేశాలు స్నేహపూరిత వాతావరణంలో జరిగాయని, పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి పూర్తి చేసుకున్నామని, అందుకు పూర్తి స్థాయిలో స్టాండింగ్ కమిటీ సభ్యులందరూ సహకరించినందుకు ధన్యవాదాలు తెలిపారు. ప్రభుత్వం జీహెచ్ఎంసీ అభివృద్ధికి ఈ సంవత్సర కాలంలో రూ. 700 కోట్లు విడుదల చేసిందని తెలిపారు. రూ. 700 కోట్ల నిధులను విడుదల చేసిన ప్రభుత్వానికి స్టాండింగ్ కమిటీ సభ్యులందరూ కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మేయర్ క్రీడా ప్రాంగణాలపై సంబంధిత అధికారులు పూర్తి పర్యవేక్షణ చేసి జీహెచ్ఎంసీకి ఆదాయం సమకూరేలా చర్యలు చేపట్టాలని కోరారు. అత్యధికంగా ఆదాయం వస్తున్న క్రీడా ప్రాంగాణాలపై ప్రత్యేక దష్టి సారించాలన్నారు. కమిషనర్ ఇలంబర్తి మాట్లాడుతూ అధికారులు, ప్రజాప్రతినిధులు అందరూ సమన్వయంతో ప్రజల కోసం పనిచేయాలన్నారు. సభ్యులందరితో కలిసి పనిచేయడం తనకు ఒక మంచి అనుభవమన్నారు. నగర అభివద్ధిలో భాగంగా రోడ్ల విస్తరణ, జంక్షన్లు, పార్కులు, క్రీడా ప్రాంగణాల అభివద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. ఆయా అభివృద్ధి పనులకుగాను ప్రతి జోన్‌కు రూ. 25 కోట్ల చొప్పున నిధులు కేటాయించనున్నట్లు తెలిపారు. జీహెచ్ఎంసీకి సంబంధించిన ఆస్తుల వివరాలు, వాటిపై వస్తున్న ఆదాయ వివరాలను అందించాలని ఎస్టేట్ అడిషనల్ కమిషనర్ అశోక్ సామ్రాట్ కు కమిషనర్ సూచించారు. జీహెచ్ఎంసీకి సంబంధించిన ఆస్తులన్నింటినీ కాపాడేలా డిజిటలైజ్ చేసే ఆలోచనలో ఉన్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో స్టాండింగ్ కమిటీ సభ్యులు బన్నాల గీత ప్రవీణ్ ముదిరాజ్, మహమ్మద్ ముజాఫర్ హుస్సేన్, ఫాహెద్ బిన్ అబ్దుల్ సమద్ బిన్ అబ్దత్, మహమ్మద్ ఖాదిర్, పొడవు అర్చన, మహమ్మద్ నజీర్ ఉద్దీన్, గౌస్ ఉద్దీన్ మహమ్మద్, మహమ్మద్ రషీద్ ఫరాజుద్దీన్, సబీహా బేగం, ఆవుల రవీందర్ రెడ్డి, కంది శైలజ, అడిషనల్ కమిషనర్లు శివ కుమార్ నాయుడు, నళిని పద్మావతి, గీతా రాధిక, చంద్రకాంత్ రెడ్డి, సత్యనారాయణ, సుభద్రాదేవి, అశోక్ సామ్రాట్, అలివేలు మంగతాయారు, పంకజ, యాదగిరి రావు, రఘు ప్రసాద్, ఈ.ఎన్.సి భాస్కర్ రెడ్డి, సీ.ఈ కోటేశ్వరరావు, జోనల్ కమిషనర్లు హేమంత్ కేశవ్ పాటిల్, అపూర్వ చౌహాన్, అనురాగ్ జయంతి, రవికిరణ్, వెంకన్న, ఉపేందర్ రెడ్డి, చీఫ్ వెటర్నరీ అధికారి అబ్దుల్ వకీల్, చీఫ్ ఎగ్జామినర్ (అకౌంట్స్) వెంకటేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'ఇండియాలో ఇప్పుడేం చేయాలి' పుస్తకావిష్కరణ



నవతెలంగాణ-ముషీరాబాద్

సాదు మల్యాద్రి రచించిన 'ఇండియాలో ఇప్పుడేం చేయాలి' పుస్తకాన్ని గురువారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ప్రొఫెసర్ జిలకర శ్రీనివాస్ ఆవిష్కరించారు. బుద్ధిష్ ఈ సంజీవ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ప్రొఫెసర్ కాసీం, ప్రొఫెసర్ జేబీరాజు, సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు జి. రాములు, హాజరయ్యారు. ఈ సందర్భంగా జీలకర్ర శ్రీనివాస్, ప్రొఫెసర్ కాసీం మాట్లాడుతూ పుస్తకం కులం సమస్యను ఉత్పత్తి సంబంధాలకోణంలో విశ్లేశించి కుల ఉత్పత్తి సంబంధాలుగా ఈ దేశ ఉత్పత్తి సంబంధాలను కుల ఉత్పత్తి సంబంధాలుగా రచయిత ప్రకటించి కమ్యూనిస్టుల ముందు స్పష్టమైన ప్రతిపాదనలను ఉంచారని తెలిపారు. కులసంఘాలను నేరుగా కమ్యూనిస్టు పార్టీలే నిర్మిస్తే నిర్మాణాయుతంగా ఉంటాయాని ఆ పని చేసినప్పుడే కులాలు అగ్రకులాలతో పరస్పర సమానంగా ఎదగగలుగుతాయాని ఆ వైపుగా కమ్యూనిస్టులు, అంబేద్కరిస్టులు ఆలోచించాలని కోరారు. పుస్తకం రచయిత సాదు మల్యాద్రి మాట్లాడుతూ వీరన్న అమరత్వం తర్వాత ఆచరణ నుండి సిద్ధాంతాన్ని సమీక్ష చేసుకొని అభివృద్ధి చేసుకొని రాసిందే ఇండియాలో ఇప్పుడేం చేయాలి అనే రచన అని తెలిపారు. ఇప్పుడేం చేయాలి అని ఈ రచన ఆచరణ నుండి సిద్ధాంతాన్ని అభివృద్ధి చేసుకునే క్రమంలో వస్తున్న ఈ రచనలు మారోజు వీరన్నకు అంకితమిస్తున్నామున్నారు. ఈ కార్యక్రమంలో బీ.ఎల్.ఎఫ్ చైర్మెన్ నల్లా సూర్యప్రకాష్, సీపీఐ (ఎంఎల్, న్యూ డెమొక్రసీ) రాష్ట్ర నాయకులు జే.వీ చలపతిరావు, ఎంసీపీఐ రాష్ట్ర కార్యదర్శి గాదాగోని రవి, బీసీపి రాష్ట్రకార్యదర్శి కే. పర్వతాలు, బీ.ఎల్.పీ రాష్ట్ర అధ్యక్షులు దండి వెంకట్, బహుజన ముక్తి పార్టీ జాతీయ ఉపాధ్యక్షులు దాస్ రాం నాయక్, పి. రాంబాబు, ఎస్.సిద్ధి రాములు, తదితరులు ఈ సభలో పాల్గొని ప్రసంగించారు.

'మితవాద దాడిని తిప్పికొట్టండి'

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఈ.టీ నరసింహ



నవతెలంగాణ-హిమాయత్‌నగర్

మతతత్వం, నిరంకుశవాద శక్తులు ప్రాతినిధ్యం వహిస్తున్న మితవాద దాడిని తిప్పికొట్టాలని సీపీఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఈ.టీ నరసింహ పిలుపునిచ్చారు. గురువారం హిమాయత్‌నగర్‌లోని కామ్రేడ్ ఎస్. సత్యనారాయణరెడ్డి భవన్‌లో సీపీఐ హైదరాబాద్ జిల్లా కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ.టీ నరసింహ మాట్లాడుతూ ఈ శక్తులను సమర్థవంతంగా ఎదుర్కోవడానికి పార్టీని మరింత బలోపేతం చేయవలసిన అవసరముందన్నారు. మన జాతీయ జెండాను, రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని నమ్మని ఈ మతతత్వ శక్తులు రాష్ట్రంలో మతం పేరుతో ప్రజలను విడదీసి అక్రమంగా అధికారంలోకి రావడానికి కుట్రలు పన్నుతున్నారని, ఈ శక్తులను సమర్థవంతంగా ఎదుర్కోవడానికి అన్ని ప్రజాస్వామ్య శక్తులతో కలిసి సీపీఐ శ్రేణులు మూలస్థాయి నుండి పోరాటాలు నిర్మించాలని, ప్రజలతో ప్రత్యక్ష సంబంధాలను ఏర్పరచుకోని, ప్రజా ఉద్యమాలను అభివృద్ధి చేసుకోవాలన్నారు. ఈ సమావేశంలో సీపీఐ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి ఎస్.ఛాయాదేవి, రాష్ట్ర సమితి సభ్యులు చందు నాయక్, జిల్లా సహాయ కార్యదర్శి బి.స్టాలిన్, కార్యవర్గ సభ్యులు కంపల్లి శ్రీనివాస్, నెర్లకంటి శ్రీకాంత్, ఎండి. ఒమర్ ఖాన్, మామిడిచెట్ల వెంకటయ్య, కౌన్సిల్ సభ్యులు వెంకటయ్య, బొడ్డుపల్లి కిషన్, అరుట్ల రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్ఐసీలో క్లాస్-3, 4 ఉద్యోగాలు భర్తీ చేయాలి



- ఏఐఐఈఏ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి శ్రీకాంతా మిశ్రా

నవతెలంగాణ-హిమాయత్‌నగర్

భారతీయ జీవిత బీమా సంస్థ (ఎల్ఐసీ)లో క్లాస్-3, 4 ఉద్యోగాల ఖాళీల భర్తీ కొరకు వెంటనే రిక్రూట్మెంట్ చేపట్టాలని, అదే విధంగా ఆలిండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయిస్ అసోసియేషన్ (ఏఐఐఈఏ) సంఘానికి గుర్తింపు ఇవ్వాలని ఏఐఐఈఏ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి శ్రీకాంతా మిశ్రా డిమాండ్ చేశారు. ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయిస్ యూనియన్ హైదరాబాద్ డివిజన్ ఆధ్వర్యంలో ఈ రెండు డిమాండ్లతో ఈ నెల 11న సీఈవో పేరిట దేశంలోని అన్ని శాఖలు, కార్యాలయాలలోనూ వినతి పత్రాలు ఇచ్చినప్పటికీ, యాజమాన్యం నుండి ఎలాంటి స్పందన కనబడలేదని, ఈ నేపథ్యంలో గురువారం మధ్యాహ్నం జోనల్, డివిజనల్ ఆఫీసుల ఉద్యోగులతో పాటు, నగర శాఖల ఉద్యోగులు పాల్గొని, ఉద్యోగులంతా ఒక గంట పాటు విధులు బహిష్కరించి దేశవ్యాప్త సమ్మెలో పాల్గొన్నారు. సమ్మె ర్యాలీకి భారీ సంఖ్యలో హాజరైన ఉద్యోగులు తమ డిమాండ్లపై నినాదాలు చేశారు. ఈ సందర్భంగా శ్రీకాంతా మిశ్రా మాట్లాడుతూ ఎల్ఐసీలో క్లాస్-3, 4 ఉద్యోగాలకు గత కొన్ని దశాబ్దాలుగా రిక్రూట్మెంట్ చేపట్టలేదని, మరోవైపు ఏటా వేలాది ఉద్యోగులు సంస్థ నుంచి రిటైర్ అవుతుండడంతో పాలసీదారులకు అందించాల్సిన సేవల విషయంలో తీవ్ర ఒత్తిడి నెలకొందన్నారు. గత రిక్రూట్ మెంట్ సందర్భంలో నింపవలసిన 2,700 ఖాళీలను నేటి వరకు పూరించలేదని, ఈ సమస్య విషయంలో యాజమాన్యం చిత్తశుద్ధిని శంకించాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆయన పేర్కొన్నారు. అనంతరం దక్షిణ మధ్య జోనల్ సంయుక్త కార్యదర్శి జి.తిరుపతయ్య మాట్లాడుతూ బీమా రంగంలో అనుభవజ్ఞులైన వారితో సంప్రదించకుండా పెను మార్పులను చేపట్టడం ఈ రంగానికి గొడ్డలి పెట్టు కాగలదని ఆందోళన వ్యక్తం చేశారు. ఫ్రీ లుక్ పీరియడ్ ను ఒక నెల నుండి ఒక ఏడాదికి పొడిగించడం దేశంలో ఇన్సూరెన్స్ వ్యాపారానికి చాలా పెద్ద దెబ్బగా పరిణమించగలదని ఆయన అభిప్రాయపడ్డారు. రాబోయే రోజుల్లో ఇతర కార్మిక సంఘాలతో కలిసి మరిన్ని ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘం జాతీయ కోశాధికారి బి.ఎస్.రవి, సహాయ కోశాధికారి కె.ఎస్.రాజశేఖర్, జోనల్ ఉపాధ్యక్షులు డి.సుజాత, కోశాధికారి ఆర్.శ్రీనివాసన్, ఐసీఈయు హైదరాబాద్ డివిజన్ అధ్యక్షులు డి.గిరిధర్, ప్రధాన కార్యదర్శి ఎల్. మద్దిలేటి, ఉపాధ్యక్షులు ఎస్.ఝాన్సీ, ఉద్యోగ సంఘం సాంస్కృతిక బృందం ఆలపించిన విప్లవ గీతాలు అందరిని ఆకట్టుకున్నాయి.

రెండవ ఏఎన్ఎంల సమస్యలను పరిష్కరించాలి

- సమస్యల పరిష్కారానికి కమిషనర్ హామీ.. తాత్కాలికంగా సమ్మె విరమణ
- ఏఐటీయుసీ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం.నరసింహ



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

రెండవ ఏఎన్ఎంల సమస్యలను పరిష్కరించాలని నిరవధిక సమ్మెకు పిలుపునిచ్చిన తెలంగాణ రాష్ట్ర రెండవ ఏఎన్ఎంల యూనియన్ (ఏఐటీయుసీ) నాయకత్వంలో తెలంగాణ రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ కమిషనర్ ఆర్.వి.కర్ణన్‌తో జరిగిన చర్చలో వారి సమస్యల పరిష్కరిస్తామని ఇచ్చిన హామీ వలన తాత్కాలికంగా సమ్మెను విరమణ చేసినట్లు ఏఐటీయుసీ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం. నరసింహ వెల్లడించారు. గురువారం కోఠిలోని కమీషనర్ కార్యాలయంలో జరిగిన చర్చల అనంతరం రెండవ ఏఎంఎంలను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ చాలాకాలంగా పేరుకుపోయిన సమస్యలను పరిష్కరించడానికి మంచి అవకాశం కలిగిందన్నారు. పోస్టుల పెంపు కొరకు ఏఐటీయూసీగా తాము చేసిన పీహెచ్సీలలో ఓపీఏఎన్ఎం, అర్బన్ పీహెచ్సీలలో రెగ్యులర్ ఏఎన్ఎంల పోస్టులను మంజూరు చేసే విషయమై ప్రభుత్వ ప్రతినిధులతో మాట్లాడి సాధ్య అసాధ్యాలను వెల్లడిస్తామని తెలియజేశారన్నారు. పరీక్ష రాయటానికి అర్హతలేని రెండవ ఏఎన్ఎంలకు రిటైర్మెంట్ బెనిఫిట్, 100శాతం గ్రాస్ శాలరీని అమలు చేయడానికి ప్రభుత్వం సానుకూలంగా ఉందని వెల్లడించినట్లు ఆయన తెలిపారు. గత కొంతకాలంగా పెండింగ్‌లో ఉన్న ఏడు నెలల పీఆర్సీ బకాయిలను, సబ్ సెంటర్ అద్దె బకాయిలను మార్చి 31 తారీకు లోపు చెల్లిస్తామని హామీ ఇచ్చినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర రెండవ ఏఎన్ఎంల సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షులు తోట రామాంజనేయులు, రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జక్కుల పద్మ బోయిని శ్యామల ఉపాధ్యక్షులు తస్వీర్ సుల్తానా, రత్నకుమారి, జయమ్మ, గిరిజారెడ్డి, సహాయ కార్యదర్శులు గీతా రాణి, పార్వతి, సంధ్యారాణి, గోపమ్మ, కృష్ణవేణి, శైలజ, కోశాధికారి రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

హామీలు అమలు చేయడంలో రేవంత్ సర్కార్ విఫలం

- సీపీఐ న్యూడెమొక్రసీ కేంద్ర కమిటీ సభ్యులు కామ్రేడ్ సాధినేని వెంకటేశ్వరరావు



నవతెలంగాణ-ముషీరాబాద్

హామీలు అమలు చేయడంలో రేవంత్ సర్కార్ విఫలం చెందిందని ఆరు గ్యారంటీలను అమలు చేయాలని, ప్రజాస్వామిక హక్కులను, స్వేచ్ఛను కల్పించాలని సీపీఐ న్యూడెమొక్రసీ కేంద్ర కమిటీ సభ్యులు కామ్రేడ్ సాధినేని వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం సీపీఐ న్యూడెమొక్రసీ ప్రజలతో ప్రజాప్రదర్శన నిర్వహించింది. సుందర విజ్ఞాన కేంద్రం నుండి బయలుదేరిన ఈ ప్రజా ప్రదర్శన ఇందిరాపార్క్ వద్ద ప్రజా మహా ధర్నాగా మారింది. ఈ ధర్నాను సీపీఐ ఎంఎల్ న్యూడెమొక్రసీ తెలంగాణ రాష్ట్ర అధికార ప్రతినిధి జేవీ చలపతిరావు ప్రారంభించగా పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు కామ్రేడ్ సాధినేని వెంకటేశ్వరరావు ముఖ్య వక్తగా మాట్లాడుతూ రేవంత్ సర్కార్ వెంటనే తాను ఇచ్చిన 6 గ్యారంటీలను అమలు చేయాలన్నారు. లక్షలాదిమంది ప్రజలు పక్కా ఇండ్లు, రేషన్ కార్డుల కోసం ఎదురు చూస్తున్నారన్నారు. 15 నెలల కాలంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో రేవంత్ సర్కార్ వైఫల్యం చెందిందన్నారు. రైతు భరోసా రైతు బీమా రైతు కూలీలకు ఇస్తానన్న రూ.12 వేలు వెంటనే అమలు చేయాలని కోరారు. నిరుద్యోగ సమస్యను పరిష్కరించాలని పెండింగ్‌లో ఉన్న ఫీజు రియంబర్స్మెంట్ స్కాలర్‌షిప్‌లను విడుదల చేయాలని కోరారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడంతో రేవంత్ సర్కార్‌పై అన్ని వర్గాల ప్రజలు తీవ్రమైన అసంతృప్తిలో ఉన్నారన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడానికి నిర్దిష్టమైన కార్యాచరణను ప్రజల ముందు ఉంచాలన్నారు. ప్రజా పాలన పేరుతో దరఖాస్తులు చేసుకున్నాక మళ్లీ మీ సేవలో దరఖాస్తులు తీసుకోవాల్సిన అవసరం ఎందుకొస్తుందన్నారు. ఏడవ గ్యారెంటీ అయిన ప్రజాస్వామ్య పాలన అమ లు జరగడం లేదని దీనికి ఎన్‌కౌంటర్లు, కుట్ర కేసులే నిదర్శనమ న్నారు. ప్రజాస్వామ్య పాలన అమలు చేయకపోగా లగచర్ల గిరిజన రైతాంగంపై అక్రమ కేసులు పెట్టి జైల్‌లో నిర్బంధించింద న్నారు. కార్మికుల వేతనాలు పెంచాలని బీడీ కార్మికులకు జీవన భృతి ఇవ్వాలని ఆటో కార్మికులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజలకు ఇచ్చిన హామీలు అన్నింటిని అమలు చేయాలని లేకుంటే మరోసారి తెలంగాణలో మిలిటెంట్ ఉద్యమం ముందుకు వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో న్యూడెమొక్రసీ రాష్ట్ర నాయకులు ఆవునూరి మధు, కే.గోవర్ధన్, ఏఐకేఎంఎస్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు వి.కోటేశ్వరరావు, పీఓడబ్ల్యు జాతీయ నాయకులు గాదె ఝాన్సీ, వీ.సంధ్య, ఐఎఫ్‌టీయు ఆల్ ఇండియా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, ఏఐకేఎంఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మండల వెంకన్న, ఐఎఫ్‌టీ యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.శ్రీనివాస్, పీడీఎస్‌యు జాతీయ నాయకులు మహేష్, తదితర నాయకులు పాల్గొన్నారు.

క్యాట్ ఒలంపియాడ్ పరీక్షలో 'నల్లకుంట' శ్రీ చైతన్య విజయ ప్రభంజనం



నవతెలంగాణ-హిమాయత్‌నగర్

నల్లకుంట శ్రీ చైతన్య పాఠశాలలో క్యాట్ ఒలంపియాడ్ పరీక్షలో విద్యార్థులు తమ ప్రతిభను మరోసారి రుజువు చేసి విజయ ప్రభంజనం సృష్టించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ తమ పాఠశాల విద్యార్థులు ఇంతటి ఘన విజయాన్ని సాధించి, బ్రాంచీ పేరును పతాకస్థాయిలో నిలబెట్టిన ప్రతి విద్యార్థిని అభినందించారు. ఉత్తమ ఫలితాల్లో 22 నగదు పురస్కారాలు, 78 మెడల్స్, 79 మెరిట్ సర్టిఫికెట్లు సాధించారని, ఇంతటి ఖ్యాతిని సాధించిన విద్యార్థులందరిని జోన్ ఏజీఎం నూర్ మహమ్మద్ అలీ ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల జోనల్ కో-ఆర్డినేటర్ పుల్లారావు, అకాడమిక్ డీన్ నీలగిరి, సీఎంపీఎల్, ఐపీఎల్ ఇన్‌చార్జిలు రవి, మురళీ, నీరజ, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

'23న పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం'

- పాఠశాల కరస్పాండెంట్ ఎం.శ్రీలత గౌతమ్

నవతెలంగాణ-హిమాయత్ నగర్

హైదరాబాద్ జిల్లా భాగ్య మెమోరియల్ బాలికల ఉన్నత పాఠశాల ఆధ్వర్యంలో 23న పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహిస్తున్నామని పాఠశాల కరస్పాండెంట్ ఎం.శ్రీలత గౌతమ్, ప్రధానోపాధ్యాయురాలు రత్నమేరి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. చాదర్ ఘాట్‌లోని తమ పాఠశాల ప్రక్కనే ఉన్న విక్టరీ ప్లేగ్రౌండ్‌లో ఈ ఆత్మీయ సమ్మేళనం జరుగుతుందని, సుమారు 1,000 మంది పూర్వ విద్యార్థులు హాజరయ్యే అవకాశం ఉందని, ఉదయం 10 గంటలకు జ్యోతి ప్రజ్వలన, వేద పఠనంతో ప్రముఖుల ప్రసంగాలు ప్రారంభమవుతాయని, ముఖ్య అతిథిగా తెలుగు విశ్వవిద్యాలయం మాజీ వైస్-ఛాన్సలర్ ఆవుల మంజులత పాల్గొంటారని, సాయంత్రం 3 గంటల నుంచి సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయని వారు వివరించారు.

నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో సిరిపురం యాదయ్య ఆత్మ బలిదానం చేసుకొని 15ఏండ్లు అయ్యింది. ఈ సందర్భంగా ప్రజా ఏక్త పార్టీ కేంద్ర కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూల మాలవేసి నివాళులర్పించిన జాతీయ అధ్యక్షులు బోనాల శ్రీనివాస్, ఇతర నాయకులు తదితరులు



ప్రజా వ్యతిరేక బడ్జెట్‌ను వెంటనే ఉపసంహరించుకోవాలి

- సీపీఐ(ఎం) చార్మినార్, బహదూర్ పుర జోన్ కమిటీ
- సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో చార్మినార్ బస్టాండ్ వద్ద నిరసన



నవతెలంగాణ-ధూల్‌పేట్

కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక బడ్జెట్‌ను వెంటనే ఉపసంహరించుకోవాలని సీపీఐ(ఎం) చార్మినార్, బహదూర్ పుర జోన్ కార్యదర్శి అబ్దుల్ సత్తార్ కమిటీ సభ్యులు ఎం.మీనా లు డిమాండ్ చేశారు. సీపీఐ(ఎం) చార్మినార్, బహదూర్ పుర జోన్ కమిటీ ఆధ్వర్యంలో బస్టాండ్ పక్కన కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌కు వ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ఈనెల 8న ప్రవేశపెట్టిన రూ.50 లక్షల కోట్ల బడ్జెట్ ప్రజా వ్యతిరేకమైనదన్నారు. ఈ బడ్జెట్‌లో కార్మికుల, మహిళ, మైనారిటీ, యువత అన్ని వర్గాలకి అన్యాయం చేసి, కేవలం బడాబాబుల ఉపయోగకరంగా ఈ బడ్జెట్‌ను తయారు చేసినట్లు ఉందన్నారు. ముఖ్యంగా బీజేపీ పాలిత రాష్ట్రాలను అనుకూలంగా బడ్జెట్ ఉందని ఇతర రాష్ట్రాలకు మొండి చెయ్యి ఇచ్చిందని ఆరోపించారు. ప్రస్తుత పరిస్థితుల్లో పెరుగుతున్న ధరలకు అనుగుణంగా బడ్జెట్‌ను తయారుచేసి పేదలకి అన్ని వర్గాలను ఆదుకోని ప్రోత్సాహించి అభివృద్ధి పరచాల్సిన కేంద్ర ప్రభుత్వం ప్రజా ఆశలపై నీళు చెల్లిందన్నారు. బీజేపీ ప్రభుత్వం బడ్జెట్‌లో సవరణ చేయాలన్నారు. ఈ బడ్జెట్‌లో మైనారిటీలకు తీవ్రమైన అన్యాయం జరిగిందన్నారు. ఇప్పటికైనా అన్ని వర్గాలకు అనుకూలంగా అభివృద్ధి పరచే విధంగా బడ్జెట్లో సవరించాలని జోన్ కమిటీ డిమాండ్ చేస్తున్నదన్నారు. జాతీయ ప్రజా పంపిణీ వ్యవస్థని మెరుగుపరిచి కనీసం 14 రకాల నిత్యవసర సరుకులు రేషన్ షాపుల ద్వారా ఇవ్వాలన్నారు. లక్షల కోట్ల రూపాయలు పెద్దోళ్ళకి రాయితీలిచ్చి, పేదలను పూర్తిగా విస్మరించిందన్నారు. దేశంలో మతోన్మాద గొడవలు సృష్టించి విద్వేష రాజకీయాలు కొనసాగిస్తూ ప్రశ్నించడానికి అవకాశం లేకుండా ఆటంక పరుస్తున్న ఈ ప్రభుత్వం తక్షణమే అన్ని వర్గాలకు న్యాయం చేకూర్చే రకంగా బడ్జెట్‌లో సవరణ చేయాల్సిందేనని డిమాండ్ చేశారు. జోన్ కమిటీ సభ్యులు బాబర్ ఖాన్ అధ్యక్షతనలో జరిగిన ఈ నిరసన కార్యక్రమంలో గులాబ్ నసీర్, మహమ్మద్ హాజీ, మహమ్మద్ ఇబ్రహీం, షేక్ చాంద్ పాషా తదితరులున్నారు.

వరల్డ్ కరాటే ఫెడరేషన్ జడ్జ్‌గా సయ్యద్ ఇఫ్తాకర్ హుస్సేన్ ఎన్నిక..



నవతెలంగాణ-ధూల్‌పేట్

వరల్డ్ కరాటే ఫెడరేషన్ జడ్జ్‌గా సయ్యద్ ఇఫ్తాకర్ హుస్సేన్ శుక్రవారం ఎన్నికయ్యారు. యూఏఈ కన్సర్డ్ హెూటల్ లో వరల్డ్ కరాటే ఫెడరేషన్ కుమిటే జడ్జ్ పరీక్షలో పాల్గొని ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కరాటే జడ్జ్‌గా తనవంతు పాత్ర నిర్వర్తించడానికి కృషి చేస్తానన్నారు. కరాటే ఇండియా ఆర్గనైజషన్ అధ్యక్షులు హ్యాంషి భరత్ శరం, ప్రధాన కార్యదర్శి షిహన్ సంజీవి ఝాంగ్ర, టీఎస్కేడీఏ అధ్యక్షులు మాషెస్ గౌడ్, షిహన్ డి. విజయ్ కుమార్ తన విజయం సాధించినట్లు వారికీ ధన్యవాదాలు తెలిపారు.

అమృతం కన్నా అమ్మ భాషే మిన్న

- సిటీ కాలేజీ ప్రిన్సిపాల్ ఆచార్య పి.బాల భాస్కర్



నవతెలంగాణ-ధూల్‌పేట్

అమృతం కన్నా అమ్మ భాషే మిన్న అది ఎంతో మధురమైనదని సిటీ కాలేజీ ప్రిన్సిపాల్ ఆచార్య పి.బాల భాస్కర్ అన్నారు. ఎన్ని భాషలు నేర్చి, ఎంత ఎత్తుకు ఎదిగినా మన భావాలను, ఆలోచనలను మాతృభాషలోనే ప్రకటించటానికి ఇష్టపడతామన్నారు. అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవ రజతోత్సవాల సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక సదస్సులో ఆయన విద్యార్థులను, అధ్యాపకులను ఉద్దేశించి మాట్లాడారు. ఈ సందర్భంగా ముందుగానే కాలేజీలో తెలుగు, హిందీ, ఉర్దూ, కన్నడ, మరాఠీ, మధుర, భోజ్ పురి, కోయ, గొండి, బంజారా, పంజాబీ, మలయాళం, ఒడియా, మైథిలి భాషల విద్యార్థులు తమ సంస్కృతి, తమ ప్రత్యేక పండుగలు, కుటుంబ సంబంధాలు, మానవ సంబంధాలు, సిటీ కళాశాలపై తమ అభిప్రాయం తదితర అంశాలను తమ మాతృభాషలో వ్యక్తీకరించారు. సిటీ కాలేజిలో రాష్ట్రంలోని 33 జిల్లాల విద్యార్థులు చదువుకొంటున్నారన్నారు. ఇదొక మినీ తెలంగాణగా గుర్తింపు పొందితే ఇవ్వాళ మాతృభాష దినోత్సవ సదస్సులో పద్నాలుగు భాషల విద్యార్థులు పాల్గొని తమ తమ మాతృ భాషలలో మాట్లాడటం అనిర్వచనీయమైన అనుభూతిని ఇచ్చిందన్నారు. ప్రస్తుతం సిటీ కాలేజీని మినీ ఇండియాగా పేర్కొనవచ్చని, ఇటీవల కాలేజీని సందర్శించిన నాక్ బృందం కూడా ఈ అరుదైన విశేషాన్ని అభినందించిందని గుర్తు చేశారు. ఐక్యూయేసి ఆధ్వర్యంలో జరిగిన ఈ సదస్సును డాక్టర్.జె.నీరజ నిర్వహిం చారు. ఈ సదస్సులో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్.విప్లవ దత్ శుక్లా, డాక్టర్.కోయి కోటేశ్వర రావు, అవధానం సుజాత, డాక్టర్. సూర్య నారాయణ మూర్తి, డాక్టర్.అనంత లక్ష్మి, డాక్టర్.కమల సుధారాణి, డాక్టర్.సుజాత అజ్మీరా, డాక్టర్.రాజేంద్ర కుమార్, డాక్టర్.అజరార్ ఉల్ హక్, డాక్టర్.ఝాన్సీ తదితరులున్నారు.



ఏ రంగంలోనైనా సక్సెస్ సాధించాలంటే స్త్రీకి ఎన్నో ఇబ్బందులు ఎదురవుతాయని ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. స్త్రీకి కష్టపడి లక్ష్యాన్ని సాధించే సామర్థ్యం ఉన్నా చాలామంది చిన్నచూపు చూస్తారనే సంగతీ తెలిసిందే. అయినా మహిళలు అన్నింటినీ ఎదుర్కొంటూ ఎన్నో విజయాలు సాధిస్తున్న విషయం కూడా తెలిసిందే. అలాగే రెనీ జాయ్ కూడా అనేక ఆటంకాలను ఎదుర్కొని ఇప్పుడు స్ఫూర్తిగా నిలిచారు. ఎంతో మంది నుండి ప్రశంసలు అందుకుంటున్నారు. ప్రస్తుతం ఆమె ఢిల్లీలో కార్పొరేట్ అడ్వకేట్‌గా ఉన్నారు. బాధిత మహిళల గొంతుగా మారారు. అంతేకాదు అలేఖ్ ఫౌండేషన్ ద్వారా పేద మహిళలు, పిల్లలకు ఫ్రీగా వృత్తివిద్యాకోర్సులను నేర్పుతున్న ఆమె పరిచయం...







బాధిత మహిళల గొంతుగా...

రెనీ జాయ్ తాత ఓ ఆర్మీ ఉద్యోగి. దేశంలో వివిధ ప్రాంతాల్లో ఉద్యోగాలు చేశారు. చివరకు ఢిల్లీలో స్థిరపడ్డారు. తల్లిదండ్రులకు ఈమె ఒక్కతే సంతానం. తన చిన్నతనంలోనే తల్లిదండ్రులు విడిపోయారు. దీంతో తండ్రి నుండి ఆమెకు ఎలాంటి సహకారం, ఆదరణ లభించలేదు. ఇలాంటి పరిస్థితుల్లో అమ్మమ్మ, తాతయ్యలే ఈమెకు తల్లిదండ్రులయ్యారు. వీళ్ల ఆలనాపాలనాలో తండ్రి తమతో లేడనే భావనే లేకుండా పెరిగారు. ఆ రోజుల్లో భార్య, భర్త నుండి విడిపోవడం సమాజం దృష్టిలో పెద్ద నేరం. అందుకే వాళ్లు చాలా కాలం విడాకులు తీసుకోలేదు. రెనీ కాలేజీ చదువుకు వచ్చిన తర్వాత చట్టబద్ధంగా విడిపోయారు. సమాజం ఇలా ఆలోచించడం వల్ల ఆ సమయంలో ఆమె తమ తల్లిదండ్రులు విడిపోయారని ఎవరీ చెప్పలేకపోయారు. ఎందుకంటే ఈ విషయం తెలిస్తే తన తోటి వాళ్లు తన గురించి ఎలా ఆలోచిస్తారో అని ఆమె భయపడ్డారు. ఇలా ఆమె చిన్నతనం కొంత బాధాకరమైన వాతావరణంలో గడిచిపోయింది.



అమ్మమ్మ ప్రభావంతో...

రెనీకి తన తల్లిదండ్రులు విడిపోవడానికి కారణాలు తెలిసిన తర్వాత ఆడపిల్లలు తమ కాళ్లపై తాము నిలబడాలనే విషయం బాగా అర్థమయింది. అమ్మమ్మ ఆమెతో ఎప్పుడూ 'ఎంత సంపాదించినా, ఏ పని చేసినా ఫర్వాలేదు. కానీ, నీ కాళ్ల మీద నువ్వు నిలబడటమే ముఖ్యం. కుటుంబంలో ఏ సమస్య వచ్చినా దాన్ని పరిష్కరించే ఉపాయాలు కనుక్కోవాలి' అనేది. ఈ మాటలు రెనీపై ఎంతో ప్రభావాన్ని చూపాయి. అలాంటి వాతావరణంలో పెరగడం వల్ల పెద్దయ్యాక మహిళల హక్కుల కోసం పోరాడాలనే ఆలోచన ఆమెలో కలిగింది.

చదువు పూర్తి చేసిన తర్వాత బ్యాంకింగ్ రంగంలో సేల్స్ అండ్ మార్కెటింగ్ టీమ్‌లో చేరింది.

చిన్న వయసులోనే...

రెనీ తల్లి ఓ జాతీయ బ్యాంకులో ఉద్యోగం చేసేది. అక్కడ ఒత్తిడి ఎక్కువగా ఉండేది. అందుకే బ్యాంకు ఉద్యోగాల్లో చేరవద్దని కూతురిని సలహా ఇచ్చేది. అయితే ఆమె మార్కెటింగ్ రంగంలో ఏదైనా చేయాలనుకుంది. అందుకే బ్యాంకులో అవకాశం రాగానే దాన్ని వదులుకోలేకపోయింది. ప్రతి పనినీ నేర్చుకునేందుకు శ్రద్ధ పెట్టింది. పదకొండేండ్లు బ్యాంకులో పని చేసింది. అక్కడ తన పనితీరుతో చిన్న వయసులోనే బ్యాంక్ వైస్ ప్రెసిడెంట్‌గా పదోన్నతి పొందింది. ఒకానొక సమయంలో ఉద్యోగంపై విసుగు వచ్చి స్టాక్ మార్కెట్‌లో కన్సల్టింగ్ పని ప్రారంభించింది. స్టాక్ మార్కెట్‌లో తీవ్ర నష్టాలు వచ్చాయి. వ్యాపార భాగస్వాములు ఆమెను మోసం చేశారు. ఉద్యోగం మానేసిన ఏడాదిన్నర పాటు ఆమె తీవ్రమైన ఆర్థిక సమస్యలు ఎదుర్కొన్నారు.

ఎప్పుడూ చిన్నచూపే

జీవనోపాధి కోసం తిరిగి బ్యాంక్ ఉద్యోగంలోనే చేరాల్సి వచ్చింది. అయితే బ్యాంకింగ్ అనుభవాన్ని సద్వినియోగం చేసుకోవడానికి సీనియర్ల సలహాతో లా చదివారు. అప్పటికే ఆమెకు నాలుగేండ్ల కూతురు ఉంది. ఓ వైపు ఉద్యోగం, మరోవైపు చదువు, ఇల్లు... వీటన్నింటినీ సమన్వయం చేసుకోవడం అంత సులభంగా జరగలేదు. మన సమాజంలో స్త్రీల పనికి అంత త్వరగా అంగీకారం లభించదు. ఎందుకంటే స్త్రీ సామర్థ్యాలపై సమాజానికి ఎప్పుడూ చిన్నచూపే ఉంటుంది. అటువంటి పరిస్థితుల్లో క్లయింట్స్‌ను ఒప్పించడానికి, వారిలో విశ్వాసం కలిగించడానికి ఆమె రెండు రెట్లు కష్టపడాల్సి వచ్చింది. దీని కోసం తన దృక్పథాన్ని, పని విధానాన్ని మార్చుకుంది. తనని తాను ఉత్సాహపరచుకుంది. మెల్లగా తన లక్ష్యం వైపు కదిలి ఈ రోజు ఈ స్థితికి చేరుకుంది.

మహిళల కోసం...

కెరీర్‌లో తిరిగి పుంజుకున్నా రెనీ తన వ్యక్తిగత జీవితంలో మాత్రం కొన్ని సవాళ్లు ఎదుర్కోవలసి వచ్చింది. భర్త నుండి అనేక విషయాల్లో అభిప్రాయ భేదాలు తలెత్తడంతో ఇద్దరూ విడిపోయే పరిస్థితి వచ్చింది. అయితే భార్యాభర్తలుగా కాకుండా స్నేహితులుగా ఉండాలని ఇద్దరూ నిర్ణయించుకున్నారు. విడిగా ఉంటున్నా కూతురి పెంపకం విషయంలో మాత్రం ఇద్దరూ కలిసి నిర్ణయాలు తీసుకుంటున్నారు. ఇప్పటి వరకు రెనీ కుటుంబంలో లా చదివిన వారు ఎవరూ లేరు. ఇప్పుడు రెనీ చాలా కేసుల్లో మహిళల తరపున నిలబడి న్యాయం కోసం పోరాడుతుంది. ఈ రంగంలో లీగల్ అడ్వైజర్‌గా తనదైన ముద్ర వేయగలిగింది. 2015లో అలేఖ్ ఫౌండేషన్ ప్రారంభించింది. దీని ఆధ్వర్యంలో మహిళల జీవితాలను మెరుగుపరిచే పనిని చేపట్టింది. లైంగిక వేధింపులకు గురైన పిల్లలు, మహిళలకు ఉచిత న్యాయ సహాయం అందిస్తుంది. ఫౌండేషన్ ద్వారా బాలికా విద్య, వృత్తి విద్యలలో నైపుణ్యాలకు సంబంధించిన కోర్సులు ఇవ్వడంలో కృషి చేస్తుంది. అలాగే రొమ్ము క్యాన్సర్, పీరియడ్స్, శానిటేషన్ వంటి ఆరోగ్య సమస్యలపై మహిళలకు అవగాహన కల్పిస్తుంది.

పర్యావరణంపై అవగాహన

న్యాయ సలహాలు, ఆరోగ్యంతో పాటు నిరుపేద బాలికల చదువుకు బాధ్యత కూడా తీసుకుంది. నాగాలాండ్‌లో సౌండ్ ఇంజనీరింగ్‌లో శిక్షణ ఇచ్చేందుకు ఆ సంస్థతో వీరి ఫౌండేషన్ టై అప్ అయ్యింది. దీనికి అయ్యే ఖర్చులను ఫౌండేషనే భరిస్తుంది. పర్యావరణానికి మేలు జరిగేలా అవగాహన, ప్రచారం నిర్వహిస్తున్నారు. వాతావరణ మార్పుల నుండి చెట్లను రక్షించడం, ప్లాస్టిక్ వాడకాన్ని నిరోధించడం, పేపర్‌లెస్ జీవనశైలిని ప్రోత్సహించడం చేస్తున్నారు.

ఇవి కూడా సంకేతాలు కావొచ్చు..

ప్రస్తుతం ప్రపంచాన్ని భయపెడుతోన్న అంశాల్లో డయాబెటిస్ ఒకటి. రోజురోజుకీ ఈ వ్యాధి బారినపడుతోన్న వారి సంఖ్య క్రమంగా పెరుగుతోంది. అందులో మన దేశంలో మరీ ఎక్కువగా ఉంది. వయసుతో బేధంలేకుండా డయాబెటిస్ సోకడం ఆందోళన కలిగిస్తోంది. అయితే డయాబెటిస్‌ను మొదటి దశలోనే గుర్తించి జీవన విధానంలో మార్పులు చేసుకుంటే సమస్య నుంచి బయటపడొచ్చని నిపుణులు చెబుతున్నారు. డయాబెటిస్ సమస్యను శరీరం మనల్ని ముందుగానే అలర్ట్ చేస్తుంది.

సాధారణంగా డయాబెటిస్ అనగానే కంటి సంబంధిత సమస్యలు, అధికంగా మూత్ర విసర్జన, గాయాలు త్వరగా మానకపోవడం వంటి సమస్యలే అనుకుంటారు. కానీ చర్మ సంబంధిత సమస్యలు కూడా డయాబెటిస్‌కు ప్రాథమిక లక్షణాలుగా చెప్పొచ్చని నిపుణులు చెబుతున్నారు. అవేంటో తెలుసుకుందాం.

చర్మంపై దురద, ఎర్రగా మారటం వంటి సమస్యలు డయాబెటిస్ ప్రాథమిక లక్షణంగా భావించాలని అంటున్నారు. డయాబెటిస్ బారిన పడిన వారిలో చర్మంపై పొక్కులు కనిపిస్తాయి. ముఖ్యంగా కాళ్లు, చేతుల వేళ్లపై బొబ్బలు ఎక్కువగా కనిపిస్తాయి. అయితే అప్పుడప్పుడు వచ్చే ఈ బొబ్బలు సాధారణంగా మూడు వారాల తర్వాత వాటంతటవే తగ్గిపోతాయి. రక్తంలో షుగర్ లెవల్స్ పెరిగితే ఇలాంటి లక్షణాలు కనిపిస్తాయి. డయాబెటిస్ బాధితుల్లో స్క్లెరోసిస్ వచ్చే ప్రమాదం కూడా ఉంది. ఇందులో చర్మం సాధారణం కంటే మందంగా మారుతుంది. టైప్-1, టైప్-2 మధుమేహంతో బాధపడుతున్న వ్యక్తుల్లో ఈ సమస్య ఎక్కువగా కనిపిస్తుంది. వేళ్లు, కాళ్ల చర్మం మందంగా మారుతుంది. రక్తంలో చక్కెర స్థాయిలు పెరగడానికి ఇదొక సంకేతంగా చెప్పొచ్చు. ఈ సమస్య కారణంగా చర్మంపై చిన్న చిన్నగా కనిపించే ఎర్రటి మచ్చలు ఏర్పడతాయి. కాబట్టి చర్మంపై ఇలాంటి మార్పులు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించి సంబంధిత పరీక్షలు చేయించుకోవాలి.

కేఆర్ఎంబీకి మంత్రి ఉత్తమ్ ఫిర్యాదు

నేడు బోర్డు సమావేశం

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కృష్ణా జలాలను అక్రమంగా తరలిస్తున్నదని తెలంగాణ నీటిపారుద ల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కేఆర్ఎంబీకి ఫిర్యాదు చేశారు. ఈనేపథ్యంలో కేఆర్ఎంబీ చైర్మెన్ అతుల్‌జైన్ అధ్యక్షతన శుక్రవారం మధ్యాహ్నం బోర్డు సమావేశం కానుంది. శ్రీశైలం, నాగార్జునసాగర్ నుంచి నీటిని ఏపీ ప్రభుత్వం తరలిస్తున్నదనీ, వెంటనే అడ్డుకోవాలని మంత్రి ఉత్తమ్ ఫిర్యాదులో పేర్కొన్నారు. శ్రీశైలం, నాగార్జునసాగర్ ప్రాజెక్టుల పరిధి లో 35 ప్రాంతాల్లో టెలిమెట్రీ పరికరాలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం కోరు తున్నది. ఈ అంశంపై ప్రధానంగా చర్చ జరిగే అవకాశం ఉన్నట్టు తెలిసింది.

అక్రమంగా ఏపీ నీళ్ల తరలింపు

(మొదటిపేజి తరువాయి)

విమర్శించారు. గురువారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో లక్షల ఎకరాల్లో పంటలు ఎండిపోతున్నాయనీ, వేసవిలో తాగునీటి సమస్య ఎదురయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. సాగర్ కుడి కాల్వ నుంచి ఏపీ ప్రభుత్వం రోజూ 10 వేల క్యూసెక్కుల నీటిని తరలించుకుపోతున్నదని తెలిపారు. కృష్ణా జలాల్లో ఏపీ తాత్కాలిక వాటా 512 టీఎంసీలనీ, కానీ ఇప్పటి వరకు 657 టీఎంసీలు తరలించారని చెప్పారు. గడిచిన 25 రోజుల్లో 60 టీఎంసీలు తరలించారన్నారు. సీఆర్పీఎఫ్ బలగాలను వెంటనే ఉపసంహరించుకోవాలని ఆనాడు అసెంబ్లీలో తీర్మానం చేశామనీ, నాగార్జున సాగర్‌ను తెలంగాణ ఆధీనంలోకి తీసుకోవాలని కోరుతూ 2023 నవంబర్ 30న అసెంబ్లీలో తీర్మానం చేసినట్టు తెలిపారు. అయినా ఏడాది కాలంగా రాష్ట్రం చేతుల్లోకి తీసుకోలేకపోయిందని విమర్శించారు. కేంద్రాన్ని, చంద్రబాబు ను అడిగే ధైర్యం సీఎం రేవంత్ రెడ్డికి లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఏడాది ఏపీకి 666 టీఎంసీల వాటా ఉందనీ, ఇప్పటికే 657 టీఎంసీలు వాడుకోగా, మిగిలింది 9 టీఎంసీలే అని గుర్తు చేశారు. తెలంగాణకు ఆ రేషియో ప్రకారం చూసినా... 343 టీఎంసీల నీళ్లు రావాలని వివరించారు. తెలంగాణ 220 టీఎంసీలు వాడుకోగా, ఇంకా 123 టీఎంసీలు రావాల్సి ఉందని గుర్తు చేశారు. ఈ రెండింటిని కలిపితే 132 టీఎంసీల నీరు కాగా, శ్రీశైలం, సాగర్‌లో కలిపి 100 టీఎంసీలే ఉండటంతో తెలంగాణ నష్టపోతున్నదని చెప్పారు. మిగిలిన వంద టీఎంసీలోనూ ఏపీ నీటిని తరలిస్తున్నదని తెలిపారు. సాగర్ ఎడమ కాల్వ కింద నల్లగొండలో లక్షా 45 వేల ఎకరాలు, సూర్యాపేటలో 2 లక్షలా 35వేల ఎకరాలు, ఖమ్మంలో 2 లక్షల పైగా ఎకరాలు, మొత్తంగా 6 లక్షలా 38 వేల ఎకరాల్లో రైతులు పంటలు వేసుకున్నారని హరీశ్‌రావు తెలిపారు. వీటికి నాలుగు తడులకు దాదాపు 30 నుంచి 35 టీఎంసీల నీరు అవసరమన్నారు. కేంద్ర జలశక్తి మంత్రి కార్యాలయం ముందు ధర్నా చేద్దామని సూచించారు. అఖిలపక్షాన్ని తీసుకెళ్లాలని కోరారు. ఇంత జరుగుతున్నా కాంగ్రెస్, బీజేపీ ఎంపీలు మౌనంగా ఉన్నారనీ, 16 మంది గెలిచి ఏం లాభమని ప్రశ్నించారు. జలదోపిడీకి సీఎం రేవంత్ రెడ్డి సహకరిస్తున్నారని ఆరోపించారు. ప్రతి సంవత్సరం కేఆర్ఎంబీ పరిధిలోని ఉమ్మడి ప్రాజెక్టులకు సంబంధించి నీటి వినియోగానికి త్రిమెన్ కమిటీ సమావేశం నిర్వహించాల్సి ఉంటుందని తెలిపారు. ఈ ఏడాది ఇంతవరకు త్రిమెన్ కమిటీ మీటింగ్ పెట్టలేదని విమర్శించారు. బోర్డు కేంద్రం కంట్రోల్‌లో ఉందా? లేక ఏపీ నియంత్రణలో ఉందా? అని ప్రశ్నించారు. కాంగ్రెస్, బీజేపీలు తెలంగాణ ప్రయోజనాలను పట్టించుకోవడం లేదని విమర్శించారు.

విద్యుద్ఘాతానికి కుటుంబం బలి

(మొదటిపేజి తరువాయి)

అందజేశారు. సీఐ విజయ్‌బాబు, రూరల్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాలను పరిశీలించారు. పోలీసుల సహకారంతో సీఐ స్వయంగా మృతదేహాలను మోసుకొచ్చి గట్టున చేర్చారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం బోధన్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. గంగారం కూతురు యశోద ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. కాగా, గ్రామంలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మృతి చెందడంతో విషాదఛాయలు అలుముకోగా ఆ కుటుంబానికి చెందిన బాలిక అనాథ అయ్యింది.

ఆర్టిజన్లపై ఉక్కుపాదం

(మొదటిపేజి తరువాయి)

ప్రయత్నించటం ఏంటని ప్రశ్నించారు. ఆర్టిజన్లను కాదనీ, కొత్త నోటిఫికేషన్లు వేసినా, కొత్త నియామకాలు చేపట్టినా అడ్డుకుంటామని హెచ్చరించారు.. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ నెరవేర్చాలని డిమాండ్ చేశారు. గురువారం హైదరాబాద్‌లోని 'చలో విద్యుత్ సౌధ' కార్యక్రమం సందర్భంగా అక్కడ పోలీసులు పెద్ద ఎత్తున మోహరించారు. కార్మికులను ఎక్కడికక్కడ అరెస్టులు చేశారు. జనజీవనానికి తీవ్ర అంతరాయం కలిగించారు. అరెస్టయిన ఉద్యోగులు తమను కన్వర్షన్ చేయాలని ప్లకార్డులు ప్రదర్శిస్తూ పోలీసు వ్యాన్ల నుంచే నిరసన తెలిపారు. 'వూయ్ వాంట్ కన్వర్షన్' అంటూ పెద్ద పెట్టున నినదించారు. ఈ సందర్భంగా ఆర్టిజన్లను కన్వర్షన్ చేసే వరకు జేఎల్ఎం, సబ్‌ఇంజనీర్, జూనియర్ అసిస్టెంట్లు, ఆఫీస్ సబార్డినేటర్స్ పోస్టులను భర్తీ చేయొద్దంటూ తమ ఆవేదనను వ్యక్తం చేశారు. జేఏసీ చైర్మెన్ కే ఈశ్వర్‌రావు మాట్లాడుతూ విద్యుత్ సంస్థలో 23వేల మంది ఆర్టిజన్లు పని చేస్తున్నారని తెలిపారు. విద్యుత్ కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ చేస్తున్నామంటూ 2017లో బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్ణయించిందని గుర్తు చేశారు. ఈ విషయాన్ని అనేక వేదికల మీద చెప్పిందన్నారు. ఆ తర్వాత ఆర్టిజన్లను బీఆర్ఎస్ ప్రభుత్వం మోసం చేసిందని విమర్శించారు. ఈనేపథ్యంలో ఆర్టిజన్లు జేఏసీగా ఏర్పడి ఉద్యమానికి శ్రీకారం చుట్టామన్నారు. కేసీఆర్ మాదిరిగా కాకుండా కాంగ్రెస్ ప్రభుత్వం తమను కన్వర్షన్ చేయాలని కోరారు. 23వేల మంది ఆర్టిజన్లలో చాలా మంది రిటైర్డ్ అయ్యారనీ, కొంత మంది విధి నిర్వహణలో ప్రమాదానికి గురై చనిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంకా మిగిలింది 20వేల మందేననీ, వారినైనా కన్వర్షన్ చేయాలని కోరారు. ఆర్టిజన్లలో డిప్లొమో చేసిన వారికి సబ్ ఇంజనీర్, ఐటీఐ చదివిన వారికి జూనియర్ లైన్‌మెన్, డిగ్రీ, బిటెక్, ఎంటెక్ చదివిన వారికి జూనియర్ అసిస్టెంట్, టెన్త్, ఇంటర్ చదివిన వారికి సబార్డినేటర్ పోస్టు, చదువుకోలేని వారికి అటెండర్ పోస్టులను ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈవిధంగా చేయడం వల్ల రాష్ట్ర ప్రభుత్వంపైగానీ, విద్యుత్ సంస్థపైగానీ ఆర్థిక భారం పడదని వివరించారు. ప్రస్తుతం ఈ పోస్టులు ఉన్నాయనీ, ఆ పోస్టుల్లో ఆర్టిజన్లను నియమించాలని సూచించారు.

శాంతియుత ఆందోళనపై నిర్బంధం

ఆరుగ్యారంటీలతో పాటు ఏడో గ్యారెంటీ అయిన ప్రజాస్వామ్య పరిరక్షణకు ప్రాధాన్యత ఇస్తామంటూ చెప్పిన సీఎం..మాట తప్పారని ఆర్టిజన్లు విమర్శించారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఆర్టిజన్ల సమస్యల పరిష్కారానికి పూనుకోవాలని విజ్ఞప్తి చేశారు. అరెస్టయిన ఉద్యోగులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అరెస్టయిన వారిలో జేఏసీ చైర్మెన్ కె ఈశ్వర్‌రావుతోపాటు కో చైర్మెన్ వినరేందర్, కన్వీనర్ ఎంఏ వజర్, ఎస్ చంద్రారెడ్డి, ఎస్ సదానంద్, చింత ఎల్లయ్య, అరవింద్, సలీంపాషా, శ్రీనివాస్‌రెడ్డి, సందీప్‌కుమార్, గాంబో నాగరాజు, వడ్ల తిరుపతి, రఘునాథరెడ్డి తదితర నేతలు ఉన్నారు.

జగన్ స్నేహంతోనే ఏపీ జలదోపిడీ

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేస్తున్న జలదోపిడీకి బీఆర్ఎస్ ప్రభుత్వం సహకరించిందని తెలంగాణ నీటిపారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఆరోపించారు. హైదరాబాద్‌లోని జలసౌధలో వారు సంయుక్తంగా మీడియాతో మాట్లాడారు. కృష్ణాజలాల్లో తెలంగాణకు కేవలం 200 టీఎంసీలు సరిపోతాయని చెప్పిన ఘనత ఆనాటి బీఆర్ఎస్‌దేనని విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే తెలంగాణకే 500 టీఎంసీలు కావాలనే వాదనకు శ్రీకారం చుట్టినట్టు తెలిపారు. పాలమూరు- రంగారెడ్డి ప్రాజెక్టు పూర్తిచేసి ఉంటే మహబూబ్‌నగర్ జిల్లా అద్భుతంగా ఉండే దన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం వల్లే తెలంగాణకు అన్యాయం జరిగిందన్నారు. జగన్‌తో స్నేహంగా ఉంటూ, ఏపీ జలదోపిడీకి బీఆర్ఎస్ సహకరించిందన్నారు. జగన్ పోతిరెడ్డిపాడు సామర్థ్యం పెంచుతున్నా, అక్రమంగా ముచ్చుమర్రి నిర్మిస్తున్నా కేసీఆర్ నోరెత్తలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టులో నీళ్లు రాలేదు కానీ, బీఆర్ఎస్ నేతల జేబులు నిండాయి. లక్ష కోట్లు ఖర్చు చేసినా మేడిగడ్డ కూలిపోయింది. ఈ ప్రాజెక్టు అప్పు తెలంగాణ ప్రజలు ఎప్పటికీ తీర్చలేనంత భారంగా మారింది' అని అన్నారు. అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం కనీసం టెలిమెట్రీలు కూడా ఏర్పాటు చేయలేదన్నారు. కృష్ణా జలాలను జగన్ ప్రభుత్వం బేసిన్ అవతలకు తరలిస్తుంటే పట్టించుకోలేదని చెప్పారు. కృష్ణా జలాల్లో 299 టీఎంసీలు మన హక్కు, అయితే, 190 టీఎంసీల కంటే ఎక్కువగా ఎప్పుడూ వాడలేదన్నారు. కృష్ణాబేసిన్‌లో ఆన్‌గోయింగ్ ప్రాజెక్టులు పూర్తిచేసి ఉంటే మన వాటా పూర్తిగా వాడుకునే వాళ్లమన్నారు. ఏదుల, డిండి ప్రాజెక్టులను కూడా పదేండ్లల్లో పూర్తి చేయలేదని ఉత్తమ్ విమర్శించారు. సీతారామ ప్రాజెక్టుకు అనుమతుల విషయంలో కేంద్రం సానుకూలంగా స్పందించిందన్నారు. సమ్మక్క సారక్క పూర్తికి చర్యలు తీసుకోవాలని చెప్పారు. 20 నెలల్లో ఎస్ఎల్‌బీసీని పూర్తి చేస్తామన్నారు. పాలమూరు-రంగారెడ్డికి రూ. 27000 కోట్లు, సీతారామ లిఫ్టుకు రూ. 9000 కోట్లు ఖర్చుచేసి ఒక్క ఎకరాకు నీరందించలేదని గుర్తు చేశారు. దేవాదుల, కల్వకుర్తి, నెట్టెంపాడు, భీమా, కోయల్‌సాగర్, ఎస్ఎల్‌బీసీ, డిండి వంటి దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులు ఎందుకు పూర్తి చేయలేకపోయారని ప్రశ్నించారు. పెండింగ్ ప్రాజెక్టులను పూర్తిచేయడం ద్వారా తెలంగాణ జల హక్కులను కాపాడడంతో పాటు నీటిపారుదల రంగం ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందన్నారు. కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ చాలా కోల్పోయిందన్నారు. అపెక్స్ కౌన్సిల్ సమావేశాన్ని వాయిదా వేయడం ద్వారా బీఆర్ఎస్ ప్రభుత్వం రాయలసీమ లిఫ్టుకు టెండర్లు పిలవడానికి అనుమతించిందన్నారు. ఈ బహిరంగ ఉల్లంఘనలపై అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం తక్షణమే సుప్రీంకోర్టును లేదా కృష్ణా వాటర్ జల వివాదాల ట్రిబ్యునల్-2ను ఎందుకు ఆశ్రయించలేదని నిలదీశారు. మహబూబ్‌నగర్, నల్లగొండ, రంగారెడ్డి జిల్లాల్లో రైతులు నీటికొరత కారణంగా తీవ్రంగా నష్టపోయారని చెప్పారు. హైదరాబాద్ తాగునీటి సరఫరా కూడా ప్రమాదంలో పడిందని చెప్పారు. ఎస్ఎల్‌బీసీ టన్నెల్ పనులు వంద శాతం పూర్తవుతాయని చెప్పారు. అలాగే నాగార్జునసాగర్ ప్రాజెక్టు పైభాగాన్ని ఆంధ్రప్రదేశ్ నుంచి తిరిగి సాధించేందుకు ప్రభుత్వం కృషి చేస్తున్నదన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన నష్టాన్ని సరి చేయడానికి మా ప్రభుత్వం అహర్నిశలు పనిచేస్తున్నదన్నారు. తెలంగాణకు న్యాయంగా దక్కాల్సిన నీటి వాటాను రక్షించడంలో మా ప్రభుత్వం వెనుకడుగు వేయదని మంత్రులు స్పష్టం చేశారు. మీడియా సమావేశంలో రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఎవరినో గెలిపించేందుకు ప్రయత్నం

(మొదటిపేజి తరువాయి)

వ్యక్తం చేశారు. అటువంటి ఆర్థిక సాయం భారత్‌కు చేయాల్సిన అవసరమేంటని ప్రశ్నించారు. భారత ఎన్నికల్లో ఓటు వేసే ఓటర్ల సంఖ్యను పెంచేందుకు ఈ మొత్తాన్ని అంద చేయాల్సిన అవసరాన్ని ఆయన బుధవారం కూడా ప్రశ్నించారు. భారత్‌లో అధిక సుంకాలు విధిస్తారని, ఆ స్థాయికి అమెరికా చేరుకోవడం చాలా కష్టమని ఆయన పునరుద్ఘాటించారు. భారత్‌లో ఓటర్ల శాతాన్ని పెంచేందుకు ఎన్నికల కమిషన్‌కు యుఎస్ఎయిడ్ 21 మిలియన్ల డాలర్లను అందచేసిందని ఎలన్ మస్క్ నేతృత్వంలోని డోజ్ విభాగం వెల్లడించింది. ఆ నేపథ్యంలో ట్రంప్ పై విధంగా స్పందించారు.

ఎఫ్ఐఐ సదస్సులో ట్రంప్ మాట్లాడుతూ, తాను అధ్యక్షుడిని కాకముందు ప్రజల డబ్బు అంతా ఎక్కడకు పోతోందో కొన్ని ఉదాహరణలు వివరించారు. ఇందుకు చాలా ఉదాహరణలు వున్నాయని చెప్పారు. "అందులో భాగంగానే, 21 మిలియన్ల డాలర్లు భారత్‌కు వెళ్ళాయి. అసలు అక్కడ ఓటర్ల శాతాన్ని పెంచేందుకు మనం ఇంత మొత్తం ఖర్చు పెట్టాల్సిన అవసరమేముంది? బంగ్లాదేశ్‌లో రాజకీయ పరిస్థితులను బలోపేతం చేసేందుకు 29 మిలియన్ల డాలర్లు అందచేశారు. ..నేపాల్‌లో జీవ వైవిధ్య పరిక్షణ కోసం 10మిలియన్ల డాలర్లు ఇచ్చారు. ఆసియా దేశాల పరిస్థితి బాగానే వుంది. వారికి మనం డబ్బు ఇవ్వాల్సిన అవసరం లేదు." అని ట్రంప్ పేర్కొన్నారు. ఇవి కొన్ని ఉదాహరణలు మాత్రమేనని, ఇలాంటి జాబితా సుదీర్ఘంగా వుందన్నారు.

ఏఏ అంశాలపై అమెరికా పన్నుదారుల డబ్బు ఖర్చు చేస్తున్నారో వివరిస్తూ ఫిబ్రవరి 16న డోజ్ ఒక జాబితా ఇచ్చింది. అందులో భారత్‌కు ఇచ్చిన మొత్తం గురించి వుంది. ఆ జాబితాలోని అంశాలన్నింటినీ రద్దు చేసామని డోజ్ తెలిపింది. ప్రపంచవ్యాప్తంగా యుఎస్ఎయిడ్ చేపట్టే మానవతా సాయాన్ని నిలిపివేస్తూ ఈ నెల 7న డోజ్ ఆదేశాలు జారీ చేసింది.



విద్యుత్ ఆర్టిజన్ల అరెస్టులకు సీపీఐ(ఎం) ఖండన


నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

సమస్యల పరిష్కారం కోసం చలో విద్యుత్ సౌధ కార్యక్రమానికి వచ్చిన విద్యుత్ ఆర్టిజన్లను పోలీసులు అరెస్టు చేయడాన్ని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండించింది. విద్యుత్ ఆర్టిజన్లను హైదరాబాద్‌లోని వివిధ పోలీస్ స్టేషన్లలో నిర్బంధించారు. ఈ విషయాన్ని తెలుసుకున్న సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ వెంటనే స్పందించి గురువారం ఆసీఫ్ నగర్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి వారిని పరామర్శించి సంఘీభావం తెలిపారు. ఆయన వెంటనే సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి రవికుమార్, రాష్ట్ర నాయకులు డీజీ నరసింహారావు, భూపాల్ తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా జాన్‌వెస్లీ మాట్లాడుతూ ఆర్టిజన్లతో రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చర్చలు జరిపి సమస్యను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. నిర్బంధాలు, అరెస్టులతో ఉద్యమాలను అణచివేయాలని చూడటం అన్యాయమని విమర్శించారు. కార్మికుల పోరాటాలను అణచివేసిన గత పాలకులకు తగిన గుణపాఠం చెప్పారని గుర్తు చేశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం విద్యుత్ సంస్కరణలను అమలు చేసి ఈ రంగాన్ని ప్రయివేటు, కార్పొరేట్ సంస్థలకు అప్పగించాలని చూస్తున్నదని అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం దాన్ని వ్యతిరేకించకుండా అవే విధానాలను అమలు చేస్తున్నదని విమర్శించారు. విద్యుత్ ఆర్టిజన్లు క్షేత్రస్థాయిలో విద్యుత్ రంగంలో కీలకంగా పనిచేస్తున్నారని వివరించారు. వారి కోర్కెలను పరిశీలించి తక్షణమే పరిష్కరించాలని ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు.

అరెస్ట్ అక్రమం
వారిని వెంటనే కన్వర్షన్ చేయాలి : సీఐటీయూ

విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న ఆర్టిజన్ కార్మికులను విద్యార్హతలను బట్టి కన్వర్షన్ చేయాలని కోరుతూ వినతి పత్రం ఇవ్వడానికెళ్లిన తెలంగాణ విద్యుత్ ఆర్టిజన్స్ కన్వర్షన్ జేఏసీ చైర్మెన్ కె.ఈశ్వర్‌రావు, వైస్ చైర్మెన్ వి.నరేందర్, కార్మికులను ప్రభుత్వం పోలీస్‌లతో అక్రమంగా అరెస్ట్ చేయించడాన్ని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు చుక్కరాములు, ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ తీవ్రంగా ఖండించారు. అరెస్టు చేసిన వారిని వెంటనే విడుదల చేయాలనీ, వెంటనే కన్వర్షన్ చేయాలని డిమాండ్ చేశారు. గురువారం ఈ మేరకు వారు ఒక ప్రకటన విడుదల చేశారు. ట్రాన్స్‌కో, జెన్‌కో, డిస్కాంలలో 20 వేల మంది విద్యుత్ ఆర్టిజన్లు ఐదేండ్లుగా పనిచేస్తున్నారని గుర్తుచేశారు. అంతకు ముందు ఆ కార్మికులందరూ కాంట్రాక్ట్ పద్ధతిలోనే విద్యుత్ సంస్థలో 15 నుంచి 20 ఏండ్లుగా పనిచేస్తున్నారని పేర్కొన్నారు. ఇప్పటికే మూడు వేల మంది ఉద్యోగ విరమణ చేశారని తెలిపారు. సంస్థ కోసం విధి నిర్వహణలో ఆర్టిజన్ కార్మికులు ప్రాణాలు కోల్పోతున్నారని వాపోయారు. విద్యుత్ సంస్థలో పని చేస్తున్న వారిని కన్వర్షన్ చేయాలని ఐదు నెలలుగా ప్రభుత్వానికి వినతులు చేస్తూనే ఉన్నారనీ, ఆందోళనలు చేసినా ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమని విమర్శించారు. ప్రజా ప్రభుత్వమని చెప్పుకుంటున్న కాంగ్రెస్ - ప్రభుత్వం కార్మికుల సమస్యలు పరిష్కరించకుండా ఉద్యమాలపై ఉక్కుపాదం మోపడం దుర్మార్గమని పేర్కొన్నారు. గత ప్రభుత్వాలు ఉద్యమాలను అణచివేయాలని చూస్తే ప్రజలు, కార్మికులు బుద్ధిచెప్పిన విషయాన్ని గుర్తుచేశారు. అరెస్టులతో విద్యుత్ ఆర్టిజన్ కార్మికుల ఉద్యమాన్ని ఆపలేరనీ, వారి పోరాటానికి సీఐటీయూ సంపూర్ణ మద్దతు తెలియజేస్తూ కార్మికవర్గానికి అండగా ఉంటుందని భరోసానిచ్చారు.

నవచిత్రం



ప్రశాంత్ నీల్, ఎన్టీఆర్

భారీ యాక్షన్ ఎపిసోడ్‌తో షురూ..

ఎన్టీఆర్, డైరెక్టర్ ప్రశాంత్ నీల్ కాంబోలో 'ఎన్టీఆర్ నీల్' పేరుతో గత ఏడాదిలో పూజా కార్యక్రమాలను పూర్తి చేసుకున్న విషయం విదితమే. ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ గురువారం నుంచి రామోజీ ఫిల్మ్ సిటీలో ప్రారంభమైంది. అందరూ ఆశ్చర్య పోయేలా 3వేల మంది జూనియర్ ఆర్టిస్టులతో భారీ యాక్షన్ ఎపిసోడ్ చిత్రీకరణతో షూటింగ్ మొదలైంది. ఎన్టీఆర్ వచ్చే షెడ్యూల్ నుంచి షూటింగ్‌లో పాల్గొనబోతున్నారు.

'ఎన్టీఆర్, ప్రశాంత్ నీల్ కాంబో ఎలాంటి మ్యాజిక్ క్రియేట్ చేస్తుందోనని అందరి దృష్టి ఇప్పుడు ఈ సినిమాపైనే ఉంది. తెలుగు, హిందీ, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో ఈ భారీ పాన్ ఇండియా చిత్రం వచ్చే ఏడాది జనవరి 9న ప్రపంచ వ్యాప్తంగా గ్రాండ్ లెవల్లో విడుదల కానుంది. ముందుగానే రిలీజ్ డేట్ అనౌన్స్ చేయటంతో ఎన్టీఆర్ అభిమానులతో పాటు సినీ ప్రేక్షకులు సైతం సినిమా షూటింగ్ ఎప్పుడెప్పుడు మొదలవుతుందా అని ఎదురు చూశారు. ఆ సమయం రానే వచ్చేసింది. రానున్న సంక్రాంతి థియేటర్స్‌కు ఈ చిత్రం సరికొత్త పండుగను తీసుకొస్తుందనటంలో సందేహం లేదు. మైత్రీ మూవీ మేకర్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్ బ్యానర్స్‌పై కళ్యాణ్ రామ్, నవీన్ ఎర్నేని, రవి శంకర్ యలమంచిలి, హరికృష్ణ కొసరాజు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు' అని చిత్ర యూనిట్ తెలిపింది. ఈ చిత్రానికి రచన, దర్శకత్వం - ప్రశాంత్ నీల్, ప్రొడక్షన్ డిజైన్ - చలపతి, సినిమాటోగ్రఫీ - భువన్ గౌడ.

బర్త్‌డే కానుకగా టీజర్ రిలీజ్



నాని

నాని నటిస్తున్న హైలీ యాంటిసిపేటెడ్ క్రైమ్ థ్రిల్లర్ హిట్ 3 : ది థర్డ్ కేస్'. శైలేష్ కొలను దర్శకత్వంలో హిట్ సిరీస్‌లో మూడవ భాగంగా రాబోతున్న ఈ చిత్ర గ్లింప్స్, పోస్టర్‌లకు ఇప్పటికే అద్భుతమైన స్పందన లభించడంతో, భారీ అంచనాలు నెలకొన్నాయి. వాల్ పోస్టర్ సినిమా బ్యానర్‌పై ప్రశాంతి తిపిర్నేని, నాని యూనిమస్ ప్రొడక్షన్స్‌తో కలిసి నిర్మిస్తున్న ఈ చిత్రం షూటింగ్ వేగంగా జరుగుతోంది. ఈ చిత్ర టీజర్‌కు సంబంధించిన అప్‌డేట్‌తో మేకర్స్ వచ్చారు. ఈ చిత్ర ఇంటెన్స్ టీజర్‌ను ఈనెల 24న నాని పుట్టినరోజు సందర్భంగా విడుదల చేయనున్నారు. ఈ చిత్ర ప్రధాన కథాంశం, నాని పోషిస్తున్న ఫెరోషియస్ అర్జున్ సర్కార్ క్యారెక్టర్‌తో పాటు మిగతా పాత్రల గురించి కీలక వివరాలను ఆవిష్కరించడానికి టీం సిద్ధంగా ఉంది. టీజర్ పోస్టర్‌లో నాని చేతిలో గొడ్డలి పట్టుకొని, తన పాదాల దగ్గర పడిపోయిన మనుషులతో కమాండింగ్ పొజిషన్‌లో కనిపిస్తున్నారు. ఈ బోల్డ్ ఇమేజ్ అతని పాత్ర తాలూకా ఫెరోషియస్, ఇంటెన్స్ నేచర్‌ని తెలియజేస్తోంది.

ఈ చిత్రంలో నానికి జోడీగా శ్రీనిధి శెట్టి కథానాయికగా నటించింది. ఈ సినిమా మే 1వ తేదీన థియేటర్లలోకి రానుంది అని చిత్ర యూనిట్ తెలిపింది.

ఈ చిత్రానికి రచన, దర్శకత్వం: డా. శైలేష్ కొలను, నిర్మాత: ప్రశాంతి తిపిర్నేని, డీవోపీ: సాను జాన్ వర్గీస్, సంగీతం: మిక్కీ జె మేయర్, ఎడిటర్: కార్తీక శ్రీనివాస్ ఆర్, ప్రొడక్షన్ డిజైనర్: శ్రీ నాగేంద్ర తంగాల, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: ఎస్ వెంకటరత్నం (వెంకట్), సౌండ్ మిక్స్: సురేన్ జి, లైన్ ప్రొడ్యూసర్: అభిలాష్ మాంధదపు.



ఆనంది

పవర్‌ఫుల్ కథతో 'శివంగి'

ఆనంది, వరలక్ష్మి శరత్‌కుమార్ ప్రధాన పాత్రలలో దేవరాజ్ భరణి ధరణ్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'శివంగి'.

ఫస్ట్ కాపీ మూవీస్ బ్యానర్ పై నరేష్ బాబు పి. నిర్మించిన పవర్ ఫుల్ ఉమెన్ సెంట్రిక్ ఫిల్మ్ ఇది. జాన్ విజయ్, డాక్టర్ కోయ కిషోర్ కీలక పాత్రల్లో నటించారు.

తాజాగా గురువారం ఈ సినిమా ఫస్ట్‌లుక్ పోస్టర్‌ని డైరెక్టర్ అనిల్ రావిపూడి లాంచ్ చేశారు. ఈ సినిమా ఎంత పవర్ ఫుల్, సెన్సేషనల్ కథతో ఉండబోతోందో ఫస్ట్ లుక్ చెప్పకనే చెప్పింది. నల్లలుంగీ, చొక్కాతో కాళ్ళపై కాళ్ళు వేసుకొని సోఫాలో డైనమిక్‌గా కూర్చున్న ఆనంది లుక్ స్టన్నింగ్ ఉంది. ఉమెన్ సెంట్రిక్ సినిమాలలో 'శివంగి' గ్రౌండ్ బ్రేకింగ్ కథ, స్క్రీన్‌ప్లేతో ఉండబోతోంది. ఫస్ట్‌లుక్ సినిమాపై చాలా క్యురియాసిటీని పెంచింది. ఈ సినిమా పోస్ట్-ప్రొడక్షన్ చివరి దశకు చేరుకుంది. మార్చి 7న ఈ సినిమాని రిలీజ్ చేయనున్నట్లు మేకర్స్ తెలియజేశారు. ఈ చిత్రానికి దర్శకత్వం: దేవరాజ్ భరణి ధరన్, నిర్మాత: నరేష్ బాబు పి, సంగీతం:ఏ.హెచ్.కాషిఫ్ - ఎబినేజర్ పాల్, డీవోపీ : భరణి కె ధరన్, ఆర్ట్: రఘు కులకర్ణి, సింగర్:సాహితీ చాగంటి, సాహిత్యం: శ్రీనివాస్ కామేపల్లి, దేవరాజ్ భరణి ధరన్.



శివప్రసాద్, తమ్మారెడ్డి భరద్వాజ్, హరి ప్రసాద్

ప్రయోగాత్మక చిత్రంగా 'రా..రాజా'

పద్మ సమర్పణలో శ్రీ పద్మిణి సినిమాస్ బ్యానర్ మీద బి.శివప్రసాద్ తెరకెక్కించిన చిత్రం 'రా రాజా'. ఆర్టిస్టుల్ని చూపించకుండా కేవలం కథ, కథనాల మీదే నడిచే సినిమా ఇది. అసలు మొహాలు చూపించకుండా సినిమాను తీయడం అనేది మామూలు సాహసం కాదు. ఇలాంటి అద్భుతమైన ప్రయోగం చేసి మెప్పించేందుకు రెడీ అయింది 'రా రాజా' టీమ్. ఈ చిత్రానికి బూర్లే హరి ప్రసాద్ ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్‌గా, కిట్టు లైన్ ప్రొడ్యూసర్‌గా వ్యవహరిస్తున్నారు.

తాజాగా రిలీజ్ చేసిన ఈ ట్రైలర్‌ను తమ్మారెడ్డి భరద్వాజ్ వీక్షించి అభినందించారు. అలాగే రిలీజ్ డేట్ పోస్టర్‌ను కూడా రిలీజ్ చేసిన తమ్మారెడ్డి భరద్వాజ్ మాట్లాడుతూ,'అసలు మొహాలు చూపించకుండా సినిమా తీసి, దర్శకుడు శివ ప్రసాద్ ధైర్యం చేశాడు. ఇది చాలా పెద్ద ప్రయోగం. ఇది కనుక సక్సెస్ అయితే ఇండస్ట్రీ మొత్తం మారిపోతుంది. అసలు హీరోలు, స్టార్లతో పని లేకుండా అద్భుతమైన చిత్రాలు, ప్రయోగాలు చేయొచ్చని అంతా ముందుకు వస్తారు. మార్చి 7న ఈ చిత్రం రాబోతోంది. ఈ మూవీని అందరూ చూసి సపోర్ట్ చేయండి' అని అన్నారు.

'మా చిత్రంలో ఆర్టిసుల మొహాలు కనిపించవు. కథ, కథనమే ముఖ్యం అని మేం ఈ మూవీని తీశాం. ఇది ఒక ప్రయోగం. మా ప్రయోగాన్ని అందరూ ఆదరిస్తారని, అందరికీ నచ్చుతుందని ఆశిస్తున్నాను' అని దర్శకుడు శివ ప్రసాద్ చెప్పారు.

వేట మొదలైంది

- బంగ్లాదేశ్‌పై భారత్ ఘన విజయం
- ఛేదనలో చెలరేగిన శుభ్‌మన్ గిల్
- మహ్మద్ షమి ఐదు వికెట్ల ప్రదర్శన
- ఐసీసీ 2025 చాంపియన్స్ ట్రోఫీ



ఛేదనలో శుభ్‌మన్ గిల్ (101 నాటౌట్) చెలరేగగా.. బంతితో మహ్మద్ షమి (5/53) నిప్పులు చెరుగగా.. టీమ్ ఇండియా ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీ వేట ఘనంగా మొదలైంది. సవాల్‌తో కూడిన పిచ్‌పై ఛేదనలో శుభ్‌మన్ గిల్ ఆఖరు వరకూ క్రీజులో నిలిచి అదరగొట్టాడు. పేస్, స్పిన్ దెబ్బకు పవర్‌ప్లేలోనే 5 ఐదు వికెట్లు కోల్పోయిన బంగ్లాదేశ్‌ను తౌహిద్ హృదయ్ (100) ఆదుకున్నాడు. జేకర్ అలీ (68)తో కలిసి బంగ్లాకు మెరుగైన స్కోరు అందించాడు. బంగ్లాదేశ్‌పై 6 వికెట్ల తేడాతో భారత్ ఘన విజయం సాధించింది.

నవతెలంగాణ-దుబాయ్

చాంపియన్స్ ట్రోఫీ వేటను టీమ్ ఇండియా ఘనంగా మొదలెట్టింది. గ్రూప్-ఏలో బంగ్లాదేశ్‌తో మ్యాచ్‌లో 6 వికెట్ల తేడాతో సూపర్ విక్టరీ నమోదు చేసింది. 229 పరుగుల ఛేదనలో శుభ్‌మన్ గిల్ (101 నాటౌట్, 129 బంతుల్లో 9 ఫోర్లు, 2 సిక్స్‌లు) అజేయ సెంచరీతో చెలరేగాడు. కెప్టెన్ రోహిత్ శర్మ (41, 36 బంతుల్లో 7 ఫోర్లు), కెఎల్ రాహుల్ (41 నాటౌట్, 47 బంతుల్లో 1 ఫోర్, 2 సిక్స్‌లు) రాణించారు. మరో 21 బంతులు ఉండగానే లాంఛనం ముగించిన భారత్ గ్రూప్-ఏలో అగ్రస్థానంలో నిలిచింది. అంతకుముందు, మహ్మద్ షమి (5/53), హర్షిత్ రానా (3/31), అక్షర్ పటేల్ (2/43) మాయకు బంగ్లాదేశ్ 8.3 ఓవర్లలోనే 35/5తో పీకల్లోతు కష్టాల్లో కూరుకుంది. తొలుత బ్యాటింగ్ చేసిన బంగ్లాదేశ్ 49.4 ఓవర్లలో 228 పరుగులకు ఆలౌటైంది. తౌహిద్ హృదయ్ (100, 118 బంతుల్లో 6 ఫోర్లు, 2 సిక్స్‌లు), జేకర్ అలీ (68, 114 బంతుల్లో 4 ఫోర్లు) బంగ్లాదేశ్‌ను ఆదుకున్నారు.

శుభ్‌మన్ షో

ఛేదనలో భారత్‌కు అదిరే ఆరంభం దక్కింది. కెప్టెన్ రోహిత్ శర్మ (41) పవర్‌ప్లేలో ధనాధన్ దంచికొట్టాడు. ఏడు ఫోర్లతో బంగ్లా బౌలర్లపై ఎదురుదాడి చేశాడు. పవర్‌ప్లే ఆఖరు ఓవర్లో అవుటైనా.. అప్పటికే తొలి వికెట్‌కు 69 పరుగులు జోడించాడు. యువ ఓపెనర్ శుభ్‌మన్ గిల్ (101 నాటౌట్) సహజశైలిలో ఆచితూచి ఆడాడు. విరాట్ కోహ్లి (22) కాసేపు క్రీజులో నిలిచినా వేగంగా పరుగులు చేసే క్రమంలో వికెట్ కోల్పోయాడు. శ్రేయస్ అయ్యర్ (15), అక్షర్ పటేల్ (8) ధాటిగా ఆడేందుకు చూసి పెవిలియన్‌కు చేరుకున్నారు. కెఎల్ రాహుల్ (41 నాటౌట్)తో జతకట్టిన గిల్.. భారత్‌ను గెలుపు తీరాలకు చేర్చాడు. ఏ దశలోనూ దూకుడుగా ఆడాలని చూడని గిల్.. ఒక్కో పరుగు జోడిస్తూ ముందుకు సాగాడు. ఐదు ఫోర్లు, ఓ సిక్సర్‌తో 69 బంతుల్లో అర్ధ సెంచరీ సాధించాడు. 9 ఫోర్లు, 2 సిక్సర్లతో 125 బంతుల్లో వంద మార్క్ చేరుకుని కెరీర్ 8వ సెంచరీ సాధించాడు. చివర్లో రాహుల్ సూపర్ సిక్సర్‌తో లాంఛనం ముగించాడు. 46.3 ఓవర్లలోనే 231 పరుగులు చేసిన భారత్ 6 వికెట్ల తేడాతో గెలుపొందింది.

పవర్‌ఫుల్ ఎటాక్

టాస్ నెగ్గి బ్యాటింగ్‌కు వచ్చిన బంగ్లాదేశ్‌కు భారత పేసర్లు, స్పిన్నర్లు కోలుకోలేని పంచ్ ఇచ్చారు. ఇన్నింగ్స్ తొలి ఓవర్లోనే మహ్మద్ షమి బ్రేక్ ఇచ్చాడు. సౌమ్య సర్కార్ (0), మెహిది హసన్ మిరాజ్ (5)లను అవుట్ చేయగా.. నజ్ముల్ శాంటో (0)ను రానా సాగనంపాడు. పవర్‌ప్లేలోనే బంతి అందుకున్న అక్షర్ పటేల్ వరుస బంతుల్లో హసన్ (25), ముష్పికర్ రహీమ్ (0)లను అవుట్ చేశాడు. జేకర్ అలీ సైతం తొలి బంతికే స్లిప్స్‌లో క్యాచ్ ఇవ్వగా.. రోహిత్ నేలపాలు చేశాడు. అక్షర్ పటేల్ హ్యాట్రిక్ వికెట్ల రికార్డుకు దూరమయ్యాడు. పేస్, స్పిన్ దాడితో తొలి పది ఓవర్లలో బంగ్లాదేశ్ 39/5తో పీకల్లోతు కష్టాల్లో కూరుకుంది.

హృదయ్ శతకం

35 పరుగులకే ఐదు వికెట్లు కోల్పోయిన బంగ్లాదేశ్ 100 పరుగులు చేస్తుందని ఎవరూ అనుకోలేదు. సవాల్‌తో కూడిన పిచ్‌పై తౌహిద్ హృదయ్ (100) అసమాన ఇన్నింగ్స్‌తో బంగ్లాను ఆదుకున్నాడు. జేకర్ అలీ (68)తో కలిసి ఆరో వికెట్‌కు 154 పరుగుల భారీ భాగస్వామ్యం నమోదు చేశాడు. పవర్‌ప్లే తర్వాత భారత బౌలర్లు వికెట్ల వేటలో సఫలం కాలేదు. 30 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా ఈ జోడీ 126 పరుగులు జోడించింది. బంగ్లాదేశ్‌కు మంచి స్కోరు అందించింది. జేకర్ అలీ మూడు ఫోర్లతో 87 బంతుల్లో అర్ధ సెంచరీ సాధించగా.. తౌహిద్ హృదయ్ మూడు ఫోర్లతో 85 బంతుల్లో ఫిఫ్టీ మార్క్ చేరుకున్నాడు. ఆఖరు పవర్‌ప్లేలో మళ్లీ వికెట్ల వేట మొదలెట్టిన భారత్ 63 పరుగులకు చివరి ఐదు వికెట్లు పడగొట్టింది. ఆరు ఫోర్లు, రెండు సిక్సర్లతో మెరిసిన హృదయ్ 114 బంతుల్లో కెరీర్ తొలి సెంచరీ నమోదు చేశాడు. ఆఖరు ఓవర్లో ఆఖరి వికెట్‌గా నిష్క్రమించిన హృదయ్ సూపర్ ఇన్నింగ్స్‌తో ఆకట్టుకున్నాడు. భారత బౌలర్లలో రానా (3/31), అక్షర్ పటేల్ (2/43) రాణించారు.



స్కోరు వివరాలు

బంగ్లాదేశ్ ఇన్నింగ్స్ : హసన్ (సి) రాహుల్ (బి) అక్షర్ 25, సర్కార్ (సి) రాహుల్ (బి) షమి 0, శాంటో (సి) కోహ్లి (బి) రానా 0, మెహిది (సి) గిల్ (బి) షమి 5, హృదయ్ (సి) షమి (బి) రానా 100, ముష్పికర్ (సి) రాహుల్ (బి) అక్షర్ 0, జేకర్ అలీ (సి) కోహ్లి (బి) షమి 68, రిషద్ (సి) హార్దిక్ (బి) రానా 18, హసన్ షకిబ్ (సి) షమి 0, టస్కిన్ (సి) అయ్యర్ (బి) షమి 3, ముస్తాఫిజుర్ నాటౌట్ 0, **ఎక్స్‌ట్రాలు: 9**, **మొత్తం :** (49.4 ఓవర్లలో ఆలౌట్) 228.

వికెట్ల పతనం : 1-1, 2-2, 3-26, 4-35, 5-35, 6-189, 7-214, 8-215, 9-228, 10-228.

బౌలింగ్ : మహ్మద్ షమి 10-0-53-5, హర్షిత్ రానా 7.4-0-31-3, అక్షర్ పటేల్ 9-1-43-2, హార్దిక్ పాండ్య 4-0-20-0, రవీంద్ర జడేజా 9-0-37-0, కుల్దీప్ యాదవ్ 10-0-43-0.

భారత్ ఇన్నింగ్స్ : రోహిత్ (సి) రిషద్ (బి) టస్కిన్ 41, గిల్ 101 నాటౌట్, కోహ్లి (సి) సర్కార్ (బి) రిషద్ 22, శ్రేయస్ (సి) శాంటో (బి) ముస్తాఫిజుర్ 15, అక్షర్ (సి,బి) రిషద్ 8, రాహుల్ 41 నాటౌట్, **ఎక్స్‌ట్రాలు : 3**, **మొత్తం :** (46.3 ఓవర్లలో 4 వికెట్లకు) 231.

వికెట్ల పతనం : 1-69, 2-112, 3-133, 4-144.

బౌలింగ్ : టస్కిన్ అహ్మద్ 9-0-36-1, ముస్తాఫిజుర్ రెహమాన్ 9-0-62-1, హసన్ షకిబ్ 8.3-0-58-0, మెహిది హసన్ మిరాజ్ 10-0-37-0, రిషద్ హుస్సేన్ 10-0-38-2.

సూపర్ షమి

ఐసీసీ టోర్నమెంట్‌లో మహ్మద్ షమి మరోసారి సత్తా చాటాడు. 2023 వన్డే వరల్డ్‌కప్ ఫైనల్లో ఆడిన షమి.. గాయంతో మళ్లీ ఇప్పుడే మైదానంలో అడుగుపెట్టాడు. ఇంగ్లాండ్‌తో వన్డేల్లో నిరాశపరిచినా చాంపియన్స్ ట్రోఫీలో తనేంటో చూపించాడు. బంగ్లాదేశ్‌తో మ్యాచ్‌లో ఐదు వికెట్ల ప్రదర్శన అదరగొట్టాడు. వన్డేల్లో 200 వికెట్లు పడగొట్టిన క్లబ్‌లో చేరాడు. ఈ క్రమంలో షమి పలు రికార్డులను బద్దలుకొట్టాడు. ఆసీస్ పేసర్ మిచెల్ స్టార్క్ 5240 బంతుల్లో 200 వికెట్లు పడగొట్టగా.. షమి 5126 బంతుల్లోనే ఈ ఘనత సాధించాడు. మ్యాచుల పరంగా స్టార్క్ (102) అగ్రస్థానంలో ఉండగా.. సక్లయిన్ ముస్తాక్‌తో కలిసి షమి (104 వన్డేలు) సంయుక్తంగా రెండో స్థానంలో నిలిచాడు. ఐసీసీ టోర్నమెంట్లలో మహ్మద్ షమి ఐదోసారి ఐదు వికెట్ల ప్రదర్శన చేశాడు. మిచెల్ స్టార్క్ (32), షాహిద్ అఫ్రిది (36), గ్లెన్ మెక్‌గ్రాత్ (51) ఇన్నింగ్స్‌ల్లో ఐదు వికెట్ల ప్రదర్శన ఐదు సార్లు చేయగా.. షమి కేవలం 19వ ఇన్నింగ్స్‌లోనే ఈ రికార్డును సాధించాడు.

రోహిత్ 11000

హిట్‌మ్యాన్ రోహిత్ శర్మ పరుగుల వేటలో ఓ మైలురాయి దాటేశాడు. వన్డేల్లో రోహిత్ శర్మ 11000 పరుగులు పూర్తి చేశాడు. 261 ఇన్నింగ్స్‌ల్లోనే ఈ ఘనత సాధించి విరాట్ కోహ్లి (222 ఇన్నింగ్స్‌లు) తర్వాత రెండోస్థానంలో నిలిచాడు. రోహిత్ 11 వేల పరుగులకు 11868 బంతులు ఆడగా.. విరాట్ కోహ్లి 11831 బంతులు మాత్రమే ఆడాడు.

156 వన్డేల్లో విరాట్ కోహ్లి అందుకున్న క్యాచ్‌లు 156. భారత్ తరఫున అత్యధిక క్యాచ్‌లు అందుకున్న ఫీల్డర్‌గా హైదరాబాద్ దిగ్గజం మహ్మద్ అజహరుద్దీన్ సరసన కోహ్లి నిలిచాడు. ఓవరాల్‌గా మహేళ జయవర్ధనె (218), రికీ పాంటింగ్ (160)లు కోహ్లి కంటే ముందున్నారు.

5476 వన్డేల్లో ఒక్క నో బాల్ కూడా వేయకుండా చైనామన్ స్పిన్నర్ కుల్దీప్ యాదవ్ వేసిన బంతులు 5476. బంగ్లాదేశ్‌తో మ్యాచ్‌లో తొలి ఓవర్లో కుల్దీప్ తొలి ఫ్రంట్ ఫుట్ నో బాల్ వేశాడు. 108 వన్డేలు ఆడిన కుల్దీప్ యాదవ్.. బంగ్లాదేశ్‌తో మ్యాచ్‌కు ముందు వరకు నో బాల్ వేయలేదు.

2002 వన్డే ఫార్మాట్‌లో 2002 తర్వాత 11-40 ఓవర్ల మధ్య ఒక్క వికెట్ కూడా పడగొట్టకపోవటం భారత్‌కు ఇదే ప్రథమం. ఈ 30 ఓవర్లలో భారత్ 126 పరుగులే ఇచ్చినా వికెట్ పడగొట్టలేదు. మిడిల్ ఓవర్లలో వికెట్ కోల్పోకపోవటం బంగ్లాదేశ్‌కు ఇది ఐదోసారి.

ఆటలు

గెలుపు ముంగిట విదర్భ

- ముంబయితో రంజీ ట్రోఫీ సెమీస్



నాగ్‌పూర్ : రంజీ ట్రోఫీ సెమీఫైనల్లో విదర్భ విజయం ముంగిట నిలిచింది. ముంబయికి రికార్డు 410 పరుగుల రికార్డు లక్ష్యాన్ని నిర్దేశించిన విదర్భ.. విజయానికి మరో ఏడు వికెట్ల దూరంలో నిలిచింది. ఛేదనలో ముంబయి 31 ఓవర్లలో 83/3 పరుగులు చేసింది. ఓపెనర్ ఆకాశ్ ఆనంద్ (27 నాటౌట్, 92 బంతుల్లో 1 ఫోర్), శివం దూబె (12 నాటౌట్) అజేయంగా ఆడుతున్నారు. ఆయుశ్ (18), సిద్దేశ్ లాడ్ (2), అజింక్య రహానె (12) విఫలమయ్యారు. అంతకముందు అక్షయ్ వాడ్కర్ (151, 252 బంతుల్లో 11 ఫోర్లు) భారీ సెంచరీతో విదర్భ రెండో ఇన్నింగ్స్‌లో 292 పరుగులు చేసింది. సూర్యకుమార్ యాదవ్, శామ్స్ ములాని, తనుశ్ కొటియన్, శార్దుల్ ఠాకూర్ నేడు ముంబయికి కీలకం కానున్నారు. తొలి ఇన్నింగ్స్‌లో ఆ జట్టు 383 పరుగులు చేయగా.. ముంబయి 270 పరుగులకే కుప్పకూలిన సంగతి తెలిసిందే. నేడు ఆఖరు రోజు ఆటలో ముంబయికి 323 పరుగులు అవసరం కాగా.. విదర్భ విజయానికి మరో ఏడు వికెట్ల దూరంలో నిలిచింది.

రసవత్తరంగా..

- కేరళ, గుజరాత్ రంజీ సెమీస్



అహ్మదాబాద్ : మందకొడిగా సాగుతున్న కేరళ, గుజరాత్ రంజీ ట్రోఫీ సెమీఫైనల్ రసవత్తరంగా మారింది. కేరళ తొలి ఇన్నింగ్స్‌లో 457 పరుగులు చేయగా.. గుజరాత్ తొలి ఇన్నింగ్స్‌లో 154 ఓవర్లలో 429/7 పరుగులతో దీటుగా బదులిస్తోంది. ఓపెనర్ ప్రియాంక్ పంచల్ (148, 237 బంతుల్లో 18 ఫోర్లు, 1 సిక్స్) సెంచరీతో చెలరేగగా.. ఆర్య దేశాయ్ (73, 118 బంతుల్లో 11 ఫోర్లు, 1 సిక్స్), జైమీట్ పటేల్ (74 నాటౌట్, 161 బంతుల్లో 2 ఫోర్లు) రాణించారు. సిద్దార్థ్ దేశాయ్ (24 నాటౌట్), జైమీట్ మెరుపులతో గుజరాత్ తొలి ఇన్నింగ్స్‌లో ఆధిక్యం దిశగా సాగుతోంది. ప్రస్తుతం తొలి ఇన్నింగ్స్‌లో ఆ జట్టు 28 పరుగుల వెనుకంజలో నిలిచింది. కేరళ బౌలర్లలో జలజ్ సక్సేనా (4/137) నాలుగు వికెట్లతో రాణించాడు. ఇక ఫీల్డింగ్ చేస్తుండగా గాయపడిన గుజరాత్ స్పిన్నర్ రవి బిష్ణోయ్ స్థానంలో కంకషన్ సబ్‌స్టిట్యూట్‌గా హేమంగ్ పటేల్‌ను తీసుకోవటంపై కేరళ అభ్యంతరం వ్యక్తం చేసింది. రూల్స్ ప్రకారం స్పిన్నర్‌ను మాత్రమే సబ్‌స్టిట్యూట్ చేయాలి. కానీ గుజరాత్ బెంచ్ ప్లేయర్లలో ముగ్గురు బ్యాటర్లు, ఓ పేసర్ మాత్రమే ఉన్నారు. దీంతో హేమంగ్‌ను కంకషన్ సబ్‌స్టిట్యూట్‌గా రిఫరీ అంగీకరించారు. కీలక సమయంలో హేమంగ్ పటేల్ (27) విలువైన పరుగులు సాధించి గుజరాత్‌ను ఆదుకున్నాడు.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.

పడిపోయిన మిర్చి ధర

విదేశాల్లో తగ్గుతున్న డిమాండ్.. నష్టపోతున్న రైతులు

- వారిని ఆదుకోవాల్సిన అవసరముంది : మీడియాతో ఏపీ సీఎం
- కేంద్రమంత్రులు, ఉన్నతాధికారులతో భేటీ



ఎప్పుడూ లేనంతగా ఈ ఏడాదే

నవతెలంగాణ - న్యూఢిల్లీ బ్యూరో

ఎప్పుడూ లేనంతగా ఈ ఏడాది మిరప ధర పడిపోయిందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎన్. చంద్రబాబు నాయుడు తెలిపారు. విదేశాల్లో డిమాండ్ తగ్గడంతో రైతులకు నష్టం వాటిల్లుతోందని, వారిని ఆదుకోవాల్సిన అవసరముందని ఆయన అభిప్రాయ పడ్డారు. గురువారం ఢిల్లీ పర్యటనలో భాగంగా ఆయన జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్, వ్యవసాయ శాఖ మంత్రి రాధామోహన్ సింగ్, వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులతో భేటీ అయ్యారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. దేశంలో 50 శాతం మిరప దాదాపు ఐదు లక్షల ఎకరాల్లో ఆంధ్రప్రదేశ్‌లోనే సాగవుతోందని తెలిపారు. ఈ ఏడాది 12 లక్షల మెట్రిక్ టన్నుల మిరపను సేకరించాల్సి ఉండగా, ఇప్పటికీ నాలుగు లక్షల మెట్రిక్ టన్నులు మార్కెట్‌కు వచ్చిందన్నారు. గతేడాది అంతర్జాతీయ మార్కెట్లలో డిమాండ్ ఉండటంతో రైతులకూ మంచి ధర వచ్చిందన్నారు. అనూహ్యంగా ఈ ఏడాది డిమాండ్ తగ్గడంతో రైతులు నష్టపోయే పరిస్థితులు ఏర్పడనున్నా యని వెల్లడించారు.

ఈ పరిస్థితులపై కేంద్ర మంత్రులతో మాట్లాడానన్నారు. రైతులను ఆదుకునేందుకు ప్రతిపాదనలు వారికి వివరించానని తెలిపారు. వారు స్పందిస్తూ త్వరలోనే ఈ విషయంపై కేంద్ర వాణిజ్య శాఖ అధికారులతో సంప్రదింపులు జరిపి పరిస్థితులు సమీక్షించి, న్యాయం చేసేందుకు ప్రయత్నిస్తామని హామీ ఇచ్చారన్నారు.

ఇబ్బందుల్లో ఏపీ ప్రభుత్వం

రాష్ట్ర ప్రభుత్వానికి ఇబ్బందులున్నాయని, పరిస్థితులను బట్టి ఏం చేయాలో ఆలోచిస్తున్నామన్నారు. శుక్రవారం ఆయన కూడా ట్రేడర్స్‌తో సమావేశమవుతానని, సమస్య పరిష్కారంపై దృష్టి పెట్టామని తెలిపారు. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో సమస్య పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. పంట సేకరణకు కొన్ని సమస్యలున్నాయని, ఇందుకు రేషన లైజేషన్ చేయాల్సిన అవసరముందని అభిప్రాయపడ్డారు.

జల్ జీవన్, పోలవరంపై సమీక్ష

జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్‌తో సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా జల్ జీవన్ మిషన్, పోలవరంపై సమీక్షించారు. పోలవరం పనులు సజావుగా జరుగుతున్నా యన్నాని చంద్రబాబు అన్నారు. పోలవరం ఫేజ్-1ను 2027 చివరి నాటికి పోలవరం పూర్తి చేసేలా లక్ష్యం పెట్టుకున్నామని, ఫేజ్-2ను ముందుకు తీసుకెళ్లే అంశంపైనా కేంద్రం దృష్టికి తీసుకెళ్తామన్నారు. నదుల అనుసంధానంపైనా చర్చించామని, మిగులు జలాలు వినియోగించుకుంటే కరువు సమస్య లేకుండా చేసే ఆస్కారముంటుందని తెలిపారు. పోలవరం నుంచి మడకచర్ల వరకు ప్రాజెక్టుకు కేంద్రం సహకారం అడిగామన్నారు. వీటిపై కేంద్ర ప్రభుత్వ అధికారులు అధ్యయనం చేస్తున్నారన్నారు.

గత ప్రభుత్వం హయాంలో జల్ జీవన్ నిర్వీర్యం

జల్ జీవన్ మిషన్‌ను దేశమంతా బాగా ఉపయోగించుకున్నారని, ఆంధ్రప్రదేశ్ గత ప్రభుత్వం మాత్రం ఒక్క శాతం కూడా వినియోగించుకోలేదని విమర్శించారు. రూ.27 వేల కోట్లు మంజూరు చేయించి, బోర్లు ద్వారా నీరు ఇచ్చేందుకు సిద్ధపడ్డారని, దీని వల్ల రాష్ట్రానికి చాలా నష్టం వాటిల్లిందన్నారు. ఒక్క యూపీలోనే రూ.52 వేల కోట్లు ఖర్చు చేశారని తెలిపారు. గుజరాత్‌లో ఇంటింటికి తాగునీరు అందిస్తున్నారన్నారు. ఇప్పుడు జల్ జీవన్ మిషన్‌ను సవరించిన మార్గదర్శకాలతో 2028 నాటికి పూర్తి చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ముందుకు వచ్చిందన్నారు. అయితే ఇందుకు ఇంకా రూ.54 వేల కోట్లు కావాల్సి ఉందని తెలిపారు. దీనిపై కేంద్ర ప్రభుత్వంతో సంప్రదించామన్నారు. గత ప్రభుత్వ పాలనలో ఏపిలో ఏ పథకం సరిగా అమలు చేయలేదని, కేంద్ర ప్రాయోజిత పథకాలన్నీ నిర్వీర్యమయిపోయాయని విమర్శించారు. గత ప్రభుత్వం చేతకానితనం వల్ల చాలా సమస్యలు వచ్చాయని, వాటిని ఒక్కొక్కటీ పరిష్కరించుకుంటూ వెళ్తున్నామన్నారు.

కృష్ణా మిగులు జలాల వినియోగం..

ఆంధ్రప్రదేశ్, తెలంగాణల్లో గోదావరి మిగులు జలాలున్నాయని, ఆ నీటిని రెండు రాష్ట్రాలు ఉపయోగించు కుంటున్నాయన్నారు. అయితే కృష్ణా జలాల్లో సమస్య ఉందన్నారు సముద్రంలో కలిసే నీటిని వినియోగించు కుంటామన్నారు. ఇందులో రాజకీయం చేయడం తగదని వెల్లడించారు.

ఎన్‌డీఏ నేతల భేటీ

అంతకు ముందు ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖా గుప్తా ప్రమాణ స్వీకారంలో ఏపీ సీఎం, డిప్యూటీ సీఎంలతో పాటు ఎన్‌డీఏ పక్షాల సీఎంలు, డిప్యూటీ సీఎంలు, కేంద్ర మంత్రులు పాల్గొన్నారు. అనంతరం ఎన్‌డీఏ పక్షాల సీఎంలు, డిప్యూటీ సీఎంలతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రధాని మోడీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా, బీజేపీ జాతీయ అధ్యక్షులు నడ్డా హాజరయ్యారు. సమావేశంలో దేశాన్ని ఎలా ముందుకు తీసుకెళ్లాలో చర్చించినట్టు ఏపీ సీఎం చంద్రబాబు తెలిపారు. అనంతరం పవన్ కళ్యాణ్ జాతీయ మీడియాతో మాట్లాడారు. తమ మధ్య ఎలాంటి విబేధాలు లేవన్నారు. తనకు ఆరోగ్యం బాగోలేకపోవడంతో గతంలో ఎన్‌డీఏ సమావేశాలకు హాజరుకాలేదన్నారు. ఇప్పటికీ వెన్నునొప్పితో తాను బాధపడుతున్నానని అన్నారు. ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీల అమలుకు కట్టుబడి ఉన్నామని, అమలుకు ప్రయత్నిస్తున్నట్టు తెలిపారు.



ప్రజల డిమాండ్లను తిరస్కరించిన కేంద్ర బడ్జెట్

- సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యుడు విక్రమ్ సింగ్
- బడ్జెట్‌ను నిరసిస్తూ వామపక్షాలు ఆందోళన

నవతెలంగాణ - న్యూఢిల్లీ బ్యూరో

కేంద్ర బడ్జెట్ దేశ ప్రజల డిమాండ్లను పూర్తిగా తిరస్కరించిందని సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యుడు విక్రమ్ సింగ్ విమర్శించారు. ప్రజా వ్యతిరేక బడ్జెట్‌ను నిరసిస్తూ గురువారం నాడిక్కడ జంతర్ మంతర్ వద్ద సీపీఐ(ఎం), సీపీఐ, సీపీఐ-ఎంఎల్, ఆర్ఎస్‌పీ, సీజీపీఐ తదితర వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. ప్లకార్డులు చేబూని కార్మిక, రైతు, విద్యార్థి, పేదలకు వ్యతిరేక కేంద్ర బడ్జెట్ అంటూ నినాదాల హోరెత్తించారు. ఈ సందర్భంగా కేంద్ర కమిటీ సభ్యుడు విక్రమ్ సింగ్ మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్ ఉపాధి కూలీలు, రైతులను పూర్తిగా విస్మరించిందని ధ్వజమెత్తారు. సబ్సిడీలకు కోత విధించారని, కార్పొరేట్లకు రాయితీలు ప్రకటించారని విమర్శించారు. బడ్జెట్ దేశ ప్రజల అవసరాలను పూర్తిగా విస్మరించిందన్నారు. నిరుద్యోగం, తగ్గుతున్న వేతనాలకు కారణమయ్యే ఆర్థిక వ్యవస్థ ఎదుర్కొంటున్న ప్రాథమిక సమస్యలను పరిష్కరించడానికి బదులుగా, మోడీ ప్రభుత్వం అధిక ఆదాయం కలిగిన వారికి పన్నులను తగ్గించిందన్నారు. ప్రజావసరాల కోసం చేయాల్సిన ఖర్చును తగ్గిస్తోందని దుయ్యబట్టారు. దేశంలోని కార్పొరేట్ వర్గం మినహాయిస్తే, అన్ని వర్గాల ప్రజలను ఈ బడ్జెట్ తిరస్కరించిందన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) ఢిల్లీ రాష్ట్ర కార్యదర్శి అనురాగ్ సక్సేనా, సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ కార్యదర్శి దినేష్ వర్ష్నే, రామకృష్ణ పాండే (సీపీఐ), రవి రాయ్ (సీపీఐ ఎంఎల్), మన్వేంద్ర ప్రతాప్ సింగ్ (ఆర్ఎస్‌పీ), బిర్జున్ నాయక్ (సీజీపీఐ) తదితరులు మాట్లాడారు.

మోడల్ స్కూల్, గురుకుల టీచర్లకు కుటుంబ పెన్షన్ వర్తింపజేయాలి

- డీటీఏ రామచంద్రమూర్తికి సీపీఎస్ యూనియన్ వినతి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో మోడల్ స్కూళ్లు, గురుకుల విద్యాసంస్థల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు కుటుంబ పెన్షన్‌ను వర్తింపజేయాలని సీపీఎస్ యూనియన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు గురువారం హైదరాబాద్‌లో డైరెక్టర్ ఆఫ్ ట్రెజరీస్ అండ్ అకౌంట్స్ కార్యాలయంలో డైరెక్టర్ రామచంద్రమూర్తిని సీపీఎస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు స్థితప్రజ్ఞ, ప్రధాన కార్యదర్శి కల్వల్ శ్రీకాంత్ నేతృత్వంలో కలిసి వినతిపత్రం సమర్పించారు. 2017లో వచ్చిన జీవో నెంబర్ 32 ద్వారా సీపీఎస్ విధానంలోకి వచ్చినప్పటి నుంచి కుటుంబ సౌకర్యాన్ని, ఇన్‌వాల్యుడేషన్ పెన్షన్‌ను అమలు చేయలేదని స్థితప్రజ్ఞ తెలిపారు. మోడల్ స్కూళ్లలో పనిచేసిన 38 మంది ఉపాధ్యాయుల ఆకస్మిక మరణంతో ఆ కుటుంబాలు తీవ్ర అవస్థలు పడుతున్నాయని పేర్కొన్నారు. సమాజంలో బడుగు, బలహీనవర్గాలకు గుణాత్మక విద్యను అందించడంలో మోడల్ స్కూళ్ళ, గురుకుల విద్యాసంస్థలు ఎల్లప్పుడూ ముందుంటాయని తెలిపారు. రాష్ట్ర పురోభివృద్ధికి దోహదపడుతున్నాయని వివరించారు. వాటిలో పని చేస్తున్న ఉపాధ్యాయుల సేవలను దృష్టిలో ఉంచుకుని కుటుంబ పెన్షన్‌ను అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎస్ యూనియన్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు నరేందర్‌రావు, ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, కోశాధికారి శ్యాంసుందర్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్ఆర్ఎస్‌ను ఉచితంగా అమలు చేయాలి

- మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఎల్ఆర్ఎస్‌ను ఉచితంగా అమలు చేయాలని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు ఉచితంగా ఎల్ఆర్ఎస్ అమలు చేయకుంటే సీఎం, మంత్రులు రాజీనామా చేయాలన్నారు. అలా కాదనీ క్రమబద్ధీకరణ కోసం వచ్చిన 25 లక్షల మంది నుంచి డబ్బులు దోచుకుంటే ప్రజాక్షేత్రంలో శిక్ష తప్పదని హెచ్చరించారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఒక మాట, అధికారంలోకి వచ్చాక మరో మాట మాట్లాడటం కాంగ్రెస్ అలవాటేనని ఎద్దేవా చేశారు.

షమీమ్ అక్తర్ కమిషన్‌ను తొందరపెట్టొద్దు

- శాస్త్రీయంగా, హేతుబద్ధంగా, లోతుగా అధ్యయనం అవసరం
- ఎస్సీల్లోని 57 ఉపకులాలకూ న్యాయం జరగాలి :మందకృష్ణ మాదిగ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఎస్సీల వర్గీకరణ అంశంపై వేసిన అక్తర్ కమిషన్‌ను తొందర పెట్టొద్దని ఎంఆర్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మంద కృష్ణ మాదిగ ప్రభుత్వాన్ని కోరారు. గురువారం హైదరాబాద్‌లోని సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కమిషన్ శాస్త్రీయంగా, హేతుబద్ధంగా లోతుగా అధ్యయనం చేసేందుకు పూర్తి సమయం వెచ్చించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. వర్గీకరణకు కమిషన్ వేయడం పట్ల సీఎం రేవంత్ రెడ్డికి ధన్యవాదాలు తెలిపిన ఆయన, ఫిబ్రవరి 10 వరకు గడువు ఉన్నప్పటికీ నివేదిక కోసం తొందరపెట్టడంతోనే లోపాలు చోటు చేసుకున్నాయనే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. మరోసారి కమిషన్ గడువును మార్చి 10 వరకు పెంచిన సర్కారు అంతకు ముందే ఇదే అంశంపై ప్రత్యేక అసెంబ్లీ సమావేశాలను మార్చి మొదటివారంలో నిర్వహించనున్నట్టు సమాచారం వస్తుండటంతో ఆందోళన వ్యక్తం చేశారు. మరోసారి కమిషన్ నివేదిక కోసం తొందరపెడతారనే అనుమానాన్ని వ్యక్తం చేశారు. అలాంటి పరిస్థితి తేకుండా మార్చి 9 అర్ధరాత్రి వరకు కమిషన్‌ను పూర్తి స్థాయిలో పని చేయించాలని విజ్ఞప్తి చేశారు. మాదిగలకు అధిక వాటా కావాలని తాము కోరుకోవడం లేదనీ, అదే సమయంలో 57 ఉపకులాలకు వారి వాటా దక్కాలని ఆకాంక్షిస్తున్నట్టు చెప్పారు. 57 ఉపకులాలు లిఖిత పూర్వకంగా తమ విజ్ఞప్తులను కమిషన్‌కు అందించాలని సూచించారు. తాను 57 ఉప కులాల వారితో సంప్రదింపులు జరుపుతున్నట్టు తెలిపారు. వర్గీకరణ తర్వాత పూనా ఒడంబడిక, పోలవరం కోసం ఏపీలో తెలంగాణ గ్రామాల విలీనం తర్వాత నష్టపోయామనే భావన బాధిత వర్గాల్లో తలెత్తిం దని గుర్తు చేస్తూ, వర్గీకరణ తర్వాత ఎస్సీ ఉపకులాల్లో అలాంటి భావన తలెత్తకుండా లోతైన అధ్యయనం చేసి నివేదిక సమర్పిస్తే బాగుంటుందని ఆకాంక్షించారు.

మహిళా కాంగ్రెస్...లక్ష సభ్యత్వం

- గాంధీభవన్‌లో సంబరాలు

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

రాష్ట్ర మహిళా కాంగ్రెస్ లక్ష సభ్యత్వాన్ని పూర్తి చేసింది. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని మహిళా కాంగ్రెస్ అధ్యక్షులు సునీతారావు ఆధ్వర్యంలో బుధవారం గాంధీభవన్‌లో పెద్ద ఎత్తున సంబరాలు నిర్వహించారు. టపాకులు పేల్చి, బ్యాండ్ మేళంతో మహిళలు ఆడి పాడారు. ఈ సందర్భంగా సునీతారావు మాట్లాడుతూ తమ పార్టీ మహిళా సాధికారితకు పెద్ద పీట వేసిందన్నారు. వారిని చైతన్య పరుస్తూ ఏకతాటి వైపు తీసుకువచ్చి మహిళా కాంగ్రెస్ సభ్యత్వంలో దేశంలోనే అగ్రగామీగా నిలిచామని తెలిపారు. ఇది తన విజయం కాదనీ, మహిళా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజల విజయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు నీలం పద్మ, ఆర్.లక్ష్మి, అనురాధ, ఇందిర, ఎం. లక్ష్మి పార్వతమ్మ, సరళ, ఉషశ్రీ, కవిత, జ్యోతి, కృష్ణవేణి, అంజలి, నిర్మలారెడ్డి, లక్ష్మమ్మ ఉన్నారు.

కొత్తగూడెంలో 'మైనింగ్ విశ్వవిద్యాలయం'!

- బిల్లును రూపకల్పన చేస్తున్న ఉన్నత విద్యామండలి
- అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో ప్రవేశపెట్టే అవకాశం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ప్రభుత్వరంగంలో మరో విశ్వ విద్యాలయం రాబోతున్నది. కొత్తగూడెంలో మైనింగ్ విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తున్నది. ఇందుకు సంబంధించిన బిల్లును ఉన్నత విద్యామండలి అధికారులు రూపకల్పన చేస్తున్నారు. బీఆర్ఎస్ హయాంలోనే మైనింగ్ విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు కావాల్సి ఉన్నది. నాడు కొత్తగూడెం ఎమ్మెల్యేగా ఉన్న జలగం వెంకట్రావు కూడా వర్సిటీ ఏర్పాటు కోసం కృషి చేశారు. ఆ దిశగా ప్రభుత్వం కూడా కసరత్తు చేసింది. కానీ వివిధ కారణాల వల్ల అది కార్యరూపం దాల్చలేదు.

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక స్కిల్ యూనివర్సిటీని నెలకొల్పింది. స్పోర్ట్స్ యూనివర్సిటీని నెలకొల్పేందుకు కసరత్తు జరుగుతున్నది. ఇప్పుడు కొత్తగూడెంలో మైనింగ్ విశ్వవిద్యాలయం ఏర్పాటుకు సన్నాహాలు జరుగుతున్నాయి. ఇప్పటికే కొత్తగూడెంలో మైనింగ్ ఇంజినీరింగ్ కాలేజీ ఉన్నది. దాన్ని అప్‌గ్రేడ్ చేసి విశ్వవిద్యాలయంగా మార్చే అవకాశమున్నది. బీఆర్ఎస్ హయాంలోనే తెలంగాణ ఉన్నత విద్యామండలి నియమించిన నిపుణుల కమిటీ కొత్తగూడెం యూనివర్సిటీ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీగా మార్చాలని సిఫారసు చేసింది. అప్పటి రాష్ట్ర ప్రభుత్వం ఆ సిఫారసును పట్టించుకోలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం మైనింగ్ విశ్వవి ద్యాలయం ఏర్పాటుకు సుముఖంగా ఉన్నట్టు తెలిసింది. అందుకే ఉన్నత విద్యామండలి అధికారులు మైనింగ్ వర్సిటీ ఏర్పాటుకు సంబంధించిన బిల్లును రూపొందిస్తు న్నారు. వచ్చేనెలలో జరిగే అసెంబ్లీ బడ్జెట్ సమా వేశాల్లో ఈ బిల్లును ప్రభుత్వం ప్రవేశపెట్టే అవకా శమున్నది. ఆ బిల్లు ఆమోదం పొంది గవర్నర్ ఆమోదిస్తే చట్టంగా మారుతుంది. దీంతో 2025-26 విద్యాసంవత్సరంలో మైనింగ్ విశ్వ విద్యాలయంలోనే ప్రవేశాలు చేపట్టేందుకు అవకాశముంటుంది.

390 ఎకరాల్లో మైనింగ్ ఇంజినీరింగ్ కాలేజీ

కొత్తగూడెంలో మైనింగ్ విశ్వవిద్యాలయం ఏర్పాటు కోసం నియమించిన నిపుణుల కమిటీకి చైర్మెన్‌గా వీఎస్ ప్రసాద్ వ్యవహరించారు. సభ్యులుగా ఉన్నత విద్యామండలి వైస్ చైర్మెన్లు కె వెంకటాచలం, ఎస్ మల్లేషం, కార్యదర్శి ఎన్ శ్రీనివాసరావు, విద్యాశాఖ జాయింట్ సెక్రెటరీ టి విజయ్‌కుమార్, ఎన్ఎండీసీ డీజీఎం కొడాలి శ్రీధర్, సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ ప్రతినిధులు కేజే అమర్‌నాథ్, బి రామనారాయణ, రామలింగేశ్వరుడు, జీ మురళీ సాగర్‌కుమార్, విద్యారంగ నిపుణులు మైన్స్ సేఫ్టీ డైరెక్టర్ కే నాగేశ్వరరావు, సీనియర్ ప్రిన్సిపాల్ జేకే పాండే, ఐఐటీ ఖరగ్‌పూర్ ప్రొఫెసర్ కే ఉమా మహేశ్వరరావు, కొత్తగూడెం ఎమ్మెల్యే జలగం వెంకట్రావు ఉన్నారు.

ఆ కమిటీ 2017లోనే సిఫారసులను రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పించింది. కానీ అప్పటి ప్రభుత్వం వాటిని పట్టించుకోలేదు. ఐటీఐ, పాలిటెక్నిక్, ఇంజినీరింగ్‌తోపాటు సోషల్ సైన్సెస్ కోర్సులను ప్రవేశపెట్టాలని సూచించింది. కొత్తగూడెంలో ఉన్న మైనింగ్ ఇంజినీరింగ్ కాలేజీ 390 ఎకరాల్లో విశాలంగా ఉన్నది. మైనింగ్ విశ్వవిద్యాలయంగా నెలకొల్పాలంటే భవనాలు, హాస్టళ్లు, మౌలిక వసతులు, ల్యాబ్‌లు, ఫర్నీచర్ కోసం సుమారు రూ.300 కోట్లు వ్యయం అవుతుందని నిపుణుల కమిటీ అంచనా వేసింది. క్రీడా ప్రాంగణం, జీతభత్యాలు, నివాసాల కోసం రూ.200 కోట్లు అవుతుందని సిఫారసు చేసింది. మైనింగ్ విశ్వ విద్యాలయంగా నెలకొల్పాలంటే మొత్తం రూ.500 కోట్లు వ్యయం అవుతుందని అంచనా వేసింది. పారిశ్రామిక సంస్థలు, ఎన్ఎండీసీ, సింగరేణి, కోల్ ఇండియా నుంచి నిధులు సమకూర్చుకోవాలని సూచించింది. యూనివర్సిటీ కోసం 210 మంది అకడమిక్ సిబ్బంది, 30 మంది అనుభవం గల సిబ్బంది, 110 మంది నిపుణులైన అధ్యాపకులు, మరో 50 మంది ఇతర సిబ్బంది అవసరమవుతారని నిపుణుల సిఫారసు చేసింది. రాష్ట్ర ప్రభుత్వం వాటిపై ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో చూడాల్సిందే.

ప్రయివేటు వర్సిటీలపై నియంత్రణ!

- పర్యవేక్షణ పటిష్టంగా ఉండేలా ప్రభుత్వ సమాలోచన
- తెలంగాణ యూనివర్సిటీ రిఫార్మ్స్ బిల్లు రూపకల్పన

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ప్రయివేటు విశ్వవిద్యాలయాలపై నియంత్రణ మరింత కట్టుదిట్టంగా ఉండాలన్న అభిప్రాయానికి ప్రభుత్వం వచ్చింది. అందులో భాగంగానే తెలంగాణ యూనివర్సిటీ రిఫార్మ్స్ బిల్లు-2025 రూపకల్పన జరుగుతున్నది. ప్రయివేటు విశ్వవిద్యాలయం నెలకొల్పడానికి, అనుమతి ఇవ్వడం వరకే ఉన్నత విద్యామండలికి అధికారం ఉన్నది.

కానీ ఏమైనా ఇబ్బందులు వచ్చినా, ఏమైనా ఫిర్యాదులు అందినా వాటిని విచారణ చేపట్టి చర్యలు తీసుకునే అధికారం లేదు. గతంలో అనుమతి లేకుండానే అడ్మిషన్లు చేపట్టిన గురునానక్, శ్రీనిధి ప్రయివేటు విశ్వవిద్యాలయాలపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడమే ఇందుకు నిదర్శనం. ఆ తర్వాత విద్యార్థులు రోడ్డున పడడంతో ప్రభుత్వం జోక్యం చేసుకుని వారిని ఇతర వర్సిటీలు, ఇంజినీరింగ్ కాలేజీల్లో సర్దుబాటు చేసింది. అయితే ప్రయివేటు విశ్వవిద్యాలయాలపై పర్యవేక్షణ మరింత ఉండాలన్న అభిప్రాయానికి ప్రభుత్వం వచ్చింది. అందుకోసం ఉన్నత విద్యామండలికి అధికారాలను కట్టబెట్టాలని భావిస్తున్నది. ప్రస్తుతం ప్రయివేటు వర్సిటీల్లో ప్రవేశాలు, సిలబస్, పరీక్షల నిర్వహణ, ఫీజుల ఖరారు, వసూలు వంటి అంశాలన్నింటిపై ప్రభుత్వ నియంత్రణ ఉండదు. ప్రయివేటు విశ్వవిద్యాలయాలకు నచ్చినట్టుగానే జరుగుతున్నది. వాటిపైనా పర్యవేక్షణ ఉండాలని ప్రభుత్వం భావిస్తున్నది. దానికోసమే తెలంగాణ యూనివర్సిటీ రిఫార్మ్స్ బిల్లు-2025ని రూపొందిస్తున్నది. వచ్చే అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో ఈ బిల్లును ప్రవేశపెట్టే అవకాశమున్నట్టు తెలిసింది. రాష్ట్రంలో 2021-22 విద్యాసంవత్సరంలో మహీంద్రా, మల్లారెడ్డి, వాక్సన్, అనురాగ్, ఎస్ఆర్ విద్యాసంస్థలు ప్రయివేటు విశ్వవిద్యాలయాలను నెలకొల్పాయి. వాటితోపాటు శ్రీనిధి విశ్వవిద్యాలయం (ఘట్‌కేసర్), గురునానక్ విశ్వవిద్యాలయం (ఇబ్రహీంపట్నం), నిక్‌మర్ కన్‌స్ట్రక్షన్ విశ్వవిద్యాలయం (శామీర్‌పేట), ఎంఎస్ఆర్ విశ్వవిద్యాలయం (సంగారెడ్డి), కావేరి విశ్వవిద్యాలయం (గౌరారం) కూడా నెలకొల్పాయి. వాటిలో కూడా ప్రవేశాలు జరిగాయి.

ఎస్సీ వర్గీకరణలో రేవంత్ రెడ్డి పాత్ర లేదు

- షమీమ్ అక్తర్ కమిషన్ నివేదికను బహిర్గతం చేయాలి
- అన్ని వర్గాలకు న్యాయం చేయాలి
- జాబ్ క్యాలెండర్ అమలు నిలిపేయొద్దు
- దళిత బంధు నిధులు బడ్జెట్‌లోపు విడుదల చేయాలి : దళిత బంధు సాధన సమితి సమావేశంలో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఎస్సీ వర్గీకరణలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాత్ర ఏమీ లేదని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత స్పష్టం చేశారు. వర్గీకరణ విషయంలో ప్రధాని మోడీ, సీఎం రేవంత్ చేసిందేమీ లేదనీ, సుప్రీంకోర్టు తీర్పుతో వర్గీకరణకు బాటలు పడ్డాయన్నారు. బీఆర్ఎస్ పార్టీ హయాంలో కేసీఆర్ అసెంబ్లీలో వర్గీకరణపై తీర్మానం చేసి కేంద్రానికి పంపిన విషయాన్ని గుర్తు చేశారు. దళితుల మధ్య పంచాయితీ పెట్టొద్దనీ, ఎవరికీ అన్యాయం జరగకుండా వర్గీకరణ చేపట్టాలని ప్రభుత్వానికి సూచించారు. గురువారం హైదరాబాద్‌లోని తన నివాసంలో దళిత బంధు సాధన సమితి అధ్యక్షులు మహేష్ కోగిల ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. షమీమ్ అక్తర్ కమిషన్ నివేదికను బయటపెట్టి, వెంటనే వర్గీకరణ చేపట్టాలని డిమాండ్ చేశారు. వర్గీకరణకు, ఉద్యోగాల కల్పనకు ముఖ్యమంత్రి లింక్ పెడుతున్నారని ఆరోపించారు. వర్గీకరణ వంకతో జాబ్ క్యాలెండర్ అమలు నిలిపేయొద్దని సూచించారు. కోర్టు తీర్పు వచ్చి 6 నెలలు గడిచినా ఎందుకు అమలు చేయలేదని ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి మాటలు చెబితే నమ్మరని ఎన్నికలకు ముందు ఢిల్లీ నుంచి ఆ పార్టీ జాతీయ నాయకురాలు ప్రియాంకా గాంధీని తీసుకొచ్చి హామీ ఇప్పించారనీ, దళిత కుటుంబాలకు రూ.10 లక్షలకు బదులు రూ.12 లక్షలు ఇస్తామని హామీ ఇచ్చి మోసం చేశారని దుయ్యబట్టారు. ముఖ్యమంత్రికి ప్రభుత్వాన్ని నడపడం చేతకావడం లేదని విమర్శించారు. రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా చేశారనీ, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను సీఎం కుదేలు చేశారన్నారు. ఇప్పటికే మాజీ సీఎం కేసీఆర్ మంజూరు చేసిన దళిత బంధు నిధులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే మిగిలిన 18 వేల దళిత కుటుంబాలకు బడ్జెట్ ప్రవేశపెట్టే ముందే ఆ డబ్బులను విడుదల చేయాలన్నారు. రేవంత్ సర్కారు ఎస్సీలకు బడ్జెట్‌లో రూ. 33 వేల కోట్లు కేటాయించి... కేవలం రూ.9,800 కోట్లే ఖర్చు చేసిందని ఎండగట్టారు. అంబేద్కర్‌ను, ఆయన వారసులను రేవంత్ రెడ్డి అవమానిస్తున్నారని కవిత విమర్శించారు.

అంబేద్కర్ జయంతిలోపు 125 అడుగుల విగ్రహానికి సీఎం, మంత్రులు పూలదండలు వేయాలని డిమాండ్ చేశారు. లేకపోతే ప్రభుత్వం మూసేసిన గేట్లను బద్దలు కొడుతామని హెచ్చరించారు. రెండు, మూడేండ్లలో బీఆర్ఎస్ అధికారంలోకి వస్తుందని దళితులకు మళ్లీ మంచి రోజులొస్తాయని భరోసానిచ్చారు. అంబేద్కర్ రాసిన రాజ్యాంగం వల్లే తెలంగాణ రాష్ట్రం సాధ్యమైందని ఆమె గుర్తుచేశారు. ఒక్కో దళిత కుటుంబానికి రూ.10 లక్షల చొప్పున రూ.57 వేల కోట్లు ఖర్చు చేయాలని విప్లవాత్మక నిర్ణయం తీసుకున్న నాయకుడు కేసీఆర్ అని కొనియాడారు. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి కాంగ్రెస్ దళితులను మోసం చేస్తూనే ఉందని కవిత విమర్శించారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మెన్ బండ శ్రీనివాస్, చిటిమల్ల సమ్మయ్య, మడికొండ రమేష్ తదితరులు పాల్గొన్నారు.



కష్టపడితేనే గుర్తింపు

- హైడ్రాలో డీఆర్ఎఫ్ పాత్ర కీలకం
- ప్రజల అంచనాలకనుగుణంగా పని చేద్దామన్న కమిషనర్

నవతెలంగాణ-సిటీబ్యూరో

హైడ్రా నిర్వహిస్తున్న విధులన్నిం టిలో డీఆర్ఎఫ్ బృందాలు కీలకపాత్ర పోషిస్తున్నాయని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ అన్నారు. ప్రభుత్వ లక్ష్యాలు, ప్రజల అంచనాల మేరకు హైడ్రా పని చేయాల్సిన అవసరం ఉందని, ఈ విషయంలో అందరూ అప్రమత్తంగా ఉండాలని అన్నారు. డీఆర్ఎఫ్‌లోకి ఔట్‌సోర్సింగ్ విధానంలో కొత్తగా తీసుకున్న 357 మంది శిక్షణ కార్యక్రమం గురువారం ప్రారంభమైంది. అంబర్‌పేట్ పోలీసు శిక్షణ కేంద్రంలో వారం రోజులపాటు ఈ శిక్షణ ఉంటుంది. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. హైడ్రా ప్రధాన భూమిక పోషిస్తున్న విషయాన్ని గుర్తు పెట్టుకుని ప్రతి ఒక్కరూ పని చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు ప్రజల ప్రాణాలతో పాటు, ఆస్తి నష్టాన్ని తగ్గించడంలో డీఆర్ఎఫ్ పాత్ర చాలా కీలకమైనదని, తాజాగా హైడ్రా విధులు కూడా తోడయ్యాయన్నారు. ఆ నమ్మకంతోనే ప్రభుత్వం పలు బాధ్యతలు అప్పగిస్తున్నదన్నారు. తాజాగా ఇసుక అక్రమ రవాణాను నియంత్రించే పనిని కూడా అప్పగించిందని, వీటన్నింటినీ ఎంతో శ్రద్ధగా, బాధ్యతతో చేయాల్సిన అవసరం ఉందన్నారు. పోలీసు పరీక్ష రాసి, కొద్ది మార్కుల తేడాతో ఉద్యోగం పొందలేని వారి మెరిట్ లిస్టు ఆధారంగా, సామాజిక అంశాన్ని కూడా దృష్టిలో పెట్టుకుని తమను ఎంపిక చేశామని, ఎంపిక ప్రక్రియ ఎంతో పారదర్శకంగా జరిగిందని చెప్పారు. ప్రస్తుత తరుణంలో ఉద్యోగాలకు ఎంతో పోటీ ఉందని, ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకుని ప్రతిభ కనబర్చాలన్నారు. అప్పుడే మంచి అవకాశాలుంటాయన్నారు. భారీ వర్షాలు, వరదలు, అగ్నిప్రమాదాలు ఇలా ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు ప్రజలకు అండగా ఉంటూ, ప్రాణ, ఆస్తి నష్టాలను తగ్గించే విధానాలపై శిక్షణ ఇస్తున్నారని, విజయవంతంగా శిక్షణను పూర్తి చేయాలని సూచించారు.

మార్చి 10న ఇందిరాపార్క్ వద్ద ధర్నా

- ఏఐయూకేఎస్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ అనుసరిస్తున్న రైతాంగ వ్యతిరేక విధానాలను నిరసిస్తూ వచ్చేనెల పదో తేదీన హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద ధర్నా చేపట్టనున్నట్టు ఏఐయూకేఎస్ రాష్ట్ర కమిటీ తెలిపింది. గురువారం హైదరాబాద్‌లోని మార్క్స్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆ సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కె రంగయ్య, వి ప్రభాకర్ మాట్లాడుతూ కనీస మద్దతు ధరల చట్టం చేయాలని డిమాండ్ చేశారు. నూతన వ్యవసాయ మార్కెట్ విధాన బిల్లును ఉపసంహరించుకోవాలని కోరారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా వ్యవహరిస్తున్నదని విమర్శించారు. 13 నెలలపాటు పోరాటం చేస్తే రద్దు చేసిన మూడు వ్యవసాయ చట్టాలను దొడ్డిదారిన ప్రవేశపెట్టేందుకు వీలుగా వ్యవసాయ మార్కెట్ విధాన బిల్లును తెచ్చిందన్నారు. 2013 నిర్వాసిత చట్టం ప్రకారం నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. మిర్చికి రూ.25 వేలు, పసుపునకు రూ.15 వేలు క్వింటాల్‌కు ఇప్పించాలని కోరారు. రైతాంగ సమస్యల పరిష్కారం కోసం వచ్చేనెల ఐదు నుంచి తొమ్మిదో తేదీ వరకు జిల్లా కేంద్రాల్లో సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కేఎం) ఆధ్వర్యంలో నిరవధిక ధర్నాలను నిర్వహిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐయూకేఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు గుమ్మడి నర్సయ్య, బి రాము, రాష్ట్ర కార్యదర్శులు నందిరామయ్య, సిహెచ్ రామచందర్, సారా సురేష్, కోశాధికారి ఆవుల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

రాకేశ్‌కు ఉచితంగా మెరుగైన వైద్యం అందించాలి

- ఛార్జింగ్ వాహనాన్ని కూడా ఉచితంగా ఇవ్వాలి
- అధికారులకు సీఎం రేవంత్ రెడ్డి ఆదేశం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

సూడో మస్క్యులర్ డిస్ట్రోఫీ (కండరాల క్షీణత వ్యాధి)తో బాధ పడుతున్న నిరుపేద యువకుడు రాకేశ్ కు మెరుగైన వైద్యం అందించాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. హన్మకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం రంగయ్యపల్లి గ్రామానికి చెందిన గూళ్ల రాకేశ్ చాలా కాలం నుంచి ఈ వ్యాధితో బాధపడుతున్నారు. ఇటీవల వ్యాధి తీవ్రత పెరగడంతో నడవలేని పరిస్థితికి తలెత్తింది. రాకేశ్ పరిస్థితిపై మీడియాలో వచ్చిన కథనాలపై ముఖ్యమంత్రి స్పందించారు. ముఖ్యమంత్రి ఆదేశాలతో సీఎం ఓఎస్డీ శ్రీనివాసులు రాకేశ్ కుటుంబ సభ్యులతో మాట్లాడారు. ప్రభుత్వం నుంచి అన్ని విధాలుగా ఆదుకుంటామని ముఖ్యమంత్రి తరపున హామీ ఇచ్చారు. రాకేశ్‌కు క్రమం తప్పకుండా ఖరీదైన ఇంజెక్షన్లను ఇవ్వాల్సి ఉంటుందని వైద్యులు సూచించారు. ములకనూరులోని ఒక ప్రయివేటు కాలేజీలో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్న రాకేశ్‌కు స్వగ్రామం నుంచి వెళ్లి రావడానికి ఛార్జింగ్ వాహనాన్ని ప్రభుత్వం అందించనున్నది. తమ కొడుకును ఆదుకున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి రాకేశ్ తల్లిదండ్రులు గూళ్ల సమ్మయ్య, లక్ష్మి ధన్యవాదాలు తెలిపారు.

మేక్ ఇన్ ఇండియాకు టెస్లా తూట్లు..!

జర్మనీ నుంచి కార్ల దిగుమతి | భారత్‌లో విక్రయాలపైనే దృష్టి




న్యూఢిల్లీ : ప్రధాని నరేంద్ర మోడీ అత్యంత ప్రతిష్టాత్మకంగా చెప్పుకొంటున్న మేక్ ఇన్ ఇండియా లక్ష్యానికి టెస్లా తూట్లు పెడుతోంది. ఆ కంపెనీ జపాన్‌లో తయారు చేసిన కార్లను రెడీమేడ్‌గా తెచ్చి భారత్‌లో విక్రయించడానికి ప్రణాళికలు సిద్ధం చేసుకుందని రిపోర్టులు రావడమే ఇందుకు నిదర్శనం. ప్రపంచంలోని వివిధ దేశాల్లో కార్లు తయారు చేస్తున్న టెస్లా కంపెనీ ఇప్పట్లో భారత్‌లో ఫ్యాక్టరీని ఏర్పాటు చేసే ప్రతిపాదనను ఉపసంహరించుకుంటున్నట్లు సమాచారం. దిగుమతి చేసిన కార్లనే ఇక్కడ విక్రయించాలని భావిస్తోంది. జర్మనీ రాజధాని బెర్లిన్‌లోని తమ అతిపెద్ద గిగా ఫ్యాక్టరీలో తయారయిన కార్లను భారత్‌కు ఎగుమతి చేయాలని యోచన. భారత ప్రభుత్వ కొత్త ఈవీ పాలసీ ప్రకారం విద్యుత్ కార్ల దిగుమతికి సంబంధించి రూ.4,150 కోట్ల పెట్టుబడులకు హామీ ఇస్తే 15 శాతం సుంకం మాత్రమే విధించనుంది. దీంతో ప్రతీ ఏడాది 8,000 వాహనాలను దిగుమతి చేసుకోవడానికి వీలుంది. దేశీయంగా తయారీలో స్థానికంగా ముడిసరకు సమకూర్చుకోవాలన్న నిబంధన కూడా ఉంది. కాగా.. బెర్లిన్‌లో టెస్లా వై మోడళ్లు తయారవుతున్నాయి. వీటిని తొలుత భారత్‌కు ఎగుమతి చేయాలని యోచిస్తోంది. టెస్లా ప్లాంట్‌ను ఎలాగైన తాము దక్కించుకోవాలని గుజరాత్, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ పోటాపోటీగా ఉన్నాయి.

భారత్‌లో తయారీ ప్లాంట్ నెలకొల్పాలని టెస్లాకు ఓ దశలో యోచన ఉన్నప్పటికీ.. దానికి ట్రంప్ మోకాలడ్డు వేశారని నిపుణులు విశ్లేషిస్తున్నారు. భారత్‌లో టెస్లా ఫ్యాక్టరీ ఏర్పాటు ప్రతిపాదనను అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తప్పుబట్టారు. ప్రపంచంలోని ప్రతీ దేశం తమను వాడుకోవాలని ప్రయత్నిస్తోందని ఎలన్‌మస్క్‌తో కలిసి పాల్గొన్న ఓ కార్యక్రమంలోనే ట్రంప్ వ్యాఖ్యానించారు. సుంకాలతో లబ్ధి పొందాలని చూస్తున్నాయని పేర్కొన్నారు. మస్క్ భారత్‌లో టెస్లా ఫ్యాక్టరీ ఏర్పాటు చేయడానికి సిద్ధం అవుతున్నారని.. ఇది ఆయనకు మంచిదే కావచ్చు కానీ.. అమెరికా పరంగా చూస్తే చాలా అన్యాయమేనని ట్రంప్ అనడం గమనార్హం. ఎలన్ మస్క్ ముందే ఈ వ్యాఖ్యలు చేయడంతో టెస్లా తయారీ యూనిట్‌ను భారత్‌లో నెలకొల్పడంపై నీలినీడలు కమ్ముకున్నాయని నిపుణులు భావిస్తున్నారు. దేశ రాజధాని ఢిల్లీ, ఆర్థిక రాజధాని ముంబయి నగరాల్లో రెండు షోరూమ్‌లు ఏర్పాటు చేసేందుకు టెస్లా ప్రయత్నాలు మొదలు పెట్టింది. ఇందుకోసం నియామకాల కోసం ప్రకటనలు కూడా జారీ చేసిన విషయం తెలిసిందే.

ఇక గూగుల్ పే బాదుడు

కార్డ్ చెల్లింపులపై 1 శాతం రుసుం..

న్యూఢిల్లీ : ప్రముఖ డిజిటల్ చెల్లింపుల వేదిక గూగుల్ పే తన వినియోగదారులకు షాక్ ఇచ్చింది. క్రెడిట్ కార్డ్, డెబిట్ కార్డులతో గూగుల్ పే నుంచి చేసే చెల్లింపులపై కన్వీనియన్స్ ఫీజు వసూలు చేయడం ప్రారంభించింది. విలువను బట్టి 0.5 నుంచి 1 శాతం వరకు చార్జి వసూలు చేయనుంది. దీంతో ముఖ్యంగా కరెంట్ బిల్లులు, గ్యాస్ బుకింగ్ చెల్లింపుల వినియోగదారులపై భారం పడనుంది. ఇతర ఫిన్‌టెక్ సంస్థలు పేటీయం, ఫోన్‌పే సంస్థలు ఇప్పటికే ఈ తరహా ఫీజును వసూలు చేస్తోన్నాయి. ఇప్పటి వరకు ఉచితంగా అందించిన గూగుల్ పే కూడా ఇకపై బాదుడును షురూ చేసింది. గూగుల్‌పేలో ఇటీవల క్రెడిట్ కార్డ్ ద్వారా విద్యుత్ బిల్లు చెల్లించిన ఓ వినియోగదారుడిపై రుసం వసూలు చేసినట్టు జాతీయ మీడియాలో ఓ కథనం వచ్చింది. తాను చెల్లించిన కరెంట్ బిల్‌పై రూ.15 కన్వీనియన్స్ ఫీజు రూపంలో గూగుల్ పే వసూలు చేసినట్టు ఆ వ్యక్తి తెలిపారు. కాగా ఈ చార్జీలు అందరికీ వర్తిస్తాయా లేదా అనేది గూగుల్ పే స్పష్టం చేయాల్సి ఉంది. యూపీఐ లావాదేవీలకు మాత్రం ఈ చార్జీలు వర్తించవని తెలుస్తోంది. గతేడాది నుంచే మొబైల్ రీచార్జీలపై రూ.3 వసూలు చేస్తోంది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో 12 వేల కోట్ల యూపీఐ చెల్లింపులు నమోదయ్యాయి.





ఎఐ డేటా భద్రత ముఖ్యమే

అసోచామ్ సదస్సులో జయేష్ రంజన్

హైదరాబాద్ : ఎఐ డేటా భద్రత కూడా వ్యవస్థలకు ముఖ్యమేనని రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ చీఫ్ సెక్రటరీ జయేష్ రంజన్ అన్నారు. తెలంగాణ ప్రభుత్వంలోని ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ శాఖ అసోసియేటెడ్ సహకారంతో ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఆఫ్ ఇండియా (అసోచామ్) సంస్థలు 'ఇన్నోవేషన్ నెక్సస్-కాన్ఫరెన్స్ ఆన్ సెక్యూరిటీ, డేటా ప్రొటెక్షన్ అండ్ ఎఐ'ని హెచ్ఐసిసిలో నిర్వహించారు. ఎఐ అప్లికేషన్‌లలో అభివృద్ధి చెందుతున్న ధోరణులు, సాంకేతిక పురోగతులు, పరిశ్రమలు సమాజాన్ని ఎలా పునర్నిర్మిస్తున్నాయనే దానిపై ఇందులో చర్చించారు. పటిష్టమైన భద్రతా చర్యలు, గోప్యతా ప్రోటోకాల్, నైతిక ఎఐ విస్తరణతో సాంకేతిక ఆవిష్కరణలను సమతుల్యం చేయాల్సిన అవసరం ఉందని జయేష్ రంజన్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఎన్ఎస్‌సిఎస్ ఐటిఎస్ జాయింట్ సెక్రటరీ జి నరేంద్ర నాథ్, అసోచామ్ తెలుగు రాష్ట్రాల హెడ్ దినేష్ బాబు తదితరులు పాల్గొని మాట్లాడారు.

ఐపీఓ కసరత్తులో ఫోన్‌పే..!

న్యూఢిల్లీ : ప్రముఖ డిజిటల్ చెల్లింపుల వేదిక ఫోన్‌పే ఇన్షియల్ పబ్లిక్ ఇష్యూ (ఐపీఓ)కు రావడానికి ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నట్టు ప్రకటించింది. వాల్‌మార్ట్‌కు చెందిన ఈ సంస్థ ప్రస్తుతం పదేండ్ల వార్షికోత్సవాన్ని నిర్వహించుకుంటుంది. విత్త సేవల్లో కోట్లాది మంది వినియోగదారులకు సేవలందిస్తోంది. 2023-24లో 74 శాతం వృద్ధితో రూ.5,000 కోట్ల రెవెన్యూ సాధించింది. రూ.710 కోట్ల లాభాలు నమోదు చేసింది. 2022లో ఈ సంస్థ సింగపూర్ నుంచి ఇండియాకు మారింది.

బిజినెస్

వడ్డీ రేట్లను తగ్గించిన పీఎన్బీ

న్యూఢిల్లీ : ప్రభుత్వ రంగంలోని పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్బీ) రుణాలపై వడ్డీ రేట్లను తగ్గించింది. దాదాపు ఐదేండ్ల తర్వాత ఆర్‌బిఐ ఇటీవల రెపో రేటును పావు శాతం తగ్గించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే పీఎన్బీ రిటైల్ రుణాలపై 25 బేసిస్ పాయింట్ల వరకు వడ్డీ రేట్లకు కోత పెట్టింది. సవరించిన వడ్డీ రేట్లు ఫిబ్రవరి 10 నుంచే అమల్లోకి వచ్చాయని పీఎన్బీ గురువారం వెల్లడించింది. గృహ రుణాలతో పాటు, కారు, ఎడ్యుకేషన్, పర్సనల్ లోన్లపై ఈ తగ్గింపు వర్తించనుందని తెలిపింది. తాజా సవరణతో పీఎన్బీలో గృహ రుణాల ప్రారంభ రేటు 8.15 శాతంగా ఉండనుంది. దీంతో రూ.లక్ష రుణానికి ఈఎంఐ రూ.744గా ఉంటుందని బ్యాంకు తెలిపింది. ఆటోమొబైల్ రుణాలపై 8.50 శాతం, విద్యా రుణాలపై 7.85 శాతం, వ్యక్తిగత రుణాలపై 11.25శాతం నుంచి వడ్డీ రేట్లు ప్రారంభం అవుతున్నాయని పేర్కొంది. ఇటీవలే దిగ్గజ విత్త సంస్థ ఎస్బీఐ కూడా రుణాలపై పావు శాతం వడ్డీ రేట్లను తగ్గించిన విషయం తెలిసిందే.

మార్కెట్లను వీడని నష్టాలు..

ముంబయి : దేశీయ స్టాక్ మార్కెట్లలో అమ్మకాల ఒత్తిడి కొనసాగుతూనే ఉంది. వరుసగా మూడో సెషన్ గురువారం కూడా నష్టాలను చవి చూశాయి. అమెరికా టారిఫ్‌లతో భారత్‌లో ద్రవ్యోల్బణం పెరగొచ్చనే ఆందోళనలు మార్కెట్లను ప్రతికూలతకు గురి చేశాయి. ముఖ్యంగా బ్యాంకింగ్, ఐటి షేర్లలో ఒత్తిడితో బీఎస్ఈ సెన్సెక్స్ 203 పాయింట్ల నష్టంతో 75,736కు పడిపోయింది. నిఫ్టీ 20 పాయింట్ల నష్టంతో 22,913 వద్ద ముగిసింది. డాలర్‌తో రూపాయి మారకం విలువ 86.65గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, మారుతీ సుజుకీ, టెక్ మహీంద్రా, హెచ్‌సిఎల్ టెక్నాలజీస్, ఐటీసీ షేర్లు అధికంగా నష్టపోయిన వాటిలో ముందు వరుసలో ఉన్నాయి. ఎన్‌టీపీసీ, మహీంద్రా అండ్ మహీంద్రా, అదానీ పోర్ట్స్, టాటా స్టీల్, టాటా మోటార్స్ షేర్లు అధికంగా లాభపడిన వాటిలో టాప్‌లో ఉన్నాయి.

ముఖ్య ఆర్థిక సలహాదారు పదవీకాలం పొడిగింపు



న్యూఢిల్లీ : కేంద్ర ప్రభుత్వ ముఖ్య ఆర్థిక సలహాదారు (సీఈఏ) వి అనంత నాగేశ్వరన్ పదవీకాలాన్ని కేంద్ర ప్రభుత్వం మరో రెండేండ్లు పొడిగించింది. 2027 మార్చి ముగింపు వరకు ఆయన ఈ హోదాలో కొనసాగానికి ప్రధాని నరేంద్ర మోడీ నేతృత్వంలోని క్యాబినెట్ నియామకాల కమిటీ ఆమోదం తెలిపింది. 2022 జనవరి 28న సీఈఏగా తొలుత బాధ్యతలు చేపట్టారు. కేంద్రానికి వివిధ ఆర్థిక విధానాలపై ప్రభుత్వానికి సలహాలు ఇవ్వడంతో పాటు బడ్జెట్‌కు ముందు పార్లమెంట్‌లో ప్రవేశపెట్టే ఆర్థిక సర్వేను రూపొందించడం సీఈఏ కార్యాలయం బాధ్యత.

4,625 కుటుంబాల సర్వే పూర్తి

ఈ నెల 28 వరకు గడువు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన రెండో దఫా కుల గణనలో గురువారం వరకు 4,625 కుటుంబాల సర్వే పూర్తయిందని అధికారులు ప్రకటించారు. టోల్ ఫ్రీ నెంబర్ 040-2111111 ద్వారా 6,415, ప్రజాపాలన సేవా కేంద్రాల్లో 4,227, వెబ్ సైట్ ద్వారా 398 కుటుంబాలు తమ పేర్లను నమోదు చేసుకున్నాయని తెలిపారు. ఇందులో ఇప్పటి వరకు 2,254 గృహాల ఎన్యుమరేషన్, 1,091 కుటుంబాల డేటా ఎంట్రీ పూర్తయిందని తెలిపింది. గతేడాది నవంబర్ 6ననుంచి డిసెంబర్ 25 వరకు నిర్వహించిన కులగణన గణంకాలపై పలు అభ్యంతరాలు వ్యక్తం కావడంతో ఈ నెల16నుంచి 28 వరకు రీసర్వే నిర్వహిస్తామని ప్రభుత్వం ప్రకటించిన విషయం తెలిసిందే. రెండో దఫా కులగణనకు ఇంకా ఎనిమిది రోజులు సమయం మిగిలి ఉంది.

ఇసుక తవ్వకాలు పెంచండి

భూగర్భ గనుల శాఖ ముఖ్య కార్యదర్శి శ్రీధర్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఇసుక తవ్వకాలను పెంచి ప్రజల అవసరాలకు తగినంత అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని భూగర్భ, గనుల శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్.శ్రీధర్ అధికారులను ఆదేశించారు. గురువారం తెలంగాణ మినరల్ డెవలప్‌మెంట్ ఎమ్‌డీతో కలిసి ఆయన జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని పలు ఇసుక రీచ్‌లు, స్టాక్ పాయింట్లను తనిఖీ చేశారు. మహదేవ్‌పూర్ మండలంలోని బొమ్మాపూర్, అన్నారం, పలుగుల, ఏలేశ్వరం, మద్దులపల్లి రీచ్‌లను సందర్శించి ఇసుక కాంట్రాక్టర్లు, స్థానిక గ్రామస్తులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకున్నారు. ఎక్కువ పరిమాణంలో ఇసుక తవ్వకాలు జరిపి, ప్రజల అవసరాలకు సరఫరాను పెంచాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా ఆయన జయశంకర్ భూపాలపల్లితో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇసుక కాంట్రాక్టర్లు ప్రభుత్వానికి రెట్టింపు ఆదాయాన్ని పెంచడంతో పాటు, నిబంధనలు ఖచ్చితంగా పాటించేలా అనుక్షణం పర్యవేక్షించాలని కలెక్టర్‌ను ఆదేశించారు.

గిరిజన జాతిని చైతన్యపర్చిన మహనీయుడు

సంత్‌సేవాలాల్ మహారాజ్

కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి

సేవాలాల్ జయంతి వేడుకల్లో పాల్గొన్న ఎంపీలు ఈటల రాజేందర్, డీకే అరుణ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

గిరిజన జాతిని చైతన్యపరిచేందుకు తన జీవితాన్ని త్యాగం చేసిన మహనీయుడు సంత్ సేవాలాల్ మహారాజ్ అని కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు జి.కిషన్‌రెడ్డి అన్నారు. గురువారం హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో జరిగిన సంత్ సేవాలాల్ జయంతి వేడుకల్లో భాగంగా భోగ్ బండారి హెూమంలో ఆయన పాల్గొన్నారు. ఈ వేడుకలకు ఎంపీలు ఈటల రాజేందర్, డీకే అరుణ కూడా హాజరయ్యారు. గిరిజన కళాకారుల ఆటపాటలు వీక్షకులను ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. 'బంజారా ధార్మిక వ్యాప్తి మహాసంఘ్' ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన భోగ్ భండారో హెూమంలో భాగస్వామ్యం కావడం సంతోషంగా ఉందన్నారు. భారతీయ సంస్కృతి సాంప్రదాయాలను కాపాడటంలోనూ, విదేశీయుల దండయాత్రల నుంచి దేశాన్ని కాపాడటంలోనూ ఆదివాసీ గిరిజనుల పాత్ర కీలకమని చెప్పారు. ప్రకృతితో మమేకమై జీవిస్తూ.. ప్రకృతిని కాపాడేందుకు ఆదర్శవంత జీవితాన్ని అందించింది ఆదివాసులేనన్నారు. విదేశీ రాజుల దురాక్రమణలతో బంజారాలు చెల్లాచెదురై, వ్యసనాలకు గురైన సమయంలో సేవాలాల్ వారి కోసం పనిచేశారని కొనియాడారు. బంజారాల సాధికారత అవసరాన్ని, చదువు గొప్పతనాన్ని, ఐకమత్యంగా ఉండాల్సిన ఆవశ్యకతను బోధించిన విషయాన్ని గుర్తుచేశారు. ధర్మ బద్ధంగా నడుచుకోవడం, ఆధ్యాత్మిక జీవనశైలిని అనుసరించడం, ప్రకృతిని, సహజ వనరులను కాపాడుకోవాల్సిన అవసరాన్ని సేవాలాల్ మహారాజ్ ఆచరించి చూపించారన్నారు. కేంద్ర ప్రభుత్వం బంజారాలు, ఆదివాసీల అభివృద్ధికి కృషి చేస్తున్నదని చెప్పారు. మహారాష్ట్రలోని నాగపూర్, ముంబైలలో సేవాలాల్ కార్యక్రమాలను కేంద్ర ప్రభుత్వం చేస్తున్న విషయాన్ని గుర్తుచేశారు. బంజారా బాషకు గుర్తింపు ఇచ్చేందుకు కృషి చేస్తున్నామన్నారు. సంత్ సేవాలాల్ మహారాజ్ స్ఫూర్తితో ఐకమత్యంతో ముందుకెళ్తూ.. ఈ పథకాలను సద్వినియోగం చేసుకోవడంతోపాటుగా మతమార్పిడులకు బాధితులు కాకుండా చైతన్యవంతంగా ముందుకెళ్లాలని ఆకాంక్షించారు.

ఏసీబీకి చిక్కిన ఎస్సీ కార్పొరేషన్ మేనేజర్

రూ.1 లక్ష నగదు స్వాధీనం

నవతెలంగాణ-ప్రత్యేక ప్రతినిధి

భారీ మొత్తంలో లంచం తీసుకుంటూ తెలంగాణ రాష్ట్ర షెడ్యూల్ కులాల సహకార అభివృద్ధి సంస్థ మేనేజర్ బి. ఆనంద్‌కుమార్ గురువారం ఏసీబీ అధికారులకు పట్టుబడ్డాడు. ఏసీబీ డీజీపీ విజయ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. పై కార్పొరేషన్‌కు చెందిన పనులను పూర్తి చేసిన ఒక కాంట్రాక్టర్‌కు రూ.33 లక్షల బిల్లులను మంజూరు చేయటానికి గానూ మేనేజర్ ఆనంద్‌కుమార్ రూ.1.32 లక్షలను డిమాండ్ చేశారు. అయితే, ఇందులో రూ.1 లక్ష తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు కాపుకాసి ఆనంద్‌కుమార్‌ను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. రూ.1 లక్ష లంచం సొమ్మును స్వాధీనపర్చుకొని, నిందితుడిని ఏసీబీ కేసుల ప్రత్యేక కోర్టులో హాజరుపర్చి రిమాండ్‌కు తరలించారు.



అదానీ కంపెనీ పనులు తక్షణమే నిలిపివేయండి

పర్యావరణ అనుమతులు లేవు..నిర్మాణం అక్రమం

మీర్జాపూర్ థర్మల్ పవర్ ప్లాంటుపై ఎన్జీటీలో పిటిషన్

నిర్మాణ పనులపై ట్రిబ్యునల్ అసంతృప్తి

ఆరోపణలపై యూపీ సర్కారు స్పందనను కోరిన బెంచ్

న్యూఢిల్లీ : యూపీలో అదానీ కంపెనీకి షాక్ తగిలింది. మీర్జాపూర్ జిల్లాలో నిర్మిస్తున్న వివాదాస్పద థర్మల్ పవర్ ప్లాంట్ వద్ద జరుగుతున్న పనులను తక్షణమే నిలివివేయాలంటూ నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్(ఎన్జీటీ)లో ఒక పిటిషన్ దాఖలైంది. 1600 మెగావాట్ల థర్మల్ పవర్ ప్లాంట్ నిర్మాణాన్ని అదానీ కంపెనీ ఇక్కడ చేపడుతున్నది. మీర్జాపూర్ థర్మల్ ఎనర్జీ (యూపీ) ప్రయివేటు లిమిటెడ్ అనేది అదానీ గ్రూపునకు అనుబంధంగా ఉంటుంది. తప్పనిసరైన పర్యావరణ అనుమతులు లేకుండానే ఇది సరిహద్దు గోడను నిర్మించిందనీ, భూమిని చదును చేశారని ఆరోపణలు ఎదుర్కొంటున్నది.

ఈ పిటిషన్‌పై జస్టిస్ ప్రకాశ్ శ్రీవాస్తవ, జ్యుడిషియల్ సభ్యులు సుధీర్ అగర్వాల్, ఎక్స్‌పర్ట్ మెంబర్ సెంథిల్ వెల్‌లతో కూడిన ముగ్గురు సభ్యులు ప్రిన్సిపల్ బెంచ్ విచారణ జరిపింది. అదానీ కంపెనీ చేపడుతున్న నిర్మాణంపై బెంచ్ అసంతృప్తిని వ్యక్తం చేసింది. నిర్మాణాన్ని ప్రారంభించటానికి పర్యావరణ అనుమతులున్నాయా అని అదానీ గ్రూపును శ్రీవాస్తవ ప్రశ్నించారు. అయితే, కంపెనీ తరఫున హాజరైన న్యాయవాది పర్యావరణ అనుమతులు లేవని సమాధానమిచ్చారు. సరైన అనుమతులు లేనపుడు ఈ పనులను ఎలా కొనసాగిస్తారని శ్రీవాస్తవ ప్రశ్నించారు.

ఈ పిటిషన్‌ను పర్యావరణవేత్త దేబాదిత్యో సిన్హా దాఖలు చేశారు. ఆయన తరఫున పరూల్ గుప్తా ఎన్జీటీ ముందు వాదనలు వినిపించారు. ప్రస్తుతం కొనసాగుతున్న నిర్మాణాన్ని ఆపాలనీ, ఈ నిర్మాణం కారణంగా అక్కడి సైట్, వైల్డ్‌లైఫ్ డ్యామేజ్ అవుతున్నదని పరూల్ గుప్తా ఎన్జీటీని కోరారు. అదానీ గ్రూపు చేపడుతున్న నిర్మాణం అక్రమమని ఆరోపించారు. వృక్షసంపదను, అటవిని నిర్మూలిస్తున్నారని వివరించారు. అయితే, అఫిడవిట్ దాఖలు చేయాలని మీర్జాపూర్ థర్మల్ ఎనర్జీకి ఎన్జీటీ ఇప్పటికే చివరి అవకాశం ఇచ్చింది. అయినప్పటికీ.. అదానీ గ్రూపు అఫిడవిట్‌ను దాఖలు చేయకపోవటం గమనార్హం. కాగా, ఈ ఆరోపణలపై వివరణ ఇవ్వాలని యూపీ ప్రభుత్వాన్ని ఎన్జీటీ ఆదేశించింది. ఈ కేసులో యూపీ కాలుష్య నియంత్రణ బోర్డు (యూపీపీసీబీ) భాగం కానందున.. అది సమర్పించిన నివేదికను ట్రిబ్యునల్ తిరస్కరించింది.

ఏపీలో గంట గంటకూ మోత

విద్యుత్ చార్జీల బాదుడు

చిరువ్యాపారులకూ టైమ్ అఫ్ డే విధానం అమలు

గృహవినియోగదారులకు మాత్రమే మినహాయింపు : ఎపిఇఆర్‌సి అనుమతి

అమరావతి : విద్యుత్ సంస్కరణల అమలులో మరో కీలక అడుగు పడింది. ఛార్జీలు పెంచడం లేదంటూనే వినియోగదారుల జేబులు ఖాళీ చేసే మరో విన్యాసానికి రాష్ట్ర సర్కారు తెరతీసింది. అదే వినియోగదారుల 'పీక్' అవర్ అవసరాలపై ఛార్జీల కత్తి పెట్టడం! తప్పనిసరిగా విద్యుత్‌ను వినియోగించాల్సిన సమయాల్లో ఛార్జీల మోత మోగించడం! డిమాండ్‌ను బట్టి ఛార్జీలు విధించే ఈ విధానాన్ని రాష్ట్రంలో విస్తృతంగా అమలు చేయడానికి ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి (ఎపిఇఆర్‌సి) అనుమతి ఇచ్చింది. దీంతో ఇప్పటివరకు హెచ్‌టి వినియోగదారులకు మాత్రమే పరిమితమైన ఈ 'టైమ్ ఆఫ్ డే ' విధానం ఇక నుంచి చిరువ్యాపారులకు కూడా అమలు కానుంది. గృహ వినియోగదారులను మాత్రం ప్రస్తుతానికి ఈ విధానం నుంచి మినహాయించారు. విద్యుత్ రంగంలో సంస్కరణలు అమలు చేసే రాష్ట్రాలకే కేంద్ర ప్రభుత్వం ప్రోత్సహకాలను, రాయితీలను ఇస్తున్న సంగతి తెలిసిందే. తాజాగా పార్లమెంటులో ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రతిపాదనల్లోనూ విద్యుత్ సంస్కరణలు అమలు చేసే రాష్ట్రాలకు అదనపు రుణాలతో పాటు పలు ఇతర రాయితీలనూ ప్రకటించింది. మరోవైపు విద్యుత్ సంస్కరణలకు తానే ఆద్యుడినని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పదేపదే చెప్పుకుంటున్న సంగతి తెలిసిందే. సంస్కరణల బాటలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరుగులు తీస్తున్న నేపథ్యంలో ఈ 'టైమ్ ఆఫ్ డే' లేదా 'పీక్ అవర్' ఛార్జీల మోత విధానం గృహ వినియోగదారుల తలుపు తట్టడానికి ఎక్కువ సమయం పట్టదన్న అభిప్రాయం వినపడుతోంది.

ఏప్రిల్ ఒకటి నుండి అమలు

టైమ్ ఆఫ్‌డే విధానం ఏప్రిల్ ఒకటి నుంచి అమలులోకి రానుంది. ఈ మేరకు 2025-26 ఆర్థిక సంవత్సరం పీక్ అవర్ వినియోగంలో ఒక విధంగా, ఆఫ్ పీక్ అవర్‌లో మరోవిధంగా ఛార్జీలు వసూలు చేసుకోవడానికి వార్షిక ఆదాయ నివేదిక (ఎఆర్ఆర్) లో విద్యుత్ పంపిణీ సంస్థలు ప్రతిపాదించిన ఈ విధానానికి ఎపిఇఆర్‌సి అనుమతి ఇచ్చింది. దీనిప్రకారం స్వల్ప లోడ్(ఎల్‌టి) పారిశ్రామిక, వాణిజ్య వినియోగదారులకు కూడా ఈ పద్ధతిలో నూతన ఛార్జీలు అమలులోకి రానున్నాయి. దీని ప్రకారం ఉదయం ఆరు నుంచి 10 గంటల వరకు, సాయంత్రం ఆరు నుంచి పది గంటల వరకు పీక్ అవర్‌గా ఉంటుంది. ఉదయం పది నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు, రాత్రి 12 నుంచి ఉదయం ఆరు గంటల వరకు ఆఫ్‌పీక్ అవర్‌గా ఉంటుంది. మధ్యాహ్నం మూడు నుంచి ఆరు గంటల వరకు, రాత్రి పది నుంచి 12 గంటల వరకు సాధారణ అవర్‌గా పరిగణిస్తారు. ప్రస్తుతం ఎల్‌టి వినియోగదారుల నుంచి 50 యూనిట్లలోపు వినియోగించే వారికి యూనిట్‌కు రూ.5.40లు, 51-100 యూనిట్లలోపు రూ.7.65, 101-300లోపు రూ.9.05, 301-500 మధ్య యూనిట్‌కు రూ.9.60, ఆపైన వినియోగించే వారికి రూ.10.15ల చొప్పున డిస్కంలు వసూలు చేస్తున్నాయి.

'స్మార్ట్' తప్పనిసరి...!

'వినియోగదారులు ఏ సమయంలో ఎంత విద్యుత్ వినియోగించారని తెలుసుకోవాలంటే స్మార్ట్ ప్రిపెయిడ్ మీటర్లు తప్పనిసరి కానున్నాయి. రాష్ట్రంలో విద్యుత్ వినియోగదారులకు ఈ ప్రిపెయిడ్ మీటర్లు అమర్చే కాంట్రాక్ట్‌ను అదానీ కంపెనీ దక్కించుకున్న విషయం తెలిసిందే. ఆ సంస్థ రాష్ట్రంలో 59,21,344 మీటర్లను వినియోగదారులకు బిగించనుంది. ఇప్పటికే అధిక విద్యుత్ వినియోగించే పరిశ్రమలతో పాటు చిన్న వ్యాపారస్తులకు కూడా ప్రిపెయిడ్ మీటర్లను డిస్కంలు బిగిస్తోన్నాయి. అదానీ మీటర్ల కోసమే టైం ఆఫ్ డే టారీఫ్ విధానాన్ని విద్యుత్ సంస్థలు అమలు చేస్తున్నాయని విద్యుత్ నిపుణులు పేర్కొంటున్నారు. టిఒడి విధానం వల్ల వినియోగదారులపై అధిక భారాలు పడతాయని, ఈ విధానాన్ని అనుమతించొద్దని ఇఆర్‌సి నిర్వహించిన బహిరంగ సభలో సిపిఎంతో పాటు ప్రజాసంఘాలు, పరిశ్రమలు కూడా డిమాండ్ చేశాయి. 2025 ఏప్రిల్, మే, సెప్టెంబర్, అక్టోబర్, 2026 ఫిబ్రవరి మార్చి నెలలను హైగ్రిడ్ డిమాండ్‌గా పేర్కొంది. 2025 జూన్ నుంచి ఆగస్టు వరకు, నవంబర్ నుంచి జనవరి వరకు లోగ్రిడ్ డిమాండ్‌గా విభజించింది.

చార్జీల్లో ఎలాంటి మార్పులేదు : ఇఆర్‌సి ఛైర్మన్ ఠాగూర్ రామ్‌సింగ్



విద్యుత్ ఛార్జీలు పెంచబోవడం లేదని, గతంలో ఉన్న ఛార్జీలో ఎలాంటి మార్పు లేదని ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటర్ కమిషన్(ఎపిఇఆర్‌సి) ఇన్‌చార్జి ఛైర్మన్ ఠాగూర్ రామ్ సింగ్ తెలిపారు. తిరుపతి ఎస్‌పిడిసిఎల్ కార్పొరేట్ కార్యాలయంలో 2025-26 సంవత్సరానికి సంబంధించిన టారిఫ్‌ను ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఠాగూర్ మాట్లాడుతూ.. మూడు డిస్కములు (ఎస్‌పిడిసిఎల్, సిపిడిసిఎల్, ఇపిడిసిఎల్) ఏఆర్ఆర్ (మొత్తం రాబడి అవసరాలు) 58,868.52 కోట్ల రూపాయలు ప్రతిపాదనలు ఇచ్చారని, (ఇందులో ఎస్‌పిడిసిఎల్ 22,830.44, సిపిడిసిఎల్ 12999.74, ఇపిడిసిఎల్ 23,038.34 కోట్లు). ఎపిఇఆర్‌సి 57,54.17 కోట్ల రూపాయలకు ఆమోదించిందని, రూ.1324.35 కోట్లు తిరస్కరించిందన్నారు. డిస్కంల ఆదాయ వ్యయాల మధ్య వ్యత్యాశంగా ఉన్న 12,632.40 కోట్ల రూపాయలను భర్తీ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం అంగీకరించిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం జెన్కోల ద్వారా దిగుమతి చేసుకున్న బొగ్గులు సేకరించేందుకు ఆర్ఎస్ఆర్ (రైల్ సి రైల్) మోడ్ ద్వారా బొగ్గును రవాణా చేసేందుకు అనుమతించామన్నారు. కొత్త ఇంటి నిర్మాణం చేసుకునే వినియోగదారులకు డొమెస్టిక్ టారిఫ్ అమలు చేస్తామన్నారు. డెవలప్‌మెంట్ ఛార్జీలో 50 శాతం మాత్రమే చెల్లించి గృహ వినియోగదారులు అదనపు లోడు తీసుకునే క్రమబద్ధీకరణ పథకాన్ని ప్రవేశపెట్టామని చెప్పారు. మార్చి ఒకటి నుంచి జూన్ 30వ తేదీ వరకు ఇది అమల్లో ఉంటుందన్నారు. ఈ సమావేశంలో కమిషన్ సభ్యులు వెంకటరమణారెడ్డి, డిస్కంల సిఎండిలు ఐ పృథ్వీతేజ్, ఎకెవి భాస్కర్, కె సంతోష్‌రావు తదితరులు పాల్గొన్నారు.

పోలీసు సామర్థ్యాన్ని పెంచే డ్యూటీ మీట్‌లు : రాష్ట్ర డీజీపీ జితేందర్

పతకాలు సాధించిన రాష్ట్ర పోలీసులకు అభినందన

నవతెలంగాణ-ప్రత్యేక ప్రతినిధి

పోలీసులలో నిమిడీకృతమైన సామర్థ్యాన్ని డ్యూటీ మీట్‌లు రాటుదేలుస్తాయని రాష్ట్ర డీజీపీ జితేందర్ అన్నారు. జార్ఖండ్‌లో ఇటీవల జరిగిన ఆలిండియా పోలీస్ డ్యూటీ మీట్‌లో ఓవరాల్ చాంపియన్‌షిప్ సాధించిన రాష్ట్ర పోలీసు బృందాన్ని గురువారం డీజీపీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ డ్యూటీమీట్‌లో రాష్ట్ర పోలీసులు ఆరు బంగారు పతకాలను, నాలుగు వెండి పతకాలను, ఎనిమిది కాంస్య పతకాలను సాధించారని ఆయన అభినందించారు. పోలీసులు సాధారణంగా శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణలో తలమునకలై ఉంటారనీ, ఈ నేపథ్యంలోనే తమలోని శక్తి సామర్థ్యాలను నిరూపించుకోవటానికి రాష్ట్ర, జాతీయ స్థాయిలో జరిగే పోలీసు డ్యూటీ మీట్‌లు గీటురాయిగా నిలుస్తాయని జితేందర్ వివరించారు. ఫోరెన్సిక్ సైన్స్, యాంటీ సబొటేజ్ చెక్, బాంబు సెర్చింగ్ స్క్వాడ్ విభాగాలలో రాష్ట్ర పోలీసులకు ఓవరాల్ ఛాంపియన్‌షిప్ లభించినందుకు ఆయన సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పతకాలు సాధించిన పోలీసు అధికారులు, సిబ్బందిని ఆయన అభినందించి, సత్కరించారు. జార్ఖండ్‌లో జరిగిన ఆలిండియా పోలీసు డ్యూటీ మీట్‌కు రాష్ట్రం తరఫున సీఐడీ డీజీపీ షికా గోయెల్, రాష్ట్ర పోలీసు స్పోర్ట్స్ డీఐజీ రమేశ్‌లు నోడల్ అధికారులుగా వ్యవహరించారు.